ఫిబ్రవరి, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక:1 పేజీలు: 96 వెల: రూ. 20/-

## ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక



# గ్రామాలకు మరింత చేరువవుతున్న 'అపార్డ్'

(సంబంధిత వార్త 7వ పేజీలో)





స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 1

ఫిబ్రవరి, 2010

ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం .................... 2
ఆదర్శ గ్రామం హివ్రే బజార్ నేర్పిన పాఠాలు .................... 3
ఇంద్రియ నిగ్రహాల మహా పర్వదినం మహాశివరాత్రి .................... 8
ఉద్వేగభరితం వీరనాట్యం .................... 10
పంచాయతీరాజ్ లక్ష్యాలు ఆదర్శాలుగానే మిగిలిపోయాయా .................... 12
తేట తేట తెలుగు, తీయనైన తెలుగు .................... 17
రివర్స్ గేర్ (కథ) .................... 21
లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం ఎంపికలో కొన్ని జాగ్రత్తలు .................... 24
అవధాన విద్య - తెలుగువారి ప్రత్యేకత .................... 26
సిందవ (కథ) .................... 27
పేదల జీవితాల్లో వెలుగు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం .................... 30
మహనీయుల చతురోక్తులు .................... 32
రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు
ఆహార సలహా సంఘాలు, ధరల నియంత్రణకు కమిటీలు .................... 33
శ్రీ రమణ పేరడీలు .................... 37
గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాల నిర్వహణ .................... 40
పర్యావరణ పరిరక్షణలో ప్రజలు, ప్రజా ప్రతినిధుల పాత్ర .................... 42
చెంచు మల్లన్న చరిత్ర .................... 44
అతి సర్వత్ర వర్జయేత్ .................... 47
అందాల సీతాకోక చిలుకలకు శీతకాలం .................... 48
ఆంధ్రప్రదేశ్ క్రీడా మెరుపులు .................... 52
మన గ్రామం-మన పంచాయతీ పాలన .................... 56
దోమా..దోమా... నీకు వందనం (కథ) .................... 61
మన చరిత్రకు మహోపకారం చేసిన కల్నల్ కాలిన్ మెకంజీ .................... 64
ఒక ఊరు-ఒక ఉత్పత్తి .................... 66
స్థానిక సంస్థల బలోపేతంలోనే గ్రామీణాభివృద్ధి .................... 69
2015 నాటికి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలు .................... 72
అందని ఆకు (కథ) .................... 76
యేసుక్రీస్తు మధుర స్పర్శ .................... 79
ప్రజా ప్రతినిధులకు చక్కని అవకాశాలు మహిళా శిశు కార్యక్రమాలు .................... 83
చినుకు చిందులు (కథ) .................... 89
కథల పోటీల ఫలితాలు .................... 93
పెన్నుపోటు చికిత్స (కథ) .................... 94

సంపాదకీయం..

ఫిబ్రవరి, 2010

# గ్రామ వికాసానికి కరదీపిక

"పత్రికొక్కటున్న పదివేల సైన్యమ్ము" అని సుప్రసిద్ధ సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు అనేవారు. ఆ రోజుల్లోనే పదివేల సైన్యంతో సమానమంటే, నేటి రోజుల్లో లక్షలు, కోట్లాది సైన్యంతో సమానం. ఎందుకంటే, ఒక్క పత్రిక అయినా కొన్ని కోట్ల గొంతులతో నినదించగలదు. ఏకకాలంలో కోట్లాది మందిని చేరగలదు. వారిని ఉత్తేజ పరచగలదు. స్ఫూర్తినివ్వగలదు. అనేక కార్యాచరణలకు సమాయత్తం చేయగలదు.

పత్రికకు ఉన్న ఈ అసాధారణమైన శక్తి దృష్ట్యా, ఒక సత్సంకల్పంతో సరిగ్గా ఏడాది క్రితం 'స్థానికపాలన' మాసపత్రికను 'అపార్డ్' ప్రారంభించింది. అనేక ఒడిదుడుకులను, బాలారిష్టాలను అధిగమిస్తూ, ఈ పత్రిక విజయవంతంగా ఏడాది కాలం పూర్తి చేసుకుంది. పన్నెండు సంచికలను సర్వాంగ సుందరంగా, చక్కని వ్యాసాలతో, సకాలంలో వెలువరించగలిగాము. ఆయా రంగాలలో నిష్ణాతులైన అనేకమంది అందించిన తోడ్పాటు, సమకూర్చిన వ్యాసాలు ఈ విజయానికి కారణం.

ఈ క్రమంలో 'స్థానికపాలన' పత్రికలో అనేక ఉపయుక్తమైన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. పేదల జీవితాల్లో వెలుగులు కురిపిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రైతులకు బాసటగా నిలిచే వాటర్‌షెడ్ పథకం, బంజరు భూములను బంగరు భూములుగా మార్చే 'ఇందిరప్రభ' మొదలైన అనేక కార్యక్రమాలపై సవివరంగా, సవిమర్శనాత్మకమైన వ్యాసాలను ప్రచురించాము. పంచాయితీరాజ్ సంస్థల పనితీరుని ఎట్లా మెరుగుపరుచుకోవాలో, అభివృద్ధి ఫలాలను అట్టడుగుస్థాయికి చేర్చాలంటే ఏమి చేయాలో, మన గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ఎట్లాంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలో తెలియజేసిన వ్యాసాలు పలువురికి స్ఫూర్తి కలిగించాయి. 'ప్రతి చేతికి పని, ప్రతి బిడ్డకి చదువు' అనే పేరిట మొదటి సంచికలో ప్రచురితమైన వ్యాసం అనేకమందికి కనువిప్పు కలిగించింది.

ఇవేకాక, పర్యావరణం, నీటి పరిశుభ్రత, పంచాయితీ రాజ్ సంస్థల్లో అకౌంటింగ్, షెడ్యూల్డు కులాల అభివృద్ధి, ఆదర్శ గ్రామాలు, నిర్మల గ్రామాలు, ఎయిడ్స్, సామాజిక తనిఖీ, స్థానిక సంస్థలకు అధికారాల బదిలీ, సుస్థిరమైన జీవనోపాధి, అధిక జనాభా, పంచాయితీల్లో జవాబుదారీ తనం, అభయహస్తం, సహజ వనరుల అభివృద్ధి, పొదుపు సంఘాలు, సహకార వ్యవసాయం, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయ విషయాలు, చెక్‌డ్యామ్‌లు, గిరిజనుల సంస్కృతి, ప్రత్యామ్నాయ పంటలు, భూమి కొనుగోళ్లు, గ్రామీణ విజ్ఞాన సమాచార కేంద్రాలు, పశుగ్రాసాల సాగు వంటి గ్రామాల వికాసానికి అత్యంత కీలకమైన విషయాలపై ప్రచురించిన వ్యాసాలు పంచాయతీల స్థాయిలో ఎంతగానో ఉపయోగపడ్డాయి.

అంతేకాదు, మధ్యమధ్యలో పాఠకులకు ఆసక్తి కలిగించే కథలు, చతురోక్తులు, సాహిత్యాంశాలు, సాంస్కృతికాంశాలు, సమాచార సాంకేతికాభివృద్ధికి చెందిన విషయాలు, పండుగలు మొదలైన వైవిధ్యభరితమైన అంశాలు ప్రచురించటం ద్వారా 'స్థానికపాలన' అరుదైన విశిష్ట పత్రికగా ప్రశంసలు పొందింది. ఇతర రాష్ట్రాల్లోని గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖలు కూడా ఇటువంటి పత్రికను ప్రచురించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ సూచించటం 'స్థానిక పాలన'కు గర్వకారణం.

ఈ పత్రిక ముందు ముందు ప్రతి పంచాయితీకి, అక్కడ పనిచేసే ఉద్యోగులకు, పల్లె ప్రజలకు ఒక కరదీపికగా ఉంటూ, వారికి మరింత ఉపయుక్తంగా మారగలదని ఆశిస్తూ. . . .

# ఆదర్శ గ్రామాలు నేర్పిన పాఠాలు

## వార్తల్లో 'అపార్డ్'

### హివ్రే బజార్, రాలేగావ్ సిద్ధి సందర్శించిన గంగదేవి పల్లి గ్రామ కమిటీ మెంబర్లు

మన రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలో గంగదేవి పల్లి గ్రామం ఆదర్శ గ్రామంగా గుర్తించబడింది. అలాగే మహారాష్ట్రలోని హివ్రేబజార్ ఆదర్శ గ్రామంగా పేరొందింది. దేశంలోని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు నిత్యం సందర్శించే గ్రామం అది. అలాగే డిసెంబర్, 2009లో గంగదేవి పల్లి గ్రామ కమిటీ మెంబర్లు హివ్రేబజార్, రాలేగావ్ సిద్ధి వెళ్ళారు. మామూలుగా అయితే ఆదర్శ గ్రామాల సందర్శన కార్యక్రమం క్రింద సర్పంచులను జిల్లా వారిగా పంపడం జరుగుతోంది. అక్కడ చూసిన అభివృద్ధి కార్యక్రమాలు, పోపట్‌రావ్ పవార్, అన్నా హజారే నాయకత్వాలు ఆ గ్రామాల్ని ఎలాగ మార్చిందో తెలుసుకుని, తమ గ్రామాన్ని కూడా అలాగే తీర్చి దిద్దాలని స్ఫూర్తి చెందడం జరుగుతోంది. అయితే గంగదేవి పల్లి ఇప్పటికే అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామం అయ్యింది. ఈ గ్రామ కమిటీ మెంబర్లు, ఆ గ్రామాలు వెళ్ళి ఏమి చేసి ఉంటారు? అనేది ఆసక్తికరమైన ప్రశ్న.

ఇరు గ్రామాల వారు ఇది వరకు ఎదుర్కొన్న సమస్యల ఇంచుమించు ఒకటే. చాలా మంది మద్యానికి అలవాటు పడడం, తాగిన తరువాత గృహ కలహాలు ప్రతిరోజూ జరిగేవి. నీటి సమస్య, అనారోగ్యం, నిరక్షరాస్యత, అపరిశుభ్రత మొదలైనవి కూడా రెండు గ్రామాలలోను ఉన్నాయి. అసలు ఇటువంటి సమస్యలు మనదేశంలో చాలా గ్రామాల్లో ఉన్నాయి. అయితే ఆదర్శ గ్రామాల స్థాయికి ఎదిగిన ఈ గ్రామాలు అవలంబించిన విధానాలు వేరు, గమ్యం ఒకటే.

గంగదేవి పల్లి పంచాయితీగా ఏర్పడిన దగ్గర నుండి చంద్రమౌళి గారి నాయకత్వంలో గ్రామస్థులందరు వారి గ్రామం, గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించుకున్నారు. మొదట సారా బట్టీలు పగలకొట్టారు. తరువాత గ్రామ పారిశుద్ధ్యం, బహిరంగ విసర్జన మాని మరుగుదొడ్లు వాడడం, విద్యాభివృద్ధి లాంటివి చేపట్టారు. ప్రతి సమస్యకు పరిష్కారం కమిటీల ద్వారా చేపట్టారు. పంచాయితీ రాజ్ చట్టంలో గ్రామ కమిటీలకు నిర్వచించిన విధులు కంటే ఎన్నో



కమిటీ మెంబర్లును ఉద్దేశించి అన్నా హజారే ప్రసంగం

రెట్లు విధులను నిర్వర్తించారు. 18 కమిటీలుగా ఏర్పడ్డారు. గ్రామ క్షేమమే గ్రామ సభ ధ్యేయంగా మలిచారు. ఇప్పుడున్నది సమిష్టి నాయకత్వం. నిజమైన ప్రజాస్వామ్యంకు దగ్గరగా వెళుతోంది. బాల కార్మిక వ్యవస్థ పూర్తిగా పోయింది. అందరు పిల్లలదీ బడిబాటే. పన్నులు వసూళ్ళు వంద శాతం. నీరు వృథా చేస్తే జురుమానా. మద్యం గ్రామ పొలిమేరల్లోకి రావటానికి భయపడుతుంది. అందరికీ స్వచ్ఛమైన త్రాగేనీరు ప్లాస్టిక్ బిందెల్లో సీలు వేసి ఇస్తారు. మహిళా ప్రతినిధులకు పెద్ద పీటవేశారు. కొద్దికాలం వరకు పంచాయితీలో అంతా మహిళలే.

హివ్రే బజార్‌లో అయితే పోపట్ రావ్ పవార్ నాయకత్వంలో చిత్తశుద్ధి ప్రత్యేకంగా పేర్కొన్న దగ్గ విషయం. విశ్వవిద్యాలయంలో చదువు పూర్తి అయినతరువాత వచ్చిన ఉన్నత ఉద్యోగాలు వద్దన్నారు. తన గ్రామాన్ని ముందర బాగు చేయాలని నిర్ణయించుకున్నారు. మొదట్లో కొంత కష్టం అయినా అందరినీ సమీకరించగలిగారు. ఎన్నో చర్చలు. ఒక్కొక్క కష్టాన్ని గ్రామస్థులు అధిగమించారు. మద్యం మానేసారు. నీటి వాడకం క్రమబద్ధీకరించారు. వర్షం నీటిని పొదుపు చేసారు. విద్యాభివృద్ధికి కృషి చేసారు. ప్రజా ఆరోగ్యం, పరిశుభ్రతపై దృష్టి సారించారు. ప్రతి విషయంలోను గ్రామస్థుల చేత లాభ నష్టాలను బేరీజు వేయించి నిర్ణయించేవారు. కార్యోన్ముఖుల్ని చేసారు.

గంగదేవి పల్లి గ్రామ కమిటీ మెంబర్లు సహజంగా హివ్రే బజార్‌ను తమ గ్రామంతో పోల్చుకున్నారు. ఫలితాలు సాధించటంలో ఎన్నుకున్న మార్గాలను అధ్యయనం చేసారు. సందర్శనా కార్యక్రమాన్ని అధ్యయనా కార్యక్రమంగా మలుచుకున్నారు.

తేది : 18-12-2009 రోజున ఉదయం 10-30 గం.లకు వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని గంగదేవి పల్లి గ్రామంలో గల 18 వివిధ కమిటీల బాధ్యులైన 44 మందిని (అందులో 17 మంది మహిళలు) మహారాష్ట్రలో గల అహ్మద్ నగర్ జిల్లాలోని హివ్రేబజార్ మరియు రాలేగావ్ సిద్ధి గ్రామాలను సందర్శించారు.

మొత్తం సందర్శకులను 5 జట్లుగా ఏర్పాటు చేసి వేరు వేరు అంశాలపై అధ్యయనం చేయుటకు నియమించడం జరిగింది. వారి రిపోర్టులోని ముఖ్యాంశాలు:

### వ్యవసాయం

1. భూగర్భ జలాలు అడుగంటి పోయి త్రాగునీటికి, సాగునీటికి తీవ్ర సంక్షోభం ఏర్పడటం జరిగింది. అనేక కుటుంబాలు వలసలు పోవడం జరిగినది. అక్కడ భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా చెక్ డ్యాంలు నిర్మించుకోవడం వలన భూగర్భంలో నీటి మట్టం




వీధి వీధికీ పెట్టిన చెత్త డబ్బా నమూనా

పెరిగి గతంలో 100 ఎకరాల సాగు భూమి నేడు 1500 ఎకరాలకు పెరగటం సాగు కావడం ముఖ్యంగా చెప్పుకోదగిన అంశం. పాడిపరిశ్రమ కూడా అభివృద్ధి చెందుతూ వచ్చింది.

2. వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వలన గ్రామస్తులు భూగర్భంలో నీటి మట్టం పెంచటానికి ఉపయోగపడింది.
3. సంవత్సర కాలంలో పడిన వర్షపాతం అంచనావేసి గ్రామ సభ నిర్ణయించిన పంటలను మాత్రమే వేసి కొనటం జరుగుతుంది.
4. గ్రామ పరిధిలో వ్యవసాయ వినియోగానికి బోర్లు వేయడం నిషేధం.
5. గ్రామంలోని ప్రధాన పంటలు - ఉల్లిగడ్డ, ఆలుగడ్డ, జొన్నలు, కూరగాయలు మొదలగునవి.

## విద్య

1. 20సం.ల క్రితం పాఠశాలలో విద్యార్థులే ఉండేవారు కాదు. ఈ రోజు 600 మంది విద్యార్థులకు పైగా, ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు విద్య నభ్యసిస్తున్నారు.
2. విద్యా ప్రమాణాలు పెంచడంలో కూడా ఉపాధ్యాయులు మంచి శిక్షణనిస్తూ, హివ్రేబజార్ ప్రభుత్వ పాఠశాలను ఒక ఆదర్శ వంతమైన పాఠశాలగా నిలిపినారు. విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఉన్నందున చుట్టు ప్రక్కల గ్రామాల విద్యార్థులు నగరాలకు వెళ్ళకుండా ఈ పాఠశాలకే రావటం జరుగుతుంది.
3. 10వ తరగతి మొదటి మూడు శ్రేణులలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు గ్రామం నుండి ప్రోత్సాహకంగా నగదు బహుమతులు ఇస్తున్నారు.
4. గ్రామంలోని యువకులకు క్రీడలలో ప్రోత్సాహం అందించటం వలన రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందుకున్నారు.
5. దేశభక్తితో దేశరక్షణకు ఈ గ్రామంలోని యువకులు దాదాపు 65-70 మంది సైనికులుగా చేరటం ఉదాత్తమైన అంశం.

## పారిశుద్ధ్యం

1. గ్రామంలో విశాలమైన రోడ్లు పరిశుభ్రంగా ఉండి గ్రామం మొదటనే గ్రామ పంచాయితీ కార్యాలయం, దాని ప్రక్కనే పాఠశాల ఉండటం ఆకర్షణీయంగా కనిపిస్తాయి.
2. వీధి వీధికి చెత్త డబ్బాలను ఏర్పాటు చేయడం వలన వీధిలోని వారందరూ చెత్త డబ్బాలలోనే చెత్తను వేస్తారు. దీనివలన కొంత పారిశుద్ధ్యం సాధ్యమైనది. వారానికొకమారు ఈ చెత్తను తీసి బయటపారేస్తారు.
3. గ్రామంలో దాదాపు 80-85% కుటుంబాల వారు మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకొన్నారు. మరుగుదొడ్లులేని వారికి ఊరు వెలపల పబ్లిక్ లెట్రిన్స్ కట్టించడం జరిగింది.
4. గ్రామంలోని కొంతమంది గోబర్ గ్యాస్ పొయ్యిలు వాడటం - గోశాలలో సిమెంటు చేసినందున వాలు ప్రాంతం నుండి ఒక గొయ్యిలో గోమూత్రం పడేట్టుచేయడం వలన పారిశుద్ధ్యమే గాక వ్యవసాయంలో ఈ మూత్రాన్ని సేంద్రీయ ఎరువుగా ఉపయోగిస్తారు.
5. భూమ్యంతర్గత మురికి కాలువలుండటం వలన దుర్వాసనకు ఈగలు, దోమలు వ్యాప్తిచెందే అవకాశం లేదు.
6. 11 లక్షల మొక్కలు పెంచడం వలన వాతావరణ కాలుష్యం వీరి దరిచేరే అవకాశం లేదు.
7. విశాలమైన స్థలం చుట్టూ కంచె వేసి స్మశాన వాటికను ఏర్పాటుచేసినారు.

## త్రాగునీరు

1. గ్రామంలోని కుటుంబాలకు నల్లాల ద్వారా ప్రతి రోజు 30 నిమిషాల నుండి 1 గం. సమయం నీరు అందిస్తారు. ఈ నీరు సరిపోని పక్షంలో గ్రామంలోని దాదాపు 10 చేతి బోర్ల ద్వారా నీటిని తీసుకోవడం జరుగుతుంది.

(గ్రామంలో 100% మద్యనిషేధం, 100% ఇంటి పన్నులు వసూలు, 100% కుటుంబాల వారు ఇద్దరు పిల్లలతోనే కుటుంబ నియంత్రణ అమలు చేయడం జరుగుతుంది.)

## అవార్డులు

1. 1995 'ఆదర్శ గ్రామ' పురస్కారం. (మహారాష్ట్ర ప్రభుత్వంచే)
2. 2000 'యశ్వంత్ గ్రామ్' అవార్డు. (మహారాష్ట్ర ప్రభుత్వంచే)
3. 2007 'వనగ్రామ్' అవార్డు. (అత్యధిక మొక్కల పెంపకం) (మహారాష్ట్ర ప్రభుత్వంచే)
4. 2007 'నిర్మల గ్రామ పురస్కార్'. (భారత ప్రభుత్వంచే)
5. 2007 'జాతీయ స్థాయి నీటి నిలువ' అవార్డు. (భారత ప్రభుత్వంచే)

## సూచనలు

1. ఊరి వెలుపల నిర్మించిన మరుగుదొడ్లలో నీటి సదుపాయం లేనందున దొడ్లు పరిశుభ్రంగా లేవు. దుర్గంధభూయిష్టంగా ఉన్నవి. నీటి సౌకర్యం దొడ్ల వద్ద ఉంటే బాగుంటుందని భావించాము.
2. కుటుంబ పరిసరాలలో పారిశుద్ధ్యం చెప్పుకోతగినదిగా లేదు. (గడ్డి -పిచ్చిమొక్కలు ఉండటం)
3. ఈగలు - దోమలు లేని గ్రామంగా చెప్పుతున్నప్పటికీ, గ్రామంలో ఈగలు, దోమలు సంచారం చేస్తూనే ఉన్నాయి.
4. నల్లాల ద్వారా కుటుంబాలకు సరిపోను నీరందించుచున్నట్లు లేదు.

నల్లాలు క్రమబద్ధీకరించినట్లు లేవు. రబ్బరు పైపులతో కనెక్షన్లు తీసుకోవడం జరుగుతుంది. నల్లాలకు ఆన్ - ఆఫ్ పద్దతి లేదు.

5. స్మశాన వాటిక గ్రామానికి దూరంగా ఉంటే బాగుండేదనిపించింది.
6. గ్రామసభలో తీసుకొన్న నిర్ణయాలు సక్రమంగా అమలుకు పర్యవేక్షణ కొరవడిందని, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తే బాగుండేదని భావించడం జరిగింది.
7. వరుసగా 4 తడవులు ఒకే సర్పంచ్ ఉండటం అసహజమైన విషయం. రిజర్వేషన్ పద్ధతిని అతిక్రమించినట్లుగా తోచింది.
8. పరిపాలనలో ఒక సర్పంచ్, గ్రామ సభ మాత్రమే ముఖ్య భూమికను పోషిస్తున్నందున నాయకత్వం పెంపొందే అవకాశం లేదని భావించడం జరిగినది.

## ఆదర్శగ్రామం రాలేగావ్ సిద్ధీ - సందర్శన

రాలేగావ్ సిద్ధీ మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లా పర్నేర్ తాలూకాలో ఉంది. గ్రామం జిల్లా కేంద్రం నుండి 52 కి.మీ మరియు పర్నేరు నుండి 16 కి.మీ దూరంలో ఉన్నది. మహారాష్ట్ర పడమటి కనుమలను (కొండలను) ఆనుకొని యున్నది. ఈ కనుమలను ఆనుకొనియున్న భూములన్నీ ఎక్కువభాగం ఎత్తుపల్లాలుగానే ఉంటాయి. చదరంగా ఉన్న భూములు చాలా తక్కువ. అహ్మద్ నగర్ జిల్లాలోని ఓ మారుమూల కుగ్రామం రాలేగావ్ సిద్ధీ. ఈ గ్రామం చుట్టూ ఎత్తైన గుట్టలుండటం వల్ల గ్రామం ఉపరితలం లోతైన ప్రదేశంలో ఉన్నట్లుగా భావిస్తాం. ఈ గ్రామంనకు రవాణా సౌకర్యాలు చాలా తుక్కువ.

ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తున్న రాలేగావ్ సిద్ధీ 1975కు పూర్వం ఎలా ఉండేదో ఒకసారి అవలోకిద్దాం. ఆ రోజుల్లో ఈ గ్రామాన్ని "బద్నాం గావ్" అనే వారని తెలుస్తున్నది. బద్నాం గావ్ అంటే చెడ్డ పేరు తెచ్చుకున్న గ్రామం అని అర్థం.

ఇక్కడవి సారంతమైన నేలలు కావు. దీనికి తోడుగా నీటి కొరత వలన వ్యవసాయంలో కూడా వెనుకబడి ఉన్నారు. చేయడానికి పనిలేదు. తినడానికి తిండి లేదు. రోజుకు రెండు పూటలా భోజనం చేసే కుటుంబాలు ఆ గ్రామంలో తక్కువే. దాదాపు 2200 ఎకరాల విస్తీర్ణం కలిగిన రెవెన్యూ భూమి ఆ గ్రామ పరిధిలో ఉన్నది. కానీ సేద్యం చేయడానికి సరిపడా నీరు లేదు. కటిక దారిద్ర్యం అనుభవిస్తున్న ప్రజలు సారాయి కాయడం, విక్రయించిన డబ్బుతో పొట్టనింపు కోవడం జరుగుతున్నది. సారాయి కాసే కుటుంబాలు క్రమంగా త్రాగుడుకి అలవాటు పడి, కుటుంబాల ఆర్థిక పరిస్థితిలు, సభ్యుల ఆరోగ్య పరిస్థితులు క్షీణించడం, యుక్తాయుక్త విచక్షన కోల్పోవడం వల్ల ఆ గ్రామం నిత్యం తగాదాలకు నిలయమైయుండేది.

ఆ కుగ్రామంలో ఒక సామాన్య కుటుంబం నందు జన్మించిన కిషన్ బాబూరావ్ హజారే మిలిటరీలో డ్రైవర్గా పనిచేస్తుండేవాడు. సెలవు పై ఇంటికి వచ్చినప్పుడు గ్రామం ప్రజల పరిస్థితులను చూసి చలించే వాడు. గ్రామ పరిస్థితులే కాకుండా తన కుటుంబ పరిస్థితులు కూడా అధ్వాన్నంగా ఉండటం వల్ల పరిష్కారమార్గం తోచని స్థితిలో ఆత్మహత్యయే శరణ్యమని భావించేవాడు. ఒక సారి రైలు ప్రయాణంలో స్వామి వివేకానందుడి పుస్తకాన్ని చదివాడు. దాంతో ఆత్మస్థైర్యం పొందిన కిషన్ బాబూ రావ్ హజారే "తాను తనకొరకు కాకుండా సమాజం కొరకు బతకాలని" నిర్ణయించుకున్నాడు.

నీటిని నిల్వ చేయడం, భూసారాన్ని పరిరక్షించడం వల్లనే అత్యుత్తమమైన సేద్యం సాధ్యమని భావించిన హజారే "వాటర్షెడ్" నిర్మాణాలకై పూనుకున్నాడు. రాలేగావ్ సిద్ధీ భౌగోళికంగా చిన్న చిన్న పర్వతాలతో ఆవరించబడి ఉంది. గ్రామానికి ఈశాన్యం మరియు దక్షిణం వైపుగల పర్వతాల వాలు గ్రామం వైపు ఉండటం వల్ల వాటర్షెడ్ల నిర్మాణాలకు అనుకూలంగా ఉండి ఈ గ్రామం ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. ఈ చెక్ డ్యాంల నిర్మాణంతో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయం అభివృద్ధి చెందుతూ వస్తున్నది. ప్రస్తుతం గ్రామస్తులు జొన్న, గోధుమ, ఉల్లిగడ్డ, సజ్జ మరియు సోయాబీన్ మొదలగు పంటలను పండిస్తున్నారు. వాటర్షెడ్ విజయవంతం కావడంతో హజారే పై ప్రజల్లో విశ్వాసం మరింతగా పెరిగి, అతన్ని "అన్నా హజారే" గా పిలుస్తున్నారు.

వ్యవసాయం ద్వారా ఆదాయ వనరులు కొంతమేరకు మెరుగుపడటంతో ఆ గ్రామంలో అనేక గ్రూపు మీటింగులు, గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు నాటు సారాయి తయారీని అమ్మకాన్ని మరియు సేవించడాన్ని నిషేధించడానికి పూనుకున్నారు. ఈ సమయంలో నాటు సారాయి, అమ్మకం దారుల నుండి మరియు తాగే వారి నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది.

దీన్ని పురస్కరించుకొని గ్రామ సభ నిర్వహించి గ్రామంలో నాటు సారాయి తయారు చేసినా అమ్మకం జరిపినా లేదా మద్యం తాగిన వారకు రేషన్కార్డు రద్దు, కరెంటు మరియు మంచినీటి సరఫరా నిలిపివేయాలని గ్రామ సభ చర్చించి, తీర్మానించి పూర్తి స్థాయిలో అమలు చేయటం జరుగుచున్నది. అయిన్పటికీ ఒక వేళ ఎవరైనా రహ్యంగా మద్యం సేవించినచో అట్టి వారిని గుర్తించి గ్రామ కూడలిలో గల కరెంటు స్థంభానికి బంధించి దెబ్బలు కొట్టడం జరుగుతుంది.

అభివృద్ధి పనులన్నింటినీ గ్రామ సభ నిర్ణయించిన "తరుణ్ కమిటీ"యే చేపడ్తుంది. గ్రామ పంచాయితీకి ఎలాంటి సంబంధం లేదు. ప్రభుత్వం నిధులతో చేపట్టే పనులకు గ్రామంలోని ప్రతీకుటుంబం వారానికి రెండు రోజుల శ్రమదానం చేయాల్సి ఉంటుంది. ఇట్టి శ్రమదానం ద్వారా మరియు చేపట్టిన పనిలో మిగిలిన డబ్బుతో అదనపు పనులను చేపట్టటం జరుగుతుంది. గ్రామ పంచాయితీ నిధులతో చేపట్టే పనులను కూడా ఈ కమిటీయే నిర్వహిస్తుంది.

ఏదేమైనా ఏదెట్లున్నా అధమస్థితిలో ఉన్న కుగ్రామాల్ని ఒక మార్గనిర్దేశనం చేసి నీటి సమృద్ధిని సాధించిన సర్పంచ్ శ్రీ పోపట్రావు పవార్, శ్రీ అన్నా హజారే గార్లు ధన్యులు.

**(గంగదేవిపల్లి గ్రామ మంచినీటి నిర్వహణ కమిటి సౌజన్యంతో)**

డా॥ వి.ఎన్.వి.కె. శాస్త్రి,
సలహాదారు, ప్రచురణలు, అపార్డ్

# 'అపార్డ్' లో బిఆర్‌జిఎఫ్ జాతీయ కమిటీ సమావేశం





వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు నిధుల (బిఆర్‌జిఎఫ్)పై ఏర్పాటయిన జాతీయ సలహా, సమీక్షా కమిటీ తన మూడవ సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఎ.ఎం.ఆర్. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థలో ఈ జనవరి 10వతేదీన జరుపుకుంది. ఈ కమిటీకి శ్రీవి. రామచంద్రన్ అధ్యక్షత వహిస్తున్నారు.

ఈ కమిటీ సభ్యుల్లో ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు డాక్టర్ బి.ఎన్. యుగంధర్, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి.కె.సిన్హా, ఐ.ఎ.ఎస్., కేంద్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ సుధీర్ కృష్ణ, ఎ.ఎం.ఆర్. ఆం.ప్ర. గ్రామీణాభివృద్ధి సంస్థ (అపార్డ్) కమీషనర్ శ్రీ ఫణికుమార్, ఐ.ఎ.ఎస్; బి ఆర్‌జిఎఫ్ కార్యక్రమాలను అమలు చేసే రాష్ట్రాల్లోని పంచాయితీ రాజ్, గ్రామీణావృద్ధి శాఖల కార్యదర్శులు, కమీషనర్లు ఉన్నారు.

సమావేశం ప్రారంభం కావటానికి ముందు 'అపార్డ్' కార్యాలయంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణకు ఉన్న ప్రాధాన్యతను నృత్యాలు, పాటలు, నాటకాలు, మిమిక్రీ మొదలైన కళలు, జానపదకళల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు, గ్రామీణులకు తెలియజేయడానికి నిర్దేశించిన గ్రామసభ సంచార రథాన్ని కమిటీ ఛైర్మన్ శ్రీవి. రామచంద్రన్ ప్రారంభించారు.

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలున్న 22 జిల్లాలకు ఇటువంటి 22 సంచార రథాలను పంపిస్తున్నామని, ఈ సంచార రథాలలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన బృందాలు పర్యటించి ప్రదర్శనలిస్తాయని 'అపార్డ్' కమీషనర్ శ్రీ ఫణికుమార్ కమిటీ సభ్యులకు వివరించారు.

మహబూబ్‌నగర్‌కు చెందిన బృందం సభ్యులు తమ కార్యక్రమం గురించి క్లుప్తంగా ప్రదర్శించారు. పంచాయితీరాజ్ పాలనకు చెందిన పలు అంశాలపై రూపొందించిన డాక్యుమెంటరీలను, సిబిటిలను ప్రదర్శించే మినీ వ్యాన్‌ను డాక్టర్ బి.ఎన్. యుగంధర్ ప్రారంభించారు.

ఇ-లెర్నింగ్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెయినింగ్ సెంటర్‌ను డాక్టర్ సుధీర్ కృష్ణ ప్రారంభించారు. ఆ తరువాత 'అపార్డ్' ఆధీనంలోని ఐదు విస్తరణ శిక్షణా కేంద్రాలతో ఒక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామపంచాయితీలపై 'అపార్డ్' నిర్వహించే వెబ్‌సైట్‌ను కూడా కమిటీ సభ్యులు ప్రారంభించారు. ప్రణాళికా సంఘం తయారు చేసిన జిల్లా ప్రణాళికా కరదీపికను 'అపార్డ్' తెలుగులోకి అనువదించి ముద్రించింది. ఈ పుస్తకంతో పాటు ఓపెన్ ఆఫీస్ అప్లికేషన్స్ ఫండమెంటల్స్‌ను, గ్రామపంచాయితీ సర్పంచ్‌ల శిక్షణకోసం నిర్దేశించిన మొదటి సిబిటిని కూడా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

పంచాయితీరాజ్ సంస్థల ప్రతినిధుల సామర్థ్యాలను పెంచడానికి 'అపార్డ్' తీసుకుంటున్న చొరవను, చేస్తున్న కృషిని, చేపట్టిన కార్యక్రమాలను ఎన్ఐఆర్‌డి డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి.కె.సిన్హా ఐ.ఎ.ఎస్, అభినందిస్తూ, సంతోషాన్ని వ్యక్తం చేశారు.

- టి. నర్మద

# అపార్డును సందర్శించిన డా॥ సుందర్ రామన్


డా॥ సుందర్ రామన్

ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డా॥ సుందర్ రామన్ ది. 15-01-10న అపార్డును సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఫాకల్టీ మెంబర్లనుద్దేశించి 'భూతాపం' పై ప్రసంగించారు. గత 100 సంవత్సరాలుగా పర్యావరణంలో మార్పులు వస్తున్నప్పటికీ, గడచిన 15 సంవత్సరాలుగా భూతాపం పెరిగిందని తెలుపుతూ, దీనికి ముఖ్య కారణం వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువ అవడమే అన్నారు. రాబోయే కాలంలో బొగ్గు, చమురు, ఇంధనాల వినియోగం పెరిగే అవకాశాలు ఎక్కువ. భూతాపం పెరిగితే, భూమిలో తేమ తగ్గుతుంది. అకాలవర్షాలు, కుండపోత వర్షాలు, మెరుపు వరదలు, మలేరియా వంటి జబ్బులు ఎక్కువ అవటం, వడదెబ్బలకు దుర్బల జనాభాలలో మరణాలు ఎక్కువ అవటం లాంటి పరిణామాలు తగ్గాలంటే ప్రపంచదేశాలు ముఖ్యంగా, అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు, భూతాపం తగ్గించటానికి పట్టుదలతో కృషి చేయాలన్నారు.

మన దేశంలో సాంస్కృతికంగా ఉన్న ఎన్నో అలవాట్లు పర్యావరణ రక్షణకు ఉపయోగ పడతాయని, అభివృద్ధి చెందిన దేశాల విధానాలనే అనుసరించవలసిన అవసరం లేదని తెలిపారు. గడచిన డిసెంబర్ నెలలో కోపెన్‌హేగన్‌లో వాతావరణ మార్పుపై జరిగిన శిఖరాగ్ర సమావేశాలల్లో ఉద్గారాలు తగ్గించడం కోసం 'బేసిక్' దేశాలు (భారత్ కూడా ఉంది) చూపిన చొరవ మిగిలిన దేశాలకు మార్గదర్శకమై, ఐక్యరాజ్యసమితి స్థాయిలో చట్టబద్ధమైన ఒప్పందాలకు దారితీస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రామ వికాసం - దూర విద్యా బోధన (మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్-3)

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 04-02-10 | గ్రామ పంచాయితీ అభ్యర్థులు | 11.00-11.20 | నీరు, భూమి, చెట్ల చట్టం |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | మహిళల హక్కులు, చట్టం |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| 11-02-10 | యం.పి.టి.సి.లు | 12.20- 12.40 | పీసా చట్టం |
| | | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 1.00-1.20 | వికేంద్రీకృత ప్రణాళిక తయారీ |
| | | 1.20-1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 18-02-10<br>25-02-10<br>04-02-10<br>11-03-10<br>18-03-10 | గ్రామ పంచాయితీ వార్డు మెంబర్లు | 11.00-11.20 | గ్రామసభ నిర్వహణ |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | ఆరోగ్యం - పారిశుద్ధ్యం |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20- 12.40 | గ్రామీణ ప్రాంతాలలో జీవనోపాధుల కల్పన |
| | | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 1.00-1.20 | పర్యావరణ పరిరక్షణ |
| | | 1.20-1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |



# ఇంద్రియ నిగ్రహాల మహాపర్వదినం

॥ వందే శంభు ముమాపతిం సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగ భూషణం మృగధరం వందే పశూనాం పతిమ్
వందే సూర్య శశాంక వహ్నినయనం వందే ముకుందప్రియం
వందే భక్త జనాశ్రయం చ వరదం వందే శివం శంకరం ॥

సృష్టి లయకారుడూ అణిమాది గుణోపేతుడు అయిన వరమశివుని వరమ వవిత్రంగా ఆరాధించే వర్వదినం మహాశివరాత్రి. ఇది మాఘమాసం చివరలో అమావాస్యకు ముందు వచ్చే త్రయోదశి నాడు జరుపుకొనే మహాపర్వదినం. పవిత్రమైన కాశీక్షేత్రం మొదలుకొని అన్ని శివాలయాలలోనూ ఈ పుణ్యదినాన విశేష పూజలతో, అభిషేకాలతో వరమశివుని ఆరాధిస్తారు. శంకరుడు శుభంకరుడు. ఎంతటి పాపచరితులనైనా పునీతం చేసే దయాంతరంగుడు. ఆదర్శ దంపతులకుగానీ, తల్లిదండ్రులకు గానీ పార్వతీ పరమేశ్వరులే ఆదర్శం. అద్వైత తత్వానికి కూడా ఆది దంపతులే ఉదాహరణగా నిలుస్తారు. అందుకే కాళిదాసు మహాకవి.

'వాగర్థావివ సంపృక్తే వాగర్థ ప్రతిపత్తయే
జగతః పతరే వందే పార్వతీ పరమేశ్వరే'

అని లోకపితరులుగా వీరిని కీర్తించాడు. కళారాధకులకే కాదు విద్యార్జన పరులకు కూడా శంకరుడే పరమదైవం శంకరాచార్యుల శివానందలహరి మొదలుకొని చేసిన ఎన్నో స్తోత్రాలలో శంకరతత్త్వం ప్రస్ఫుటమౌతుంది. ఇటువంటి ఎన్నో మహిమలున్న పరమశివుని నియమనిష్ఠలతో ముఖ్యంగా శివరాత్రి రోజున జాగరణ చేసి, ఉపవాస దీక్షతో ధ్యానించే వారికి సకల శుభాలూ కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే శివరాత్రి పర్వదినాన్ని బ్రహ్మోత్సవ సంప్రదాయాన్ని అనుసరించి 7 రోజులు జరుపుతారు.

## మహా శివరాత్రి

ఈ ఉత్సవాలు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. నంది కేతనాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేయడంతో సకలదేవతలకూ ఈ ఉత్సవాలకు స్వాగతపత్రాన్ని సమర్పించినట్లేననీ, అలా స్వాగతించిన దేవతలందరినీ స్తోత్రాలతో మేళతాళాలతో ఆహ్వానించి, ఆవాహనం చేస్తారు. భక్తజన సులభుడూ, వరదుడూ అయిన శివుణ్ణి భక్తులకు చేరువ చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసినదే వాహనసేవ. వివిధ రూపాలలో ఉన్న అర్చామూర్తులను వివిధ విశేష వాహనాలపై అధిరోహింపజేసి ఊరేగిస్తారు. శేషవాహనం, మయూరవాహనం, అశ్వ వాహనం ఈ వాహన సేవలలో ఏర్పాటు చేసే వాహనాలలో ముఖ్యమైనవి.

మహాశివరాత్రి నాడు పార్వతీ పరమేశ్వరులకు కళ్యాణం నిర్వహిస్తారు. ఈ కళ్యాణం లోకకళ్యాణకరం. శుభకరమైనది. అకాలంగా సంభవించే విపత్తులు, కలికాల దోషాలు, ఇంద్రియాతీత దుష్టశక్తుల వల్ల కలిగే అనార్థాలు ఈ కళ్యాణంలో పాల్గొన్న వారినిగానీ, నిర్వహించిన వారిని కానీ బాధించవు. శివరాత్రి రోజున లింగాకారంలో ఉన్న మల్లికార్జున స్వామిని అర్చిస్తారు. వివస్త్రుడైన ఒక దేవాంగనుడు తాను స్వయంగా తయారు చేసిన తెల్లటి వస్త్రాన్ని చీకటిలో వివాన





గోపురశిఖరం నుంచి ముఖ మంటపం వరకూ ధరింపజేస్తాడు. ఆ తరువాత మల్లికార్జున స్వామికీ, భ్రమరాంబకూ కళ్యాణం చేస్తారు. ఆ రాత్రి వేకువజామునే పంచామృతాలతోనూ, పవిత్రనదీ జలాలతోనూ స్వామివారికి అభిషేకం చేస్తారు. 'ఓం నమశ్శివాయ' అనే 'పంచాక్షరీ'ని జపిస్తూ శివునికి పంచామృతాలతో అభిషేకం చేస్తే విశేషఫలం కలుగుతుంది. 'నామస్మరణాత్ అన్యోపాయం నహి పశ్యామో భవతరణే'. ఈ సాంసారిక జీవితంలో మానవజన్మ తరించాలంటే శివనామస్మరణ చేయాలి. నామస్మరణ, ఉపవాసదీక్ష, జాగరణల ద్వారా ఇంద్రియ నిగ్రహాన్ని సాధించి దైవానుగ్రహాన్ని పొందాలని చాటిచెప్పే విశిష్టమైన పర్వదినం మహాశివరాత్రి.

ఆహార, నిద్రా మైధునాల్ని నియంత్రించడం ఆధ్యాత్మిక సాధనలో ప్రధానమైన సోపానం. రజోతమో గుణాల్ని అణచివేసి సాత్త్వికంగా జీవించే




అవకాశం దైవారాధన వల్లనే లభిస్తుంది. ఈ దైవారాధనకు వేదప్రామాణ్యం ఉంది. వేదోక్త మంత్రాలతో శివునికి నమకచమకాది స్తోత్రాలతో క్షీరాభిషేకం, జలాభిషేకం చేయడం; అలాగే రుద్రహోమం, చండీహోమం, దీక్షా హోమం, శాంతిహోమం, పౌష్టిక హోమాలను నిష్ఠగా చేయడం ద్వారా శివానుగ్రహాన్ని పొందవచ్చు.

సామగాన ప్రియుడైన ఆ భక్త శుభంకరుని వేదమంత్రాల ద్వారా స్తుతించి వశం చేసుకోవచ్చు. లేదా పంచాక్షరీ మంత్రాన్ని, జపదపాదుల ద్వారా ఉపాసించవచ్చు. నాదమయమయిన సృష్టి లయకారుడే కాదు. భక్తుల అభీష్టాలను తీర్చే భక్తవరదుడై పరమేశ్వరుడు వివిధ ఆరామాల ద్వారా తన కృపాకటాక్ష వీక్షణాలను ప్రసరింపజేస్తున్నాడు. శ్రీశైలం, కాళేశ్వరం, రామేశ్వరం, దాక్షారామం, అమరారామం వంటి ఎన్నో దివ్యక్షేత్రాలు అత్యంత ప్రాచీనమైన చరిత్రతో, దివ్య మహర్షుల చేత పునీతమైన స్థలపురాణాలతో అలరాడుతున్నాయి.

శివుని మూడోనేత్రం జ్ఞాన నేత్రం. నటరాజ స్వరూపం కళాంతరంగుడైన శివుని కళారూపానికి ప్రతీక. కంఠంలో ఉన్న సర్పం చైతన్యానికి ప్రతీక. స్వచ్ఛతకు హిమాలయం మారుపేరు. ప్రమధాది గణాలను నియంత్రించే సర్వాత్మకుడైన పరమశివుడే ఇంద్రియాల్ని నియంత్రించగలిగిన శక్తిమంతుడు. పైకి భస్మం రాసుకున్నట్లు కన్పించినా ఆ విభూతే లోకవిభూతి. ఏ దివ్యాంబరాలూ లేని దిగంబరుడు. సాధురూపమైన వృషభమే ఆయన వాహనం. లోక సమస్తాన్నీ తనలో నింపుకొని, తానే లోకమైన విశ్వనాధుడు. అందుకే ఈ లోకం శివమయం కావాలంటే అందరి హృదయాలు ముందుగా శివమయం కావాలి. అప్పుడే ఆనందం వెల్లివిరుస్తుంది.



– డా. అద్దంకి శ్రీనివాస్

**ఆంధ్రుల జానపద కళారూపాల్లో ప్రముఖంగా చెప్పుకునే ప్రక్రియ వీరనాట్యం. ఇది 13,14 శతాబ్దాల్లో వీరశైవ మతం ద్వారా ఆంధ్రదేశంలో ప్రవేశించింది. ఇది ఉత్సవాలు, జాతరల సందర్భంగా శివుడు, వీరభద్రుల మహాత్మ్యాన్ని తెలిపే కళారూపం. దీనిలో శివతాండవంలోని 108 కరణాలు, చారి భేదాలు కలిసిన నృత్యమిది. ఇది శైవం ఎక్కువగా ప్రచారంలో ఉన్న తూర్పు, పశ్చిమగోదావరి, కర్నూలు, అనంతపురం, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విస్తృత ప్రచారంలో ఉంది. ఐతే ప్రదర్శనా విధానంలో జిల్లాకు జిల్లాకు వైవిధ్యం కన్పిస్తుంది.**

వీరశైవ కుటుంబాలలో వివాహాలు, ప్రత్యేకమైన ఆరాధనోత్సవాలు మొదలైన సందర్భాలలో వీరనాట్య ప్రదర్శనలు జరుగుతుంటాయి. ఇతర సాంస్కృతికాంశాల కన్నా వీరనాట్యానికే ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రదర్శనలో వీరభద్ర పళ్ళెం, శివ వీరభద్రులకు అర్పించే దృశ్యం రోమాంచకంగా, గగుర్పాటు కలిగించే విధంగా ఉంటుంది. పళ్ళెంలో మంటలు ఆరిపోయేదాకా లయతాళాలు మారుస్తూ నర్తకులు పాడే పాటలు, ఆ సందర్భంగా ఉపయోగించే సంగీతవాద్యాలు ప్రత్యేకించి చెప్పవలసినవి.

ఈ సందర్భంగా పూజారులు చేతుల్లో 'కత్తి' పట్టి వచన గేయ రూపంలో శివ వీరభద్రుల స్తుత్యాత్మకంగా పాడే 'ఖడ్గాలు' విశేషాన్ని సంతరించుకున్న అంశం. దీని తరువాత అంశం 'ధ్వజస్తంభం'. ఓ పొడవైన స్తంభానికి విభూతి అద్దుతారు. దానిపైన చివర గంటలు కడతారు.



# ఉద్వేగ భరితం - వీర నాట్యం

ఈ స్తంభానికి 'దట్టి' కట్టి నిండుగా అలంకరిస్తారు. వాద్యాల కనుగుణంగా కళాకారులు నర్తిస్తారు.

వీరనాట్యంలో మూడో అంశం 'నరసం'. దీనిలో వీరశైవ భక్తులంతా మూకుమ్మడిగా వాద్యాల మోతల కనుగుణంగా నాట్యం చేస్తారు. కాంతి నరసం, కాంత నరసం, ఏక నరసం, శిరోనరసం, శూలనరసం మొదలైనవి ఈ 'నరసం'లో ఉన్నాయి. శివునికి మంగళహారతి ఇవ్వడంతో ఇది ముగుస్తుంది. అగ్ని జ్వాలల కారణంగా కొందరు పూజారుల శరీరాలకు చిన్న గాయాలు కూడా తరచూ సంభవిస్తుంటాయి.

వీరనాట్యం దక్షయజ్ఞానికి సంబంధించిన కథతో ముడిపడింది. దక్షుడు యజ్ఞం చేస్తూ తన కుమార్తె శివపత్ని దాక్షాయణిని ఆహ్వానించలేదు. ఆమె అవమాన భారంతో ఆ యజ్ఞగుండంలో తనను తాను దహింపజేసుకుంది. ఈ వార్త తెలిసిన శివుడు ఆగ్రహించాడు. తన చెమట చుక్కతో వీరయోధుల ను సృష్టించాడు. వారిలో వీరభద్రుని సేనాధిపతిని చేసి దక్షయజ్ఞ ధ్వంసానికి పంపాడు. ఆ యజ్ఞం ధ్వంసమవడమే గాక దక్షుడు చంపబడ్డాడు. ఆ విధంగా దక్షధ్వంసంతో పండుగ జరుపుకున్నారని పురాణకథ. నేటికీ శివభక్తులు ఆ కథాంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ నాట్యం చేస్తూ వినోదిస్తారు.

వీరశైవ మతానుయాయులు 'వీరనాట్యం' సాంప్రదాయికంగా నిర్వహిస్తుంటారు. జంగం బలిజ, వీరముష్టి, దేవాంగ కులాలు ప్రధానమైనవి. తెలంగాణలో కొరవి, కొత్తకొండ వంటి శైవక్షేత్రాలలో శివరాత్రి జాతరలలో 'వీరనాట్యం' సంప్రదాయబద్ధంగా పూజారులు నిర్వహిస్తారు. కర్నూలు పరిసర ప్రాంతాల్లో వీరనాట్యాన్ని 'నందికోలసేవ'తో పాటు ఉత్సవాల్లో నిర్వహిస్తారు. శివుడు, వీరభద్రుడు, నంది మొదలైన మూడు మూర్తులను ఈ సందర్భంగా నృత్యగీతాలతో ఆరాధిస్తారు.

వీరనాట్యం కళారూపంగా రూపుదిద్దుకున్న తరువాత దీనిలో కళాకారులు మార్పులు చేశారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వీరనాట్య కళాకారులు రంగురంగుల ధోవతులు ధరించి దట్టీలు కట్టుకుంటారు. మోకాళ్ళకు

# కాశీ కావిడి

కాశీకి వెళ్లి పవిత్ర గంగాజలం మోసుకొని వస్తూ గ్రామగ్రామాల్లో జనులకు దాన్ని పంచుతూ, తమ కాశీయాత్రానుభవాల్ని పాటరూపకంగా గానం చేస్తూ సంచరించేవారిని 'కాశి కావిడివాళ్ళు' అంటారు. జీవితంలో ఒకసారైనా కాశీక్షేత్రాన్ని సందర్శించి వస్తే పుణ్యం అనే విశ్వాసం ఆంధ్రదేశంలో ఉంది. ఆ కోరిక నెరవేరనివారు కాశికావిడివాళ్ళ యాత్రానుభవాలను విని సంతృప్తి పొందుతారు.

పసుపుపచ్చని గుడ్డలో కట్టిన గంగాజలం గల బిందెను కావడికి కట్టుకొని దాన్ని భుజంపై వేసుకుంటారు. కాశికావిడి వాడు గ్రామంలో ఓ అనుకూల ప్రదేశంలో చిన్న సమావేశం పెట్టి తన చుట్టూ ప్రోగైన జనులకు తన అనుభవాల్ని వివరిస్తుంటాడు. కాశీక్షేత్ర మహిమతో పాటు మార్గమధ్యంలో తాను సందర్శించిన క్షేత్రాల గూర్చి వివరిస్తాడు. కాశీకావిడివారే పూసలవాళ్ళు. వారు తమ ప్రధానవృత్తిని మరచిపోయి కాశికావడులుగా మారారంటారు. వీరు వైష్ణవులు. ఇప్పటికీ కొన్ని పూసల కుటుంబాలవారు భాగవతాలను ప్రదర్శిస్తారు. జానపద గీతాలను కూడా ఆలపిస్తారు.

ఈ 'కావిడివాళ్ళ'లో కూడా రెండు వర్గాలు. కాశికావడివాళ్ళు, కంచికావడివాళ్ళు. కంచికావడి వాళ్ళు 'కంచి' నుంచి వస్తారు. శైవవైష్ణవమతాలకు చెందిన వారంతా కాశికావడి వాళ్ళను ఆదరిస్తారు. గౌరవిస్తారు. ఆ విధంగా వీరు తమ కళారూపాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ☆

గంటలు, కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు. ముఖాన విభూతి ధరిస్తారు. భయంకరంగా ఆహార్యం కలిగిఉన్న వీరు 'శరభ శరభ అశ్శరభ, శరభ' వంటి మాటలతో వీరణం, తాషామర్ఫాలు, డోలు, తంబురా, సన్నాయి ధ్వనులతో భక్త్యావేశ పరుల్ని చేస్తారు. ఈ సన్నివేశంలో చేసే నాట్యాన్ని 'వీరంగం' అంటారు. సామాన్య ప్రజానీకానికి సైతం తెలిసిన రోమాంచిత నాట్యం 'వీరంగం'.



డోలు వాద్యాలతో ప్రారంభమయ్యే ఈ నాట్యంలో నలుగురు నుండి ఎనిమిది మంది దాకా కళాకారులు పాల్గొంటారు. తాళాలకూ, గీతాలకు అనుగుణంగా కాళ్ళూ, చేతులు కదిలిస్తూ నర్తిస్తారు. 'జాతి'ని అనుసరించి వారి నాట్యం కొనసాగుతుంది. యజ్ఞం సందర్భంగా కొనసాగే జతుల గానం తాండవ నృత్యం, లయబద్ధమైన వాద్యసంగీతం ఈ వీరనాట్యానికి నిండుదనాన్ని చేకూరుస్తాయి. ఒక దశలో మంటలు చెలరేగుతుండగా సాగే ఈ నృత్యం 'మంగళహారతి' తో ముగుస్తుంది. పేరిణి నృత్యంలో ఒకనాడు ఇది ఓ భాగమేనని పండితుల అభిప్రాయం. శివరాత్రినాడు ఈ కళాకారులు 'లింగోద్భవం' సందర్భంగా చేసే 'ఊర్ధ్వతాండవం' వైవిధ్యభరిత నృత్యం.

వీరనాట్యం శివ, వీరభద్ర ఆలయాల్లోనే కాక భావనాఋషి ఆలయాల్లో జరిగే ఉత్సవాల్లో కూడా కొనసాగించడం ఆచారంగా వస్తున్నది. తూర్పుగోదావరి జిల్లా యెల్వలపల్లికి చెందిన కళాకారులు ఈ కళారూపాన్ని అత్యున్నత దశకు తీసుకొని వెళ్ళేందుకు విశేషకృషి చేశారు. నేటికీ ప్రజాభిమానం పొందిన జానపద కళారూపం 'వీరనాట్యం'.

*-ఎ.ఎమ్. ఫీచర్స్*

# పంచాయతీ రాజ్ లక్ష్యాలు ఆదర్శాలుగానే మిగిలిపోయాయా?

**అది 1993వ సంవత్సరం ఏప్రిల్ నెల 24వ తేదీ. గ్రామ పంచాయతీలు స్వయం పాలనా ప్రభుత్వ సంస్థలుగా అవతరించడానికి కారణమైన 73వ రాజ్యాంగ సవరణ చట్టం భారత రాజ్యాంగంలో 9వ ప్రకరణంగా మారిన రోజది. ఈ సుదినం రావడానికి, స్థానిక సంస్థలకు స్వయం పాలనాధికార హోదాను కల్పిస్తూ అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ 1882లో ప్రవేశపెట్టిన తీర్మానం చట్ట రూపం పొందటానికి 110 ఏళ్లు పట్టింది. పంచాయతీలకు రాజ్యాంగ హోదా కల్పించాలని గాంధీజీ చేసిన 'గ్రామ స్వరాజ్య' ప్రతిపాదన ఆచరణ రూపం పొందటానికి పట్టిన కాలం 84 ఏళ్లు.**

మరి, నేటి పంచాయతీల పరిస్థితి ఏమిటి? వాటి నిజరూపాలు ఏమిటి? అన్న అంశాలను కనుగొనటానికి ఆంధ్రప్రదేశ్‌లో రెండు గ్రామాలలో జరిపిన అధ్యయాన్ని ఈ వ్యాసం విశదీకరిస్తుంది. దేశంలో స్వయంపాలనా సంస్థల ుగా విరాజిల్లుతున్న పంచాయతీలు వాస్తవానికి దూరంగా కేవలం భావాల ుగా/ఆదర్శాలుగా మిగిలిపోవడానికి అడ్డుపడే సంక్లిష్ట విషయాలను ఈ పత్రంలో లోతుగా చర్చించాను.

## షాద్‌నగర్

1995లో నేను షాద్‌నగర్‌కు వెళ్ళాను. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, పంచాయతీలపై బల్వంత్‌రాయ్ కమిటి నివేదిక వెలువడిన తర్వాత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అక్టోబర్ 11, 1959న దేశంలో రెండో పంచాయతీ రాజ్ సంస్థను ప్రారంభించడానికి ఇక్కడికి వచ్చారు. 105 గ్రామాల షాద్‌నగర్ తాలూకా అదే ఏడాది అక్టోబర్ 2న 66 గ్రామాలు, 52 వేల మంది జనాభా గల పంచాయతీ సంస్థ (బ్లాక్) గా మారింది. దేశంలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణను ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 బ్లాక్ సమితుల్లో షాద్‌నగర్ ఒకటి.

నాటి సమితి అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డిని నామినేట్ చేశారు. 1987 జనవరిలో వెలువడిన కొత్త చట్టం ప్రకారం, షాద్ నగర్ సమితిని నాలుగు మండల ప్రజాపరిషత్‌లుగా విభజించారు. షాద్‌నగర్ కాకుండా కొత్తూరు, కేశంపేట, కొందుర్గ్ మండలాలు అవి. షాద్‌నగర్ మండలం 29 గ్రామ పంచాయతీలతో 96,627 జనాభాతో ఏర్పాటైంది.

నేను షాద్‌నగర్ వెళ్ళినప్పుడు 73 ఏళ్ల రాందేవ్ రెడ్డిని కలిశాను. నెహ్రూ అక్కడికి రాక పూర్వం ఆయనే సమితి అధ్యక్షుడిగా ఉండేవాడు. రాందేవ్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్‌లో అతివాద నాయకుడిగా పేరుపడ్డ స్వామి రామానంద్ తీర్థ శిష్యుడు.

పి.వి.నరసింహారావు, జలగం వెంగళరావులు రామానంద తీర్థ వర్గంలో ఉండేవారు. కాంగ్రెస్ లోని మరో వర్గానికి కె.వి.రంగారెడ్డి, బూర్గుల రామకృష్ణారావులు నాయకులు. సమితి ఎన్నికల్లో రాందేవ్ రెడ్డి బూర్గుల సోదరుడు వెంకటేశ్వరరావును ఓడించారు. మొత్తం 64 ఓట్లలో రాందేవ్ రెడ్డికి 48 ఓట్లు వచ్చాయి.

షాద్‌నగర్ బూర్గుల రామకృష్ణారావు నియోజక వర్గం కాబట్టే నెహ్రూ అక్కడికి వచ్చారన్నది రాందేవ్ రెడ్డి వాదన. రామకృష్ణారావుది షాద్‌నగర్ సమీపంలోని బూర్గుల గ్రామం. అంతేకాకుండా, ఆ కాలంలో గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఉన్నతాధికారులు ఖాదర్ అలీఖాన్, కె.డి.లాల్, అబిద్ హుస్సేన్ షాద్‌నగర్ వారే. వాళ్లే గ్రామాభివృద్ధి గాథల ద్వారా షాద్‌నగర్ కు గుర్తింపు తెచ్చారు. వాస్తవానికి అప్పట్లో డిప్యూటీ డెవలప్‌మెంట్ కమీషనర్ గా ఉన్న కె.బి.లాల్ ఆదర్శ పంచాయతీ కార్యాలయం అనే పేరుతో నిర్మించిన భవనంలోనే 1995లో మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. అదే కార్యాలయం పక్కనున్న మైదానంలో 1959 అక్టోబర్ 11న జరిగిన బహిరంగ సభలో నెహ్రూ ప్రసంగించారు.

వేదిక మీద అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, ప్రజాభివృద్ధి శాఖ ఉపమంత్రి బి.యస్. మూర్తి, పి.వి.నరసింహారావు ఉన్నారు. నెహ్రూ ప్రసంగాన్ని పి.వి. నరసింహారావు తెలుగులోకి అనువదించారు. సమితి అధ్యక్షుని హోదాలో నాటి సభలో ప్రధాని నెహ్రూకు స్వాగతం పలికినట్లు రాందేవ్‌రెడ్డి గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ సభకు చుట్టు పక్కల గ్రామాల నుంచి దాదాపు 20 వేల మంది జనం నెహ్రూ ప్రసంగం వినడానికి వచ్చారు. సభలో నెహ్రూ మాట్లాడుతూ, విజయదశమి రోజున ప్రజాభివృద్ధి బాధ్యతను ప్రజలకే అప్పగించడం ఓ మంచి శకునం అని అన్నారు.

ఆ రోజుల్లో పంచాయతీ సమితి సాధించింది ఏమిటంటే,రోడ్లు, పాఠశాల భవనాల నిర్మాణానికి శ్రమదానం చేయడానికి జనం విపరీతంగా ముందుకు వచ్చేవారు. కొన్ని చోట్ల 50% పనులు స్వచ్ఛంద సేవల ద్వారానే జరిగేవి. వ్యవసాయంలో జపాన్ పద్ధతులను ప్రవేశ పెట్టారు. ఆ ప్రాంతంలోని మరో ప్రముఖ నాయకుడు ఎం.దామోదర్ రెడ్డి. ఆయన 1959లో షాద్‌నగర్ సమీపంలోని కొందుర్గ్ పంచాయతీ సమితికి అధ్యక్షుడు. తరువాత 19962లో శాసన సభ సభ్యుడిగా, 1981లో 25% నిధులతో ప్రాజెక్టులను పూర్తిచేసి మిగతా 75%తో జేబులు నింపుకొంటున్నారని దామోదర్‌రెడ్డి విమర్శించారు. ఈ రోజుల్లో జవహర్ రోజగార్ యోజన నిధులను కూడా దుర్వినియోగం చేస్తున్నారు. నేడు అధికారులే కాకుండా ప్రజాప్రతినిధులు కూడా అవినీతి పరులైపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

నేను షాద్ నగర్‌ను సందర్శించినప్పుడు సమితి అధ్యక్షులంతా అగ్ర కులస్థులే. ఆ కులం వారే ఎందుకు ఎన్నికవుతుంటారు? అని వారిని

అడిగాను. వారు ప్రజలకు సేవ చేస్తుంటారు. వారికి ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు ఉంటాయని రాందేవ్ రెడ్డి, దామోదర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ రోజుల్లో గ్రామాల్లో సోషలిజం ఎక్కువగా కన్పించేదని రాందేవ్ రెడ్డి అంటారు. ఆయనకు 1200 ఎకరాల వ్యవసాయ భూమి ఉండేదట. 1956లో తన భూములన్నిటిని ప్రజలకు పంచిపెట్టి తను కేవలం 40 ఎకరాలు ఉంచుకొన్నట్లు ఆయన చెప్పారు.

నాటి పంచాయతీలు 'నాయకత్వ నర్సరీలు'గా ఉండేవని వృద్ధ నాయకులు చాలా మంది చెప్పడం నాకు ఆశ్చర్యం కలిగించింది. షాద్‌నగర్‌కు చెందిన అనేక మంది పంచాయతీ అధ్యక్షులు ఆ తరువాతి కాలంలో ఎమ్మెల్యేలు అయ్యారు. కొందరు రాజకీయ పార్టీలలో, ప్రభుత్వంలో ప్రముఖ స్థాయికి ఎదిగారు కూడా. మొట్టమొదట ఏర్పాటైన పంచాయతీ సమితీలో ఇద్దరు మహిళలు కో ఆప్ట్ అయ్యారు. వారిలో విమలమ్మ అగ్రకుల మహిళకాగా, లక్కమ్మకు తన సంతకం చేయడం మినహా చదువు రాదు. వాళ్లకు కేవలం పార్టీకి విశ్వాసపాత్రులుగా ఉండటమే తెలుసు. పార్టీ కార్యకలాపాలో చురుకైన పాత్రను పోషించేవారు. ప్రజా సమస్యలను పై వారి దృష్టికి తీసుకెళ్ళేవారు. సభలూ, సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేవారు. ఆ రోజుల్లో గ్రామ సభలు చాలా అరుదుగా జరిగేవి. మహిళలు చదువుకొన్న పురుషులకంటే చాలా నిక్కచ్చిగా, ఆచరణాత్మకంగా ఉండేవారని రాందేవ్‌రెడ్డి అంటారు.

1959-64 మధ్యకాలం పంచాయతీ రాజ్ వ్యవస్థకు స్వర్ణయుగం లాంటిదని షాద్‌నగర్ వయో వృద్ధులంతా అంగీకరించారు. 1964-1987 మధ్య కాలాన్ని 'నిష్క్రియా కాలం' గా వారు అభివర్ణించారు. పైగా ఆ మధ్య కాలంలో పంచాయతీ వ్యవస్థ చాలా దిగ జారిపోయింది. దీనికి ఒక కారణం నిధుల లేమి. భూములపై వచ్చే 25 పైసల సెస్సే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది.

1959-60 ఆర్థిక సంవత్సరంలో షాద్‌నగర్ సమితి ఆదాయం 2,87,530 రూపాయలు కాగా, ఖర్చు 1,81,670 రూపాయలు. 1954 అక్టోబర్ లో పంచాయతీ సమితి ఏర్పడినప్పటి నుంచి ఏడేళ్ళ వరకు కేవలం 12.5 లక్షలే ఆ సమితి ఖర్చు పెట్టింది. ఇంత తక్కువ మొత్తమే మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా ఖర్చు పెట్టిన సమితిగా ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

కింది స్థాయిలో బాగా నిర్లక్ష్యానికి గురైన రంగం విద్యారంగమే. 1908 రాజరికపు గెజిటీర్ ప్రకారం, మహబూబ్ నగర్ జిల్లా 3.3% అక్షరాస్యతతో ఉన్నత స్థానంలో ఉండేది. ఇందులో పురుషులలో అక్షరాస్యులు 5.9% కాగా, స్త్రీలలో కేవలం 0.65% మాత్రమే ఉన్నారు. 1961లో అక్షరాస్యత శాతం 13.4 శాతానికి పెరిగింది. అందులో 21.5% పురుషులు, 5.4% స్త్రీలు ఉన్నారు. అయితే జిల్లా సగటు అక్షరాస్యత కంటే షాద్‌నగరే తక్కువ. అంటే అది 12.3% మాత్రమే ఉండేది. అయితే 1995 నాటికి పరిస్థితి కొంత మెరుగుబడినప్పటికీ, ఆ ఏడాది షాద్‌నగర్ అక్షరాస్యత రేటు 23.5%గా నమోదైంది. ఇది రాష్ట్ర సగటు అక్షరాస్యత రేటు 37.46% కంటే చాలా తక్కువ. ఈ వెనుకబాటు తనానికి దామోదర్ రెడ్డి ఒక కథ వినిపించారు.




షాద్‌నగర్‌కు 7 కిలోమీటర్ల దూరంలో మదిలాపుర్ అనే గ్రామం ఉంది. ఆ ఊరి బడిలో 200 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రధానోపాధ్యాయురాలిగా ఒక మహిళ ఉండేది. స్కూల్ అసిస్టెంట్‌గా ఒక పురుషుడు ఉండేవాడు. దామోదర్ రెడ్డి ఆ స్కూల్‌ను సందర్శించడానికి కొద్ది రోజుల ముందు జిల్లా విద్యాధికారి (DDO) ఆ స్కూల్ తనిఖీకి వెళ్లారు. స్కూల్లో ఒక్క టీచర్ కూడా లేదు. పిల్లలు స్కూల్ చప్రాసి పర్యవేక్షణలో పరీక్షలు రాస్తున్నారు. స్కూళ్ల స్థితిగతులు అలా ఉండేవని దామోదర్ రెడ్డి వివరించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ విఫలం కావడానికి మరో కారణాన్ని వృద్ధులు చెప్పారు. గ్రామాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వాధికారులకు ఇష్టముండేది కాదు. ఈ విషయంలో అధికారులు రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులతో కుమ్మక్కయ్యేవారు.

ప్రస్తుతం షాద్‌నగర్ పంచాయతీ వ్యవస్థ అవసాన దశలో ఉంది. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన చారిత్రాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రజలు పూర్తిగా మరచిపోయారు. ఆ చారిత్రాత్మక ఘటనను గుర్తుకు తెప్పించే స్మారక చిహ్నం కూడా ఏదీ అక్కడ లేదు. నెహ్రూ ప్రసంగించిన మైదానంలో ఇప్పుడు హరిజన కాలనీ ప్రత్యక్షమైంది. 1987లో అక్కడ ఒక తాగునీరు ట్యాంకును నిర్మించారు. ఈ నిర్లక్ష్యపు ఛాయలు పాత తరాల వారు పెట్టుకొన్న ఎన్నో ఆశల రూపరేఖలు లేకుండా చేశాయని చెప్పడానికి బాధగా ఉంది.

## శృంగవృక్షం

నా రెండో కేసు స్టడీకి తూర్పు గోదావరి జిల్లాలోని శృంగవృక్షం గ్రామ పంచాయితీని ఎంచుకొన్నాను. చెన్నై నుండి హౌరా రైలు మార్గంలో అన్నవరం పుణ్యక్షేత్రానికి 7 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. సారవంతమైన నేల, సమృద్ధిగా నీటి వనరులు ఉన్న ఈ ప్రాంతం ఎప్పుడూ పచ్చటి పైరులతో కళకళలాడుతూ ఉంటుంది. ప్రశాంతమైన వాతావరణానికి ఈ ప్రాంతం పెట్టింది పేరు.

# నెహ్రూ స్మృత్యర్థం : పతనావస్థలో మొదటితరం పంచాయతీలు

**అక్టోబర్ 2, 1959**

రాజస్తాన్‌లోని నాగోర్ గ్రామం. మొదటితరం పంచాయతీలను ప్రారంభిస్తూ నాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గ్రామీణుల నుద్దేశించి ఇలా అన్నారు.

"స్వాతంత్ర్యం వచ్చాక ప్రజాపాలనను ఏర్పాటు చేసుకొన్నాం. ప్రతీ భారతీయుడికి ఓటు వేసే హక్కు ఇవ్వబడింది. రాష్ట్రశాసన సభలకు, లోక్ సభకు తమ ప్రతినిధులను ఎన్నుకొనే హక్కును, ప్రజలు పొందారు. సరైన మార్గంలో మనం వేసిన అడుగు ఇది. కానీ ఈ హక్కుతోనే నిజమైన ప్రజాస్వామ్యం రాదు. గ్రామాల్లో నివసించే ప్రజలు చైతన్యవంతులైనప్పుడే దేశం పురోగతి చెందుతుంది"

ఆ సందర్భంగా రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ పంపిన ఒక సందేశంలో...

"రాజస్తాన్ ప్రభుత్వం అక్టోబర్ 2న వికేంద్రీకరణ దిశగా గొప్ప ముందడుగు వేస్తున్నదని తెలిసి చాలా సంతోషిస్తున్నాను. ఈ వికేంద్రీకరణ ప్రయోగం రాజస్తాన్ ప్రజలకే కాకుండా, ఇతర రాష్ట్రాల ప్రజలకు కూడా ఎంతో ప్రయోజనకరంగా వుంటుంది" అని అన్నాడు.

నాగోర్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించడం ఒక్కటే కాకుండా, రాజస్థాన్‌కు ఇతర విధాలుగా కూడా ప్రాధాన్యం ఉంది. గ్రామీణ ప్రజలకు సాధికారతను కల్పించే గొప్ప శాసనాలు కూడా ఇక్కడనే ప్రారంభమయ్యాయి. వుదహరణకు, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (NREGS), సమాచార హక్కు (RTI) రాజస్తాన్‌లోనే ప్రారంభమయ్యాయి.

నెహ్రూ నాగోర్‌ను సందర్శించటానికి సరిగ్గా ఒక నెల ముందు (సెప్టెంబర్ 2, 1959) పంచాయతీ సమితి, జిల్లా పరిషత్‌ల చట్టం చట్టరూపం దాల్చింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫార్సుల ఆధారంగా మూడంచెల పంచాయతీరాజ్ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టాన్ని అక్టోబర్ 2న నాగోర్‌లో లాంఛనంగా నెహ్రూ ప్రారంభించారు. అదే ఏడాది, అక్టోబర్ 11న ఆంధ్రప్రదేశ్‌లోనూ, 1960లో అస్సాం, కర్ణాటక (నాటి మైసూరు రాష్ట్రం), తమిళనాడు (మద్రాస్) రాష్ట్రాలలోనూ, మహారాష్ట్రలో 1962లోనూ, పశ్చిమ బెంగాల్‌లో 1964లోనూ ప్రారంభించారు క్రమంగా మిగతా రాష్ట్రాల్లో కూడా పంచాయతీరాజ్ చట్టం అమలైంది.

పంచాయతీల పనితీరును అధ్యయనం చేయడానికి నేను 1995లో ఈ చారిత్రాత్మక నాగోర్ జిల్లాను సందర్శించాను. వివిధ స్థాయిల్లో నేను ప్రజలతో మాట్లాడాను. భారతదేశ తొలి ప్రధాని ప్రారంభించినా, నాగోర్‌పై ఎటువంటి ప్రభావం వున్నట్లు నాకనిపించలేదు. 35 ఏళ్ల వైఫల్యాల ప్రస్థానం ఆ పంచాయితీది. ఇప్పుడు 50 ఏళ్ల తరువాత కూడా ఎంతో నైరాశ్యం అలముకొంది అక్కడ.

అక్కడి వైఫల్యానికి అనేక కారణాలున్నాయని ఆ ప్రాంతపు సీనియర్ నాయకులు అన్ని చోట్ల విన్న మాటలనే మళ్లీ చెప్పారు. పరిమితమైన అధికారాలు, నిరక్షరాస్యత, ఆర్థిక అడ్డంకులు, అక్రమ ఎన్నికలు, ప్రజల పట్ల సానుభూతి లేని అధికారగణం, మోతుబరి సర్పంచ్ చేతిలో పూర్తి అధికారాలు, భయంకరమైన అవినీతి తాండవిస్తున్నాయని వారు చెప్పారు. మోహన్‌లాల్ సుఖాడియా అధికారంలో ఉన్నప్పుడు ప్రధాన్‌లకు ప్రాముఖ్యం ఇవ్వగా, పంచాయతీలకు అధికారం ఇవ్వడాన్ని ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. పంచాయతీలకు అధికారమిస్తే, తాము అధికారహీనుల మవుతామన్న భయంతో ఆ ప్రయత్నాలను నీరు గార్చారు. నిర్మల్ ముఖర్జీ చెప్పినట్లు, అట్టడుగు స్థాయిలో భూస్వామ్య వ్యవస్థ, పితృస్వామిక వ్యవస్థే నిజమైన విలన్‌లు అన్నది అక్షరాలా నిజమనిపిస్తోంది. గ్రామీణ సమాజంలో ఈ రెండు వ్యవస్థలు ఉన్నంత కాలం, స్థానిక స్వపరిపాలన నుంచి మనం ఆశించాల్సింది ఏమీ ఉండదు.

దీనికి నాగోర్ కూడా మినహాయింపు కాదు. అదొక నియమంలాగా దేశంలోని మొదటితరం పంచాయతీలన్నింటా ఇదే పరిస్థితి ఉందంటే అతిశయోక్తికాదు. హైదరాబాద్‌కు సమీపంలోని షాద్‌నగర్ పంచాయతీ సమితిని కూడా నేను సందర్శించాను. 1959 అక్టోబర్ 11న పండిట్ నెహ్రూ పంచాయతీరాజ్ వ్యవస్థను షాద్‌నగర్‌లో ప్రారంభిస్తూ, చారిత్రాత్మక ప్రసంగం చేశారు. 1959 నుంచి 1964 వరకు ఈ పంచాయతీ సమితి బాగానే నడిచింది.

ఆ తరువాతి కాలం నుంచి దాని పతనం ప్రారంభమైంది. నాగోర్, షాద్‌నగర్‌లలో పంచాయతీ వ్యవస్థ పతనావస్థకు చేరుకొంది. సమాజంలో ఆధిపత్యం చెలాయించే కులాలవారు సంకుచిత స్వార్థ పరులు సమాజంలో మార్పులు రావడానికి అంగీకరించరు. విద్య, స్వేచ్ఛాయుత ఎన్నికలు, మహిళల హోదా పెరగడం వంటి అభివృద్ధికి దోహదపడే అంశాలంటే వారికి గిట్టదు.

పంచాయితీలను రాజ్యాంగంలో చేర్చితే గొప్ప విప్లవాత్మక మార్పు లొస్తాయని 1970, 80 దశకాలలో అంతా భావించారు. పంచాయితీలకు రాజ్యాంగ హోదా కల్పించే 73వ రాజ్యాంగ సవరణ (1993) అమల్లోకి వచ్చి 16 ఏళ్లు దాటింది. కానీ నేటి పరిస్థితి ఏమిటి? జమ్మూకాశ్మీర్, జార్ఖండ్‌లలో మినహా మిగతా రాష్ట్రాలన్నింటిలో ఎన్నికలు జరిగిన పంచాయతీలు ఉన్నాయి. 32 లక్షల మంది ఎన్నికైన ప్రజా ప్రతినిధులున్నారు. వారి హక్కులు, బాధ్యతలు గురించి వారికే తెలియదు. ఎం.పీలు, ఎమ్మెల్యేలు, అధికారులు అనుకూల వైఖరి అవలంబించకపోతే, 73వ రాజ్యాంగ సవరణ పేపరుకే పరిమితమవుతుంది. గాంధీజీ, నెహ్రూ కన్న కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

*– అనువాదం: బి.లలిత*

2006 జులైలో జరిగిన పంచాయతీ ఎన్నికల ద్వారా ప్రజా జీవితంలోకి ప్రవేశించాలని ఆ గ్రామంలో ఓ మహిళ భావించింది. వెనుకబడిన కుటుంబంలో పుట్టిన 48 ఏళ్ల ఆ మహిళ బలహీన వర్గాలకు రిజర్వు చేసిన వార్డుకు నామినేషన్ వేసింది. అయితే ఆ గ్రామ భూకామందులు, పెద్ద రైతులు తమ తరపున మరో పురుష అభ్యర్థిని అదే వార్డ్ నుంచి నిలబెట్టాలనుకొన్నారు. తమ అభ్యర్థికి ఎదురు లేకుండా ఏకగ్రీవంగా గెలిపించుకొనేందుకు వీలుగా ఆమెను పోటీ నుంచి విరమించుకోవల సిందిగా కోరారు. కావాలంటే ఎంతైనా డబ్బు ఇస్తామని భూకామందులు ఆశ చూపారు. గ్రామమంతా ఏకగ్రీవంగా ఎన్నికవ్వాలని వారు పట్టుబట్టారు. కానీ పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉన్న ఆమె పోటీ నుంచి వైదొలగడానికి నిరాకరించింది. వారి బెదిరింపులకు ఏ మాత్రం భయపడలేదు.

ఆ మహిళ ఒక మోడల్ బాలట్ పేపర్‌ను ప్రింట్ చేయించుకొని ఇంటింటికి తిరిగి ప్రచారం చేసుకొంది. రోజుకూలీగా పనిచేసుకొనే ఆమె అంతకంటే ఎక్కువ ఏమీ చేయలేకపోయింది. కానీ తన ప్రత్యర్థి మాత్రం ఇంటికో వెండి కుంకుమ భరిణి, బంగారు రంగులో ఉన్న లక్ష్మీదేవి విగ్రహాన్ని పంచిపెట్టాడు. వాటితో పాటు దాదాపు 80 చీరెలు కూడా పంచాడు. ఆ వార్డులో మొత్తం ఓటర్ల సంఖ్య 284. వారిలో 80% అంటే 227 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎట్టకేలకు ఆమె తన ప్రత్యర్థిని 14 ఓట్ల తేడాతో ఓడించింది. కానీ ఆ ఎన్నిక అనేక తీవ్ర పరిణామాలకు దారి తీసి అంతిమంగా ఆమె దారుణహత్యకు కారణమైంది.

పోలింగ్ ముగిశాక ఆమె ప్రత్యర్థులు రహస్యంగా సమావేశమై ఉప సర్పంచ్‌ను ఎన్నుకొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ సమయాన్ని కూడా ప్రకటించారు. ప్రమాణ స్వీకారోత్సవం ప్రారంభం కావటానికి ముందు, కొత్త పంచాయతీని సమావేశపరచకుండా ఉపసర్పంచ్‌ను ఎన్నుకోవడం చెల్లదని ఆమె సవాల్ చేసింది. ఆ సందర్భంలో అక్కడే వున్న మండల పంచాయతీ అధ్యక్షుడు తప్పును అంగీకరించి క్షమాపణలు చెప్పాడు. కానీ ప్రత్యర్థులు మాత్రం నిరసన తెలుపుతూ ఆమెకు క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదని అనడమే కాకుండా 'మేమింతే చేస్తామని' మొండిగా చెప్పారు.

గ్రామ పంచాయతీ కార్యాలయాలలో స్థానిక ఎమ్మెల్యేల ఫోటోలు పెట్టడం ఆనవాయితీ. శృంగవృక్షంలో గెలిచిన మెజార్టీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే వ్యతిరేక పార్టీ వారు. అందుకని ఆయన ఫోటోను తొలగించారు. ఈ చర్యను ఆమె ఖండించి ఎమ్మెల్యే ఫోటో పెట్టేవరకు పట్టుబట్టి నిరసన తెలియచేసింది. చేసేది లేక వారు ఫోటోను యథాస్థానంలో పెట్టాల్సి వచ్చింది.

పంచాయతీ సమావేశాలప్పుడు ఆ గ్రామ మహిళా సర్పంచ్ పక్కన ఆమె భర్త (ఆయనకు అధికార హోదా ఏమీ లేదు) ఆమె పక్కనే కూర్చునేవాడు. ఆయన పక్కన అగ్రవర్ణాల ప్రతినిధి మరో వ్యక్తి అనధికారి కంగా కూర్చునేవాడు. ఈ పద్ధతి సరైనది కాదని, అనధికార వ్యక్తులను సమావేశంలోకి అనుమతించగూడదని అభ్యంతరం పెట్టినా వారు ఖాతరు చేయలేదు. సరైన రికార్డులు లేకుండా చేసే ఖర్చులు, కూలీల పేర్లు లేకుండా చెల్లింపులు వంటి విషయాలపై వారిని నిలదీసి ప్రశ్నించేది.

అలా మూడు సమావేశాల అనంతరం ఆమె తమకు అడ్డంకిగా ఉందని ఆమెకు తగిన గుణపాఠం చెప్పాలని మెజార్టీ వర్గం వారు నిర్ణయించుకొన్నారు. ఒకరోజు రాత్రి ఆమె కుటుంబం కౌలుకు తీసుకొన్న రెండెకరాల పొలంలో పండిన వరి కుప్పలను ప్రత్యర్థులు తగులబెట్టారు. అయినా ఆమె ఏ మాత్రం జంకలేదు. ఆమె జిల్లా కలెక్టర్ వద్ద కెళ్ళి, తన ఆస్తిని, తన నోటి దగ్గరి కూడును ప్రత్యర్థులు ధ్వంసం చేశారని ఫిర్యాదు చేసింది. దానికి ఆయన సమాధానమిస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయల సిందిగా సలహా ఇచ్చాడు.

ఇందిరమ్మ గ్రామాభివృద్ధి పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామసభ ఒక సెలక్షన్ కమిటిని నియమిస్తుంది. సాధారణంగా ఈ సెలక్షన్ కమిటి సభ్యుల పేర్లను స్థానిక ఎమ్మెల్యేలు ప్రతిపాదిస్తారు. జిల్లా కలెక్టర్ ఆ ప్రతిపాదనలను యథాతథంగా ఆమోదించడం ఒక సంప్రదాయం. శృంగవృక్షం గ్రామ సభలో సెలక్షన్ కమిటి సభ్యుల పేర్లను ప్రకటించినప్పుడు ఆమె అభ్యంతరం తెలిపింది. గ్రామసభలోనే సెలక్షన్ కమిటి సభ్యులను ఎంపిక చేయాలని ఆమె పట్టుబట్టింది. ఆమె ప్రత్యర్థులు ఆమెను నోటికొచ్చినట్లు తిట్టారు. అంతటితో ఆగకుండా ఆమెను బట్టలు ఊడదీసి చావబాదాలని ప్రతిన పూనారు. అధికార పార్టీ సభ్యులం గాబట్టి తమకిష్టమొచ్చినట్లు చేస్తామని హెచ్చరించారు. అయినా ఆమె వారి బెదిరింపులకు భయపడలేదు. ఆగ్రహం కట్టలు తెంచుకొన్న ఆమె ప్రత్యర్థి ముఠా నాయకుడి చొక్కా కాలర్ పట్టుకొని లాగింది. అప్పుడే వారు, 'నీ అంతు చూస్తామని' చివరి హెచ్చరిక చేసినట్లు గ్రామస్తులు చెప్పారు.

2007 జులై నెల మొదటి వారం. గ్రామ చౌకధరల దుకాణం నుంచి ఒక అర్ధరాత్రి 5 క్వింటాళ్ళ బియ్యం ఆటో రిక్షాలో అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకొన్నారు. మరునాడు ఆమె 30 మంది గ్రామ మహిళలతో వెళ్ళి తహసిల్దారుకు ఫిర్యాదు చేసింది. వెంటనే ఆయన స్పందించి దుకాణానికి సీల్ వేయించాడు. ఆ తరువాత మూడు రోజులకు పంచాయతీ సమావేశం మామూలుగానే జరిగింది. అప్పుడు కొందరు వ్యక్తులు ఆమెను కలిసి చౌక ధరల దుకాణ యజమానిపై కేసును ఉపసంహరించుకోమని కోరారు. దానికి ఆమె ససేమిరా అన్నారు.

2007 జులై 14వ తేదీ. ఆ సాయంత్రం వర్షం పడింది. సాధారణంగా ఊరి మధ్యలో ఉన్న రచ్చబండ వద్ద చాలా మంది రాత్రిళ్ళు పడుకొనేవారు. ఆ రోజు వర్షం కారణంగా ఎవరిళ్లలో వారు పడుకొన్నారు. ఆ రోజు ఆమె ఇంటికి టీవీలో సీరియల్ చూడటానికి పక్కింటి ఇల్లాలు సోదరి వచ్చింది. ఆమెది కామరాజుపేట. చుట్టపు చూపుగా సోదరి ఇంటికి ఆ వేళ వచ్చింది. చాలా పొద్దుపోవడంతో తమ ఇంట్లోనే పడుకోమని ఆమె తన ఇంటికి వచ్చిన మహిళను కోరింది. ఆ మహిళ వరండాలో పడుకుంది. ఈమె తన మనుమడుతో సహా ఆ సోదరి పక్కనే మంచంపై పడుకుంది. మిగతా కుటుంబ సభ్యులు ఇంట్లో పడుకున్నారు.

అర్ధరాత్రి దాటాక గాఢ నిద్రలో వున్న ఆమెపై, ఆమె మనుమడిపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. క్షణాలలో వారిద్దరూ కాలి బూడిదైపోయారు. పక్కనే వున్న ఆ మహిళకు కూడా నిప్పు అంటుకుంది. దాంతో ఆ మహిళ పరిగెత్తుతూ బురదలో పడి స్పృహ కోల్పోయింది. ఆమె ఎన్నికై సరిగ్గా సంవత్సరం పూర్తైన రోజే ఈ దారుణం జరిగింది.

ఆగ్రహావేశాలతో రగిలిపోతున్న శృంగవృక్షం గ్రామస్తులు ఏడుస్తూ నాకు స్వాగతం పలికారు. ఆమె కూతురి శోకాన్ని ఎవరూ ఆపలేక పోతున్నారు. ఆరేళ్ల మనవరాలు పరిస్థితి అలాగే ఉంది. ఆమె తన తమ్ముడితో అక్కడే ఆటలాడుకొనేది. కలిసి స్కూల్‌కు వెళ్ళేది. అప్పుడప్పుడు కొట్టుకొనేవారు.

ఆ వెంటనే నవ్వుకొనేవారు. అదంతా ఇప్పుడు పాత జ్ఞాపకంలా మిగిలిపోయింది. ఆమె హత్యకు రెండు గంటల ముందు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిళ్ళ నుంచి పెట్రోల్ తీస్తుండగా చూసినట్లు రాత్రి పొలానికి వెళ్తున్న గ్రామస్తులు చెప్పారు.

ఆమె అల్లుడు దినసరి వ్యవసాయ కూలీ. నేను ఆ గ్రామంలో ఉన్నంత సేపు ఆయన ఏడుస్తూనే ఉన్నాడు. ఆమె భర్త  గురించి వాకబు చేశాను. ఆయన తన రెండో కొడుకును వెంటబెట్టుకొని కూలిపనికి వెళ్ళాడట. చనిపోయిన వారి కోసం ఏడవటానికి కూడా వారికి సమయం దొరకలేదు. ఇంట్లో తినడానికి పిడికెడు బియ్యం లేవు. ఆ రోజు పొట్ట నింపుకోటానికి పనికి వెళ్ళక తప్పింది కాదు వారికి. ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలి పనికి మగవారైతే 50 రూపాయలు, ఆడవారైతే 40 రూపాయలు ఇస్తారు. 'ప్రభుత్వం నుంచి సహాయం ఏమీ అందలేదా' అని వారిని అడిగితే ఏ మాత్రం అందలేదని వారు ముక్త కంఠంతో చెప్పారు.

ఆ ప్రాంతపు ఆచారం ప్రకారం ఒక ఇంట్లో చావు జరిగితే, ఆరు నెలల పాటు ఆ ఇంటిని పాడు పెట్టాలి. ఆమె ఇంటి ముందు దర్వాజాకు ప్లాస్టిక్ షీట్ కట్టి ఉంది. ఆ కుటుంబానికి పొరుగింటి వారు తాత్కాలికంగా తల దాచుకోటానికి చోటిచ్చారు. కానీ వచ్చే ఆరు నెలలు వారెక్కడ ఉంటారు? వారికి తిండి, బట్టలు ఎలా అన్నది ఎవరికీ తెలియదు. దివంగత పంచాయతీ సభ్యురాలికి శ్రద్ధాంజలి ఘటించడానికి పంచాయతీ ప్రత్యేక సమావేశం ఏదైనా జరిగిందా అంటే 'లేదు' అనే సమాధానం. పంచాయతీ కార్యాలయంపై నల్ల జెండా ఎగుర వేశారా అంటే దానికీ 'లేద'నే జవాబు. ప్రత్యర్థులు ముందునుంచీ చేసిన హెచ్చరికలు ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని అడిగితే, 'ఇప్పటిదాకా ఈ గ్రామం ఎంతో ప్రశాంతంగా ఉండేది. పైగా ఇలాంటి దారుణం ఓ మహిళ పట్ల జరుగుతుందని ఎవరూ ఊహించలేదని' వారు చెప్పారు.

శృంగవృక్షంలో ఆమె కుటుంబ సభ్యులను, గ్రామస్తులను కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని చూసేటప్పటికి సాయంత్రం చీకటి పడింది. నేను అక్కడి నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కామరాజు పేటకు బయలుదేరాను – హత్య జరిగిన రాత్రి ఆమె పక్కనే పడుకొన్న మహిళను పరామర్శించడానికి. రాత్రి 8 గంటలకు అక్కడికి చేరుకొన్నాను. బాగా వర్షం కురిసింది. చాలా ఏళ్ళుగా మరమత్తులకు నోచుకోని రోడ్లు. ఎక్కడా వీధిదీపాలు లేవు. రోడ్ల మీద తప్పతాగిన గ్రామస్తులు వస్తూపోతూ వున్నారు. ఈ రాష్ట్రంలో అక్రమ సారాయి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లాఉంటుంది. దూరాన ఎక్కడో మిణుగు మిణుగుమనే దీపం కనిపించింది. ఓ గ్రామస్తుడు ఆ మహిళ సోదరుని ఇంటిని చూపించాడు. ఆయన పాల వ్యాపారి. రోజుకు 100 రూపాయల సంపాదనతో ఐదుగురు కుటుంబ సభ్యులను పోషించాలి.

ఆమెకు భర్తా, పిల్లలు లేరు. కాలిన గాయాలతో ఆమె మంచం పట్టింది. ఆమె తల భాగం కూడా బాగా కాలిపోయి వుంది. చూడగానే ఆమె మరిన్ని రోజులు బతకదని ఎవరైనా చెప్పగలరు. ప్రభుత్వం నుంచి గాని, పంచాయతీ నుంచి గాని ఏమైనా సహాయం అందిందా అని అడిగితే 'లేద'ని సమాధానం. ప్రజా జీవితంలోకి ప్రవేశించాలనుకొన్న మహిళ తాను చెల్లించుకొన్న మూల్యం ఏమిటో శృంగవృక్షం ఘటనే మనకు చెబుతుంది. పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళలకు అంతకుముందు కనీవినీ ఎరుగని అవకాశాలు కల్పించడంతో అనూహ్యమైన ఘటనలు చోటు చేసుకొంటున్నాయి. పంచాయతీలు నాయకత్వ నర్సరీలని మనమంతా గొప్పగా వాదిస్తూ ఉంటాం. కానీ వాస్తవాలేమిటి? పేదలకు ముఖ్యంగా మహిళలకు కనీస మానవ హక్కులు, జీవించే హక్కు కరువైంది. వాళ్ళ శక్తి సామర్థ్యాలను చూపించడానికి మహిళలు తమ రక్తాన్ని ధారపోయాల్సి వస్తోంది.

★ ★ ★ ★ ★

**పం**చాయతీల వైఫల్యాలకు ప్రధాన కారణం కుల వ్యవస్థ, పితృస్వామ్య వ్యవస్థ. శృంగవృక్షం గ్రామంలో హత్య కాబడిన ఆమె చేసిన నేరమేమిటి? భారత రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రకారం ఆమె స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసి గెలిచింది.  ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వహించింది. ఆమె సమస్యల్లా ఒక్కట్లే. జమీందారులైన అగ్ర కులస్తుల ఆధిపత్యం ఎక్కువగా ఉన్న చోట బలహీన వర్గానికి చెందిన కులంలో పుట్టడమే. జమీందారులు సమాజంలో మార్పులను అంగీకరించరు.  అభివృద్ధికి దోహదపడే విద్య, స్వేచ్ఛా ఎన్నికలు, మహిళల స్థితిగతుల్లో వస్తున్న ప్రగతి వంటి విషయాలు వారికి మింగుడు పడవు. వారి ఆధిపత్యానికి అవి సవాలుగా మారతాయి. మహిళా సాధికారితను ఆమె ప్రత్యర్థులు సహించలేకపోయారు. మంటల్లో మాడిపోయిన ఆమె, ఆమె మనుమడి శరీరాలు గ్రామస్తులకు వెన్నులో వణుకు పుట్టించే సందేశానిస్తాయి. కానీ స్వార్థపరులకు అదో సాధారణ విషయం.

అక్కడ షాద్‌నగర్‌లో 1959వ సంవత్సరం దసరా రోజు జరుపుకొన్న ప్రజాస్వామ్య పండుగ భూస్వామ్య వ్యవస్థ, దాని తాలూకు బూజుపట్టిన విలవల కారణంగా తన లక్ష్యాన్ని సాధించలేకపోయింది. దేశంలో పంచాయతీ రాజ్ సంస్థల్లో నెలకొని వున్న పరిస్థితులకు ఈ రెండు ఉదాహరణలు ఓ సంకేతాలు మాత్రమే.

1994 లో 'పొంచివున్న ప్రమాదాల'న్న శీర్షికతో నిర్మల్ ముఖర్జీ రాసిన వ్యాసంలో ఇలా అంటారు – 'అట్టడుగు స్థాయిలో చూస్తే భూస్వామ్య, పితృస్వామిక వ్యవస్థలే మన ప్రధాన శత్రువులు. గ్రామీణ సమాజంలో ఇవి ఉన్నంత కాలం స్వయంపాలిత పంచాయతీ వల్ల ఒరిగేదేమీ ఉండదు. పంచాయతీరాజ్‌కు ఎక్కువ అధికారాలు కట్టబెట్టడం వల్ల సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా శక్తివంతులైన వారిని మరింత శక్తివంతులుగా మార్చడానికి ఉపయోగపడతాయి.

ఈ రాజకీయ సంక్లిష్టత కారణంగా పేదలు, మహిళలు మరింత పీడనకు గురౌతారు. వారికి ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ఓ వరంగా కంటే ఓ శాపంగా పరిణమించే ప్రమాదం వుంది. ముఖర్జీ చెప్పిన పై మాటలకు షాద్‌నగర్ పరిస్థితి, శృంగవృక్షం ఘటనలే మంచి ఉదాహరణలు. కొద్దిపాటి విజయాలకు మురిసిపోయి రాష్ట్ర అసెంబ్లీలో, పార్లమెంట్లో మన ప్రజాస్వామ్య విజయోత్సవాలను జరుపుకొనేటప్పుడు ఇలాంటి విషయాలను మరిచిపోవద్దు. దేశంలో ప్రాణాలు అర్పించిన ఎందరో బలహీన వర్గాల వారికి మనం నివాళులు అర్పిద్దాం!

*– **జార్జ్ మాథ్యూ,** డైరెక్టర్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, న్యూఢిల్లీ*

*అనువాదం: **కె.యస్. రెడ్డి***

# తేట తేట తెలుగు, తీయనైన తెలుగు

## తెలుగు.

**మన భాష తెలుగు. తెలుగు మాట్లాడే వారందరు తెలుగువారు. వీరు నివసించే ప్రదేశం తెలుగుదేశం. మన భాష తెలుగు భాష.**

**తెలుగు ఎంతో తేటనైన భాష. అందుకనే ఆధునిక కవులు 'తేట తేట తెలుగులా' అంటూ పాటలు కూడా వ్రాశారు.**

**తెలుగునకే తెనుగు, ఆంధ్రము అనే పేర్లు కూడా ఉన్నాయి.**

**మహాభారతాన్ని ఆంధ్రీకరించుమని నన్నయను కోరుతూ, రాజరాజ నరేంద్రుడు, "తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" అని తెనుగు పదాన్ని ఉపయోగించాడు.**



నన్నయభట్టు కూడా రాజరాజనరేంద్రుని కోరిక మేరకు మహాభారత గ్రంథాన్ని ఆంధ్రీకరించడానికి అంగీకరించాడు. గ్రంథం వ్రాయడమంటే మాటలు కాదు. దానికెన్నో నియమాలుంటాయి. ఛందస్సు, యతి, ప్రాస మొదలైనవుంటాయి. వ్యాకరణ నిబంధనలుంటాయి. వాటినన్నింటిని పాటించినప్పుడే కవిత్వం కలకాలం నిలుస్తుంది.

పుట్టిన బిడ్డ, పుట్టీపుట్టగానే మాట్లాడలేడు కదా! నాలుగైదు నెలలు వచ్చేసరికి అత్త, తాత అంటూ తొక్కు తొక్కు మాటలతో కన్నవారిని మురిపిస్తాడు. అదే విధంగా, నన్నయకు ఎన్నో సంవత్సరాల పూర్వం తెలుగుభాష ఆవిర్భవించి ఉంటుంది. అది గ్రంథ రూపం చెందడానికి కొన్ని శతాబ్దాల కాలం పట్టింది. నన్నయ, రాజరాజనరేంద్రుని ఆస్థానకవి. ఆయనకు కులబ్రాహ్మణుడు పురోహితుడు. గురువు కూడా రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసికొని, వేంగీ సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. రాజరాజు క్రీ.శ. 1022 వ సంవత్సరంలో జూలై పందొమ్మిదిన రాజమహేంద్రవర స్వర్ణ సింహాసనం మీద పట్టాభిషిక్తుడయ్యాడు. 1063వ సంవత్సరం వరకు, అంటే 41 సంవత్సరాలు రాజ్యపరిపాలన చేశాడు. నన్నయభట్టు, రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి కనుక, ఈయన కూడా 1022-1063 సంవత్సరాల మధ్య కాలంలోనివాడు.

అయితే, నన్నయకు పూర్వం తెలుగు ఎలా ఉండేది? మన భాషకు తెలుగు అనే పేరు ఎప్పుడు వచ్చింది? తెలుగువారుగా ప్రసిద్ధి చెందకపూర్వం, తెలుగు వారెవరు? వారెక్కడ నుండి ఈ ప్రదేశానికి వచ్చారు? ఎక్కడివరకు తెలుగువారు వ్యాప్తి చెందారు?... ఈ మొదలైన విషయాలన్నీ కూడా ఆసక్తిదాయకాలే. ముందుగా మనమెవరమో మనం తెలుసుకోవాలి కదా!

తెలుసుకుందాం. . .!

కొన్ని కారణాల వల్ల విశ్వామిత్ర మహర్షి తన కుమారుల్ని శపించాడు. ఆ కారణంగా వారు కొన్ని తెగలుగా, జాతులుగా విడిపోయారు. అందులో ఒక జాతి 'ఆంధ్ర' అనే పేరుతో వ్యవహారంలోకి వచ్చింది. వారే ఆంధ్రులని కొందరు విమర్శకులు తమ అభిప్రాయాన్ని తెలిపారు.

## తెలుగు సాహిత్య చరిత్ర

ఈ విషయాన్ని తెలియజేసే అందమైన కథ ఒకటి ప్రచారంలో ఉంది.

దీపకర్ణి కుమారుడు సాతవాహనుడు. ఈయననే శాతవాహనుడని, శాలివాహనుడని, శాతకర్ణి అని కూడా వ్యవహరిస్తారు. శాతవాహనుడు ఒకసారి, తన భార్యలతో కలిసి జల క్రీడలాడుతున్నాడు. ఆయన భార్యలలో ఒక రాణి సంస్కృతం చదువుకుంది. మహారాజు జలక్రీడలాడుతూ తన రాణుల ముఖాల మీద బలంగా నీళ్ళు చల్లాడు. అది తట్టుకోలేని విద్యావతియైన రాణి, "రాజన్! మోదకైస్తాడయ" అంది. అంటే , ఓ రాజా! (మ +ఉదకైః, తాడయ) నీళ్ళతో కొట్టవద్దు అని చెప్పింది.

సంస్కృతం రాని శాతవాహనుడు (మోదకైః) ఉండ్రాళ్ళతో (లడ్డులతో) కొట్టమన్నదనుకొని గంపలకొద్దీ లడ్డులు తెప్పించాడు. మహారాజు, తనను సరిగా అర్థం చేసుకోలేదని మహారాణి అనుకొంది. అసలు విషయం మహారాజుకి చెప్పింది. శాతవాహనుడు తన అజ్ఞానానికి, సంస్కృతం రాకపోడానికి ఎంతో చింతించాడు.

ఈ సంగతి, ఆయన మంత్రులైన శర్వవర్మ, గుణాఢ్యుడు తెలుసుకొన్నారు. వీరు చక్కని పండితులు కూడా. "మహారాజా!

విచారించకండి. మిమ్మల్ని ఆరు సంవత్సరాలలో మహాపండితుడుగా చేస్తాను" అన్నాడు గుణాఢ్యుడు.

"దీనికి ఆరు సంవత్సరాలు కావాలా? మహారాజా! నేను మిమ్మల్ని ఆరు మాసాలలో సంస్కృత పండితునిగా తీర్చిదిద్దుతాను" అన్నాడు శర్వవర్మ.

తనను కాదని ఆరు మాసాలలోనే విద్య నేర్పుతానని చెప్పిన శర్వవర్మ మీద, గుణాఢ్యుడికి కోపం వచ్చింది. దాంతో వారిద్దరి మధ్య మాట మాట పెరిగింది. పెద్ద గొడవైంది. ప్రతిజ్ఞల దాకా వెళ్ళారు. "ఆరుమాసాలలో నువ్వు మహారాజును పండితుణ్ని చేస్తే, నేను దేశభాషలనన్నింటిని విడిచిపెడతాను. అసలు మాట్లాడను. అంతేకాక, రాజ్యం విడిచి అడవులకు వెళ్ళిపోతాను" అని గుణాఢ్యుడు ప్రతిజ్ఞ పట్టాడు.

"మహారాజును ఆరు నెలల్లో విద్యావంతుణ్ని చెయ్యలేకపోతే, ఓ గుణాఢ్యా! నేను జీవించినంతకాలం నీ పాదరక్షలు నెత్తిమీద పెట్టుకు మోస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు శర్వవర్మ.

ఈ ఇద్దరి ప్రతిజ్ఞలు విని మహారాజు విస్తుపోయాడు.

శర్వవర్మ కుమారస్వామి భక్తుడు. ఇతడు కుమారస్వామిని గురించి తపస్సు చేశాడు. శర్వవర్మకు కుమారస్వామి ప్రత్యక్షమయ్యాడు. శర్వవర్మ కోరిన కోరికలను స్వామి అనుగ్రహించాడు. ఆ వరబలంతో శర్వవర్మ శాతవాహన మహారాజును మహాపండితుణ్ని చేశాడు.

ప్రతిజ్ఞ ప్రకారం, గుణాఢ్యుడు తాను నేర్చుకొన్న భాషలనన్నింటిని విడిచిపెట్టేశాడు. రాజ్యం వదిలి అరణ్యాలకు వెళ్ళాడు. అక్కడ ఆటవిక జాతులలో ఒక జాతివారైన పిశాచులతో పరిచయాలు ఏర్పరచుకొన్నాడు. వారి భాషను నేర్చుకొన్నాడు. వారిదైన పైశాచిక భాషలో బృహత్కథ అనే గ్రంథాన్ని రచించాడు. అదే క్రమంగా కథా సరిత్సాగరము అనే పేరుతో సంస్కృతంలో ఇతరులచే అనువాదం చేయబడింది.

క్రమక్రమంగా వింధ్య పర్వత ప్రాంతం నుండి ఆర్య జాతివారు కొందరు దక్షిణ దేశానికి వలస వచ్చారు. 'తెన్' అంటే దక్షిణం. దక్షిణ దేశంలో ఆర్యజాతి వారు మాట్లాడిన భాష తెన్గ్. అదే క్రమంగా తెనుగుగా మారింది. తెనుగు, తెలుగు అయింది. వీరు దక్షిణ పీఠభూమిని నివాసంగా చేసుకొన్నారు. (ఈ ప్రాంతం కొంతకాలం కన్నడుల పరిపాలనలో ఉండేది). తెలుంగులున్న ఆణెము (దేశం) కనుక తెలుంగాణెము అనే పేరు కూడా ఈ ప్రాంతానికి స్థిరమైపోయింది. తెలుంగాణమే పరిణామదశలో తెలంగాణముగా మారింది. ఈ ప్రాంతం నుండి కొందరు కృష్ణా, గోదావరీ తీరప్రాంతాలకు వలస వెళ్ళారు. ఇప్పటికీ ఇక్కడి నుండి గోదావరీ ప్రాంతాలకు వెళ్ళిన వారి యిండ్ల పేర్లు ములుగు, చిలుకూరి, పమ్మి, కొండూరి మొదలైనవి కనబడుతున్నాయి. తెలంగాణా నుండి వచ్చినవారు కనుక, వారిని తెలగాణ్యులని వ్యవహరించడం గమనించదగ్గ విషయం.

శాతవాహనుల తర్వాత ఆంధ్రదేశంలో అనేక చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. పూర్వం ఆంధ్రదేశంలోని సముద్ర ప్రాంతానికి కళింగ దేశమనే పేరుండేది. గంగానదికి దక్షిణతీరం నుండి గోదావరి నది ఉత్తరతీరం వరకు ఉన్న దేశం కళింగదేశం. ఇది ఉత్తర కళింగం, మధ్య కళింగం, దక్షిణ కళింగం అని మూడు భాగాలుగా ఉండేది. ఇందులో నేటి ఓఢ్ర (ఒరిస్సా) దేశమే ఉత్తర కళింగం. ఇదే ఉత్కళదేశం. మధ్య కళింగం, దక్షిణ కళింగాలు ఆంధ్రదేశానికి చెందినవి. కాలం గడుస్తున్న కొద్దీ ఇక్కడ తెలుగు భాష అభివృద్ధి చెందసాగింది.

ఈ రకంగా శాతవాహనులు ఆంధ్ర జాతీయులు అని చారిత్రకులు నిర్ధారణ చేశారు. ఇతర భాషలతో, అంటే... కన్నడం, ప్రాకృతం మొదలైన భాషలతో కలిసి, క్రొత్తగా తెలుగుభాష పుట్టింది. తరువాతి కాలంలో తెలుగుభాష శాసనాలలోకెక్కింది. దీనిని పరిపాలకులు, ప్రజలు కూడా ఆదరించడం మొదలుపెట్టారు. దానితో క్రీ.శ. 1022 లో రాజ్యానికి వచ్చిన రాజరాజనరేంద్రుడు తెలుగుభాషకి ఒక శాశ్వతమైన రూపాన్ని తీసుకు రావాలని భావించాడు. నన్నయ భట్టుని రప్పించాడు. తన మనస్సులోని ఆలోచనను ఆయనకు చెప్పాడు. నూతన వస్త్రాలతో, ధన కనక వస్తు వాహనాలతో గౌరవించాడు.

అది చాలా మంచి ముహూర్తం. ఆంధ్ర భాషలో మహాభారతం ఆవిర్భవించడానికి నన్నయభట్టు అంగీకరించాడు. 'శ్రీ'కారం చుట్టాడు. తెలుగు సాహిత్యానికి తొలిమెట్టు ఏర్పడింది. తెలుగు సరస్వతి గోదావరీ తీరంలో గజ్జకట్టి నాట్యమాడింది.

మహాభారతాన్ని తెలుగులో అనువదించే కార్యక్రమంలో నన్నయభట్టుకి, నారాయణభట్టు సహకరించాడు. మహాభారత యుద్ధంలో అర్జునుడికి, శ్రీకృష్ణుడే విధంగా సహాయపడ్డాడో, తనకీ భారత రచనలో నారాయణభట్టు ఆ విధంగా సహాయం చేశాడని నన్నయభట్టే స్వయంగా చెప్పుకొన్నాడు. ఏదయినా ఒక గొప్ప కార్యక్రమం నిర్వహించాలంటే ఎంతమంది సహాయమో తీసుకోవాలి కదా! ఒక్కరి వల్లనే ఏ పని పూర్తి కాదు కదా!

మహాభారతాన్ని సంస్కృతంలో వ్యాసమహర్షి రచించాడు. మహాభారతానికి పంచవేదము అని పేరు. ఈ గ్రంథంలో లేని విషయాలు మరే గ్రంథంలోనూ లేవు. ఈ గ్రంథంలో ధర్మశాస్త్రానికి చెందిన విషయాలు, వేదాంత విషయాలు, నీతిశాస్త్ర ప్రసంగాలు, లక్షణ ప్రస్తావనలు, ఒకటేమిటి? సమస్తం దీనిలోనే ఉన్నాయి.



## నన్నయ భట్టు

నన్నయ భట్టు వేగినాటి శాఖకు చెందిన బ్రాహ్మణుడు. వేదం చదివినవాడు. అష్టాదశ పురాణాల సారం తెలిసినవాడు. తెలుగు కవిత్వానికి శ్రీకారం చుట్టాడు మహాకవి. సంస్కృతంలో వాల్మీకి ఆదికవి అయితే, ఆంధ్రభాషలో ఆదికవి నన్నయ భట్టు. ప్రతిరోజు అగ్నిహోత్ర కార్యక్రమాలు నిర్వహించేవాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. అంత గొప్పవాడు కనుకనే రాజరాజనరేంద్రుడు, మహాభారతాన్ని తెనుగులో వ్రాయమని నన్నయను కోరాడు. లోకంలో ప్రధానంగా రెండు వంశాలకు చెందిన రాజులున్నారు. ఒకరు సూర్యవంశపు రాజులు. మరొకరు చంద్రవంశపు రాజు. శ్రీరాముడు మొదలైనవారు సూర్యవంశానికి చెందిన రాజులు. పాండవులు చంద్రవంశపు రాజులు. రాజరాజనరేంద్రుడు పాండవ వంశంలోనివాడు. సంస్కృత భాష యొక్క ప్రభావం తగ్గుతూ, తెలుగుభాష ఎంతో ప్రచారంలోకి రాసాగింది. ప్రజల ఆసక్తి తెలుసుకొన్న రాజరాజు మహాభారతాన్ని తెలుగులో వ్రాయించాలని భావించాడు. దీని వలన పాండవుల కథ జనబాహుళ్యంలో ప్రచారం కావాలన్నదే రాజరాజ నరేంద్రుని అంతరంగం. తద్వారా వైదిక మతాన్ని ప్రచారం చెయ్యాలన్నదే ఆయన ఆలోచన. రాజరాజనరేంద్రుని ఆస్థానంలో, నన్నయ భట్టుతో పాటు, నారాయణభట్టు, పావులూరి మల్లన అనే ప్రసిద్ధులైన కవులున్నారు. వీరే కాక మరెందరినో రాజరాజు పోషించాడు.

గాసట బీసటగా ఉన్న తెలుగతల్లికి ఒక చక్కని రూపాన్ని ఏర్పాటు చెయ్యాలని తలంచిన నన్నయ, ముందుగా 'ఆంధ్ర శబ్ద చింతామణి' అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడు. పట్టా బాగా ఉంటే రైలు సుఖంగా నడుస్తుంది. రోడ్లు, గతుకుల్లేకుండా ఉన్నప్పుడే కార్లు, బస్సులు హాయిగా ప్రయాణిస్తాయి. అదే విధంగా తెలుగుభాషకి నిర్దుష్టమైన పదాలను నిర్మించడానికి వ్యాకరణం సహాయపడుతుంది. ఇక్కడ చెప్పుకోదగ్గ విచిత్రమేమిటంటే, తెలుగులో వ్రాసే భారతానికి, నన్నయ, ఆంధ్రశబ్ద చింతామణి (వ్యాకరణాన్ని) సంస్కృతంలో వ్రాశాడు. ఈ వ్యాకరణం రచించడం వల్ల నన్నయకు, వాగను శాసనుడని, శబ్ద శాసనుడని బిరుదులు వచ్చాయి.

నన్నయ నాటికి తెలుగు ప్రచారంలోకి వచ్చింది కాని, బహుళ ప్రచారంలోకి రాలేదు. అందుచేత మూడు వంతులు సంస్కృత పదాలు, ఒకవంతు తెలుగు పదాలు వాడుతూ నన్నయ మహాభారతాన్ని రచించాడు. సాహిత్యంలో మొట్టమొదటి గ్రంథమే అయినా ఎంతో రసవత్తరంగా రచన సాగింది. పైగా ఇది మహాభారతమాయే! 'వింటే భారతమే వినాలి, తింటే గారెలే తినాలి' అనే సామెత మనందరకు తెలిసిందే.

ఇక్కడో విచిత్రం చెప్పుకోవాలి. రాజరాజనరేంద్రుడికి రత్నాంగి అనే మహారాణి, చిత్రాంగి అనే ప్రియురాలు ఉన్నారు. రత్నాంగి కుమారుడు సారంగధరుడు. సారంగధరుడు నన్నయగారి దగ్గర, ఆంధ్రశబ్ద చింతామణి అనే వ్యాకరణం అభ్యసించాడు. సరే! చిత్రాంగి అందగత్తె, రూపవతి, పైగా యౌవనవతి. ఆటలో ఎగిరిపోయిన సారంగధరుని పావురం చిత్రాంగి మేడవాలింది. దీనిని తెచ్చుకోడానికి చిత్రాంగి మేడకు వెళ్ళాడు రాజకుమారుడు. సారంగధరుని రూపాన్ని, వయస్సుని, లావణ్యాన్ని చూసిన చిత్రాంగి, అతని మీద మనసుపడింది. అదే విషయాన్ని మనసువిప్పి సారంగధరుడితో చెప్పింది. "నీవు నాకు పినతల్లివి. నీ కోరిక అధర్మం" అంటూ సారంగధరుడు పావురాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు.



చిత్రాంగి విరహ వేదనకు గురయింది. తరువాత మహారాజు వచ్చాడు. ఆయనతో చిత్రాంగి చెప్పకూడని విషయాలు చెప్పింది. నేను నీ ప్రియురాలిని కాదు. కోడలిని. నీ కుమారుడెంత వారించినా వినక అఘాయిత్యం చేశాడు అంటూ లేనిపోనివన్నీ చెప్పి భోరున ఏడ్చింది. రాజరాజనరేంద్రుడు ఆ మాటలు విని కోపంతో ఊగిపోయాడు. వెంటనే అతని కాళ్ళు, చేతులు ఖండించమని భటులనాజ్ఞాపించాడు. "ఈ తప్పు సారంగధరుడు చేసి ఉండడు. బాగా ఆలోచించి మరీ శిక్ష విధించండి" అని నన్నయ రాజరాజునకు హితముపదేశించాడు. మహారాజు ఆ మాటలు వినలేదు.

సారంగధరుణ్ని వధ్యశిల దగ్గరకు తీసుకుపోయారు భటులు. ఆయన కాళ్ళుచేతులు ఖండించారు. తరువాత నిజం తెలిసింది రాజరాజనరేంద్రునకు. రాజు తనను శిక్షిస్తాడేమోననే భయంతో చిత్రాంగి గోదావరిలో దూకి మరణించింది.

బాలసరస్వతి అనే సాధువు, సారంగధరుడి దుస్థితిని చూశాడు. పరిసరాలలో లభించే 'సంధానకరణి' అనే మూలిక ద్వారా సారంగధరుని కాళ్ళు, చేతులు ఒకచోట చేర్చి వాటిని అతికించాడు. బాలసరస్వతి ద్వారా పునర్జన్మను పొందిన యువరాజు, తిరిగి రాజధానికి వెళ్ళలేదు. కృతజ్ఞతగా ఆ సాధువునకు ఆంధ్రశబ్ద చింతామణి అనే వ్యాకరణాన్ని బోధించాడు. బాలసరస్వతి ఆ గ్రంథానికి వివరణ వ్రాశాడు. దానికి బాలసరస్వతీయము అనే పేరు పెట్టాడు. ఆ గ్రంథం ఇప్పటికి కూడా లభిస్తోంది.

కానీ, చరిత్రలో రాజరాజనరేంద్రునకు రత్నాంగి, చిత్రాంగి అనే భార్యలు కాని, సారంగధరుడనే కుమారుడుగాని లేరు. అయినప్పటికి, రాజమహేంద్రవరంలో ఇప్పటికీ సారంగధరుని పేరు మీదుగా సారంగధరమెట్ట ఉంది. పూర్వకాలం నుండి వ్యవహారంలో నున్న చిత్రాంగి

మేడ, రత్నాంగి భవనం ఉన్నాయి. సారంగధర చరిత్ర అనే పేరుతో చేమకూర వెంకటకవి ఒక ప్రబంధం వ్రాశాడు. ఈ కథా వృత్తాంతం భవిష్యత్పురాణంలో సంస్కృతంలో ఉంది.

సారంగధరుడు నిర్దోషి, అతనిని శిక్షించవద్దు అని తాను చెప్పినా రాజరాజు వినలేదని, శిష్యుని మీద ఉండే ప్రేమాభిమానాలతో, "నా మాట నీవు వినలేదు కనుక, నీవు కోరిన భారతాన్ని ఇక నేను తెలుగులో వ్రాయను" అని నన్నయ మహారాజునకు చెప్పి భారతాంధ్రీకరణాన్ని విరమించాడని ఒక కథ బాగా ప్రచారంలో ఉంది. అందుకేనేమో నన్నయ ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలో కొంత భాగం వరకు అనువదించి విడిచిపెట్టాడు.

నన్నయభట్టు, ఆంధ్రశబ్ద చింతామణి, ఇంద్ర విజయం, చాముండికా విలాసం అనే గ్రంథాలు కూడా రచించాడని చెబుతారు. కొంతమంది, తరువాతి కవులు, ఈ గ్రంథాలలోని పద్యాలను, తమ గ్రంథాలలో నన్నయగారివని ఉదహరించారు. కాని, ఈ గ్రంథాలు ఈనాటి వరకు లభించలేదు.

ఏది ఏమైనా నన్నయగారి భారతరచన, తెలుగు వారికొక సరస్వతీ ప్రసాదం. నిత్యం పఠించదగినది. ఎంతో మధురమైంది. నన్నయగారిని గురించి తెలుసుకున్నాం కనుక, ఆయన భారతం నుండి రెండు మూడు పద్యాలు కూడా నేర్చుకుందాం.

*సారమతిన్ కవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తి లో*
*నారసి మేలునా నితరుల క్షర రమ్యత నాదరింప నా*
*నా రుచిరార్థ సూక్తినిధి నన్నయ భట్టు తెనుంగునన్ మహా*
*భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్*

(ఆది-1ఆ-25)

**వివరణ:** నేను జగత్తు యొక్క హితం కోసం, అంటే లోకకళ్యాణం కోసం మహాభారతాన్ని తెనుగులో వ్రాస్తున్నాను. కవులు, మంచి మనస్సుతో ఈ గ్రంథంలోని కథలను గ్రహిస్తారు. కొందరు, అక్షరాల (పదాల) చక్కదనాన్ని ఆదరిస్తారు. ఆ రకంగా అనేక రకాలైన అర్థాలు, సూక్తులు చెప్పడంలో నా గొప్పదనాన్ని అర్థం చేసుకొనేటట్లు ఈ గ్రంథ రచనకు పూనుకొన్నాను -అని నన్నయ చెప్పడం ఈ పద్యంలోని భావం.

*మొదలి పెక్కు జన్మముల పుణ్యకర్మముల్*
*పరగ పెక్కు చేసి పడయబడిన*
*యట్టి యెఱుక జనుల కాక్షణ మాత్రన*
*చెఱచు మద్యసేవ చేయనగునె?*

(ఆది-3ఆ-120)

బృహస్పతి కుమారుడైన కచుణ్ని, రాక్షసులు చంపారు. ఆతని శరీరాన్ని కాల్చి బూడిద చేశారు. ఆ బూడిదను కల్లులో కలిపి, రాక్షసకుల గురువైన శుక్రాచార్యుని చేత త్రాగించారు. కచుడు ఇంకా ఇంటికి రాలేదని, శుక్రాచార్యుని కుమార్తె అయిన దేవయాని బాధపడింది. ఆ విషయం తండ్రికి చెప్పింది. ఆయన కల్లు త్రాగిన మత్తు మీదున్నాడు. అయినా దివ్యదృష్టితో చూశాడు. జరిగిన సంగతి తెలుసుకొన్నాడు. ఆ సందర్భంలో నన్నయగారు వ్రాసిన పద్యమిది.

**వివరణ:** ఒక్కసారి కల్లు త్రాగితే, ఎన్నో జన్మల నుండి చేసుకొన్న పుణ్యమంతా క్షణంలో నశించిపోతుంది. అటువంటి మద్యాన్ని సేవించకూడదు.

*ఇది నన్నయగారి ఆఖరి పద్యం*

*శారద రాత్రులుజ్జ్వల లసత్తర తారక హార పంక్తులన్*
*చారు తరంబులయ్యె వికసన్నవ కైరవ గంధ బంధురో*
*దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క*
*ర్పూర పరాగపాండు రుచిపూరము లంబర పూరితంబులై*

(అరణ్య-4ఆ-142)

**భావం:** శరత్కాలంలోని రాత్రివేళలు ప్రకాశిస్తున్న నక్షత్రహారాలతోను, వికసించిన కలువపువ్వుల సువాసనలతోను, తెల్లని చంద్రకిరణాలతోను ఎంతో మనోహరంగా ఉన్నాయి.

ఇది శరత్కాల వర్ణనకు చెందిన పద్యం.

ఆంధ్రులకు, తెలుగు కవులకు నన్నయ భట్టు ప్రాతఃస్మరణీయుడు. పంచమ వేదమైన భారత విశేషాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉందాం.

తెలుగువాడు కాని (తమిళుడైన) అప్పయదీక్షితులు మన తెలుగు గొప్పదనాన్ని ఏ విధంగా చెప్పాడో తెలుసుకుని, ఈ వ్యాసం ముగిద్దాం.

*"ఆంధ్రత్వమాంధ్ర భాషాచ*
*నాల్పస్య తపసః ఫలమ్"*

ఆంధ్రత్వము (తెలుగుదనము), ఆంధ్ర (తెలుగు) భాష, ఎంతో తపస్సు చేస్తేగాని లభించవు.

మనం ఎంతో పుణ్యం చేసుకొన్నాం కనుకనే తెల ుగువారుగా జన్మించాం.

ఆ కీర్తి నిలబెట్టుకొందాం.

*- అవధాన రత్నాకర, కవితిలక పండిత*
*వారణాసి వెంకటేశ్వర శాస్త్రి,* ఎం.ఎ., బి.ఇడి.



# రివర్స్ గేర్

**కాలింగ్ బజార్ మోగడంతో తలుపు తీసిన రాజ్యలక్ష్మి ఎదురుగావున్న భానుమతిని చూసి గతుక్కుమని విధిలేక జీవంలేని నవ్వు మొఖానికి పులుముకుని 'రండి' అని ఆహ్వానించింది.**

చేతిలో పెద్దస్టీలు గిన్నెతో లోపలకు వచ్చిన భానుమతిని చూడగానే డైనింగ్ టేబుల్ దగ్గర భోంచేస్తున్న రమ్య, సౌమ్య కంచాలలో వున్న పెరుగన్నాన్ని నోట్లో కుక్కేసుకొని రెండు సెకన్లలో బాత్‌రూంలోకి వెళ్ళిపోయారు చేతులు కడుక్కోవడానికి.

"ఏమిటి? ఇంకా పిల్లలు తెమల్లేదా? నేను లంచ్ బాక్స్‌లు సర్దిపెట్టనా? ఇవాళ మనందరి కోసం వెరయిటీ స్వీటు చేసాను. ఇదిగో తీసుకోండి." అంటూ తాను తెచ్చిన స్టీలు గిన్నె డైనింగ్ టేబులు మీద పెట్టింది భానుమతి.

రాజ్యలక్ష్మి చాకచక్యంగా ఆవిడ్ని కబుర్లలో పెట్టి డ్రాయింగ్ రూంలోకి తీసుకువచ్చేసింది. ఈలోగా రమ్య, సౌమ్యలు వాళ్ళే లంచ్ బాక్సులు సర్దుకొని స్కూల్ బ్యాగులతో బయటకు వచ్చి తల్లికి 'బై' చెప్పి అర్జునుడు

హాస్య కథల పోటీ విభాగంలో తృతీయ బహుమతి పొందిన కథ



- ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

వదిలిన బాణాల్లా సైకిళ్ళ మీద స్కూల్‌కి దూసుకుపోయారు. గతంలో ఒకసారి భానుమతి యిచ్చిన స్వీట్ తిని స్కూల్లో విరోచనాలయ్యి నానా బాధపడ్డారు వాళ్ళిద్దరూ. ఆ గొప్ప 'అనుభవం' వారిని భానుమతి పట్ల 'ఎలర్ట్' చేసి రాపిడ్ యాక్షన్ ఫోర్సు సిబ్బందిలా వ్యవహరించేలా శిక్షణ నిచ్చింది.

శ్రీహరి, రాజ్యలక్ష్మిల పిల్లలు రమ్య, సౌమ్య. డింగ్‌డాంగ్ కాన్వెంట్లో రమ్య ఏడవ తరగతి, సౌమ్య ఆరవ తరగతి చదువుతున్నారు. శ్రీహరి మండల వ్యవసాయాధికారి. సౌమ్యుడు, ఉపకార బుద్ధి కలవాడు. అందుకే చేసేది ప్రభుత్వద్యోగమైనా నాలుగు రాళ్ళు వెనకేయడం చేతకాక పోయినా, రెండు గడ్డిపరకలు కూడా 'కతకని' చేతకాని వాడని బాగా 'ముందుచూపుతో' ఆమ్యామ్యాలు పట్టేసే కొలీగ్స్ అభిప్రాయం. రైతులకి ఉత్తమ సేవలందిస్తున్నందుకు నాలుగుసార్లు జిల్లా కలెక్టరు నుండి అవార్డులు అందుకున్నాడు శ్రీహరి 'చెక్కుబుక్కులే' మనిషి స్టేటస్‌కి కొలబద్ధయని 'చెక్కముక్కలు' (షీల్డులు) కావని మిత్రులు దుర్భోధ చేస్తున్నా చిరునవ్వే సమాధానంగా తన పని తాను చేసుకుపోతాడు శ్రీహరి. రాజ్యలక్ష్మి డిగ్రీ పాసై కొన్నాళ్ళు కాన్వెంట్లో పనిచేసి ప్రస్తుతం భర్తా, పిల్లల బాగోగుల కోసం ఉద్యోగం మానేసింది. గ్రామంలో ఎవరికి ఏ సహాయం కావల్సినా చేస్తుంది. రెగ్యులర్ బ్లడ్ డోనర్ రాజ్యలక్ష్మి అంటే తహసీల్దారు నుండి జిల్లా కలెక్టరు వరకూ ఎంతో గౌరవం వుంది.

రావులపాలెం పక్కనున్న గ్రామమే వెదిరేశ్వరం. పూర్వం విదురుడు ఆశ్రయం నిర్మించుకొని తపస్సు చేసిన ప్రాంతమని అదే 'విదురాశ్రమం' నుండి మార్పుచెంది వెదిరేశ్వరంగా స్థిరపడిందని ఆ ఊరి మాష్టారు లక్ష్మీనారాయణ గారు చెప్తారు. ఆ గ్రామంలో వున్న బ్యాంకుకి మేనేజరుగా బదిలీపై వచ్చిన జోగారావు భార్య భానుమతి. ఆ గ్రామం వచ్చిన రెండు నెలలకే జోగారావు అందరికీ తలలో నాలుక మారితే, తన అద్భుత వంటకాలతో మహిళలకు చేరువయ్యాననుకుంటూ వారి 'కడుపుల్ని' తన అమోఘమైన స్వీట్సుతో 'పంజాబ్ మెయిల్లా' కుదిపేసి పరిగెట్టించేస్తోంది. భానుమతి.

వెదిరేశ్వరంలో వున్న స్రవంతి మహిళా మండలిలో సభ్యురాలిగా చేరి అందరితో పరిచయాలు పెంచుకొని డైరెక్టుగా ఇళ్ళకు రాకపోకలు సాగిస్తూ తన చేతి వంటతో అందర్నీ ఆకట్టుకొని "మోస్ట్ పాపులర్ ఉమన్"గా ప్రఖ్యాతి పొందాలన్న మహత్తర ఆశయంతో పయనిస్తోంది భానుమతి. బ్యాంక్ మేనేజరు భార్యకావడం, పైగా పల్లెటూరవడం వలన ఎవరూ ఆమెకి ఎదురు చెప్పలేకపోతున్నారు.

అందరూ శనగపిండితో, పెసరపిండితో జంతికలు చేస్తారు. కానీ మన 'సిస్టర్ ఆఫ్ నలమహరాజా' అదేనండి భానుమతి వెరయిటీగా వుంటుందని రాగుల పిండితో నానా ఫీట్లు చేసి జంతికలనే పదార్థాన్ని రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, పద్మావతిలకు పంపింది. ఆలోచనా పరులైన రాజ్యలక్ష్మి, వరలక్ష్మి ఆ అపురూప జంతికలకు దూరంగా వుంటే పద్మావతి వాటిని రుచి చూసిన పొరపాటుకి రెండు రోజులు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవలసి వచ్చింది.

వంటల పుస్తకాలలో, ఆదివారం అనుబంధాలలో ప్రచురించే ప్రత్యేక పిండివంటల్ని తన సునిశిత నయనాలతో పరిశీలించి "ఆలస్యం కొత్త వంటకం విషం" అన్న నానుడిని ఫాలో అవుతూ సోమవారం మధ్యాహ్నమే వండి మహిళామణులకు పంపిణీ చేయడం ఆమె డ్యూటీగా మారిపోయింది. అప్పుడప్పుడు టీ.వి.ల్లో వచ్చే "వంటింటి ఘుమఘుమలు" కార్యక్రమాల్నీ అనుసరిస్తూ యిలా ఉదయాన్నే తన ప్రక్కయింటిలోనేవున్న రాజ్యలక్ష్మిని కలిసి కొత్త వంటకాలతో కలవర పెడుతుంది భానుమతి

ఒక్క వంట విషయంలో తప్పిస్తే మిగతా విషయాల్లో ఇరుగుపొరుగుకి బాగా సహాయం చేస్తుంది భానుమతి. ఎవరైనా అడిగితే చీరలపై కొత్త కొత్త పెయింటింగ్స్ తన స్వంత ఖర్చులతో స్వయంగా వేసి యిస్తుంది. డోర్ కర్టెన్లకు దేవుళ్ళ బొమ్మలతో ఎంబ్రాయిడరీ కూడా బాగా చేస్తుంది. అప్పడాలు, వడియాలు పెట్టడంలో సహకరిస్తుంది. ఎవరైనా పదీ, పరకా అడిగితే మంగళవారం, శుక్రవారం అనికూడా చూడకుండా యిస్తుంది. వాళ్ళు ఆ డబ్బు తిరిగి యివ్వకపోయినా బాధపడదు, తన వెరయిటీ వంటకాలు తినకపోతేనే బాధపడుతుంది.

భానుమతి వంటకాలన్నీ ఒక పుస్తకంగా వేయమని సలహాయిచ్చింది రాజ్యలక్ష్మి. ఇదీ బాగానే వుందనుకొని తను స్వంతంగా తయారు చేసినవి, బాగా పాత పత్రికలలో ప్రచురితమైన వంటకాలు క్లిప్పింగ్‌లకు పేర్లు మార్చేసి ఒక వంట పేజీల పుస్తకానికి మేటరు తయారు చేసింది భానుమతి. దానిని రాజ్యలక్ష్మికి చూపించగా ఆమె అక్కడక్కడ మార్పులు చేసి యిచ్చింది.

ఒకరోజు రాత్రి భర్త జోగారావుకి చెప్పింది వంటల పుస్తకం ప్రింటు చేయించాలని. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు జోగారావు. ప్రస్తుతం భానుమతి వంటలతో వెదిరేశ్వరం ఒక్కటే యిబ్బంది పడుతోంది. అటువంటిది, ఈ పుస్తకం ప్రింటయి మార్కెట్‌లోకి వస్తే ఆంధ్రప్రదేశ్ అంతా 'సునామీ'లా అతలాకుతలం అవుతుందా? అని ఆలోచించాడు. మరుక్షణమే అతనికి 'లైటు' వెలిగింది. తెలుగు వాళ్ళకి పుస్తకం కొని చదివే అలవాటు బాగాతక్కువ కదా! అంచేత వందకంటే పుస్తకాలు కొనరన్న స్థిర నిర్ణయానికి వచ్చి 'సరే' అన్నాడు జోగారావు.

వంటల పుస్తకం అట్ట వెనుకా, లోపలి పేజీల్లో అడ్వర్‌టైజుమెంట్లు సంపాదించి, మొత్తానికి 'చేతిడబ్బులు' పడకుండా పుస్తకాన్ని ప్రింటు చేయించింది. భానుమతి. కాకినాడ నుండి ప్రఖ్యాత రచయిత్రిని పిలిపించి ఆమె చేత ఆవిష్కరణ చేయించారు భానుమతి మిత్ర బృందం. పుస్తకం ప్రింటింగు పుణ్యమా అని నెలరోజులు తమని కొత్త వంటలతో యిబ్బంది పెట్టనందుకు స్రవంతి మహిళా మండలి వారు

'సిస్టర్ ఆఫ్ నలమహారాజా' అన్న బిరుదుని కూడా భానుమతికి ప్రదానం చేసి కృతజ్ఞత వెల్లడించుకున్నారు. ఆ రోజు మాత్రం భానుమతి వెరయిటీ వంటకాలు లేకుండా ఏర్పాటు చేసిన విందుకు గ్రామ ప్రముఖులంతా హాజరై భానుమతిని అభినందించారు.

☆ ☆ ☆

నెల రోజుల విశ్రాంతి తుఫాను ముందు వచ్చే ప్రశాంతత అని గ్రహించలేక పోయారు రాజ్యలక్ష్మి మిత్రబృందం. పుస్తక ప్రచురణ, బిరుదు స్వీకరణలతో తన బాధ్యత మరింతగా పెరిగిందని భావించిన భానుమతి రెట్టించిన ఉత్సాహంతో రోజూ రెండు రకాల వెరయిటీ వంటకాలు చేసి, పనమ్మాయిని తోడు తీసుకునీ మరీ అందరికీ యివ్వడం మొదలు పెట్టింది. భానుమతి చర్యలతో మరింతగా కుదేలైపోయారు మహిళా మండలి సభ్యులు. భానుమతి వెళ్ళితే జాగ్రత్తగా ఆమె యిచ్చిన వంటకాల్ని డస్ట్‌బిన్‌లో పడేసేవారు మహిళలు.

అయితే వాళ్ళు అనుకోని అవాంతరం వచ్చి పడేది. ఇంట్లో పెద్దవాళ్ళు భానుమతి రాగానే "ఆమె ఎంతో కష్టపడి చేసింది కదా, కొంచెం రుచి చూద్దాం" అని ఆమె ఎదురుగానే అడిగేసరికి పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిలా విలవిలలాడిపోయేవారు. పెద్దవాళ్ళు అలా అడిగే సరికి "ప్రపంచ బ్యాంకు అప్పు తక్కువ వడ్డీకే మంజూరయ్యిందన్న చల్లని కబురు విన్న బడుగుదేశం" అధిపతి మొహంలా వెయ్యిక్యాండిల్స్ కాంతితో వెలిగిపోయేది భానుమతి మొహం. జిహ్వ చాపల్యం కొద్దీ ఎక్కువగా తిన్న వెరయిటీ స్వీట్లు పెద్దవారి ఆరోగ్యాన్ని "గోతిలో పడ్డ ఆర్టీసీ బస్సులా పెద్ద కుదుపు కుదిపి" ఆసుపత్రికి పంపించాయి.

ఒక వారం రోజులు గడిచాక ధనలక్ష్మి యింట్లో రహస్య సమావేశం నిర్వహించారు స్రవంతి మహిళా మండలి సభ్యులు ఒక్క భానుమతిని మినహాయించి.

భానుమతి వంటల బాధనుండి తప్పించుకునే మార్గం గురించి విస్తృతంగా చర్చించారు. చివరకు "నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష" అన్నట్ల తాము వెరయిటీ పేరుతో అస్తవ్యస్త వంటకాలు చేసి భానుమతిపై దాడి చేయాలని తీర్మానించారు.

మరుసటి రోజు భానుమతి రాగానే ధనలక్ష్మి 'బనానా బీర్' అని గ్లాసు నిండా తెచ్చి ఆమెకిచ్చి తాగమంది. తానూ లోపల్నుండి ఒక గ్లాసు తెచ్చుకొని తాగింది ధనలక్ష్మి. 'బనానా బీర్' బాగుందని మెచ్చుకొని రాజ్యలక్ష్మి యింటికెళ్ళింది భానుమతి. ఆమెతో మాటా మంతీ అయ్యేసరికి కడుపులో కదలిక ప్రారంభమై మిగతా గృహాల సందర్శన వాయిదా వేసుకొని ఇంటికి తిరుగు ముఖం పట్టింది భానుమతి.

నాలుగైదు విరోచనాలయ్యి నీరసంగా పడుకునే వుంది భానుమతి, జోగారావు వచ్చేసరికి. ఆమె పరిస్థితి చూసి టాబ్లెటు తెచ్చి యిచ్చాడు జోగారావు. రెండురోజులు విశ్రాంతి అయ్యాకా వరలక్ష్మి యింటికెళ్ళింది భానుమతి. "అమ్మా! ఆంటీ వచ్చారు" అని ఆనందంగా చెప్పి వీధిలోకి పరుగెత్తాడు చందు. వరలక్ష్మి ప్లేటునిండా స్వీట్సు తెచ్చింది. "మా మేనల్లుడు హైద్రాబాదు నుండి తెచ్చాడు. ఒక్కటైనా తీసుకోండి" అని బతిమాలి ఆమె చేతిలో పెట్టింది బాదుషా లాంటి స్వీటుని. వరలక్ష్మి కూడా తను ఒకటి తీసుకొని తింది. మనసు కీడు శంకిస్తున్నా మొహమాటానికి వరలక్ష్మి చేతిలో పేటిన స్వీటు తింది భానుమతి. సినిమాలు, టి.వీ.ల గురించి మాట్లాడి గ్లాసెడు మంచినీళ్ళు తాగి పద్మావతి ఇంటికెళ్ళింది భానుమతి.

పద్మావతి చేగోడీలు తేవడం చూసి "ఇప్పుడే వరలక్ష్మి గారింట్లో స్వీటుతిన్నాను. దయచేసి బలవంతం పెట్టకండి" అంది భానుమతి. పదినిముషాల గడిచేసరికి కడుపులో తిప్పేసి ఇంటికి వెళ్ళే సమయం కూడా లేక పద్మావతి యింట్లోనే రెండుసార్లు బాత్రూంకి వెళ్ళి వచ్చింది భానుమతి.

పద్మావతి యింట్లోవున్న టాబ్లెటు తెచ్చియిచ్చింది. మజ్జిగతో ఆ టాబ్లెట్ వేసుకొని నిస్త్రాణగా సోఫాలోనే నిద్రపోయింది సాయంకాలం వరకూ భానుమతి. ఆమెని ఆ స్థితిలో చూసి కొద్దిగా బాధపడింది పద్మావతి. కానీ రెండు నెలల పాటు తామంతా పడిన బాధలు గుర్తుకు వచ్చి మనసుని సమాధాన పరుచుకుంది. సాయంత్రం 5 గంటలకు కొడుకు నందుని తోడిచ్చి భానుమతిని ఇంటికి సాగనంపింది పద్మావతి.

జోగారావు యింటికి వచ్చాకా భార్యని బాగా కేకలేసాడు. ఇంటి పట్టునే వుండు. ఎక్కడికీ తిరగవద్దని చెప్పాడు. వారం రోజులు గడిచినా భానుమతి తమ యిళ్ళకు రాకపోయేసరికి రాజ్యలక్ష్మి, ధనలక్ష్మి, వరలక్ష్మి ముగ్గురు భానుమతి యింటికి వచ్చారు, ఆమెని చూడటానికి.

ముగ్గుర్నీ సాదరంగా ఆహ్వానించింది భానుమతి. "ఈ మధ్యన మీరు మళ్ళీ కొత్త వంటకాలు తయారు చేయడం లేదా?" అడిగింది రాజ్యలక్ష్మి.

"లేదండీ. వంటలు కట్టి పెట్టేసాను. ప్రస్తుతం పత్రికలకి సాహిత్య వ్యాసాలు రాస్తున్నాను. ఈ సందర్భంగా అనేక పుస్తకాలు చదివే అవకాశం కలిగింది. మనం ఎదుటి వారికి మంచి చేయలేకపోయినా చెడు మాత్రం చెయకూడదని స్వానుభవం మీద గ్రహించాను. నా రాతలు, చేతలు సమాజానికి ప్రయోజనం కల్గించే దిశగా ప్రయాణిస్తున్నాను. నాలో ఈ మార్పుకి కారణమైన మీకు నేనెంతో ఋణపడి వుంటాను. ఈ సందర్భంగా అందరం కలిసి చక్కని కాఫీ తాగుదాం. అదీ నేను తయారు చెయ్యను. భయపడకండి. రాజ్యలక్ష్మిగారు మీరే వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలుపుకుని రండి. ఈ లోగా నేను వీళ్ళతో మాటాడుతూవుంటాను." అంది భానుమతి.

పరివర్తన భావాలు ఆమె కళ్ళలో కదలాడం స్పష్టంగా గమనించి ఆనందించి వంటింట్లోకి వెళ్ళింది రాజ్యలక్ష్మి నాలుగు మంచి కాఫీల కోసం. ◆

# లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం ఎంపికలో కొన్ని జాగ్రత్తలు

**లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టం (LMS) అవసరాలు ఒక్కో సంస్థకు ఒక్కో విధంగా ఉంటాయి. LMS ను ఒక సంస్థలో అమలు చేయాలంటే ముందుగా ఆ సంస్థ అవసరాలను విశ్లేషించాల్సి ఉంటుంది. వివిధ రకాల ఉపయోగాల ఆధారంగా ఎన్నో రకాల LMS లు అందుబాటులో ఉన్నాయి. మీ సంస్థకు సరిపోయే సిస్టమ్‌ను ఎంపిక చేసుకున్నాక, ఏ ఏ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ మీ అవసరాలను తీర్చుతాయో పరిశీలించాలి. వివిధ సంస్థలు అందించే LMS లలో పేర్కొన్న ఫీచర్లను అవసరమైనవి, వాంఛనీయమైనవి అన్న కేటగిరీలతో జాబితాను రూపొందించుకోవాలి. ఒక LMS ను ఎంపిక చేసుకొనేటప్పుడు ముఖ్యంగా ఈ కింది ఫీచర్లను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.**

*రెండురకాలు :* కొందరు సర్వీస్ ప్రొవైడర్లు తమ సర్వర్ల నుంచే LMS ను ఆపరేట్ చేసుకొనే వెసులుబాటు కల్పిస్తారు. సిస్టమ్స్ నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సర్వీస్ ప్రొవైడర్లే చూసుకొంటారు. కానీ, ఇన్‌స్టాల్డ్ వెర్షన్స్‌లో, LMS సాఫ్ట్‌వేర్ మీ సర్వర్‌లోనే ఇన్‌స్టాల్ చేస్తారు కాబట్టి మీ అంతరంగిక ఐ.టి. సిబ్బందే దాని నిర్వహణను చేబడతారు. తద్వారా మీ సంస్థ అవసరాలకు అనుగుణంగా దాన్ని కస్టమైజ్ చేసుకోటానికి వీలు కలుగుతుంది.

*భాష :* LMS ను కొనేముందు ఇంగ్లీషేతర భాషల్లో అది పని చేస్తుందా? ముఖ్యంగా భారతీయ భాషల్లో పనిచేసేటట్లయితే, దాన్ని డిమోన్‌స్ట్రేట్ చేసి చూపించవలసిందిగా అమ్మకందారుణ్ణి కోరాలి.

*ప్రమాణాలు:* SCORM, AICC, IMS వంటి ప్రామాణిక సంస్థల ప్రమాణాల ను అనుసరిస్తాయో లేవో చూడాలి. ఈ ప్రమాణాలను అనుసరించకపోతే,






సమన్వయ సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. SCORM ప్రమాణాల ను పాటించిన LMS అయితే థర్డ్‌పార్టీ రూపొందించిన లేదా సంస్థలోనే రూపొందించిన అప్లికేషన్లు క్రమంగా పనిచేస్తాయి.

*రిపోర్టింగ్, ట్రాకింగ్ :* అవసరమైనప్పుడు తాత్కాలిక రిపోర్టులను తయారు చేసి ఇవ్వగలిగే సామర్థ్యం ఉండాలి. ప్రతి విద్యార్థి నేర్చుకుంటున్న పాఠాల పై రిపోర్టును, ప్రతి మాడ్యూల్‌కు సంబంధించిన వివరాలను ఇవ్వగలిగేలా LMS ఉండాలి.

*శిక్షణా రీతులు :* LMS ఆన్‌లైన్, మిశ్రమ, స్వీయబోధనా పద్ధతులకు అనువుగా ఉండాలి. అంటే ప్రత్యక్ష, ప్రత్యామ్నాయ శిక్షణా పద్ధతులను అది సపోర్టు చేసేదిగా ఉండాలి.

*కాలానుగుణవృద్ధి :* LMS ను ఒకసారి అమలు చేయడం ప్రారంభించాక మీ సంస్థ అభివృద్ధి ప్రారంభమవుతుంది. సంస్థతో పాటు వృద్ధి పొందే LMSను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. లేకపోతే, కొంతకాలం తరువాత మరో LMS ను ఎంపిక చేసుకోవాల్సి వస్తుంది.

*భద్రత :* డేటా భద్రతకు ప్రత్యేక అవసరాలుంటే, వాటిని మీరు కొనబోయే LMS సపోర్టు చేస్తుందో లేదో చూసుకోవాలి.

*స్థాయి పెంపునకు అవకాశం :* అప్‌గ్రేడ్ చేసుకొనేందుకు కొత్త ప్యాచెస్‌ను అనుమతించేందుకు అవకాశం ఉందో లేదో చూసుకోవాలి.

*గ్రూప్ టూల్స్ :* చాట్, ఈ-మెయిల్స్, చర్చావేదికలు వంటి గ్రూప్ టూల్స్‌ను ఆ LMS సపోర్టు చేస్తుందో లేదో పరిశీలించాలి.

*సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్ :* స్టూడెంట్లకు ఇచ్చేందుకు సంస్థ కోసం ప్రత్యేకంగా డిప్లొమా సర్టిఫికెట్లను రూపొందించే అవకాశం ఉందేమో చూడాలి.

***క్విజ్‌లు :*** క్విజ్ ఫలితాలను చూపించేలా LMS లో వ్యవస్థ ఉండాలి.

***ఆన్‌లైన్ హెల్ప్, ట్యుటోరియల్స్ :*** నాన్‌లైన్ హెల్ప్, వీడియో ట్యుటోరియల్స్ కూడా ఉండాలి.

***మార్పులకు అనుకూలం :*** కోర్సులను ఇంపోర్టు, ఎక్స్‌పోర్టు చేసుకోటానికి, పబ్లిష్ చేసుకోటానికి అనువుగా ఉండాలి.

***నిపుణుల కోసం :*** LMS లో వినియోగదారు స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో లేదా పేర్ల నమోదుకు అవకాశాలు ఉండేలా LMSఉండాలి.

సాధారణ వినియోగదారుడు (యూజర్), నిపుణులు, అడ్మినిస్ట్రేటర్ వంటి వివిధ స్థాయిల యూజర్లకు వేరు వేరు ఏర్పాటు ఉండాలి.







***చెల్లింపుల సౌకర్యం :*** ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలకు సౌకర్యం ఉండాలి. కోర్సును ఎంపిక చేసుకొనే వినియోగదారుడు వెంటనే ఫీజు కూడా చెల్లించే వెసులుబాటు ఉండాలి.

ఏదైనా ఒక అంశాన్ని చూడాలంటే, ఒక విషయసూచిక లేదా ఇండెక్స్ ఉండాలి. మీరు ఎంపిక చేసుకునే LMS లో ఇండెక్స్‌ను రూపొందించగలదా లేదా చూసుకోవాలి.

పైన పేర్కొన్న అంశాలు మీరు కొనే LMS కు ఉండాల్సిన కొన్ని ఫీచర్లు. మీ సంస్థ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒక 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ని తయారు చేయాలి. దాంట్లో తప్పనిసరిగా కావల్సిన వాటిని ఒక కాలమ్‌లోనూ, 'ఉంటే మంచిది' అనుకొన్న ఫీచర్లను మరో కాలమ్‌లో రాయాలి.

- LMS అమ్మకందారులు 5, 6 గురిని గుర్తించాలి.
- REP ని వారికి పంపి, వారి ఉత్పత్తులను సమీక్షించాలి.
- వెండర్స్‌తో చర్చించి, డెమోలను చూడాలి.




- ఒకటి రెండు ప్రొడక్టులను నిజ సమాచారంతో, నిజ పరిస్థితుల్లో, నిజ వినియోగదారులతో పరీక్షించి చూడాలి.
- అనంతరం వెండర్‌ను , ప్రొడక్టును ఎంపిక చేయాలి.
- ధరపై బేరమాడి, సరసమైన ధరకు ప్రొడక్టును కొనాలి.




ఇప్పుడు మార్కెట్‌లో Moodle, Claroline, Atutor, Dokebo, Ganesha, Dokeos, efront, OLAT, Sakai అనే ఓపెన్ సోర్స్ LMSలు లభ్యమవుతున్నాయి. ఇటీవల IIT కాన్పూర్ వారు 'బృహస్పతి' అనే ఓపెన్ సోర్స్ LMS ను రూపొందించారు. 'బృహస్పతి–2' అనే అప్‌గ్రేడెడ్ వెర్షన్ కూడా వచ్చింది. విద్యాసంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు, చిన్న, మధ్య తరహా సంస్థలకు ప్రారంభదశలో Moodle LMS అనేది చాలా అనుకూలంగా ఉంటుంది. చిన్న బడ్జెట్ ఉన్న వారికి LMS చాలా చౌకైన పరిష్కారాన్ని ఇస్తుంది. దాంట్లో ఫ్రీ డౌన్‌లోడ్ కు అవకాశం ఉంది. అయితే దాన్ని కస్టమైజ్ చేసుకొనేందుకు కొంత కష్ట పడాల్సి ఉంటుంది.

***– డాక్టర్ బి.వి.ఎన్.ఎస్. ప్రకాశరావు***
*టెక్నికల్ డైరెక్టర్, ఎన్.ఐ.సి. హైదరాబాద్*
*(అనువాదం : కె.యస్. రెడ్డి)*

**ఏకాగ్రతకు మారు పేరు అవధానం. అవధాన విద్య ఆంధ్రులకు సంక్రమించిన పిత్రార్జితం. ఒక్క ఏకాగ్రతయే కాక, వివిధ శాస్త్ర పరిజ్ఞానం, భాషా పాండిత్యం, కవితా వైదుష్యం, సమయస్ఫూర్తి, రసమయ చమత్కృతి, అన్నిటినీ మించి, అసమాన ధారణా శక్తి (power of retention) అవధానానికి అత్యవసరమైన అంగాలు. ఇన్నిటి కలగలపే హృద్యమైన అవధాన ప్రక్రియగా అవతరించింది తెలుగునాట. ఏకాగ్రతభంగ హేతువులు ఎన్ని వున్నా, మనస్సుని ఆవశ్యక విషయంపై కేంద్రీకరించి వుంచడం అవధానంలో ముఖ్య కర్తవ్యం. అంటే, అవధానం యించుమించు తపస్సులాంటిదన్నమాట. తపస్సు చేసి మెప్పించ గలిగినవాడు 'తపస్వి' అయినట్లే, విజయవంతంగా అవధానం చేసి చూపినవాడు 'అవధాని' అనిపించుకుంటాడు. ఆదిలో ఈ అవధాని పదం వేద పండితులకు వాడబడేది.**

# అవధాన విద్య
## తెలుగు వారి ప్రత్యేకత

వేద మంత్రోచ్చారణలో స్వర, వర్ణాలు రెంటికీ చాలా ప్రాధాన్యం వుంది. ఈ రెంటిలో ఎటువంటి లోపం జరిగినా కీడు వాటిల్లుతుందని నమ్మకం. కాబట్టి మంత్రోచ్చారణ సమయంలో అత్యధిక అవధానం పాటించాలి. అందుకే, 'అవధాని' అన్న బిరుదు వేద పండితులకు సార్థకమైంది.

క్రమంగా యీ అవధానం వేదరంగం నుంచి సాహిత్య రంగంలోకి వ్యాపించి, ఒక విశిష్టమైన కళగా రూపొంది, పండిత, పామర జనాదరణ పొందింది. ఈ రంగంలో అవధాన విద్య చిలువలు, పలువలు సృష్టించుకొని ఒక్క చిత్తైకాగ్రతయే కాకుండా సాహిత్యం, కవిత్వం, చమత్కృతి, సమయస్ఫూర్తులతో కూడిన హంగులు కూడా ఏర్పరచుకొని యితర లలిత కళల లాగానే అత్యంత హృద్యంగానూ, ఆపాత మధురంగానూ వెలసింది. సరస్వతీ దేవికి కళాభూషణం, గళాభరణం అయింది.

ఈ అవధాన కళా చరిత్రని గమనిస్తే, యిది శతావధాన రూపంలో ఉద్భవించి, సహస్రావధానంగా విస్తరించి అష్టావధానంగా పరిణితి చెందిందనే భావం కలుగుతుంది. ప్రాచీన కవులలో చరిగొండ ధర్మన, రామరాజ భూషణుడు, మాడభూషి వేంకటాచార్యులు వంటి కొద్ది మంది అవధాన విద్యలో నిష్ణాతులుగా పేరు పొందారు. ఆ కాలంలో అవధానాలు పండిత పరిషత్తులలో మాత్రమే రాజ పూజల నందుకున్నాయి. ఆధునిక యుగంలో, అంటే, 20వ శతాబ్ద పూర్వార్థం నుండి, అవధానాలకు బహుళ ప్రాచుర్యం లభించింది. ముఖ్యంగా ప్రాతస్మరణీయులైన తిరుపతి వేంకట కవుల వలన. వీరి అనితర సాధ్యమైన ఆశుధారా కవిత్వం ౧భయ భాషలలోనూ నల్లేరుపై బండి నడకలాగా అనర్గళంగా సాగి వాడ వాడలా ఆంధ్రావనిని ఉర్రూతలూగించింది.

ఆధునిక అవధాన ప్రక్రియకు వారిని ఆద్యులుగా నిలిపింది. అంతేకాకుండా, జంట కవులు కలిసి అవధానాన్ని నిర్వహించే క్రొత్త ఒరవడిని సృష్టించింది. ఆ రోజులలో వీరికి పోటీగా నిలిచిన కొప్పెరపు జంట కవులతో వీరి కవితా యుద్ధం నేటి క్రికెట్ మ్యాచ్‌ల వలే పరమోత్కంఠ భరితంగా సాగేవని పెద్దల ఉవాచ. వీరందరిలోని అవధాన సరస్వతిని ఆహ్వానించి, ఆదరించి, సన్మానించి ఆనందించని పట్టణాలు అరుదు. వీరి అవధానాలు ఆంధ్రావళికి నూతన కవిత్వోత్తేజాన్ని ప్రసాదించి ఛందస్సుకి మేల్పచ్చడాలు కప్పి పట్టు పుట్టాలు కట్టబెట్టాయి.

తిరుపతి వేంకట కవుల అనంతరం వారి శిష్య శిఖామణి వేలూరి శివరామశాస్త్రి గారు గురు పరంపరగా సంక్రమించిన అవధాన కళా నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించారు. ఇటీవలి కాలంలో 60వ దశకంలో ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవి పీఠాన్నలంకరించిన కాశీ కృష్ణమాచార్యుల వారు పేరెన్నికగన్న శతావధాని, అష్టావధాని. శ్రీ సుబ్బన్న శతావధాని గారు కూడా వారి సమకాలికులే. శ్రీ కోట వీరాంజనేయ శర్మ, శ్రీ గడియారం వేంకట శేష శాస్త్రి గొప్ప అవధాన కర్తలు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ప్రధానాంధ్రోపాధ్యాయులుగా, ఆంధ్ర శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ చేసిన కీ॥శే॥ దివాకర్ల వేంకటావధాని గారి అష్టావధానాలు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వారి జీవిత కాలంలోనే వీనుల విందుగా ప్రసారం చేసింది.

ప్రస్తుత కాలంలో శ్రీయుతులు రావూరి వేంకటేశ్వరులు, మాడుగుల నాగఫణి శర్మ, మేడసాని మోహన్, రాళ్ళబండి కవితా ప్రసాద్, సముద్రాల లక్ష్మణయ్య, గరికపాటి నరసింహారావు, వద్దిపర్తి పద్మాకర్ మొదలైన లబ్ధప్రతిష్ఠులు అవధాన కళకు ముద్దు బిడ్డలుగా వెలసి, ఆ కళను తమ సర్వతోముఖ ప్రజ్ఞ చేత నేటికి కూడా జనరంజకంగా పోషిస్తున్నారు, నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమంది సహస్ర, ద్విసహస్ర, పంచ సహస్రావధానాలను సైతం అవలీలగా నిర్వహించి అందరినీ అబ్బుర పరచారు.

ప్రాచీన కాలంలో సంస్కృత భాషలో సాగిన ఈ అవధాన ప్రకియను తెలుగు సారస్వతం ఒక వంశ పారంపర్య హక్కు మాదిరిగా స్వంతం చేసుకుంది. అందుకే నేడు మరే యితర భారతీయ భాషలలోనూ లేని ఈ ప్రక్రియ తెలుగు వారికి మాత్రమే సొత్తుగా పరిణమించింది. అందునా, శత సహస్రావధానాలకన్నా వైవిధ్యం ౧న్న అష్టావధానంలోని వివిధ అంగాల లోటుపాటులు, వాటిలోని క్లిష్టతలను హృద్యంగమంగా మార్చగలిగిన అవధాని చాతుర్యం మనం ముందు పరిశీలించాక, 'ఔరా! ఏమి ఈ కళ!" అని ఆశ్చర్యపోకుండా ఉండలేం. ఇటువంటి అమూల్యమైన తెలుగు సారస్వతానికి వారసులమైనందున గర్వించకుండానూ ఉండలేము.

*– అందవోలు రామమోహన్*



- మల్లిపురం జగదీశ్వరరావు

# సిందవ

గ్రామీణ కథల పోటీ విభాగంలో ద్వితీయ బహుమతి పొందిన కథ



**"ఇల పొంటి పార్టీ యిచ్చి నోడు ఈ కొండమీదెవుడూ లేదు వోయి" చికెన్ ముక్కని నములుతూ అన్నాడు కామేసు.**

"నిజమేని వోయి. పార్టీ అంతె యిల గుండాల. ఎప్పుడూ జీలుగు కల్లూ మొగ్గల మొకరేనా?" గ్లాసులో మందు సిప్ చేస్తూ అన్నాడు బీసురు.

"మరీ పొగిడీ కంద్రా, నాక్కలిగింది నీ నిచ్చేను" లో లోపల పొంగి పోతూనే అన్నాడు నర్సయ్య.

"నేదు బావా, ఆడు సెప్పింది నిజిము బావా. బిరియాని, కోడి పకోడి.. అల్లదేమిటి బావా?... లూడుల్సు తోటి మందిచ్చినోడు ఎవ్వడ్రా మన్లోన?" తూలుతూ అన్నాడు కాలేసు.

వెన్నెల కురుస్తోంది. వీధి మధ్యలో చలిమంట చుట్టూ నులక మంచాల పైన కూర్చొని వున్నారంతా. అంతా యువకులే.. ఒకరిద్దరు తప్ప. అడవి మీంచి వేస్తున్న గాలి వణికిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇళ్ల ఎదుట పశువుల శాలలో ఏదో అలికిడయ్యింది. పశువుల కలకలం .. అంతదాకా అడవి పరిమళాల్ని మోసుకొచ్చిన గాలిలో ఏదో మార్పు. కుళ్ళిన శవమేదో రేగినట్టు.. ఊరు చివర కుక్కలు అదే పనిగా మొరుగుతున్నాయి. కన్నాయి గాడు రాటకి కట్టిన డప్పు తీసి వాయించటం మొదలెట్టేడు. కొందరు కర్రలు తీసి బయట కొచ్చేరు. లీసు గాడు ఒక చేత్తో టార్చి, మరో చేత దుడ్డు కర్ర పట్టుకుని పశువుల శాలవైపు కదిలేడు. అందరి లోనూ ఉత్కంఠ...

"ఏట్లేదురా... కుక్కలు బెదిర్నాయి.. అంతే" అంటూ చుట్టు ప్రక్కల టార్చి కొడుతూ కర్రతో అలికిడి చేస్తూ బయట కొచ్చేడు.

"జాగ్రర్తరో... పరాగ్గుంతే, ఏటైనా ఎత్తికెలి పోద్ది" అన్నారెవరో.

అందిరి మనసుల్లో మెదిలింది...

సిందవ... ఆడ సిరత పులి.

పులైతే...వేటాడి తినేస్తుంది దాని కాకలేస్తే. సిందవ అలాగకాదు నక్క బుద్దులున్న పులి. మాటు కాస్తుంది. అవసరమైతే చీకట్లో దాక్కుంటుంది. జడదు. అదును చూసి దొంగ దెబ్బ తీసి కావల్సింది ఎత్తుకుపోతుంది.

"ఏట్రోయ్ అందరొక్కాడ సేరినారు. పార్టీయా?" మంట దరి కొచ్చి కూర్చున్నాడు సోమేసు.

"రారా మామా... మనోడు టీవీ, డిస్సు కొన్నాడ్రా... అందుకే పార్టీ యిస్తున్నాడ్రా... యింద బిరియానీ తిన్రా" ఆహ్వానించేడు కామేసు.

"నా కేటీ వొద్దు గాని, ఎంతైందిరా దద్దా పార్టీ ఖర్చు"?అడిగేడు. చెప్పేడు నర్సయ్య. గతుక్కు మన్నారంతా.

"అవున్రా... అంత ఖర్చు అవుసరంరా?" నవ్వుతూనే అడిగేడు.

అతనడిగిన ఏ ప్రశ్నైనా యిలాగే వుంటుంది. అందరితో పాటు అందరి లాగా వుంటాడు. ఇంటర్‌తో చదువాపేసాడు. ఆపై చదవలేక. కొన్నాళ్ళు ఏదో స్వచ్ఛంద సంస్థలో పనిచేసేడు. మరి కొన్నాళ్ళు కమ్యూనిస్టు పార్టీలో తిరిగి, అదీ యిష్టం లేక దగ్గర్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యా వలంటీరుగా పని చేస్తున్నాడు. అప్పుడే అక్కడ పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడితో పరిచయమయ్యింది. అతడితో ఏవో సాహిత్య సభలకి వెళ్తుంటాడు. అతనిచ్చే పుస్తకాలు చదువుతూ వుంటాడు.

"వైన్సు మందిచ్చేడని సంకలు గుద్దుకున్నారు గాని అంత ఖర్చెందుకని ఎవుడైనా ఆలోచించేడ్రా?" ఈ సారి గట్టిగానే అడిగాడు.

"అదేట్రా బావు, జీడి పిక్కల్లోన డబ్బులొచ్చేయి. టీవీ కొన్నాడు, పార్టీ యిచ్చేడు. తప్పేట్రా?" డిస్పోజబుల్ గ్లాసులో నీళ్ళు పోస్తూ అన్నాడు బీను.

"తప్పా తప్పన్నరా?" కొంచం హెచ్చు స్వరంలో అన్నాడు. మంట మరింత రాజుకుంది.

"ఈ రోజుకి మానూర్లోన జబ్బు తోటున్నోలు నలుగురున్నారు. డోలి కట్టి ఆసుపత్రి మందుల కింద ఈ డబ్బు ఖర్చు బెట్టుంతే ఆళు బతకరేట్రా?" సోమేసు మాటల్లో వేడి తగిలింది. కుక్కి మంచాల మీద జబ్బు మనుషులు గుర్తొచ్చేరు అందరికీ. మంచు దట్టంగా జారుతోంది. వీధి మధ్యన విద్యుత్ దీపాలు కొండ కొనకి అంటుకున్న మంటలా వెలుగుతున్నాయి. నర్సయ్య గడపలో టీవీ నిరంతరాయంగా మాట్లాడుతోంది. దాని గుప్పెట్లోకి వూరు వూరంతా కదిలెళ్లిపోతోంది సినిమాలు గాను.. సీరియళ్లు గాను.. ప్రక్క గడపలో కుక్కి మంచమ్మీంచి ఎడతెరిపి లేని దగ్గు తెరలు తెరలుగా.

'ఒరే నువ్వన్నది ఒప్పుకుంతాను గాని. ఒక మాట సెప్పురా... జీడి పిక్కలు మన బతుకుల్ని బాగుసే సేయంతాను. నువ్వొప్పుకుంతావా లేదా?' చార్మినార్ సిగరెట్ వెలిగిస్తూ అడిగేడు సొంబర "ఈడు అన్నీ అడ్డు సుడేన్రా.. తాగడు, తాగనివ్వడు" ప్రక్కనున్నోడి చెవిట్లో మెల్లగా అంటూ కన్ను గీటేడు.

"జీడి పిక్కల తోటి డబ్బు లొస్తున్నాయి. బాగుంది. మరి సోలు, గంటీలు, కొర్రలు, కందులు యివెవ్వడూ పండించకుంతున్నారు. ఆటి మాటేటి?" తిరిగి అడిగేడు సోమేసు.

"బాగుందిరా అల్లుడా.. అవి పండించాలంతె కొండ మీద తుప్ప నరకాల, కంకపట్టి కొండ తువ్వాల, అదును సూసి ఇతన మెయ్యాల. యింతాసేసి వాన పడకపోతే ఇవాళ కష్టము బుగ్గిల కల్సిపోయినట్టే"

"మరి తిండెలగ?" పొడిగించేడు సోమేసు.

"ఓసి తిండం లేదా, బతకడం లేదా? తినాలంటే అవే పండించాలేట్రా?... బియ్యం లేవురా? భూమున్నోడు వరి పండిస్తున్నాడు. అదే లేనోడు డిపో బియ్యం కొనుక్కుంతున్నాడు. డబ్బు లెక్కడివంతావా? ఎండలన్నాళ్లు జీడిపిక్కలు.. మిగతా టైములోన వుపాది పనులు. రోజుకి ఎనబై. గునపం,పార పట్టుకొని ఎల్లడమే. పని సేస్తేటి సెయ్యక పోతేటి? సెప్పురా అల్లుడూ?" దీసరి మామ ప్రశ్నించేడు.

"మామా.. మొన్న తాడికొండ డాక్టరు నీకు రోజుకొక మాత్ర రాసిచ్చేడు గదా... అప్పుడు ఏటి సెప్పేడు సెప్పి?" అడిగేడు సోమేసు.

"ఒరే అల్లుడూ మాట మార్చకు.నేనడిగిందేటి, నువ్వు సెప్తుందేటి?"

"మాట మార్చడం కాదు మామా.. సుగరు జబ్బుకి మాత్రలవి. తెలుసునా?" అన్నాడు.

అందరిలోనూ నిశ్శబ్దం. అతని వైపు చూసేరు 'ఇంకా ఏమి చెప్తాడా! అని

"...కొండోడి సుగరు జబ్బు రాడమేట్రా? కందులు సోడి పిండంబలి, కొర్రలు,జొన్నలు, సామలు తిన్న శరీరమురా మనిది. పొత్తూరిన కాసి పొద్దు ములిగిందాక కష్టపడినోడికి ఆ జబ్బు రాదురా. మూడు పూటలు మెక్కి, నీడ పట్టున వుంతాడే.. పల్లపోడు అలపొంటోడికి రావలసిన జబ్బురా అది. అయినా పల్లపోడి సోకులు, నాజూకులూ మన కొచ్చి నాయి. ఆళ జబ్బులు రావేటి? ఇవేల నీకా జబ్బొచ్చిందంతే నీవూ పల్లపోడివైపోయి నట్టిగే కదా?" సూటిగా అడిగేడు సోమేసు.

ఆ మాట అందరిలోనూ ఆలోచన రేకెత్తించింది. వెన్నెలకి మబ్బులడ్డమొచ్చేయి. మంటలారి కొర్రాయి మీద నివురు కమ్ముకుంది. టీవీలో ప్రకటనల హోరు. వాటిని మించి కుక్కలు మెరగనారంబించేయి ఉలిక్కి పడ్డారంతా. అటువైపు చూసేరు. ముక్కు పుటాలదిరించి గాలిలోని వాసనని పసిగట్టడానికి ప్రయత్నించేరు. సాలల్లోని మేకలు, గొర్రెలు అరుస్తూ అలజడి చేస్తూనే వున్నాయి.

"డ్రు...డ్రు...హోవ్ హో..." ఆల మందలకి ధైర్యం చెప్తున్నారు. టార్చిలైట్లు,అగ్గి దివిటీలు వెలిగేయి. మగాళ్లు వీధిలో కొచ్చేరు. తల్లులు పిల్లలకి ధైర్యం చెప్తూ గుండెలకు హత్తుకుంటున్నారు. ఆ కలకలం లోంచే సిందవ గాండ్రింపు. దాని వైపు పరిగెత్తేరంతా. ఒక్కొక్కరూ ఒక్కొక్క ఆయుధంలా.

* * *

సగం కాలిన తుమ్మికి మొజ్జు పొగలు వదులుతోంది చలిగాలికి మంట ఆరి నివురు కప్పుకుంటోంది.

"వూరంతా సిందవకి తగుల్తుంతే మీరింకా లెగరేట్రా" చీకటి లోంచి బయటి కొస్తూ అన్నాడు జన్ని ముసిలోడు. చేతిలోని ఆయుధాన్ని కిందపెట్టి మంట దరికొచ్చేడు.

"సిందవా? ఇటుకానొచ్చుంతే... ఒక్క దెబ్బకి సంపీసుందును" మంచం కోడును ఆసరా చేసుకొని నిలబడబోతూ ముందుకు తూలేడు సొంబర.

"సిందవని సంపడమంతే సికిని బిరియాని తిండమనుకున్నావేట్రా?" యిగట మాడేడు.. ముసిలోడు.

"అంతేట్రా? నే న్నీలాగ పరిగెట్టలేనన్రా దద్దా?"

"పరిగెట్టడానికి, పనిసెయ్యడానికి పటుత్వ ముండాల్రా సొంబరా"

"అంతే నీ లాగ పని సెయ్యలేనన్రా?"

"వనంతే వుపాది వనుల్లాగ తట్ట వట్టుకొని నిలబడి పొడమనుకుంతున్నావురా? వనంతె కొండ సెయ్యాల.. పంట పండించాల... గింజ నోట్లెయ్యాల"

"పనేదైతేటి? సంపాదిస్తున్నామా, లేదా?"

"సంపాదన కాదురా... పని ముఖ్యం. పని సేసినోడికే తిండి తినే అక్కు ఒక్కొక్కరే వచ్చి చేరుతున్నారు మంట దగ్గరికి. చిదుగుల్ని వేస్తూ, పూది మండించే రెవరో...

"అంతెందుకు, మాలాగ తినగలర్రా మీరు. కందులు సోడి పిండంబలి కలిపి వొండితే దాకడంబలి ఒక్కడ్నే తినోడిని. ఆ తిండి తిని పన్ల పడితే పొద్దు తెలిసేది కాదు."

"అడివికెల్తే?.. బోదెంటం కూర, పుల్లేరు కూర, సిల్లేరు కూర సిట్టి కూర.. ఏది కాదనోలిము?" సుక్కు ముసిలోడు మాట కలిపేడు.

"తేగలో? ఆరితేగ, పల్లేరిక తేగ,. నారిఒడ్డు, పందిముక్కు, కర్రతేగ, గోని తీగ, వలగెంద, పులిదుంప.. ఒకటేటి? అడివికెల్తే తిండిక్కరువుండదు. ఇప్పుడో? అడివీలేదు. అడివి దుంపాలేదు" విచారం వ్యక్తపరిచేడు.

"నిజమేన్రా... మా సిన్న తనంలోన పంటల్లేని కరువు రోజుల్లోన ఏటి తినోలుమురా?" అంటూ మండింగోడు మొదలిట్టేడు.

"మొదలెట్టేరా నాయినా.. బుర్ర తినేస్తారికన" అని విసుగు ప్రదర్శించేడొక కుర్రాడు.

"నోరు ముయ్‌రా ఆలు లేకపోతే ... మన మున్నాముర... నువ్వు సెప్పేద్దూ అంటూ సోమేసు మంటని మరింత రాజేసాడు.

"జీలుగు సెట్టు నరికి దవ్వ తీసి ఎండబెట్టాలా. గూటంతో సితగ్గొట్టి పిండి నేసి అంబల్లోన కలిపి తినోలుము - మామిడి టెంకలో... లోన పలుకు తీసి ఎండబెట్టి దంచి తట్టలోన నాన బెట్టి గెడ్డలోన కడిగోలిము, తన చిన్న నాటి జ్ఞాపకాల్ని నెమలి వేసుకున్నాడు.

"అయినా యిప్పుడా తిండెవులు తింతున్నార్రా? ఎవడింటిల సూడు, వరికూడే. పండించినా, పండించక పోయినా డబ్బులికి ఇబ్బంది లేదు. జీడి సెట్లుంతే సాలు, సావుకారి అప్పిస్తాడు." వెటకారం ధ్వనిస్తుండగా మండింగి ముసిలోడు అన్నాడు.

"ఎందు కివ్వడు? ఇవేల నీకు వందిస్తే.. పిక్కల టైముకి వందకి వంద ఆరోజు రేటు బట్టి పిక్క లివ్వగా ఎగస్ట మూడు కేజీలివ్వాలి. అది సావుకారి తెలివి. నీకా మూడు కేజిలు లాసుకాదేటి?" లాజిక్కు విప్పేడు సోమేసు.

"కొండ మీద పంటలు బలమూ, వరికూడు తింతే బలములేదు, ఇవన్నెవర్రా ఆలోసిస్తున్నాడు? ఆరోజుల్లోన పచ్చి మాంసం కోసి తీగిల మీద ఎండబెట్టి రోజుల తరబడి నిలువసేసి తినోలుము. అది యీ వేల మానీసేము. సికెన్ బిరియాని తినగలుగుతున్నాము. బట్టలెలగ వుతికోటి కుండలోన రొయ్యి బుగ్గి తోటి పుడకబెట్టి గెడ్డలో గుంజోలుమి. బుర్రకి తెల్ల కారిమన్నే, మారట కాయ గుజ్జో పులిమి కడుక్కుండోలిమి. అలాంటిదివేల సబ్బులు, షాంపూలు వాడుతున్నాము. యివన్నీ డబ్బులుండ బట్టే గదా? ఆ లెక్కన మనం డవలప్పైనట్టా, కాదా? తుపుక్కున వుమ్మి సోమేసు వైపు చూసేడు సన్నాయి.

"నీ లెక్క ప్రకారమైతే వైన్సు మందొచ్చిన తర్వాత జీలుగు కల్లు, ఇప్ప సారా మానీయాల గదా? మరదెందుకు మానలేదు?" సోమేసు ప్రశ్నించేడు.

"ఇది సర్దా బావా..." అని ఖైనీని నోట్లో వేసుకున్నాడు.

"అందుకే డవలప్పై పోయేవనుకుంటున్నావన్నమాట. డిగ్రి సదివి నోడివి. ఆ మాత్రం ఆలోచించ లేకపోయేవురా?" అన్నాడు సోమేసు.

అక్కడ నిశ్శబ్దం కమ్ముకుంది.

ఏది అభివృద్ధి?

డబ్బు సంపాదించి సుఖ పడడమా?

మూలాల్ని మరిచి అడవికి దూరమవడమా?

పొగతో పొగ మంచు కలిసి వూపి రాడ నివ్వడంలేదు. చందమామ నెత్తి మీద కొచ్చేడు. అడవికి పీడేదో పట్టినట్టు తీతువు కూసింది.

సోమేసు మంటలో కర్రల్ని కదిపేడు. నిప్పులు ఎర్రగా రగులుతున్నాయి.

"ఆరోజుల్లో అడవుల్లోనే తిరిగి బతికినోలుము ఇవేల సదువుకొని పుజ్జోగస్తులమైనాము. అడివొదిలి పట్నంల అడుగెట్టేము. అక్కడి తిండి, తాగుడు యిక్కడికి తెచ్చేము. అక్కడి సోకులు, సదుపాయాలు యిక్కడికి తెచ్చేము, ఇప్పుడిక్కడ అడివి కరిగిపోయి టౌనయిపోయింది. మనమెటు నడుస్తున్నాము? ఆ రోజుల్లోన ముసిలోలు ఆలు వయసప్పుడు వుద్యమం కాసి నడిచేరు. ఈ వేల మనము, రేపు మన పిల్లలు .. ఎటు నడుస్తారు?" సోమేసు అందరి వైపూ చూసేడు.

ముసిలోళ్లు ఆలోచనలో పడ్డారు. కొండ మీంచి చలిగాలి రివ్వున వీచింది. వూరు మీద నిద్రా దేవత వాలింది. తుడుము రప్పలు అలుపు తీరుస్తున్నట్టు రాట మీద వేలాడుతున్నాయి. కొందరు కుర్రాళ్ళు టీ.విని ఆపి ఇంట్లోకి మోసుకుపోయి తలుపు వేసుకున్నారు. వాళ్ళ చేతుల్లో సీడీలు, సెల్‌ఫోన్లు వున్నాయి.

ఉన్నట్టుండి కుక్కలు మొరిగేయి మళ్ళీ. పశువులసాలలో కలకలం. వూరు నిద్రలేచింది.. అలజడి పెరిగింది. అగ్గి దివిటీలు వెలిగేయి డప్పుల హోరు కొండల్లో ప్రతిధ్వనిస్తోంది. బాణముచ శిలకోల, గొడ్డలి, కత్తి, వడిసెల బల్లెము ఎవరికి దొరికిన ఆయుధంతో వాళ్లు ముందు కురికేరు.

చీకట్లో సిందవ గాండ్రింపు. వూరు సమూహం.. సిందవ ఒంటరిది.

కాసేపటికి సిందవ మృతదేహాన్ని వూళ్ళోకి మోసుకొచ్చేరు.

విద్యుత్ వెలుగుల్లో నిర్జీవంగా సిందవ. వీర గాథలతో చుట్టూతా మూగిన వూరు. పార్టీలోని యువకులు మాత్రం నిలబడలేక.. మత్తులో మాట్లాడలేక... ఏదో పాట పాడుకుంటూ. వాంతులు చేసుకుంటూ.. నిర్వీర్యంగా.

సోమేసు ఆలోచనలో పడ్డాడు. వూరు మీద పడిన సిందవని చంపేరు ముసిలోళ్ళు. మరి కుర్రాళ్ళకు పట్టిన సిందవని?? ఆలోచనేదో దొరికినట్టయ్యింది. చిరుగాల్ని ఎగదోసేడు. ఇందాకటి సందడిలో కుర్రాళ్ళ చేతుల్లోంచి జారిన సీడీల్ని మంటల్లో పడేసారు. అతని కళ్లు మెరుస్తుండగా మంటలు మరింత ఎగిసేయి. సిందవ దాడికి గాయపడిన మేక పిల్లకు మందేసి కట్టు కట్టేడు సోమేసు. ◆

# పేదల జీవితాలలో వెలుగు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

స్వాతంత్ర్యానంతరం మనం ఎదుర్కొన్న సమస్యలలో ప్రముఖమైనది పేదరిక నిర్మూలనా సమస్య. గ్రామీణ ప్రాంతాలలో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంది. "గత 60 సంవత్సరాలుగా పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు కొన్ని వేల కోట్ల" రూపాయలు ఖర్చు చేశాయి. ఇంకా ఖర్చు చేస్తూనే ఉన్నాయి.. ఇన్ని చేసినా దేశజనాభాలో 2004-2005 నాటికి సుమారు 27.5 శాతం ప్రజలు దారిద్ర్యరేఖ దిగువున ఉన్నట్లుగా గణాంకాలు తెలియజేస్తున్నాయి.



పేదరిక నిర్మూలనకోసం ఎన్ని చర్యలు తీసుకున్నా, పలు కార్యక్రమాలు ప్రారంభించినా పరిస్థితిలో ఆశించిన ఫలితాలు, మార్పులు రాకపోవడానికి ప్రధాన కారణం ఈ కార్యక్రమాల కోసం కేటాయించిన బడ్జెట్‌లో అధికభాగం వృధాగా ప్రక్కదారి పడుతున్నాయని పరిశీలకుల అభిప్రాయం. ఫలితంగా గ్రామీణ పేదలకు ఉపాధి కరువై కూలీ కోసం ఉన్న ఊరిని, కుటుంబాన్ని వదలి దూర ప్రాంతాలకు వెళ్ళి దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ పరిస్థితులలో మార్పు తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకాన్ని ప్రారంభించింది. కోట్లాది మందికి ఉపాధి కల్పించే ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి పార్లమెంటులో చట్టాన్ని తీసుకు రావడంతో పాటుగా ఈ పథకాన్ని ప్రప్రథమంగా మన రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ఫిబ్రవరి 2006న భారత ప్రధాని గౌ॥డా.మన్‌మోహన్‌సింగ్ గారు ప్రారంభించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఎంత పారదర్శకంగా ఉన్నప్పటికీ, సమర్థవంతమైన అమలుకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, ఈ రెండున్నర సంవత్సరాల ప్రయాణంలో కొన్ని క్లిష్టసమస్యలు ఎదుర్కొనక తప్పలేదు. ఈ చట్టం అవినీతిమయమని కొందరు వ్యాఖ్యానించగా గ్రామీణ ప్రాంతాల పేదల జీవితాలలో వెలుగుకి ఉత్తమ సాధనమని మరికొందరు వ్యాఖ్యానించారు.

**పథకం ప్రాముఖ్యత:** బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు ఉపాధి ప్రత్యామ్నాయాలు కరువై కొరవడినపుడు జాతీయ గ్రామీణ ఉపాది హామీ చట్టం ఉపాధి వనరుగా పని చేసి, వారికి సామాజిక భద్రతా కవచాన్ని ఏర్పాటు చేస్తుంది. వేతన ఉపాధి కార్యక్రమాలకు భద్రతను కలిగిస్తుంది. శారీరకశ్రమ చేసే పనికి సంసిద్ధులైన వయోజనులకు పనికోరే హక్కును కల్పించి, నిర్ణీత కాలవ్యవధిలో వారికి ఉపాధి అందజేయుటంలో ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలుపుతుంది. సహజ వనరుల యాజమాన్యానికి ప్రాధాన్యం ఇచ్చి మన్నికగల ఆస్తుల కల్పనపట్ల ప్రత్యేక శ్రద్ధతో వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ సుస్థిరాభివృద్ధికి సమర్థమైన వృద్ధి వాహకంగా పని చేస్తుంది.

**రాష్ట్రంలో ఉపాధి హామీ అమలు:** గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు పరచడానికి రాష్ట్రప్రభుత్వాలు రాష్ట్ర ఉపాధి హామీ పథకాన్ని రూపొందించాలి. ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రూపొందించడం జరిగింది. మూడు దశలలో ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు పరిచారు. దీనితో హైదరాడాద్ జిల్లా మినహా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలలో ఈ పథకం 2008 ఏప్రిల్

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 13 నవంబర్ 2008 వరకు లభించిన ఫలితాలు (గణాంకాలలో)

| | | | 2008-2009 | పథకం మెదలైన తేదీ నుండి |
|---|---|---|---|---|
| 1 | శాఖాపరంగా మంజూరయిన పనులు | సంఖ్య<br>రూ.లక్షలలోమొత్తం పనుల విలువ | 12,14,232<br>1,21,12,36,.66 | 15,38,652<br>1,40,53,79.52 |
| 2 | జరుగుతున్న పనులు<br>పనుల విలువ రూ. (లక్షలలో) | సంఖ్య<br>53,00,13.9 | 4,27,008 | –<br>– |
| 3. | పూర్తయిన పనులు | సంఖ్య<br>పనుల విలువ రూ. (లక్షలలో) | 1,52,138<br>13,48,17.00 | 4,76,580<br>32,91,84.53 |
| 4. | మొత్తం వ్యయం | వేతనాలు (రూ.లక్షలలో)<br>సామగ్రి మరియు స్కిల్డ్ వేతనాలు(రూ.లక్షలలో)<br>అనిశ్చిత ఖర్చులు (రూ.లక్షలలో)<br>మొత్తం రూ.లక్షలలో | 15,05,49.18<br>2,94,93.92<br>68,54.51<br>18,68,97.61 | 36,83,98,22<br>5,73,06.05<br>2,08,66.66<br>44,65,70.94 |
| 5. | వేతనాలు పొందినవారి సంఖ్య | కుటుంబాల సంఖ్య<br>వ్యక్తుల సంఖ్య<br>పురుషుల సంఖ్య<br>స్త్రీల సంఖ్య<br>షెడ్యూల్ కులాల సంఖ్య<br>షెడ్యూల్ తెగల సంఖ్య<br>వికలాంగుల సంఖ్య | 53,43,584<br>91,98,848<br>42,34,156<br>49,64,192<br>24,64,121<br>12,27,487<br>56,623 | 71,14,272<br>1,22,46,859<br>56,51,140<br>65,95,719<br>32,79,183<br>16,10,139<br>75,175 |
| 6. | మొత్తం మానవ పని దినాలు | | 8,19,55,587 | 44,74,57,982 |
| 7. | ఒకదినానికి ఒక వ్యక్తికి సగటు వేతనం | | 82.74 | 82.33 |
| 8. | 100 రోజులు పని చేసిన మొత్తం కుటుంబాల సంఖ్య | | 2,75,968 | 7,53,718 |

సూచిక: పైన తెలుపబడిన పట్టిక www..nrega.ap.gov.in అనే వెబ్ సైట్ నుంచి తీసుకొనబడినది

1వ తేదీనుండి అమలులోనికి వచ్చింది. ఈ కార్యక్రమం 22 జిల్లాలలో 1098 మండలాలలో 22,070 గ్రామ పంచాయితీలలో 73,527 ఆవాసాలలో అమలు జరుగుతోంది.

**పథకం పని తీరు:** ఈ పథకం కూలీలకు వరంగా మారింది. ఇదొక చారిత్రాత్మకమైన కార్యక్రమం. ఇంత పెద్దకార్యక్రమం అమలులో కొన్ని పొరపాట్లు, అపశ్రుతులు దొర్లుతున్నమాట వాస్తవమే. ప్రతి పథకంలోనూ మంచి చెడులుంటాయి. ఇది జగమెరిగిన సత్యం. ఒకానొక సందర్భంలో స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనకు, కేటాయించిన ప్రతి 100 రూపాయలలో పేదవారికి అందేది పది రూపాయలు అన్నారు. కాని ఉపాధి హామీ పథకంలో అటువంటి పరిస్థితి లేదు, కష్టించిన ప్రతి పైసా పేదవారికి చేరుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. పథకంలో జరిగిన 90% అభివృద్ధిని మరచి, 10% పొరపాట్లను వేలెత్తి చూపడం మన సమాజంలో సర్వసాధారణమైనది. జరుగుతున్న చిన్నచిన్న పొరపాట్లను ఎప్పటికప్పుడు అధికారగణం విశ్లేషించి చెక్ పెట్టడం జరుగుతోంది. ఏది ఏమైనప్పటికినీ జాతీయ ఉపాధి హామీ పథకం అత్యంత ప్రజాదరణ పొందిన పథకంగా అవతరించింది. పథకం అమలులో ఆంధ్రరాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. ఈ పథకం విజయవంతం కావడానికి గ్రామ స్థాయి సిబ్బంది నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు చేసిన నిరంతర కృషి, పట్టుదల, అంకిత భావం ఉన్నాయి.

ఇంత వరకు లభించిన ఫలితాలు

డా॥ యస్.సి. నారాయణ,
జూనియర్ ఫ్యాకల్టీ, ఇ.టి.సి,
హసన్‌పర్తి, వరంగల్

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## అర్ధాంగికి అర్థాలు వేరులే !

**ఈ సంఘటన ఎవరెవరి మధ్యనో జరిగినట్లు ఈ మధ్య ఎవరో రాశారుట. అదేమో కాని, నాకు తెలిసినంత మట్టుకి, నలభైయేళ్ళ క్రితం జరిగిన సంగతి ఇది.**

అప్పటికింకా శ్రోత్రియులు, ఎక్కడకేనా ఆఫీసుకో, ఉద్యోగస్థులతో పనిబడో, వ్యవహారాల విషయంలోనో బయటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు తప్ప, ఉత్తరీయమే కాని చొక్కా ధరించేవారు కాదు. అదైనా, మెడదాకా, గుండీలూ, మణికట్టుల దగ్గర కప్పులూ, జబ్బల దగ్గర ఫిల్టులూ వున్న పొడుగుచేతుల చొక్కా తొడిగేవారు. పొట్టిచేతుల చొక్కాలు బాలురకీ, యువకులకీ మాత్రమే పరిమితం. కొందరు, అంటే రైతులూ వాళ్ళూ చేతులున్న బనీన్లు తొడిగేవారు.

పండితులూ, శ్రోత్రియులూ, ఆచార సంపన్నులూ వీరంతా ఇంట్లోనూ, బంధువుల ఇంటికి వెళ్ళినప్పుడూ, ఒకర్నొకరు కలుసుకోడానికి వెళ్ళినప్పుడూ, చివరికి పెళ్ళిళ్ళూ, పండగ పబ్బాలు వంటి ముఖ్య సందర్భాల్లోనూ కూడా పంచ కట్టుకోవడం, పైన ఉత్తరీయం వేసుకోవడమే. చొక్కా అనేది ఉద్యోగాది సందర్భాల్లోనే.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు కూడా అలాగే యూనివర్సిటీకి క్లాసులు తీసుకోడానికి వెళ్ళినప్పుడూ, సర్.సి.ఆర్. రెడ్డి వంటి పెద్దల్ని కలుసుకోడానికి వెళ్ళినప్పుడు మాత్రమే పొడుగుచేతుల చొక్కా తొడిగేవారు. వారి మేనల్లుడైన పుట్టపర్తి నారాయణాచార్యులుగారు, రాళ్ళపల్లివారి కంటే కొంచెం ఆధునికులు. అయినా మేనమామగారి సముఖంలో పైమీద కండువాయే – అలాంటిది, నాడు, రాళ్ళపల్లి వారిని పుట్టపర్తివారు కలుసుకోడానికి వెళ్తూ, సగం చేతులున్న చొక్కా తొడుక్కుని వెళ్ళారు. అది చూసి కొంచెం ఎబ్బెట్టు అనిపించి "ఏం నారాయణా! అర్ధాంగితో వచ్చావు?" అన్నారు అనంతకృష్ణశర్మగారు. మొదట నారాయణాచార్యులు వారు తెల్లబోయి, తర్వాత అర్థ–అంగీ అని అర్థం చేసుకుని నవ్వుకుని మామకి అల్లుడి అర్ధాంగి, పూర్ణాంగీకారమైందేగా" అని చమత్కరించారు. ☆

## పళ్ళు ఉంటేనే పదవి

**అప్పటికింకా మనం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే వున్నాం. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం రాలేదు. ఆస్థానకవి శ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు అస్తమించారు. ఆ పదవి తనకి రావాలని రాజమండ్రిలో శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి పట్టుదల. అప్పటికి ఆయనకి దాదాపు ఎనభై ఏళ్ళున్నాయి.**

ఆస్థానకవి పదవికై ఆయన తీవ్రంగా ప్రయత్నించడం ప్రారంభించారు. ప్రయత్నించడం అంటే రోజూ రాత్రి పది గంటలకి, మద్రాసులో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి మంత్రిగా వున్న శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారికి ఫోను చెయ్యడం, ఆ పదవి తనకే రావాలని నచ్చచెప్పి వాదించడం.

రోజూ ఫోను చేద్దాం అంటే ఇంట్లో ఫోను వుండాలిగా? ఆయనకి లేదు. అందువల్ల బోడపాటి రామలింగం అనే ఓ మిత్రుణ్ణి అడిగారు. రామలింగంగారికి రాజమండ్రిలో మినర్వా టాకీసు ప్రక్కన దేశసేవ ప్రెస్ అని వుండేది. దేశసేవ అని ఒక వారపత్రిక నడిపేవారు. అందులో ఫోను వుంది. పత్రికలో నేను అప్పుడూ పనిచేస్తూ వుండడం వల్ల రాత్రిపూట తాళాలు నా దగ్గర వుండేవి.

రోజూ రాత్రి కృష్ణమూర్తిశాస్త్రిగారు మా యింటికి రిక్షాలో రావడం, నన్ను రిక్షాలో ఎక్కించుకుని దేశసేవ ఆఫీసుకి వెళ్ళడం, ఆయన ట్రంక్ కాల్ చేసి ఫోనులో గోపాలరెడ్డిగారితో అలా మాట్లాడుతూనే వుండడం, నేను చలికి వణికిపోతూ పక్కనున్న టేబుల్ మీద తలవాల్చి కునికిపాట్లు పడుతూ వుండడం– ఇలా 1949 డిసెంబరు నెల అల్లా గడిచింది.

ఓ రోజున ఆయన చలికి దంతాలు టకటకలాడుతూంటే "అబ్బాయి, మనకి ఆస్థాన పదవి వచ్చినట్లే–పళ్ళూడి కళ్ళు కనిపించని వారికి ఆస్థాన పదవి ఇవ్వద్దన్నాట్ట రాజాజీ–మనకి కళ్ళు శుభ్రంగా కనిపిస్తున్నాయి. ఇంక పళ్ళ సంగతి వస్తే అవి ఊడే ప్రసక్తి లేదు. మన దంతోదంతం వాళ్ళకి తెలియదు. మనవి కట్టుడుపళ్ళు అంటూ పకపకా నవ్వారు. పళ్ళకీ పదవికీ గల అవినాభావ సంబంధం విని నేను ఆశ్చర్యంతో తెల్లబోయాను. ☆

## నశ్యమే కాదు అంటేది నషాళం

**ఇద్దరూ ప్రసిద్ధి కెక్కిన కవులే! పేర్లు అప్రస్తుతం. ఇద్దరూ ఇప్పుడు లేరు. దివంగతులయ్యారు. అందులో ఒకాయన పేరు శర్మ అనుకుందాం. ప్రతీదానికీ కక్కుర్తి పడేవారు. రెండో ఆయన పేరు రావుగారని వ్యవహరిద్దాం. ఆయన దర్జాగా వుండేవారు. అంతేకాకుండా ప్రగల్భాలు పలకడం కూడా కాస్త ఎక్కువే. ఇలా ఇద్దరినీ భిన్న ప్రకృతులే అయినా, ఇద్దరూ మంచి స్నేహితులూ, మాటకారులూ.**

ఒక రోజున ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కబుర్లు మాంఛి రసకందాయంలో పడ్డాయి. ఆ సమయంలో రావుగారు రొంటిలోంచి ముక్కు పొడుం డబ్బా తీసి, పీల్చబోయే ముందు, వేలితో డబ్బా మీద తాటిస్తున్నారు. అప్పుడు శర్మగారు ముక్కుపొడుం మీద మనసుపడి చెయ్యి తాపి "రావుగారూ! కాస్త ఇలా విదపండి" అన్నారు.

రావుగారికి అవకాశం దొరికింది. కాస్త పొడుం శర్మగారి చేతిలో వేస్తూ "మొత్తానికి శర్మగారూ! మీరు పౌరోహిత్యం వదిలి కవిత్వంలో పడ్డా, పాత అలవాటు వుందే–అదే, చెయ్యి జాపడం– మానలేదు" అన్నారు కొంటెగా.

వెంటనే శర్మగారు "నిజమేనండీ–ఇన్నాళ్ళు నుంచీ మీ స్నేహం చేస్తున్నా–ఇప్పటికింకా స్వంత డబ్బా అలవాటు కాలేదు" అన్నారు.

రావుగారికి ముక్కుపొడుం మాట దేవుడెరుగు, ఆ మాట మాత్రం నషాళం అంటింది. ☆

ప్రభుత్వానికి సంబంధించిన పౌరసరఫరా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావలనే ఉద్దేశ్యంతో పంచాయతీ రాజ్ సంస్థలైన జిల్లా ప్రజాపరిషత్, మండల ప్రజాపరిషత్, గ్రామ పంచాయతీ స్థాయిలో ఆహార సలహా సంఘాలను ప్రభుత్వం ఏర్పరచింది. ప్రస్తుతం వున్న ఆహార సలహా సంఘాలతో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో మరింత పటిష్టవంతంగా పని చేయాలనే ఉద్దేశ్యంతో, రెండు రూపాయల కిలో బియ్యానికి మరింత ప్రాధాన్యత సంతరించుకొన్న ప్రస్తుత తరుణంలో అత్యధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులు, అధికారులతో ఈ ఆహార సలహా సంఘాలను ప్రభుత్వం పునర్నిర్మాణం చేసింది. నూతనంగా పునర్నిర్మించిన ఆహార సలహా సంఘాలలో (జి.ఓ.యం.యస్.నెం.47) వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ (సి.యస్.ఐ) తేది: 2-08-2009) లో అత్యధికంగా వివిధ సంస్థలు, శాఖల నుండి సభ్యులుగా నియమించారు.



# రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఆహార సలహా సంఘాలు, ధరల నియంత్రణ కమిటీలు



స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల నిఘాతో ఈ చౌకదుకాణాలు పౌరులకు మరింత న్యాయమైన సేవలు అందించాలనే దృక్పథంతో పంచాయతీ రాజ్ సంస్థలలోని ఎక్కువ మంది ప్రజాప్రతినిధులకు ఇందులో ప్రాతినిధ్యం కల్పించబడింది. 'ఆహారసలహా సంఘం' తో బాటు 'ధరల నియంత్రణ కమిటీ' ని కూడా పై ఉత్తర్వు ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం అమలులో ఉన్న ధరలు, నిత్యావసర వస్తువుల లభ్యత, నిత్యావసర వస్తువుల పంపిణి మొదలగు అంశాలను గురించి ప్రతివారం ఈ కమిటీ సమావేశమై సమీక్ష చేస్తోంది.

***రాష్ట్ర స్థాయి ఆహార సలహా సంఘం :*** రాష్ట్ర స్థాయిలో ఆహార సలహా సంఘానికి వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాలు, కొలతలు, తూనికల మంత్రి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ మెంబరు - కన్వీనరుగా వ్యవహరిస్తారు. వీరు కాకుండా వివిధ సంస్థల నుండి హోదాలలో రాష్ట్ర స్థాయిలో పనిచేసే 26 మంది సభ్యులుగా ఉంటారు.

***జిల్లాస్థాయి ఆహార సలహా సంఘం :*** జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టరు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ప్రజాపరిషత్ ఛైర్మన్ కో-ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సంయుక్త కలెక్టరు, వైస్ -ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో జిల్లాకు చెందిన అందరు శాసనసభ్యులు, అందరు శాసనమండలి సభ్యులు, అందరు పార్లమెంటు సభ్యులు సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరు కాకుండా సంయుక్త సంచాలకులు పండ్ల తోటల పెంపకం, వ్యవసాయ ఉప-సంచాలకులు, జిల్లా వాణిజ్య పన్నుల శాఖ అధికారి, మార్కెటింగ్ సంయుక్త / ఉప-సంచాలకులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుండి ఒక్కొక్క ప్రతినిధి, జిల్లా ప్రజాపరిషత్ నుండి నామినేట్ చేయబడిన ఆరుగురు (అందులో ముగ్గురు మహిళలు) సభ్యులుగా వుంటారు.

జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్, పరిశ్రమల నుండి ఒక్కరు, ఆయిల్ పరిశ్రమ నుండి జిల్లా కో-ఆర్డినేటర్, చౌకదుకాణాల అసోసియేషన్ నుండి ఒకరు, కిరోసిన్ రిటైల్ డీలర్సు అసోసియేషన్ నుండి ఒకరు, జిల్లా కలెక్టరుచే నామినేట్ చేయబడిన జిల్లా వినియోగదారుల సంస్థ నుండి ముగ్గురు, వ్యవసాయదారుల నుండి ఇద్దరు, ప్రింట్ మీడియా నుండి ఇద్దరు, జిల్లా కలెక్టరుచే నామినేట్ చేయబడిన జిల్లాకు చెందిన రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి నుండి ఒకరు, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి, ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల బోర్డు డైరెక్టరు (సంబంధిత జిల్లాకు చెందిన), జిల్లా మేనేజరు (ఎ.పి.యస్.సి.యస్.సి.యల్) సభ్యులుగా వ్యవహరిస్తారు. పై సభ్యులు జిల్లా స్థాయి ఆహార సలహా సంఘం సమావేశంలో పాల్గొంటారు.

పై జిల్లా స్థాయి ఆహార సలహా సంఘాన్ని ఏర్పాటుచేసి సమావేశాలు నిర్వహించే బాధ్యత జిల్లా పౌరసరఫరాల అధికారిపై ఉంది. జిల్లా పౌరసరఫరాల అధికారి ఈ ఆహార సలహా సంఘానికి మెంబరు కన్వీనరుగా వ్యవహరిస్తారు.

***మండల స్థాయి ఆహార సలహా సంఘం :*** మండల స్థాయి ఆహార సలహా సంఘానికి సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి / సబ్-కలెక్టరు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, కో- ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండల స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుండి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. ఆ మండలానికి చెందిన జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల ప్రజాపరిషత్‌చే నామినేట్ చేయబడిన ముగ్గురు మహిళా సభ్యులు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి, వ్యవసాయదారుల నుండి ఇద్దరు సభ్యులు, చౌకధరల దుకాణదారుల అసోసియేషన్ నుండి ఒక ప్రతినిధి, కిరోసిన్ డీలర్ (చిల్లర) అసోసియేషన్ నుండి ఒక ప్రతినిధి, జిల్లా కలెక్టరుచే నామినేట్ చేయబడిన స్వచ్ఛంద వినియోగదారుల సంస్థ నుండి నలుగురు సభ్యులు, జిల్లా కలెక్టరుచే నామినేట్ చేయబడిన స్వయం సహాయక సంఘ గ్రూపుల ప్రతినిధి ఒకరు, మండల స్థాయి వాణిజ్య పన్నుల అధికారి, మండల వ్యవసాయశాఖాధికారి, మండల ఉద్యానవన శాఖాధికారి, ప్రింట్ మీడియా నుండి ఇద్దరు, రెవెన్యూ డివిజనల్ అధికారి / సబ్-కలెక్టరుచే నామినేట్ చేయబడిన స్థానిక కన్జ్యూమర్ క్లబ్బుల నుండి ముగ్గురు, ఆహార సలహా సంఘంలో సభ్యులుగా వుంటారు. మండల తహసీల్దారు మెంబరు -కన్వీనరుగా వ్యవహరిస్తారు. పై మెంబర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి తహసీల్దారు బాధ్యత వహిస్తారు.



***గ్రామ పంచాయతీ స్థాయి ఆహార సలహా సంఘం :***(జి.ఓ.యం.యస్. నెం.7 వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల (పౌ.స.1) శాఖ తేది: 01-02-2006)

గ్రామపంచాయతీ స్థాయి ఆహార సలహా సంఘంలో పంచాయతీ సర్పంచ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. గ్రామ పంచాయతీ పరిధికి చెందిన యం.పి.టి.సి. సభ్యుడు, గ్రామ పంచాయతీచే నామినేట్ చేయబడిన గ్రామ పంచాయతీలోని ఆరుగురు సభ్యులు (కనీసం ఇద్దరు మహిళలు), మండల స్థాయి సంఘం నామినేట్ చేసే వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల నుంచి ముగ్గురు ప్రతినిధులు, మండల స్థాయి సంఘం నామినేట్ చేసే స్వయం సహాయక గ్రూపులలోని ముగ్గురు ప్రతినిధుల సభ్యులుగా వుంటారు. పంచాయతీ కార్యదర్శి సభ కన్వీనరుగా వుంటారు.

ఆహార సలహా సంఘం కమిటీలను ఎవరు ఎప్పుడు సమావేశ పరచాలి?

రాష్ట్రస్థాయిలో పౌరసరఫరాల శాఖ సంచాలకులు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల స్థాయిలో తహసీల్దారు, పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి సదరు ఆహార సలహా సంఘానికి ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశపరుస్తారు.

## ఆహార సలహా సంఘం విధులు, బాధ్యతలు

- పౌర సరఫరాల పంపిణీలో, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం.
- జిల్లాలోని చౌకధరల దుకాణదారుల పనితీరుకు సంబంధించిన ఫిర్యాదులు పరిష్కరించడం.
- చౌకధరల దుకాణ డీలర్లు, కార్డు హోల్డర్లకు సరుకులు సక్రమంగా, న్యాయబద్ధంగా పంపిణీ చేయటానికి తగుచర్యలు చేపట్టడం.
- చౌకధరల దుకాణాలను తరచు సందర్శించి, చౌకధరల దుకాణాల పనితీరును మెరుగుపరచటానికి తగు సూచనలను ఆహార సలహా సంఘ సమావేశంలో ఉంచటం.
- ప్రతి నెలలో ప్రభుత్వం నుండి వచ్చిన సరుకుల కోటాను సక్రమంగా కార్డు హోల్డర్లకు పంపిణీ చేసేటట్లు చూడటం.
- చౌకధరల దుకాణాల పనితీరును నిరంతరం పర్యవేక్షణ జరిపి లోపాల నివారణకు సంబంధిత అధికారులకు వాస్తవ నివేదికలు అందించటం.
- పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో పరస్పర సమన్వయం కలిగి ఉండటం.

రాష్ట్ర స్థాయి నుండి గ్రామపంచాయతీ స్థాయి వరకు ఏర్పడిన ఆహార సలహా సంఘాలలో చర్చించవలసిన అంశాల ఎజెండా –

- గత సమావేశంలో చర్చించిన అంశాల పైన చర్య నివేదికను ఆహార సలహా సంఘంలో ఉంచటం.
- నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు గల కారణాలు, ధరల నియంత్రణకు (తగ్గింపునకు) తీసుకొన్న చర్యలు, నల్లబజారులో సరుకులు దాచిపెట్టడం, డీలర్లు నిత్యావసర వస్తువులకు కృత్రిమ కొరతను సృష్టించడం మొదలగు అంశాలను చర్చించి తగిన చర్యలు చేపట్టటానికి సంబంధిత అధారిటీలకు రిపోర్టు చేయడం.
- వ్యవసాయ వస్తువులకు సంబంధించిన, ఆహార ధాన్యాలు, కూరగాయల ఉత్పత్తిని సమీక్షించడం.
- ప్రజా పంపిణీ వ్యవస్థకు, నిత్యావసర వస్తువులకు కేటాయింపులు చేయించడం.
- నిత్యావసర వస్తువులైన ఆహార ధాన్యాలు, కిరోసిన్‌ను షెడ్యూలు సమయానికి చౌకధరల దుకాణానికి తరలించడం.
- ఆహార ధాన్యాలు, పంచదార, ఎడిబిల్ ఆయిల్స్ మొదలైన సరుకులు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ నుండి రవాణా చేసే అంశాన్ని సమీక్షించటం.
- స్టాకును డీలర్లు సరియైన సమయానికి తీసుకువెళ్తున్నారా? లేదా? అనే విషయాన్ని సమీక్షించటం.
- పూర్తిగా లేదా పాక్షికంగా సరుకులను తీసికొని వెళ్ళని చౌకధరల దుకాణదారుల డీలర్లు, తీసుకొన్న సరుకులు కార్డు హోల్డర్లకు సరిగా పంపిణీ చేయని డీలర్లపైన తగిన చర్యలు చేపట్టడం.
- స్టాకు లభ్యంగా ఉంచుకొనకపోవడం, నాణ్యతలో లోపం, అత్యధిక ధరకు అమ్మడం, తూకాలు తగ్గించి తూచటం, సరకులను నల్లబజారుకు తరలించటం వంటి పనులు చేసిన డీలర్లపైన చర్యలు చేపట్టే అంశాన్ని చర్చించటం.
- చట్టబద్ధంగా నడుచుకోని డీలర్లపై "ప్రజాపంపిణీ నియంత్రణ ఉత్తర్వులు, 2008" లో సెక్షన్ 6–ఎ ప్రకారం తగిన చర్యలు చేపట్టటానికి, అట్టి డీలర్ల లైసెన్సును రద్దు పరచే అంశాన్ని సమీక్షించటం.
- ప్రస్తుతం రేషన్ షాపుల వద్ద వున్న కార్డుల పరిస్థితిని సమీక్షించటం.
- కొత్త కార్డులు జారీచేయటం, బోగస్ కార్డులు తొలగించటం వంటి అంశాలపై తగు సూచనలు చేయటం.
- వివిధ కేటగరీల చౌకధరల దుకాణాల సంఖ్యను పరిశీలించటం.



- చౌకధరల దుకాణాల డీలరుషిప్‌ల ఖాళీలను సమీక్షించి సంబంధిత ఖాళీలలో డీలర్లను నియమించటానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయటం.
- చౌకధరల దుకాణాల ఖాళీలను భర్తీ చేయటం, డీలర్లను నియమించటం, రిజర్వేషన్ రూలును పాటించటం వంటి అంశాలను పరిశీలించటం.
- చౌకధరల దుకాణాల డీలర్లు బ్యాంకు నుండి తీసికొన్న రుణాలు తిరిగి చెల్లించే అంశాన్ని సమీక్షించి సకాలంలో చెల్లించని వారిపై తగిన చర్యలు చేపట్టడం.
- ధాన్యాన్ని ప్రొక్యూర్ చేయటం, వినియోగదారుల రక్షణ వ్యవహారాలు, వినియోగదారుల క్లబ్బుల పనితీరును సమీక్షించటం.
- చౌకధరల దుకాణాల గురించిన విధి విధానాలను ప్రచారం చేసే అంశాన్ని సమీక్షించటం.
- పంచాయతీ రాజ్ సంస్థలలో ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధులకు, చౌకధరల దుకాణం వలన లబ్ధిపొందే లబ్ధిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు ప్రక్రియ ఏవిధంగా వుంది? ఇందుపై నిఘా వ్యవస్థ ఎంత వరకు వుంది? అనే అంశాల గురించి అవగాహన కల్పించటం.
- గ్రామ సభల యందు, మండల ప్రజాపరిషత్‌ల సమావేశాలలో ఆహార సలహా సంఘానికి సంబంధించి తీర్మానించబడిన అంశాలను గురించి ఆహార సలహా సంఘంలో సమీక్షించటానికి సంబంధిత అంశాలపైన తీసుకొన్న చర్యల వివరాలు సేకరించటం.
- ఆహార ధాన్యాలు, వంట నూనెలను, కిరోసిన్ కేటాయింపుల సమాచారాన్ని సంబంధిత సంస్థల నుండి సేకరించడం.

- ఆహార సలహా సంఘ సభ్యులు ఏదైనా చౌకధరల దుకాణాల కిరోసిన్ షాపులను తనిఖీ చేసి ఉన్నట్లయితే సంబంధిత అధికారులు ఎంత మేరకు చర్యలు గైకొన్నారో సమీక్షించటం.
- చౌకధరల దుకాణంలో టోకుధరల దుకాణం ఆవరణలో కిరోసిన్‌ను దించేటప్పుడు కొంతమంది ఆహార సలహా సంఘ సభ్యులు ఆయా దుకాణాల వద్ద వుండేటట్లు చర్యలు చేపట్టడం.
- చైర్‌పర్సన్ అనుమతితో మరేదైనా ఇతర అంశాలను చర్చించటం.

## ధరల నియంత్రణ కమిటీ

ప్రస్తుత నిత్యావసర వస్తువుల ధరల పరిస్థితిని సమీక్షించి పౌరసరఫరాల పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా ముందుకు తీసుకపోవటానికి ఈ ఆహార సలహా సంఘంలో జిల్లా స్థాయిలో 12 మందితో, మండల స్థాయిలో 8 మందితో, 'ధరల నియంత్రణ కమిటీ'గా పిలవబడే ఈ సబ్‌కమిటిని ఏ ర్పాటు చేస్తూ ప్రభుత్వం తేది: 26-08-2009న జి.ఓ.యం.యస్. నెం. 47 ను వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ ద్వారా జారీచేసింది. పై ఉత్తర్వుల మేరకు ఏర్పాటయిన జిల్లా స్థాయి, మండల స్థాయి సబ్‌కమిటీలు వారం వారం సమావేశమై నిత్యావసర వస్తువుల ల భ్యత, ఓపెన్ మార్కెట్టు నందు ప్రస్తుత ధరల పరిస్థితి, ధరల పెరుగుదలకు గల కారణాలు సమీక్షించి ధరలు అదుపు చేయటానికి 'ధరల నియంత్రణ కమిటి' తగు చర్యలు తీసుకొంటుంది.

### ఎ. ధరల నియంత్రణ కమిటీ విధులు, బాధ్యతలు :

- మార్కెట్టులో ప్రస్తుతం అమలులో ఉన్న నిత్యావసర వస్తువుల ధరల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి ధరల తగ్గుదలకు తగిన చర్యలు చేపట్టడం.
- వ్యాపారస్తులు నిత్యావసర వస్తువులను దాచి పెట్టడం, నల్లబజారుకు తరలించడం, సరకులను అత్యధిక లాభాల కోసం డీలర్లు అధిక ధరలకు విక్రయించడం వంటి అంశాలు సంబంధిత అధికారులకు తెలియపరచి వారి ద్వారా ధరల నియంత్రణకై తగు చర్యలు చేపట్టడం.
- అవసరమైన సందర్భంలో కొంతమంది ఇతర సభ్యులను ప్రత్యేక ఆహ్వానితులుగా 'ధరల నియంత్రణ కమిటి' సమావేశాలకు పిలిపించటం.
- 'ధరల నియంత్రణ' కమిటీతో సమీక్షించిన అంశాలు, తీసుకొన్న చర్యల ను 'ఆహార సలహా సంఘం' లో ఉంచటం.
- 'ధరల నియంత్రణ కమిటి' నుండి వచ్చిన సూచనలు, సలహాలను పౌరసరఫరాల శాఖ కమీషనర్, ప్రభుత్వ కార్యదర్శికి తదుపరి చర్యలు తీసికొనే నిమిత్తం నివేదికలు పంపించటం.

### బి. జిల్లా స్థాయి ధరల నియంత్రణ కమిటీ నిర్మాణం

- జిల్లా కలెక్టరు / సంయుక్త కలెక్టరు- ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.
- జిల్లా పౌరసరఫరాల అధికారి-కన్వీనరుగా వుంటారు.
- సంయుక్త / ఉప -సంచాలకులు, ఉద్యానవనాలు - మెంబరు
- వాణిజ్య పన్నుల అధికారి-మెంబరు
- మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టరు-మెంబరు
- స్వచ్ఛంధ వినియోగదారుల సంఘంలో ఒక ప్రతినిధి- మెంబరు
- వ్యవసాయదారుల సంఘంలో ఒక ప్రతినిధి-మెంబరు
- ప్రసారసాధనాల నుండి ఒక ప్రతినిధి-మెంబరు
- ఉత్పత్తిదారులు / మిల్లర్ల నుండి ఒక ప్రతినిధి - మెంబరు
- ఆహారధాన్యాలు, పప్పుధాన్యాల టోకు వ్యాపారస్తుల నుండి ఒక ప్రతినిధి-మెంబరు
- ఆహార ధాన్యాలు, పప్పుధాన్యాలు, చక్కెర చిల్లర వ్యాపారస్తుల నుండి ఒక ప్రతినిధి - మెంబరు
- పరిస్థితుల అవసరాన్ని బట్టి వివిధ సరుకుల వ్యాపారుల నుండి ప్రతినిధి-మెంబరు

### బి. మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీ నిర్మాణం

- మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు- ఛైర్మన్
- సంబంధిత మండల తహసీల్దారు- చైర్మన్
- స్వచ్ఛంద వినియోగదారుల సంఘం నుండి ఒక ప్రతినిధి- మెంబరు
- మండల ఉద్యానవన శాఖాధికారి / మండల వ్యవసాయ శాఖాధికారి- మెంబరు
- వ్యవసాయదారుల సంఘం నుండి ఒక ప్రతినిధి - మెంబరు
- చౌక ధరల దుకాణాల అసోసియేషన్ నుండి ఒక ప్రతినిధి- మెంబరు

పౌరసరఫరాల విభాగాలలో స్థానిక సంస్థలలో ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులకు సముచిత స్థానాన్ని కల్పిస్తూ అధికార వికేంద్రీకరణ దిశగా నిత్యావసర సరకులు విక్రయించే చౌకధరల దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచటానికి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండల, గ్రామ పంచాయతీ స్థాయిలలో అత్యధిక మంది సభ్యులతో కూడిన ఆహార సలహా సంఘాన్ని ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రతి నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించటానికి జిల్లా స్థాయి, మండల స్థాయి, 'ధరల నియంత్రణ' కమిటీలు కూడా ఆహార సలహా సంఘంలో భాగమై ధరలను అదుపుచేయటమే కాకుండా, పౌరులకు న్యాయబద్ధమైన సేవలు అందించటానికి ఈ కమిటీలు తోడ్పడతాయి. కాబట్టి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల, జిల్లా స్థాయి ఆహార సలహా సంఘాలలో పౌరసరఫరాల వ్యవస్థ పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించి చౌకధరల దుకాణాల డీలర్లు పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయటానికి వారికి తగిన సూచనలు, సలహాలను అందించి సంబంధిత అధికారుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీలో మరిన్ని సేవలు అందించటానికి ఈ ఆహార సలహా సంఘాలు ఎంతో తోడ్పడతాయి. స్థానిక సంస్థలలోని ప్రజా ప్రతినిధులు ఈ ఆహార సల హా సంఘం సమావేశాలలో చురుకైన పాత్రను పోషించి పౌరసరఫరాల వ్యవస్థను ప్రజల ముంగిటకు తీసికొనివెళ్ళి, వారికి సముచితమైన సేవలు అందించటానికి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలి.

*డా॥ పి.వి. శేషారెడ్డి, యం.ఎ.,యం.ఫిల్., పి. హెచ్.,డి.*
*డివిజనల్ పంచాయతీ అధికారి, చిత్తూరు*

# అనువాద మోదం

*జాతీయ పుస్తక సంస్థవారి ఆదానప్రదాన కార్యక్రమంలో అనేక యితర ప్రాంతీయ భాషల్లోని కథలు తెలుగులోకి వచ్చాయి. హిందీ, బెంగాలీ భాషల్లోని కథలు కొన్ని ఇదివరకే తెలుగులోకి వచ్చినా, అన్ని ప్రాంతాల కథలూ విరివిగా ఇప్పుడిప్పుడే తెలుగులోకి వస్తున్నాయి.*

*ఏ భాషలోనుంచి వచ్చినా ప్రాంతీయ వాసనలు, వాతావరణం కన్పిస్తూనే వుంటుంది. వేర్వేరు భాషల నుంచి అనువదింప బడినపుడు కథల నడకలు ఎలా వుంటాయి.*

*- అనేది పేరడీ అంశం.*

## ఆంధ్ర మహాకృష్ణుడు

**పదహారణాల తెలుగు రచయిత, మల్లాది రామకృష్ణశాస్త్రి గారి శైలితో ప్రారంభిస్తున్నాను.**



"స్వామిశాస్త్రీ! యింకా తావళం దగ్గరే వున్నావుషోయ్?" తాంబూలం నవుల్తూ చేసంచీతో వంటింటి గుమ్మంలో అగాడు అవధాని.

"మా పాలేరు గుమ్మడిపండుని గుమ్మంలో దొర్లించి వెళ్ళాడేమో ననుకున్నాను. నువ్వుటోయ్ అవధానీ లోపలికి రా!" అర సున్నాలాగా వోరగా చూశాడు స్వామిశాస్త్రి.

"నువ్వు లేవూ–ఊడగొట్టిన నాగటిదుంపలాగా. ఈ చమత్కారాలకేం గాని తొందరగా ఆవుపోసన పడుదూ"

"కూర్చో అన్నయ్యా" అంటూ కామేశ్వరమ్మ గోడవార పీటతీసి వాల్చింది. తావళం బొట్టుపెట్టి –హరివేణం వుద్దరిణ సర్దుబాటు చేశాడు. ధోవలీముడి వొదులుచేసి ఆసనశుద్ధిగా కూర్చున్నాడు స్వామిశాస్త్రి.

"ఇవ్వాళ మీ చెల్లెలు మెట్ట గోంగూర పులం వెట్టింది పప్పులో కలగలిపి. రవ్వంత వెన్న నాలిక్కి రాసుకుంటే మాంఛి వనరుగా వుంటుంది. ఓ పట్టు పట్టరాదూ?"

"ఆ అదొక్కటే తక్కువ. శాస్త్రులూ! కోర్టు వ్యవహారమంటే గోంగూర కాదు. అబ్దికాలన్నా అగుతాయేమోగాని కచ్చేరీలో వాయిదాలు ఆగవు."




"జడ్జిగారైతే మాత్రం చెయ్యి తిప్పకుండా యెట్లా జరుగుతుందిష? మీరు నిదానంగానే కూర్చోండి"

అంటూ కామేశ్వరమ్మ వుసిరికాయంత వెన్న మారు వడ్డించి నాలుగు అన్నం మెతుకులు కప్పి మరీ వెళ్ళింది లౌక్యంగా.

"అయినా నిన్నని ఫాయిదా యేముందిలే. భోజనం మీద నీకింత ప్రీతే లేకపోతే ఆనాడు చివుకుల వారింటో వారమూ నిలిచేది. పది పన్నాల వేదమూ అబ్బేది!" నిట్టూర్పుగా అన్నాడు అవధాని.

"ఇప్పుడేం పోయింది లెద్దూ!"

"ముష్టి అగ్రహారం పోయింది అంతేగా"

"కాలం వస్తే యేదీ ఆగదనుకో, తెల్లవాడికి రాజ్యం పోలా? అవధానీ! ఈ పోచుకోలు కబుర్లకేంగాని గోంగూరలో నాలుగు అనపకాయ ముక్కలు పడేస్తే దాని రుచి దానిదే! గోంగూరలో కాకరకాయ కూడా బాగానే పొసుగుతుంది గుర్తుంచుకో!"

"ఇవన్నీ నా కెందుకు.... ఆనక బోనెక్కి ఈ ముక్కలే జడ్జీగారికి చెప్పు"

☆

## హిందీ చందర్

**హిందీమూలం : కిషన్ చందర్**

**తెలుగు సేత : ఆరిగిపూడి రమేష్ చౌదరి**

"గంగారామ్?" గట్టిగా పిలిచాడు రమణీలాల్.

"లోపలికి వచ్చి చదర మీద కూర్చో అన్నయ్యా, గంగారామ్ రోటీ తింటున్నాడు" అంది మోతీ ఘూంఘట్ సవరించుకుంటూ.

రమణీలాల్ లోపలికి వచ్చి పద్మాసనం వేసుక్కూర్చున్నాడు. గంగారామ్ సూకారోటీలో ఉల్లిపాయ నంజుకుని తింటున్నాడు. గంగారామ్ కళ్ళలోని సంతృప్తి రమణీలాల్‌కి ఆశ్చర్యం కలిగించింది. ఏం లాభం. తనకీ ఖజానా వుంది...! ఇల్లుంది....! ఆ మాటకొస్తే తనకి లేనిదేముంది? మోతీ లాగా సూకా రొట్టెలు కాల్చి లోటాలో లస్సీ కలిపి యిచ్చే మనిషి యేది? నిజానికి యిల్లాలు లేని ఇల్లు దేముడు లేని దేవళంలాగే వెల వెల బోతుంది. రమణీలాల్ ఆలోచనలకు అంతరాయం



కళ్లిస్తూ– "మనం కచ్చేరీ వేళకు వెళ్ళగలమా" అన్నాడు గంగారామ్.

"ఓ! నిక్షేపంగా, మన టాంగా గుర్రం కుంటిదికాదు భాయ్. అబలక్... రిక్కవేస్తే అరక్షణంలో కచ్చేరీముందు ఆగదూ" అన్నాడు రమణీలాల్.

☆

## తమిళాశిపన్

**తమిళ మూలం :** **అఖిలన్**

**తెలుగు సేత :** **డాక్టర్ చల్లారాధాకృష్ణశర్మ**

ఏళుమలైకి సోమరిపోతులంటే మహా చెడ్డ కోపం. ఏళుమలై తేనెటీగలా ఎప్పుడూ హడావిడిగా వుంటారు. కుంచితపాదం బద్ధకస్తుడే కాదు సరికదా తిండిపోతు కూడా. కుంచిత పాదానికి పాటుమీద కంటే సాపాటు మీద శ్రద్ధ ఎక్కువ. పచ్చని అరిటాకులో దండిగా తెల్లని అన్నం రాసిగా పెట్టించుకుని మధ్యలో సాంబారు పోయించుకోవాలి. అన్నంతో కట్టిన గురుగు నిండితే అప్పుడు యింక జుర్రుకోవడమే.

"ఈ తిండి మీద చూపించే శ్రద్ధ వ్యాపారం మీద నిలిపితే ఈ పాటికి కోటికి పడగెత్తేవాడివి" అన్నాడు ఏళుమలై వెండి పెట్టెలోంచి తమలపాకులు తీసి సున్నం రాస్తూ.



"నీవు ఆ తంబ నవలడం మానేస్తే ఈ పాటికి పెద్దదైన యిల్లు కట్టేవాడిని" అని గట్టిగా నవ్వాడు కుంచితపాదం.

వాళ్ళిద్దరూ సుగంధ ద్రవ్యాలు విదేశాలకు పంపే కంపెనీలకు భాగస్వాములు. అయితే వాళ్ళిద్దరికీ వ్యాపారంలోనే గాక యింకో వ్యవహారంలో కూడా వాటా వుంది. అది అందరికీ తెలియదనుకోండి. ఆ రహస్యాన్ని రహస్యంగానే వుంచిన ఖ్యాతి మాణిక్యమ్మాళ్‌కే చెందుతుంది.

☆

## కన్నడ త్రివేణి

**కన్నడ మూలం :** **త్రివేణి**

**తెలుగు అనువాదం :** **శర్వాణి**



కాఫీ తోటలు వచ్చాయంటే చిక్కమగుళూరు వచ్చినట్లే గుర్తు. గణ గణమని మెళ్ళో గంటల చప్పుడు చేసుకుంటూ వడివడిగా వరుగు తీస్తున్నాయి. ఎర్రబసప్ప. నల్ల బసప్ప, ఆ మైసూరు ఎద్దుల జత నంజుండయ్యకి కుడి కన్నూ, ఎడమ కన్నూలాంటివి, వాటిని యింకొకరు తోలడానికి అంగీకరించడు నంజుండయ్య. వాటిని కొరడాతో కొడ్తారేమోనని భయం, స్వయంగా తోలాలి, అవీ అంతే, అతని కనుసైగలో నడుచుకుంటాయి.

సూర్య భగవానుడు నడినెత్తికి చేరుకుంటున్నాడు. బండిని రోడ్డు పక్కకు తీసి చెట్టు నీడన ఆపాడు.

"అప్పుడే మన హళ్ళి వచ్చిందా?" అంటూ బండిలో కునుకు తీస్తున్న శివదేవయ్య ఆవలిస్తూ అడిగాడు.

"హళ్ళి రాలేదుకాని దాణాకి వేళ అయింది దిగు.... దిగు" అని శివదేవయ్యని హెచ్చరించాడు. బండి జల్లలోంచి వులవ గుగ్గిళ్ళ మూట తీసి రెండు భాగాలు చేసి బసప్పలకు దాణా అందించాడు.

"దేవయ్యా! మనం కూడా నాలుగు మెతుకులు నంజుదాం" అన్నాడు నంజుండయ్య.

☆

## పంజాబీ సింగ్

**పంజాబీ మూలం :** **కర్తార్ సింగా దుగ్గళ్**

**తెలుగు సేత :** **ఉషారాణి**

సుందర్ సింగ్ బందిపోటు దొంగ అయినా అతనికి హృదయం వుంది. "తప్పనిసరి అయితే యెవరినైనా వీపుమీద కొట్టు, పొట్టమీద మాత్రం కొట్టకు" తండ్రి మాటలు ఇప్పటికీ సుందర్ సింగ్ చెవుల్లో రింగుమంటూ వుంటాయ్.



మధ్యాహ్నపు యెండ కొండరాళ్ళను సైతం పగలగొట్టేలా వుంది. చేతులు వెనక్కు పెట్టుకుని గంభీరంగా కొండ వైపుకు నడుస్తున్న తన యజమాని సుందర్‌ని చూసి పెద్దగా సకిలించింది రజియా. రజియా నమ్మకమైన అశ్వం. దానిపై ఎక్కడకు వెళ్ళినా తిరుగు వుండదని డాకూ సుందర్ సింగ్ విశ్వాసం.

మొలసంచీ లోంచి రెండు వుడకబెట్టిన బంగళాదుంపలు తీసి, మిరియప్పొడి జల్లుకుని ఒక్కసారి వేసుకుని కడుపునిండా నీళ్ళు తాగాడు సుందర్.

"గోధుమల్ని గోతాల్లోకి యెక్కించండి. ఎవరక్కడ? ధాన్యలక్ష్మికి నిప్పు పెట్టమని యెవరు చెప్పారు మీకు?" నాలుగు అంగల్లో గోధుమ రాసి దగ్గరకు వచ్చాడు సుందర్ సింగ్. అనుచరులంతా శిలాప్రతిమల్లా నిలబడి పోయారు.

"బలదేవ్, నీకెన్నోసార్లు చెప్పాను. మీరు బతకండి.... ఇంకా నలుగుర్ని బ్రతికించండి, కాని యిలా తగలబెట్టకండి" సింహం గర్జించినట్లు, ఐరావతం ఘీంకరించినట్లు వుందా అరుపు.

గోధుమరాసి నల్లని మసికుప్పలా మారింది. బలదేవ్ చెంప చెళ్ళుమంది తల దించుకున్నాడు సుందర్‌సింగ్. అంతా నిశ్శబ్దం. ☆

## మళయాళ కురుప్

**మళయాళం మూలం : శంకర్ కురుప్**

**తెలుగు సేత : నరసింహారావు కె.వి.యస్.**

నేలలోంచి పుట్టుకొచ్చిన కుక్క గొడుగుల్లా వున్నాయి ఆ బెస్తవాళ్ళ గుడిసెలు. అంత దూరానికే ఎండు చేపల వాసన కొడ్తుంది. ఎండు చేపల్ని లారీల నిండా కొని పట్నంలో ఎక్కువ ధరకి అమ్ముకోవడం సలావుద్దీన్ వ్యాపారం.



బెస్తవారి కష్టాన్నీ, ప్రాణాలొడ్డి వాళ్ళు సముద్రంతో పోరాడి పట్టిన చేపల్ని సునాయాసంగా లారీలో తీసికెళ్ళి సొమ్ము చేసుకునే సలావుద్దీన్ లాంటి దళారిలంటే కురియకోస్‌కి చంపెయ్యాలన్నంత కోపం. చెనకమ్మ కురియకోస్ భార్య, లారీడ్రైవర్ తోమస్ మంచివాడులా కన్పిస్తాడు. అతను కూడా కురియకోస్ యింట్లోనే వుంటాడు.

అమావాస్య చీకటి. సముద్రం పోటుమీద వుంది. విరిగిన కెరటాల చప్పుళ్ళు బెస్తవాడలో కొలువు జరుగుతున్నట్లు వుంది. తలుపు కొట్టాడు సలావుద్దీన్. చెనకమ్మ తలుపు తీసింది.

"రొయ్యిపప్పు వేయించి పెట్టాలి వేగిరం" అన్నాడు సలావుద్దీన్. బాగా తాగిన మైకంలో వున్నాడు. చెనకమ్మ గుమ్మంలోనే నిలబడి వుంది.

"ఆవనూనెలో వేగిస్తే రుచిరుచిగా వుంటాయ్ చెనకమ్మా" అని మైకపు స్వరంతో తూలిపోతూ అంటున్నాడు సలావుద్దీన్. ☆

## బెంగాలీ బాబు

**బెంగాలీ మూలం : ఎస్. ఎస్. చటోపాధ్యాయ**

**తెలుగు సేత : అమరేంద్ర**



చందినీపూర్ సంస్థానంలో ముఖర్జీగారి మాటకు విలువ వుంది. ఆ వూరి సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడే కాళీమాత ఆలయానికి పూజారిగా వుండటం దివాణంలో అనాదిగా వస్తున్న ఆచారం. సురేంద్రుడు వయసులో చిన్నవాడైనా అటు సంస్కృత పాఠాలు చెప్పగలడు, ఇటు పూజారి విధానమూ తెలుసు. దివాణంలో కుదిరిన కొద్దిరోజులకే నలుగురి చేత మంచి అన్పించుకున్నాడు సురేంద్రుడు. యామినీదేవి అతనికి తగిన యిల్లాలు.

రోజూ వుదయమే కాళీమాతకు నైవేద్యం తీసుకుని వెళతాడు. వూరి వాళ్ళు తలా వొకరు రోజూ వొక భాగం అమ్మవారికి చేయించే అనవాయితీ చందినీపూర్‌లో వుంది. ఒకరోజు చక్రపొంగలి, మరోదినం దద్ధోజనం, యింకోరోజు పులగం యిట్లా జరిపిస్తూ వుండడం రివాజు. కోవెలలో పంచిపెట్టాక మిగిలిన ప్రసాదం యింటికి తెచ్చేవాడు సురేంద్రుడు. ఆ పూటకి వారిద్దరూ దాన్నే భోజనంగా సరిపెట్టుకునేవారు. ప్రసాదం రోజూ దివాణానికి వెండిపాత్రలో పంపేవాడు సురేంద్రుడు.

ఆ రోజు ముఖర్జీ గారి మాటలకు సురేంద్రుడు అప్రతిభుడై అలాగే నిలబడిపోయాడు.

(మూల రచయితల పేర్లు అనువాదకుల పేర్లు కేవలం సహజత్వం కోసం మాత్రమే పెట్టడం జరిగింది). ☆

**గ్రామాల అభ్యుదయమే- దేశాభ్యుదయం. భారతదేశంలోని గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి వ్యర్థ పదార్థాలు, అపరిశుభ్రత పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. పర్యావరణ సమతుల్యతకు, ప్రజారోగ్యానికి హాని కల్గిస్తున్న వ్యర్థ పదార్థాలను సరైన పద్ధతిలో నిర్మూలన, నిర్వహణ చేయాల్సిన అవసరం ఉంది.**




*వ్యర్థ పదార్థాలను రెండు రకాలుగా విభజించవచ్చును.*

**1. కుళ్ళే పదార్థాలు 2. కుళ్ళని పదార్థాలు**

భారతదేశంలోని పల్లెప్రజలు ఒక రోజుకు 15 వేలనుంచి 18 వేల మిలియన్ లీటర్ల వ్యర్థ ద్రవ పదార్థాలను, 0.3 నుంచి 0.4 మిలియన్ మెట్రిక్ టన్నుల వ్యర్థ ఘన పదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉత్పత్తి చేస్తున్న ద్రవ, ఘన వ్యర్థ పదార్థాలు, వాడి వదిలేసిన నీరు వల్ల అతి ప్రమాదకరమైన అతిసార, మలేరియా, డెంగ్యూ, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. నీరు కలుషితం కావడం వలన వ్యాప్తి చెందే వ్యాధులు 88 శాతం పరిశుభ్రత పాటించకపోవడం వలన వ్యాప్తి చెందుతున్నాయి. వ్యర్థ ద్రవ, ఘన పదార్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టినట్లయితే

# గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాల నిర్వహణ

త్రాగునీరు, పరిసరాలు కలుషితం కాకుండా ఉండి వ్యాధుల వ్యాప్తి తగ్గుతుంది.

### నీటి కాలుష్యం వలన జరిగే నష్టాలు

1 నుంచి 14 సంవత్సరాల మధ్య పిల్లల మరణాలకు కారణమవుతున్న అతి ప్రమాదకరమైన పది వ్యాధుల్లో ఐదు నీరు, అపరిశుభ్రతకు సంబంధించినవే.

* 1500 మంది పిల్లలు ప్రతిరోజు అతిసారవ్యాధుల వలన మరణిస్తున్నారని అంచనా.



* ప్రతి ఐదుగురి శిశువుల మరణాలు అపరిశుభ్రత, కలుషిత త్రాగునీరు వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల వల్ల సంభవిస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే-3 ప్రకారం శిశుమరణాల రేటు గ్రామీణ ప్రాంతాల్లో 68 శాతం నుంచి 57 శాతానికి తగ్గింది.
* నీటి ద్వారా వ్యాప్తి చెందుతున్న వ్యాధులు పిల్లల పోషకశక్తిని క్షీణింప చేస్తున్నాయి. దీనివలన పాఠశాలలకు పిల్లల హాజరు శాతం తగ్గుతుంది.
* ప్రపంచ వ్యాప్తంగా వివరాలు పరిశీలిస్తే, ప్రతి ఏటా నీటి కలుషితం ద్వారా అతిసార, కలరా వ్యాధులు వచ్చి మరణిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 90 శాతం మంది పిల్లలు అతిసారవ్యాధుల వలన మరణిస్తున్నారు.
* ప్రతి ఏటా మలేరియాతో 1.3 మిలియన్ మంది మరణిస్తున్నారు. అందులో 90 శాతం మంది పిల్లలే.
* 160 మిలియన్ మంది నీటి ద్వారా సంక్రమించే అంటువ్యాధితో బాధపడుతున్నారు. ఇది కేవలం అపరిశుభ్రత, కలుషితనీరు, వ్యర్థపదార్థాల వల్ల మాత్రమే వస్తుంది.
* 133 మిలియన్ మంది కామెర్లు వంటి నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులతో బాధపడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యర్థపదార్థాల నిర్మూలన-నిర్వహణ

ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు పెంపొందించడానికి వ్యర్థ

పదార్థాలను సురక్షితంగా తొలగించి పునరుత్పత్తి చేయాలి. వ్యర్థాల నిర్వహణ ద్వారా పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కల్గించకుండా చర్యలు తీసుకోవచ్చు.

వ్యర్థ పదార్థాల నిర్వహణ ద్వారా కుళ్ళిన పదార్థాలను సేకరించి ఎరువులుగా తయారు చేసి పొలాలకు ఉపయోగించుకొనవచ్చును. దీనివలన గ్రామాల్లో వ్యర్థ పదార్థాలు తొలగి వాటి ద్వారా మంచి ఎరువులను తయారు చేసుకొనవచ్చు.

వ్యర్థ పదార్థాల నిర్వహణను స్వల్ప శిక్షణ ద్వారా గ్రామపంచాయితీ స్వయంగా పై పటంలో చూపిన విధంగా చేపట్టవచ్చు.

వ్యర్థ పదార్థాల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత ఏర్పడుతుంది. పైపట్టికలో చూపిన వ్యర్థ పదార్థాల విభజన గురించి వివరంగా తెలుసుకుందాం:

**1. *పునర్ ఉత్పత్తి చేయకలిగేవి (Bio Degreadable) కుళ్ళే పదార్థాలు :*** వంటింటిలో వ్యర్థ పదార్థాలు, తోటలో మొక్కల ఆకులు, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ మొదలైనవి.

**2. *కుళ్ళని పదార్థాలు (Non Bio Degreadable) .*** ప్లాస్టిక్ కవర్లు, వస్త్రాలు, మెటల్ పదార్థాలు మొదలైనవి.

ఈ రెండు రకాల పదార్థాలను ప్రతి ఇంటికి రెండు రకాల చెత్తబుట్టలను/లేదా 2 సంచులను ఇవ్వాలి.. వేరువేరుగా సేకరించాలి. తడి, పొడి అని విడగొట్టి అందులో తడిపదార్థాలు అంటే కుళ్ళినవి ఎరువుగా మార్చడానికి ఒక ప్రదేశాన్ని కేటాయించాలి. అక్కడ ప్రత్యేకంగా వర్మీకంపోస్ట్ ఎరువులు తయారుచేసుకోవాలి.




**వ్యర్థ పదార్థాల నిర్వహణ**

**వ్యర్థ పదార్థాలను వేరుచేయడం**

- బయోడిగ్రేడబుల్ (కుళ్ళే పదార్థాలు)
  - గృహాల స్థాయిలో సేకరించిన పదార్థాలు
    - వర్మీకంపోస్ట్ ఎరువులు తయారు చేయవచ్చును
- నాన్ డిగ్రేడబుల్ (కుళ్ళని పదార్థాలు)
  - కుళ్ళని పదార్థాలు
    - పేపరు
    - వస్త్రాలు
    - ప్లాస్టిక్
    - గ్లాస్
    - మెటల్

## వ్యర్థ పదార్థాల నిర్మూలన

వ్యర్థ పదార్థాల నిర్వహణ ఇంటి నుంచే ప్రారంభిస్తే సత్ఫలితాలు ఉంటాయి. ప్రతి ఇంటికి ఎరుపు, ఆకుపచ్చ ప్లాస్టిక్ బుట్టలను చెత్త సేకరించడానికి సరఫరా చేయాలి. కుళ్ళే పదార్థాలు, కుళ్ళని పదార్థాల కోసం కేటాయించి ఆయా వ్యర్థాలను వేరుగా చెత్త డబ్బాల్లో వేయాలి.



ఎరుపు డబ్బాలో కుళ్ళేపదార్థాలు వేయాలి. ఉదా: కూరగాయ ముక్కలు, వంటింటి వ్యర్థాలు, తోటల్లో మొక్కలు, ఆకులు, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ తదితర వస్తువులను గ్రామం బయట ప్రత్యేకంగా తీసిన గోతిలో వేయాలి. ఇలా వేసిన పదార్థాలు కుళ్ళి ఎరువుగా మారతాయి. పై విధంగా ప్రయత్నం చేస్తే గ్రామాలలో పరిశుభ్రత ఏర్పడుతుంది. 'గ్రామాల పరిశుభ్రతే –ఆరోగ్యానికి భద్రత'. కావున పటిష్టవంతంగా, సమర్ధవంతంగా గ్రామాలలో చెత్తను ఎరువుగా తయారు చేసుకొనవచ్చును. ఆ ఎరువును తోటలకి ఉపయోగించుకొనవచ్చును.

'వ్యర్థంలోనే పరమార్థం ఉంది వ్యర్థంతో గ్రామపంచాయితీ ఆర్థికవనరులు పెంపొందించుకోవాలి'.

*– కె. కోటేశ్వరరావు, ఎం.పి.డి.వో., భీమడోలు మండలం*



# పర్యావరణ పరిరక్షణలో ప్రజలు, ప్రజా ప్రతినిధుల పాత్ర

**మానవుడి అత్యాశ భూగోళాన్ని మండిస్తోంది. విశ్వవ్యాప్తంగా పర్యావరణానికి పెనుముప్ప ముంచుకొస్తోంది. కాలుష్యం కోరలుచాచి మానవ మనుగడనే శాసిస్తోంది. ఋతువులు గతి తప్పుతున్నాయి. వర్షాకాలంలో ఎండలు, చలికాలంలో వరదలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి.**

ప్రపంచీకరణ ప్రైవేటీకరణ, ఆర్థిక సరళీకరణలు పర్యావరణ సమస్యను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. వీటి కారణంగా రోజుకు ఒక కొత్తవ్యాధి మానవాళిని వణికిస్తోంది. దీనికంతటికి కారణం ప్రజలు– ప్రజాప్రతినిధులు పర్యావరణాన్ని బొత్తిగా నిర్లక్ష్యం చేయడమే.

ప్రపంచ వ్యాప్తంగా క్షణానికి వెయ్యిటన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే 2016 నాటికి మంచుకొండలు కరిగి సముద్రమట్టాలు పెరగడంతో పాటు పెనుతుపాన్లు, విలయ సునామీలు మానవాళిని అతలాకుతలం చేస్తాయని పర్యావరణ నిపుణులు చెపుతున్నారు.

కొత్తగా మరో ముప్పు అణువిద్యుత్ కేంద్రాల స్థాపన. వీటి కారణంగా వందల కిలోమీటర్ల మేర భూమి ఎడారిగా మారే ప్రమాదం వుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విద్యుత్ వినియోగం పెరిగిన మాట వాస్తవం. దీనికి ప్రత్యమ్నాయంగా సౌరవిద్యుత్‌ని వినియోగించుకోవాలి. సూర్యుడు ఉన్నంతకాలం దీని ఉత్పత్తికి ఢోకాలేదు. చైనా, క్యూబా, నికరాగూవా దేశాలు సౌరవిద్యుత్ మీద పరిశోధనలు చేసి మంచి విజయాలు సాధించాయి.

ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ స్పృహ రోజురోజుకు పెరుగుతుండగా, భారత్ మాత్రం ఆ దిశగా ప్రాథమిక ఆలోచన కూడా చేయడంలేదు. ప్రకృతి సమతౌల్యాన్ని ప్రజాశ్రేయాన్ని పూర్తిగా పక్కనపెట్టి ఇక్కడి ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు వినాశ హేతువులవుతున్నాయి.

దేశంలో కొంతకాలంగా పెద్దయెత్తున చర్చనీయాంశ మవుతున్న ప్రత్యేక ఆర్థిక మండళ్లు మోసుకొస్తున్న చేటు అంతా ఇంతా కాదు. వీటివల్ల జనం నిరాశ్రయులయ్యే విషయాన్ని పక్కనపెడితే, అసలు జనం ఉనికే మృగ్యమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రకృతికి నిలువెత్తు సాక్షాలై నీడనిచ్చే అడవుల్ని అడ్డగోలుగా నరికేసి, సహజసంపద పునాదుల మీద అభివృద్ధి సౌధాలు నిర్మించాలనుకోవడం వినాశాన్ని కోరితెచ్చుకోవడమే. ప్రజాజీవనంలో వస్తున్న మార్పులు సమస్యలను తీవ్రం చేస్తున్నాయి. అవసరానికి మించిన వాహనవినియోగం వాయుకాలుష్యానికి మూల కారణమవుతోంది. ప్రస్తుతానికి దేశంలో వాయుకాలుష్యం 14 శాతం

అయినప్పటికీ అది మరింత పెరిగే ప్రమాదం వుందని పర్యావరణవేత్తలు అంచనా వేస్తున్నారు. పారిశ్రామిక కాలుష్యానిది మరో తరహా కాలుష్యం. దేశకాలుష్యంలో దీని వాటా సుమారు 17 శాతం.

మానవాళి సురక్షిత జీవనానికి కారణమవుతున్న ఓజోన్ పొర కాలుష్యం పెరిగి క్రమేణా పలుచబడటం ఆందోళన కలిగిస్తున్న మరో పరిణామం. ఓజోన్ పొరకు అధికనష్టం కలిగిస్తోంది అభివృద్ధి చెందిన దేశాలు కాగా, దుష్ఫలితాలు ఎదుర్కొంటోంది మాత్రం ప్రధానంగా వెనుకబడిన దేశాలే. భూవాతావరణం అనూహ్యంగా వేడెక్కడం వల్ల వర్షపాతంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. హిమపర్వతాలు, ధ్రువాల వద్ద క్రమేణా మంచు కరగడం వల్ల సముద్రాల నీటి మట్టం పెరుగుతోంది.



ఉదాహరణకు, హిమాలయాల్లోని మంచుకొండలు ఏడాదికి 10 నుండి 15 మీటర్లమేర కరిగిపోతున్నాయి. ఫలితంగా గంగవంటి జీవనదుల్లో నీటి ప్రవాహం తగ్గుతున్నట్లు పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. లక్షల ఎకరాల పంట భూములకు సాగునీటి సమస్య తలెత్తుతోంది. సముద్రమట్టాలు విపరీతంగా పెరగడం వల్ల వాయుగుండాలు, తుపానులు, ఉప్పెనలు వంటివి సరేసరి. సముద్ర వాతావరణంలో మార్పుల కారణంగా అక్కడి అరుదైన జీవరాశులు, మత్స్యసంపద కనుమరుగయ్యే ప్రమాదం తోసిపుచ్చలేనిది. దేశంలో సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కోట్ల సంఖ్యలోని ప్రజలు ఉపాధి కోల్పోయే పరిస్థితి తలెత్తుతోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న విపరీత మార్పుల వలన దేశంలో సేద్యరంగం కుదేలవుతోంది.

ఆహారభద్రతపై ఇది ప్రతికూల ప్రభావం కనపరుస్తోంది. ఉత్పత్తులు పడిపోవడం వల్ల బియ్యం, కందిపప్పు ధరలు ఇప్పటికే ఆకాశానికి అంటుతున్నాయి. ఇది ఆరంభం మాత్రమే. పరిస్థితి మరింత విషమించే సూచనలు ఉన్నాయి. వాహనవినియోగం విపరీతంగా పెరిగినందు వలన రహదారుల్ని విస్తరించే పనిలో మహావృక్షాల్ని తెగనరుకుతున్నారు. వృక్షసంపద నాశనం చేయడం వల్ల వాతావరణ సమతౌల్యం దెబ్బతిని ప్రాణవాయువుకు కొరత ఏర్పడే ముప్పు ముందుంది.

ప్రజలు- ప్రజాప్రతినిధులు ఇకమీదట తమ ప్రాంతాలలో నెలకొల్పబోయే పరిశ్రమల వలన ఆ ప్రాంతానికి ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయం తెలుసుకొన్న మీదటే ఆర్థిక మండళ్లకు అనుమతి ఇవ్వాలి.

ప్రజాభిప్రాయం తెలుసుకొన్న మీదటే ప్రభుత్వాలు ప్రతిగా ఆర్థిక మండళ్లకు స్వాగతించాలి. అంతేగాని వ్యక్తుల కోసం, సంస్థల కోసం ప్రజల జీవనవిధానాన్ని పణంగా పెట్టరాదు. సామాజిక సంస్థలు, గ్రామపంచాయతీలు ప్రజలకు పర్యావరణం మీద అవగాహన కల్పించాలి. ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి. పిల్లలకు ప్రాథమిక తరగతి నుంచే పర్యావరణం మీద అవగాహన కల్పించాలి. అంతేకాని ప్రజల గొంతునులిమి బంగారు పంటలు పండే భూములను రైతులనుండి సేకరించి ప్రత్యేక ఆర్థికమండళ్లు ఏర్పాటు చేయడం తగదు. ప్రజల ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా ప్రజాప్రభుత్వాలు పనిచేయాలి.



**– ఎ.వి.సురేష్ కుమార్**
*జిల్లా శిక్షణా మేనేజరు, శిక్షణా విభాగము,*
*జిల్లా ప్రజాపరిషత్, కడప.*
*సెల్ నెంబరు :92471 74968*



# 'చెంచు మల్లన్న' చరిత్ర

**నల్లమల అడవుల్లోని చెంచులు కొద్దికాలం క్రితం వరకు అడవికి రాజులు. మహోన్నత చరిత్ర కలవారు. శ్రీశైలం అడవుల్లో నివశించే వీరికి, శ్రీశైలంలోని మల్లిఖార్జునితో పాటు అంతటి చరిత్ర ఉందని చాలామందికి తెలియదు. సాంకేతికంగా మాత్రం ఇంకా పురాతన సంస్కృతి (ఆహారం సేకరించడం, వేటాడటం) కలిగి ఉండడం వల్ల ప్రస్తుత పరిస్థితిలో చాలా వెనుకబడి ఉన్నారు.**

1991 జనాభా లెక్కల ప్రకారం మొత్తం మీద 40,869. అందులోను ఇంకా తక్కువ మంది (30వేలు ఉంటారేమో) కారడవిలో ఉంటారు. వారి సంస్కృతిలో కూడా భేదాలు చాలా ఉన్నాయి. చెంచులలో అడవి చెంచులు, ఊరచెంచులు అనే రెండు రకాల వారు ఉంటారు. అడవి చెంచులనే కొండ చెంచులు అని కూడా అంటారు. వీరు ఇంచుమించు అందరు నల్లమల అడవులలోనే ఉంటారు. అయితే ఊర చెంచులు మైదానం ప్రాంతం గ్రామాలలో మాత్రమే ఉంటారు. ఇంచుమించు అన్ని జిల్లాల్లో ఉంటారు. వీరిలో బొంత చెంచులు, కృష్ణ చెంచులు అనేవారు కూడా ఉన్నారు. నెల్లూరు, ప్రకాశం చిత్తూరు జిల్లాల్లో ఏనాదులు అనే గిరిజన జాతి ఉంది. వారి ఇండ్లు, పోలికలు చెంచుల లాగే ఉంటాయి. వెన్నెలకంటి రాఘవయ్య గారైతే చెంచులు కొండదిగి యానాదులు అయ్యారు అన్నారు. అయితే మన పరిశోధనాంశం- అడవి చెంచులే.

కృష్ణానదికి ఇరువైపులా, నల్లమల అడవులలో నివాసం వీరిది. ఈ ప్రాంతం ప్రస్తుతం మహబూబ్‌నగర్, కర్నూల్, ప్రకాశం, గుంటూరు ప్రధానంగా జిల్లాలకు విస్తరించి ఉంది. కొంతమంది నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో కూడా ఉన్నారు. ఆరు జిల్లాలకు విస్తరించి ఉన్నారని చాల పెద్ద గిరిజన ప్రాంతం అనుకోవద్దు. ప్రతి జిల్లాలోను ఒక మూల ఉన్నారు. ఈ మూలలన్నీ కలిపితే చెంచుప్రాంతం అవుతుంది. ప్రతి జిల్లాలో ఒక మూల ఉంది కాబట్టి, ఆ జిల్లా అధికారులందరికీ ఈ ప్రాంతం అంటే అలుసే. వ్యాపారులందరికీ కూడా లోకువే.

చెంచుల ప్రాచీన చరిత్రపై ఉన్నన్ని ఆధారాలు మిగిలిన ఏ గిరిజన జాతిలోను నాకు దొరకలేదు. కొంత చరిత్ర పూర్వ విశేషాలు కూడా ఈ ప్రాంతంలో శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. చెంచుల కుటుంబ గాథలు, శ్రీశైలం స్థల పురాణం, గుడి ప్రాకారాల మీద బొమ్మలు, పాల్కురికి సోమనాథుని రచనలు, 1694 లో ఫరిష్టా ఇచ్చిన వివరాలు, నిజాం ప్రభుత్వ అధికారులు వివిధ జనాభా లెక్కల సందర్భాల్లో రాసిన వివరాలు, 1943లో హెమండార్ఫ్ గారు చెంచులపై రాసిన పుస్తకం, శ్రీశైలం లోని తెలుగు విశ్వవిద్యాలయ పరిశోధనలు, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థలో రీసెర్చి ఆఫీసరుగా పనిచేసిన కీ.శే. రమణారావు గారి పరిశోధనలు, ప్రొ. భౌమిక్, కలకత్తా విశ్వవిద్యాలయం గారి పుస్తకం, నా పరిశోధనలను కలిపి ఇందులో క్లుప్తంగా పొందుపరిచాను.

ప్రకాశం జిల్లా దోర్నాల నుండి కాని, ఎర్రగొండపాలెం కాని, మహబూబ్ నగర్ జిల్లాలో అచ్చంపేట నుండి కాని, కర్నూలు జిల్లాలో నంద్యాల నుండి కాని, ఆత్మకూరు నుండికాని అడవి లోకి ప్రవేశించేసరికి సామాన్యంగా ఎదురుబడే సన్నివేశాలు కొన్ని వున్నాయి. చేతిలో విల్లంబులు, పెద్దకత్తి, భుజంమీద గొడ్డలి, వీపుమీద బుట్టతో ముందు నడుస్తున్న భర్త, ఆ వెనుక చంకలో లేక కొంగు మడతల్లో పిల్లాడు, ప్రక్కన నడుస్తూన్న చిన్న పిల్లాడు లేదా పిల్ల, నెత్తిమీద బుట్టలో ఆహారం, నీళ్ళ సీసాతో నడుస్తున్న భార్య ఆవెనక కాపలాగా రేచు కుక్క ఎదురుబడ్డారు. ఇలాంటి చిన్న కుటుంబాలు అడవిలో తిరుగుతూ అన్ని చోట్ల కనిపిస్తూనే ఉంటారు. వీరివి చిన్న కుటుంబాలు. సంచార జీవులు.

అంత పొడవు, పొట్టి కాని ఎత్తు (155 నుండి 163 సెంటీమీటర్లు) ఉండి, సన్నంగా ఉంటారు. నలుపు, కాఫీ పొడి రంగు మధ్యలో చర్మం రంగు, నల్లటి కళ్ళు, సామాన్యంగా ఉంగరాల జుట్టుతో ఉంటారు. వీరు ఆస్ట్రలాయిడ్ జాతికి చెందిన వారని గుహా గారు

**కృష్ణానదికి ఇరువైపులా, నల్లమల అడవులలో నివాసం వీరిది. ఈ ప్రాంతం మహబూబ్‌నగర్, కర్నూల్, ప్రకాశం గుంటూరు జిల్లాలలో విస్తరించి ఉంది. కొంతమంది నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో కూడా ఉన్నారు.**

చెబుతూ, నీగ్రిటో లక్షణాలు మరుగున ఉండి అప్పుడప్పుడు బయటకు కనిపిస్తూ ఉంటాయి అన్నారు. మంచి కండలు కలిగిన చెంచులను ఎప్పుడూ చూడలేదన్నారు హెమండార్ఫ్‌గారు (1943). నాకు కూడా ఎప్పుడూ బక్కప్రాణాలే తారసపడ్డారు. అందుకనే ఆరోగ్యవంతులు, అనారోగ్యవంతులను మొదటిసారి చూడగానే విడిగా పోల్చుకోలేము.

## చెంచుమల్లన్న - మల్లిఖార్జునుడు

మల్లన్న అన్న పదానికి మల + అన్న అనే అర్థం తీస్తారు చాలామంది శాస్త్రకారులు. మల అంటే కొండ, అన్న అనేది ఈ ప్రాంతంలో పెద్దలను గౌరవప్రదంగా పిలిచే పదం. కొండమీద ఉన్న అన్న కాబట్టి మల్లన్న. మల్లన్న అనేది మల్లిఖార్జునుకి అసలు పేరని చాలా మంది నమ్మకం. లింగమయ్య, భగవంతుడు అనే పదాలు కూడా వాడతారు చెంచులు. అయితే చెంచులకు, మల్లన్నకు ఏమిటి సంబంధం? మల్లన్న మల్లిఖార్జునుడు ఎప్పుడు అయ్యాడు? అనేవి రెండు మంచి ప్రశ్నలు

శ్రీశైలం గుడికి వెళితే అక్కడ కొన్ని వివరాలు దొరికాయి. ప్రాకారాల మీద వేటగాళ్ళ బొమ్మలు చాలా చెక్కబడి వున్నాయి. శ్రీశైలం లోని తెలుగు విశ్వవిద్యాలయంలో 1988-89లో చరిత్ర పూర్వ విభాగం ఆచార్యులు తిమ్మారెడ్డి గారిని అడిగితే ఆ బొమ్మలు చెంచుల సంస్కృతికి పురాతన చిహ్నాలనీ, వారి శిష్యుడు ఒకరు వీటిమీద పరిశోధన చేశాడని చెప్పారు. అంటే గుడికి చెంచులకు చాలా సంబంధం ఉందని ఒక ఆధారం దొరికింది. మరో విశేషం ఏమిటంటే, ఇది కారడవి. ఐదు దశాబ్దాల క్రితం వరకు యాత్రికులందరూ కాలినడకమీదే వచ్చేవారు చెంచులు మాత్రమే అడవిలో ఉండేవారు. అడవి మధ్యన, ముఖ్యంగా ఎండాకాలంలో, పశువులు మేపుకునేందుకు గొల్లలు, లంబాడీలు వచ్చేవారు. తరువాత మైదానప్రాంతంలో గడ్డి దొరకటం ప్రారంభం కాగానే తిరిగి వెళ్ళిపోయేవారు. మళ్ళీ వచ్చేది ఎండాకాలంలోనే.

శ్రీశైలం గుడి ప్రాకారంలో ఒక చిన్న గుడి ఉంది. దాంట్లో ఉండేది చిన్న రాయి మాత్రమే. చెంచువారి దేవుళ్ళ రూపాలు రాళ్ళు లాగే ఉంటాయి. బొమ్మలు లాగ ఉండవు. అయితే ఈ చిన్న గుడిని వృద్ధ మల్లిఖార్జునుడి గుడి అని పిలుస్తారు. చెంచులు పూర్వకాలం పూజించిన మల్లన్న ఇదేనా? అనేది చర్చనీయాంశం.

వృద్ధ మల్లికార్జనుడు చెంచుమల్లన్నే అని నమ్మితే, కొత్త మల్లిఖార్జునుడు ఎప్పుడు వచ్చేడు? ఎందుకు వచ్చేడు? అనేది అనుబంధ చర్చనీయాంశం. కొత్త మల్లిఖార్జునుడు ఎప్పుడు ఆవిర్భవించాడు అనేది చెప్పటం కష్టం. ఎందుకంటే ఆయన కూడా స్వయంభూదేవుడు అంటారు. అక్కడ నేను విన్న కథలలో ఒక ఆధారం దొరికింది.

వృద్ధ మల్లిఖార్జునికి వృద్ధాప్యం వల్ల చెముడు వచ్చిందట. అందువల్ల భక్తుల విన్నపాలు వినబడలేదట. వారి కోర్కెలను నెరవేర్చలేకపోయే వాడట. క్రమంగా భక్తుల సంఖ్య తగ్గటం మొదలైంది. యువ మల్లిఖార్జునుడి అవసరం వచ్చింది. ఈ క్రొత్త మల్లిఖార్జునుడి రూపం శివలింగం. వృద్ధ మల్లిఖార్జున రూపం పగిలిన బండరాయి. అందువల్ల వృద్ధ మల్లిఖార్జునుడు చెంచుమల్లన్న అని నా నమ్మకం.

**పూర్వకాలంలో శ్రీశైలం గుడికి సంబంధించిన ఆస్తులు, ప్రత్యేకంగా అమ్మవారి ఆభరణాలు నంద్యాలలో దాచేవారట. పండగరోజుల్లో శ్రీశైలంకు తీసుకువచ్చేటప్పుడు, ఆ తరువాత తిరిగి తీసుకువెళ్ళేటప్పుడు దారిపొడుగునా చెంచులు కాపలా కాసేవారట.**

చారిత్రక, సామాజిక ఆధారాలు కూడా దీన్ని సమర్థిస్తున్నాయి.

కొత్త మల్లిఖార్జునునితో లింగాయత్ పూజారులు వచ్చారు. వారి సాంస్కృతిక ఆచార వ్యవహారాలకు చెంచుల పురాతన, పూజావిధానాలకు సరిపడదు. శైవ పూజారులు నిష్ఠులు. చెంచులేమో ఇప్పసారా తాగి పూజ చేసేవారు. పశువులు బలి ఇచ్చేవారు. పాల్కురికి సోమనాథుని రచనల్లో చెంచులు శ్రీశైలంలో 24 రకాల సేవలు చేసేవారని రాస్తూ, ఆసేవల గురించి వివరాలు కూడా తెలిపారు. అటువంటి చెంచులు ఇప్పుడు గుడి ముందర బిచ్చగాళ్ళుగా ఉన్నారు.

రోడ్లు, బస్సులు రాకముందు శ్రీశైలం గుడికి వెళ్లేందుకు, అందరిదీ కాలినడకే. ఇప్పటికీ చాలా మంది యాత్రికులు నడిచే వస్తారు. శ్రీశైలం చేరేందుకు నాలుగు కాలిబాటలు ఉన్నాయి. రెండు బాటలు మహబూబ్ నగర్ జిల్లా నుంచి ఉంటే, మూడవ బాట ప్రకాశం జిల్లా నుండి, నాలుగవ బాట కర్నూలు జిల్లా నుండి ఉంది. కాలి బాటల గుండా కొండలు, అడవులు, కొండవాగులు దాటుకుంటూ క్రూర మృగాలను తప్పించుకుంటూ ప్రయాణం చేయాలి. ఎంత తొందరగా నడచినా, రాను పోను నాలుగు రోజులు నడక ఉంటుంది. అంటే రెండు మూడు రోజులు అడవిలో నిద్రించాలి. క్రూరజంతువుల బారినుండి రక్షణ పొందాలి. అందువల్ల యాత్రికులు చెంచువారి సహాయం తీసుకుంటారు. చెంచువారు కూడా ఈ పనిని మల్లన్న సేవలో భాగంగానే భావిస్తారు.

ఒక చెంచు పెంట నుండి, మరోపెంట వరకు సాయం వెళ్ళి అక్కడి చెంచులకు వారిని అప్పగించి తిరిగి వచ్చేవారు. ఆ పెంట (ఊరు) వారు మరో పెంటకు యాత్రికులను ఇలాగే చేర్చేవారు. ఓపికలేని వాళ్ళని, ముసలివాళ్ళని డోలీలలో చేర్చేవారు. ఇలాగ యాత్ర పూర్తి అయ్యేది. యాత్రికులు ఇచ్చిన డబ్బులు (ఒక్కొక్క యాత్రికునకు ఒక అణా-మెట్ట ఉండేది). తిండిపదార్థాలు తీసుకుని జీవనం గడిపేవారు. ఇదికూడా ఈ దారులలో నివశించే చెంచులకు, అందులో దసరా, శివరాత్రి సందర్భాలలోనే ఎక్కువ పని ఉంటుంది. మిగిలిన కాలాలలో అడవే ఆధారం. శ్రీశైలం విద్యుత్ ప్రాజెక్టు సౌకర్యార్థం గుడి యాత్రికుల సౌకర్యార్థం, కర్నూలు వైపు నుండి (ఆత్మకూరు, దోర్నాల మీదుగా) ఒక రోడ్డు, మహబూబ్ నగర్ నుండి (అచ్చంపేట ద్వారా) రోడ్లు పడ్డాయి. బస్సులు బాగా వచ్చాయి. కాలినడకపై వెళ్ళే యాత్రికులు తగ్గిపోయారు. దాంతో చెంచుల ఆదాయం పడిపోయింది. ఆకలి వేసినప్పుడు దారిదోపిడీకి దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

పూర్వకాలంలో శ్రీశైలం గుడికి సంబంధించిన ఆస్తులు, ప్రత్యేకంగా అమ్మవారి ఆభరణాలు నంద్యాలలో దాచేవారట. పండగరోజుల్లో శ్రీశైలంకు తీసుకువచ్చేటప్పుడు, ఆ తరువాత తిరిగి తీసుకువెళ్ళేటప్పుడు దారిపొడుగునా చెంచులు కాపలా కాసేవారట. ఒకసారి శ్రీశైలంలో ఈ ఆస్తులు దొంగతనం జరిగితే మొదటగా చెంచులను

అనుమానించారని, చివరకు ఆ దొంగసొమ్ము నంద్యాలలో ఒక షావుకారు దగ్గర దొరికిందని ప్రముఖ చరిత్రకారులు ప్రొ. హనుమంతరావు గారు నాతో చెప్పారు. తరువాత నాకు తెలిసిన సంఘటనకు నేను ప్రత్యక్ష సాక్షి. ఆకలిబాధ తాళలేక చిలకచెర్ల ఆశ్రమ పాఠశాల నుండి నాలుగు బస్తాల బియ్యం ఆ ప్రాంతపు చెంచులు ఇరవైమంది కలసి ఎత్తుకు పోయారు. అయితే ఇదే అదను అనుకుని హాస్టల్ వార్డెన్ ఇరవై బస్తాలు పోయాయని పిర్యాదు ఇచ్చి, మిగిలినవి ఆయన స్వాహా చేశాడు. పోలీసులు వచ్చి చిలకచెర్ల గ్రామంలో చెంచుల ఇళ్ళన్నీ సోదా చేయగా ఆ నాలుగు బస్తాల బియ్యమే దొరికింది. ఇదే అదను అనుకుని పోలీసులు చెంచుల ఇళ్ళల్లోని సామానులు ఎత్తుకు పోయారు. ఆకలికి తాళలేక బియ్యం ఎత్తుకుని వెళ్ళిన చెంచులు దొంగలుగా పిలువబడుతుంటే, ఇదే అదను అనుకుని దోచుకునే హాస్టలు అధికారులు, పోలీసులు దొరలుగా చలామణి అయ్యారు.



చెంచులకు శ్రీశైలంతో ఎంతో సంబంధం ఉంది. అలాగే నంద్యాల అహోబిళం ప్రాంతంలో నివశించే చెంచులకు నృసింహస్వామి చాలా దగ్గరివాడు. పురాణ గాథల ప్రకారం హిరణ్యకశిపుని చంపిన తరువాత ఇంకా ఆవేశం తీరని నృశింహస్వామి ఈ అడవుల్లో తిరుగుతున్నప్పుడు లక్ష్మీదేవి చెంచువనిత లాగ వచ్చి వారిని శాంతింపచేసింది. చెంచులక్ష్మి చెంచుల పిల్లేననీ వీరి నమ్మకం. అందుకనే ఈ గుడితో చాలా సంబంధం ఉంది. దీనికి సంబంధించిన వివరాలు నేను పరిశోధించలేదు. ఎవరైనా చేస్తే బాగుంటుంది.

ఈ రెండు కాకుండా చెంచులు పూజించే దేవతలు, గ్రామదేవతలు ఉన్నారు. గారెలమైసమ్మ, భగవంతులు, లింగమయ్య, పోతమ్మ, పోతురాజు, ఎల్లమ్మ అనేవి ముఖ్యమైనవి. ఇవి చెంచులవేనా? లేక హిందూ దేవతలనే వీరు పూజిస్తున్నారా? అనేది తెలుసుకోవటం కష్టం. ఎందుకంటే వారు కొన్ని వందల సంవత్సరాల క్రితం హిందూమతంలో కలిసిపోయారు. కాని తరువాత హిందువులే వారిని దూరం చేసారు. శ్రీశైలం, అహోబిళం గుడిల్లో చిన్న ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు వీళ్ళకు. అందుకనేమే కొంతమంది చెంచులు యీ మధ్యన క్రైస్తవమతం తీసుకున్నారు.

చెంచులు మాట్లాడేభాష తెలుగే. కొంత ఏస మాండలీకం ఉంటుంది. ఇదికూడా మహబూబ్ నగర్ చెంచులకు ఆ ప్రాంత నుడికారం ఉంటే, కర్నూలు ప్రాంతం వారికి ఆ ప్రాంత నుడికారం అబ్బింది. అయితే వీరి భాషాధ్యయనంపై ఒక విచిత్ర సంఘటన జరిగింది. ఆ మధ్యన (1970 లో అనుకుంటా), కలకత్తా నుండి ఆంత్రపాలాజికల్ సర్వే వారు చెంచుభాషపై పరిశోధన చేసేందుకు ఒకరిని పంపారు. ఆయనకు తెలుగు రాదు. తెలుగు వచ్చిన వారి సహాయం కాని, సలహాకాని తీసుకున్నట్లు లేదు. అన్న అంటే బ్రదర్ అని, అక్క అంటే సిస్టర్ అని చెంచు భాషా పదకోశం తయారు చేశారు. తరువాత నేను ఒకసారి కలకత్తా వెళ్ళినప్పుడు ఈ విషయం వారికి చెబితే, సరేలే అయిపోయింది కదా అని అన్నారు. లేనిది ఉన్నట్లు సృష్టించడం, చెప్పినా వినకపోవటం ఎంత మూర్ఖత్వం. చెంచువాళ్ళ గురించి ఎనిమిది దశాబ్దాలుగా బయటి వారు రాసింది, వారికి మాత్రం తెలియదు. ఎందుకంటే వారిలో చాలామంది నిరక్షరాస్యులు. వారే రాయటం మొదలు పెడితే అసలు చెంచుకథలు బయటికి వస్తాయి. వేరే సందర్భంలో నేను చదివిన ఒక ఉదంతం ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది.

ఒక నల్లజాతి రచయితని ఆయన కుమారుడు ఇలా ప్రశ్నించాడట. "డాడీ, నా పుస్తకంలో ఎప్పుడూ షికారి తన నైపుణ్యంతో పులిని చంపిన కథలే ఉన్నాయి కాని ఎప్పుడూ పులి షికారీలను తన నైపుణ్యంతో చంపలేదా?" దానికి తండ్రి సమాధానం "పులికి రాయటం వచ్చిన తరువాత ఆ కథలు కూడా వస్తాయి". ఈ సమాధానం చాలా బాగుంది.

వేరే గిరిజన జాతులు (ముఖ్యంగా గోండులు, కోయలు) లో ఉన్నట్లు ప్రత్యేకమైన నృత్యం కాని, పాటలు కాని చెంచులలో మనకు కనిపించవు. డప్పువాయిద్యానికి అటు యిటూ తిరుగుతారు. లయబద్ధంగా కూడ కనిపించలేదు ఈ నృత్యం కూడ. సంచారజాతి లక్షణమేమో ఇది అనిపిస్తుంది. స్థిర వ్యవసాయం, స్థిర నివాసం, స్థిర ఆదాయం ఉంటే, కొంత ఖాళీ దొరుకుతుంది. దాంట్లోంచి సాంస్కృతిక రూపాలు అభివృద్ధి చెందుతాయి. రోజూ జీవిత పోరాటంలో మునిగి తేలుతుంటే ఆటపాటలకు సమయం ఎక్కడుంటుంది?

బలమైన బయటి సంస్కృతి ధాటికి ఒక మహోన్నత ప్రాచీన సంస్కృతి తట్టుకోలేనప్పుడు, ఆ సంఘం ఆర్థికంగా, సామాజికంగా ఎటువంటి మార్పులకు గురి అవుతుందో చెంచుమల్లన్న చరిత్ర చెపుతుంది.

డా. వి.ఎన్.వి.కె. శాస్త్రి
సలహాదారు, ప్రచురణలు, అపార్డ్

# అతి సర్వత్ర వర్జయేత్




**ఏ విషయంలోనైనా మితం హితం. పరిమితి లేని అతి అహితం, అనర్ధదాయకం. అందుకే 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు పెద్దలు. వ్యక్తిని బట్టి, సందర్భాన్ని బట్టి స్థలాన్ని బట్టి యోగ్యమైన పరిమితుల్ని ఎవరికివారే విధించుకోవాలి.**

అలా ఉన్నప్పుడే గౌరవం దక్కుతుంది. ఎంతో సమర్ధవంతమూ, శక్తివంతమూ అయిన సముద్రం కూడా చెలియకట్ట హద్దు దాటకుండా ఉంటుంది. అలా హద్దు దాటితే ఎంతటి ప్రళయం సంభవిస్తుందో ఇటీవల జరిగిన సునామీ బీభత్సమే ఒక ఉదాహరణ.

మానవుడు సాధించవలసిన పురుషార్ధాలు నాలుగున్నాయి. అవి ధర్మ, అర్ధ, కామ, మోక్షాలు. వీటిని సాధించాలంటే ఎంతో పట్టుదల, స్థితప్రజ్ఞత కావాలి. వీటిలో ధర్మ మోక్షాలను సాధించాలంటే అర్ధ, కామ విధులను కూడా నిర్వర్తించవలసిందే. ఈ రెండూ అత్యంత ప్రమాదకరమైనవి. వీటి విషయంలో మనం ఎంతలో ఉండాలో అంతలో ఉండకపోతే అవి మనల్ని పతనం చేస్తాయి. అర్ధం కోసం శ్రమించడం, ప్రేమ ద్వారా ధర్మ మార్గంలో చరించడం వరకే మన పాత్ర. జీవన నావికకు ధనం చుక్కాని మాత్రమే. అది చూపించే మార్గంలో మంచి కోసం ప్రయాణిస్తేనే సన్మార్గమవుతుంది. రెండవది కామం. కోరికలు అందరికీ ఉండాలి. కోరికలు ఉండని మానవుడు అభివృద్ధిని సాధించలేడు. అయితే ఆ కోరికలు ధార్మిక జీవనం ప్రతిపాదించేవిగా ఉండాలి. మితిమీరిన కోరికలను అదుపులో ఉంచలేకపోతే జీవితం వక్రమార్గం పడుతుంది. అంటే ధర్మాన్ని ఆచరించి మోక్షం పొందడానికి అర్ధ, కామాలు మితంగా వ్యవహరించి దోహదం చేయాలి. వీటి వరుస క్రమంలో  కూడా మొదట ధర్మాన్ని, చివరిగా మోక్షాన్ని చేర్చి మధ్యలో అర్ధ, కామాల్ని ఉంచి చెప్పడాన్నిబట్టి ఆలోచిస్తే, అర్ధ, కామాలు ధర్మ మోక్షాలను అతిక్రమించకుండా ఉండాలన్నమాట ! ధర్మాన్నే ఆచరించిన పాండవులలో ఈ అర్ధ, కామాలు మితంగా ఉన్నాయి. కౌరవులలో అవే పెట్రేగిపోయి, వారి పతనానికి కారణమయ్యాయి.




మనిషికి భగవంతుడు ప్రసాదించిన బలమైన ఆయుధం వాక్కు. ఆ వాక్కును సక్రమంగా ఉపయోగిస్తే ఎంత ప్రయోజనకారి అవుతుందో, అనాలోచితంగా ప్రయోగిస్తే అంత ప్రమాదకారి అవుతుంది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. మంచిమాట నీరసించిన మనసులకు జవసత్వాలనిస్తుంది. అదేమాట హింసాత్మకమైతే సమూల నాశనానికి మూలమవుతుంది.

ఎందరెందరో మహర్షులు, భక్తులు భగవంతుడు ప్రసాదించిన వాక్కుతో భగవంతుణ్ణి ప్రస్తుతించి ఉత్తమ గతుల్ని పొందారు. మరి శిశుపాలుడు మొదలైనవారు అతి గర్వంతో భగవంతుణ్ణే దూషించి అపకీర్తి పాలయ్యారు.

త్యాగ జీవులకు మరణం లేదు. త్యాగం చెయ్యడానికి ప్రేరకం నిస్వార్ధం. త్యాగం చెయ్యలేకపోవడానికి కారణం లోభం. ఈ లోభమే ఎన్నో సామ్రాజ్యాలను కూకటి వేళ్ళతో పెకలించింది. తద్వారా ఎందరో అమాయకులను పొట్టన పెట్టుకుంది. స్వార్ధం కూడా హద్దులో ఉన్నంతవరకే దాని దుష్ప్రభావం అణిగిమణిగి ఉంటుంది. స్వార్ధంలో కూడా పరార్ధం ఉండాలి. నడువు-నడిపించు, 'బతుకు-బతికించు' అనే ధోరణి స్వార్ధ-పరార్ధాలను సమం చేస్తుంది. బుద్ధి హీనుడు స్వార్ధం కోసం పరార్ధాన్ని సమూలంగా నాశనం చేస్తాడు. తెలివిగలవాడు పరార్ధం కోసం, ధనాన్ని, అవసరమైతే ప్రాణాల్ని సైతం త్యాగం చేస్తాడు. పరార్ధంతో కూడిన త్యాగమే మనిషికి అమృతత్వాన్నిస్తుంది.

మానవులంతా ప్రయత్నించినప్పటికీ, అణుచుకోలేనిది క్రోధం. క్రోధం కూడా ఉండవలసినదే. అయితే ఆ క్రోధం వల్ల మంచి జరగాలి. చెడ్డ వారితో నడుస్తున్న పుత్రుణ్ణి మందలించేటప్పుడు క్రోధం సత్ఫలితాన్నే ఆశిస్తుంది. అరాచకాల్ని రేపుతూ, దేశాన్ని అల్లకల్లోలం చేసే దుష్ట శక్తుల పట్ల చూపించే కోపం శాంతి స్థాపనకు బీజమవుతుంది.

మిత్రుల పట్ల, అశ్రితుల పట్ల సంబంధ బాంధవ్యాలు శృతి మించకూడదు. మిత్రులు అంటే కలిసి పనిచేసే వారని అర్ధం. ఒకరికొకరు సహాయకారులుగా ఉంటూనే ఎవరి హద్దుల్లో వారు ఉండాలి. ఎవరూ ఎవరి కంటే ఎక్కువ కారు. మిత్రులిద్దరికీ సమాన ప్రతిపత్తి ఉంటుంది. అందువల్ల హద్దు మీరితే స్నేహాలు చెడిపోతాయి. ద్వేషం పెరుగుతుంది. తద్వారా ద్రోహం చెయ్యాలనే ఆలోచన పుడుతుంది. మిత్రునికి ద్రోహం చెయ్యడంకన్నా వేరే పాపం లేదని రామాయణ అయోధ్య కాండలో భరతుడు పేర్కొన్నాడు.

ఇలా ఎన్నింటికో పరిమితులున్నాయి. ప్రతి విషయంలోనూ హద్దులెరిగి నడుచుకుంటే జీవితం సాఫీగా సాగిపోతుంది. అలా కాదని హద్దు మీరితే సరిహద్దు తగాదాలతో విధ్వంసాన్ని సృష్టించే సామ్రాజ్యాల పరిస్థితే మనకు కూడా ఎదురవుతుంది.

- అద్దంకి శ్రీనివాస్

**అతి - పరిమితి**

అందాలు కుమ్మరించే సీతాకోక చిలుకలకు ఉపద్రవం ముంచుకొస్తోంది. వీటి ఉనికికే సవాలుగా మారిన అనేక ప్రతికూల పరిస్థితులు నానాటికీ పెరుగుతున్నాయి. అధికమవుతున్న భూతాపం, వాతావరణంలో వేడి, నివాస ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు పెరగటం, వ్యవసాయం పెరగటం మొదలైనవెన్నో సీతాకోక చిలుకల ఉనికికి ముప్పుగా తయారయ్యాయి. అనేక జాతుల, జంతువుల అస్తిత్వానికి ప్రమాదం ఎదురయినట్లే, సీతాకోక చిలుకలు కూడా ప్రకృతి నుంచి కనుమరుగవుతాయనే భయాలకు ఆధారం దొరుకుతోంది.





ప్రపంచవ్యాప్తంగా దాదాపు 17,500 జాతుల సీతాకోక చిలుకలు ఉన్నాయని అంచనా. వీటిలో కొన్ని కేవలం 3,4 రోజులు మాత్రమే నివశిస్తాయి. కొన్ని 40 రోజుల వరకు ఉంటాయి. అయితే, ఏడాది కాలంపాటు నివశించే అరుదైన జాతులు లేకపోలేదు.

# అందాల సీతాకోక చిలుకలకు శీతకాలం













ఇప్పటికే అనేక జాతుల సీతాకోక చిలుకలు కనుమరుగయ్యాయి. మరికొన్ని 'అరుదుగా' కనపడుతున్నాయి. అరుదుగా కనపడటమంటే కనుమరుగు కావడానికి దగ్గర్లోని దశ అన్నమాట.

ప్రపంచంలోని అనేక దేశాల్లో సహజసిద్ధమైన చెట్లు, అడవిపూలు అంతరించిపోతున్నాయి. రోడ్ల ప్రక్కన ఉన్న చెట్లను కూడా కత్తిరించడం వల్ల, తొలగించడం వల్ల అక్కడ పూలు పూసే మొక్కలే మొలకెత్తటం లేదు. విశాలంగా ఉన్న భూముల స్థానంలో దగ్గర దగ్గరగా నాటిన మహావృక్షాలు రావడంతో, వాటి మధ్య ఏ మొక్కలూ బతికే పరిస్థితి లేదు. తడిగా ఉన్న భూములను ఎండబెట్టి, వ్యవసాయానికి అనువుగా మారుస్తున్నారు. సీతాకోక చిలుకలకు వివిధ దశల్లో ఆహారాన్ని అందిస్తాయని భావిస్తున్న మొక్కలను సాధారణంగా కలుపు మొక్కలుగా ముద్రవేసి వాటిని తొలగించటమో, లేక విష రసాయనాలను స్ప్రే చేయటమో చేస్తారు. దాంతో ఆ మొక్కలతో పాటు, వాటిమీద ఆధారపడి బతికే సీతాకోక చిలుకలూ నశిస్తాయి. అసలు సీతాకోక చిలుకలకు ఆహారంగా పనికివచ్చే మకరందాన్ని అందించే పూల రకాలు చాలా తక్కువగా ఉన్నాయి.

ఒకప్పుడు మేకలు, గొర్రెలను బయట మేపే వాళ్లు. ఇప్పుడు గొర్రెలను, మేకలను బయట మేపటం తగ్గిపోవటంతో పొదలు, ముతక గడ్డి పెరిగిపోయి సీతాకోక చిలుకలకు పనికివచ్చే పూల మొక్కలు కరువయిపోయాయి.

ఇటువంటి అవాఛనీయ పరిణామాల కారణంగానే 'లార్జ్ బ్లూ' అనే సీతాకోక చిలుక జాతి అదృశ్యమై పోయింది. అనేక సంవత్సరాలపాటు ఈ జాతి సీతాకోక చిలుకలకు అవసరమైన పూల మొక్కలు తగ్గిపోతూ వచ్చాయి. తదనుగుణంగా, వీటి సంఖ్య కూడా తగ్గిపోతూ వచ్చింది. ఈ తగ్గుదలను అరికట్టడానికి ప్రకృతి సంరక్షకులు ఎంతగానో ప్రయత్నించారు. అవేవీ ఫలించలేదు. చివరికి 1979లో 'లార్జ్ బ్లూ' మొత్తానికి కనుమరుగైపోయింది. సీతాకోక చిలుకలకు నివాసయోగ్యంగా, ఆహార యోగ్యంగా పనికివచ్చే మొక్కలు నశించటమో, లేదా తగ్గిపోవటమో లేదా ఆయా ప్రదేశాల స్వభావాల్లో మార్పులు రావటమో పలురకాల సీతాకోక చిలుకల జాతులు అంతరించటానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.









బెకర్ స్పాట్, ఒరెగాన్ సిల్వర్ స్పాట్ అనే జాతుల సీతాకోక చిలుకల మనుగడ కూడా ప్రమాదంలో పడింది. లార్వా దశలో వాటికి ఆహారంగా పనికివచ్చే మొక్కలను బాగా పెంచి, వాటిని సంరక్షించడానికి ప్రయత్నాలు, పరిశోధనలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. అట్లాగే, బెహ్రెన్స్ సిల్వర్ స్పాట్ అనే సీతాకోక చిలుకల ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారింది. వీటి ఆహారానికి ఆధారంగా ఉన్న మొక్కల స్థానంలో ఇతర మొక్కలు పెరగటం, ఆయా ప్రాంతాల్లో వాహనాలు తిరగటం, పశువులు సంచరించటం ఇందుకు కారణాలుగా చెప్పవచ్చు. అంతేకాక, బ్లాక్ మార్కెట్‌లో అమ్మటానికి సీతాకోక చిలుకలను చట్ట విరుద్ధంగా, అక్రమంగా సేకరించటం వల్ల కూడా వీటి ఉనికి ప్రమాదంలో పడుతోంది.

అన్‌కంపాగ్రె ఫ్రిటిలరీ అనే జాతి సీతాకోక చిలుకలు ప్రమాదంలో ఎప్పటినుంచో ఉన్నప్పటికీ, వీటిని మనుషులు 1978లోనే కనిపెట్టారు. ఈ జాతి సీతాకోక చిలుకలు ఇంకా కన్పిస్తాయని శాస్త్రవేత్తలు ఆశతో ఉన్నారు. అయితే, అక్రమ సేకరణ, పశువుల పెంపకం, పెరుగుతున్న వినోద కార్యక్రమాలు, లేదా కరువు కాటకాలు వీటి ఉనికికి ప్రమాదంగా మారటంతో 1982 లోనే వీటిని ప్రమాదంలో పడిన సీతాకోక చిలుకలుగా వర్గీకరించవలసి వచ్చింది.

అదే విధంగా స్మిత్ బ్లూ, షాస్ స్వాలోటైల్, సెయింట్ ఫ్రాన్సిస్ శాటైర్, పాలోస్ వెర్దెస్ బ్లూ మొదలైన జాతులు కూడా ప్రమాదంలో పడ్డాయి. వీటిని రక్షించటానికి ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇవేకాక, అనేక ప్రాంతాల్లో ఎదురవుతున్న వాతావరణ మార్పులు, అతివృష్టి, అనావృష్టి వంటి పరిస్థితులు, పెరుగుతున్న భూతాపం, కాలుష్యం, అతి శీతలం, అతి గ్రీష్మం వంటివి వివిధ రకాల సీతాకోక చిలుకల ఉనికికి ప్రమాదంగా మారాయి. వీటి కారణంగానే పలు జాతులు ఇప్పటికే అంతరించిపోయాయి.

### 4800 కి.మీ. దూరం వరకూ సీతాకోక చిలుకల వలసలు

నిజానికి, సీతాకోక చిలుకలు తమ ఉనికిని, మనుగడను కాపాడుకోవటానికి, ఆహారం కోసం వెతుక్కుంటూ చాలాదూరం వలస వెళతాయి. 'మోనార్క్' సీతాకోక చిలుకలు 4000 నుంచి 4800 కిలోమీటర్ల దూరం వలస వెళతాయి. ఆహారం కోసం అవి మెక్సికో నుంచి బయల్దేరి అమెరికా, దక్షిణ కెనడాల్లోని వివిధ ప్రదేశాలకు చేరుకుంటాయి. 'పెయింటెడ్ లేడీ', 'డనైన్' జాతులకు చెందిన పలు రకాల సీతాకోక చిలుకలకు కూడా వలస వెళ్లడం అలవాటు. భారత దేశంలో వర్షాకాలం కనులకు విందుచేసే సీతాకోక చిలుకల వలసలు పెద్దస్థాయిలో జరుగుతాయి.

అయితే, వయస్సు మీదపడే కొలదీ సీతాకోక చిలుకల రెక్కలు దెబ్బతింటాయి. ఒకసారి దెబ్బతిన్నాక, అవి తిరిగి కోలుకోవు. రకరకాల వ్యాధులు, పర్యావరణ సమస్యల వల్ల కూడా సీతాకోక చిలుకలు ఇబ్బంది పడుతుంటాయి. సీతాకోక చిలుకల తొలి దశలో వాటిని తినడానికి అనేక రకాల జీవులు పొంచి ఉంటాయి. వాటినుంచి రక్షించుకోవటానికి సీతాకోక చిలుకలు రకరకాల స్వీయ రక్షణ విధానాలను అవలంబిస్తాయి. కొన్ని మొక్కలు తమ మనుగడకు ప్రమాదంగా పరిణమించిన క్రిమి కీటకాల నుంచి రక్షించుకోవటానికి విషపూరిత రసాయనాలను తయారు చేసుకుంటాయి. ఈ విషపూరిత రసాయనాలను పీల్చుకుని స్వీయ రక్షణకు ఉపయోగించుకోగలిగే శారీరక యంత్రాంగాలను సీతాకోక చిలుకలు రూపొందించుకున్నాయి. అంతేకాక, శరీరంలోని రంగులు మార్చుకోవటం,





ఆకుల్లో కలిసిపోయేవిధంగా రూపొందటం వంటి రక్షణ యంత్రాంగాలను కూడా ఇవి తయారు చేసుకున్నాయి. కాటర్ పిల్లర్ దశలో, ఇవి తమ శరీరాలను గట్టిగా బిగించి, పుల్లల మాదిరిగా, కొమ్మల మాదిరిగా కనపడేలా చేస్తాయి. కొన్ని సీతాకోక చిలుకలు కీలకమైన తల భాగాన్ని కనపడకుండా చేసి, రక్షించుకోవటానికి కళ్ల ప్రాంతంలో చుక్కలు, తోకలు వంటి వాటిని కలిగి ఉంటాయి. ఇవి దృష్టి మరల్చడానికి ఉపయోగపడతాయి.



### అందానికే అందం

అసలు సీతాకోక చిలుకలు అందానికే నిర్వచనం ఇస్తాయి. అనేక సంస్కృతుల్లో, భాషల్లో సీతాకోక చిలుకలను ప్రత్యేకంగా వర్ణించారు. ఈజిప్టులో 3500 సంవత్సరాల క్రితమే సీతాకోక చిలుకలను కళాత్మకంగా వర్ణించారు. ఇప్పుడయితే, నగలు, కళాత్మక చిత్రాలు, అలంకరణ సామాగ్రి మొదలైన అనేక రకాల వస్తువుల్లో సీతాకోక చిలుకల బొమ్మల్ని వాడుతున్నారు. 'బార్బీ మరిపోసా' సినిమాతో సహా వివిధ నవలల్లో 'బటర్ ఫ్లై ఫెయిరీ' పాత్రకు స్ఫూర్తి కలిగించింది సీతాకోక చిలుకలే.

లాఫ్కాడియో హెర్న్ రాసిన 'క్వైడాన్: కొత్త విషయాల కథలు, అధ్యయనాలు' అనే గ్రంథంలో సీతాకోక చిలుకలపై ఒక అధ్యయనం ఉంది. మనిషి ఆత్మకు సీతాకోక చిలుకను ప్రతిబింబంగా ఇందులో వర్ణిస్తారు. బతికి ఉన్నా, చనిపోతున్నా, లేక చనిపోయినా... అన్ని దశల్లోనూ ఈ వర్ణన మారదు. ఒక సీతాకోక చిలుక మన ఇంట్లోని అతిథుల గదిలోకి ప్రవేశించి, వెదురు తెర వెనుక కూర్చున్నట్లయితే, మనం అత్యధికంగా ప్రేమించే వ్యక్తి మనను చూడటానికి మన ఇంటికి వస్తారని జపాన్‌లో నెలకొన్న విశ్వాసం.

రష్యన్ భాషలో సీతాకోక చిలుక (బబోచకా) అంటే స్త్రీ, అవ్వ, కేక్ అని అర్థాలున్నాయి. గ్రీకు భాషలో ఆత్మ, మనస్సు అని కూడా అర్థాలున్నాయి.

భారతదేశంలోని మణిపూర్ రాష్ట్రంలోని నాగాలు తాము సీతాకోక చిలుకల నుంచి వచ్చామని నమ్ముతారు. చైనా సంస్కృతిలో రెండు సీతాకోక చిలుకలు కలిసికట్టుగా ఎగురుతున్న దృశ్యాన్ని ప్రేమకు చిహ్నంగా భావిస్తారు. చైనాలో 'సీతాకోక చిలుక ప్రేమికులు' అనే ప్రసిద్ధ జానపద కథ కూడా ఉంది. ఇవే కాకుండా అనేక దేశాల్లో సీతాకోక చిలుకలను రకరకాల వర్ణనల్లో ఊహాత్మకంగా వర్ణించారు.

ఇంతటి అందమైన, అపురూపమైన, సృష్టికే శోభను చేకూరుస్తున్న సీతాకోక చిలుకలు కనుమరుగైతే భరించగలమా ? ఒక జీవ జాతి అంతమైతే, దాని ప్రభావం ఇతర జీవ జాతులపై కూడా పడుతుంది. ఈ దృష్ట్యా అందానికే అందం లాంటి సీతాకోక చిలుకలను రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మన వ్యక్తిగత స్థాయిలో చేయగలిగింది చేసినా ఎంతో ఉపయోగం ఉంటుంది. మన ఇంటి పరిసరాల్లో, తోటల్లో, పొలాల్లో సీతాకోక చిలుకలకు ఆహారంగా పనికివచ్చే పూల మొక్కలను పెంచితే చాలు. అవి ఎక్కడెక్కడి సీతాకోక చిలుకలనూ ఆకర్షిస్తాయి. తద్వారా వాటి సంతతి తగ్గిపోకుండా, జాతి అంతరించిపోకుండా కాపాడుకోగలం. అంతేకాదు, సీతాకోక చిలుకల వల్ల ఆయా పరిసరాలకే చక్కని అందం వస్తుంది. అందమైన పూల మొక్కలు, వాటిపై ఎగురుతున్న అంతకంటే అందమైన సీతాకోక చిలుకలను ఒక్కసారి ఊహించుకోండి!

– గొట్టిపాటి సుజాత







లక్ష్మణ్ సానియా మీర్జా కోనేరు హంపి

# ఆంధ్రప్రదేశ్ క్రీడా మెరుపులు

మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. నిజానికి కొత్త దశాబ్దంలోకి ప్రవేశించాం. గత ఏడాది ఏం సాధించాం, ప్రత్యేకించి క్రీడా రంగంలో ఏం విజయాలు సాధించామనే విషయాలను ఒకసారి పునశ్చరణ చేసుకోవాలని ఈ సమయంలో అన్పించటం సహజం.

2009 సంవత్సరాన్ని ఒక్కసారి అవలోకిస్తే, సంతోషపడే సంగతులే ఉన్నాయి తప్ప, నిరాశపడవలసిన వేమీ అంతగా లేవని అర్థమవుతుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మన బ్యాడ్మింటన్ క్రీడాకారులు బాగానే ఆడుతున్నారు. నూతన విజయాలు సాధిస్తున్నారు. ఇక మన చదరంగపు క్రీడాకారులయితే, ఆ మేధో క్రీడలో ముందు వరసలోనే ఉన్నారు.

టెన్నిస్ కోర్టులో గ్లామర్ తారగా వెలిగే సానియా మీర్జా మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో మహేష్ భూపతితో కలిసి ఆడి, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో గ్రాండ్ శ్లామ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. అయితే, ఇతర విజయాల పరంగా చూస్తే, సంవత్సరకాలమంతా ఈమెకు సంతోషం కలిగించే పెద్ద సంఘటన లేమీ జరగలేదు. సంవత్సరాంతానికి సానియా మీర్జా 57వ ర్యాంకు దగ్గర నిలిచింది. ఆమె కెరీర్ బాగా ఉన్న స్థితిలోని ర్యాంకు కంటే ఇది 30 స్థానాల దిగువన ఉన్నట్లు. అయితే, క్రీడల్లోనూ, ఫ్యాషన్ పరంగానూ అనేక మంది యువతీ యువకులకు ఆమె స్ఫూర్తి కలిగిస్తూనే ఉంది.

గతంలో భారతదేశపు మహిళా క్రికెట్ జట్టుకి కేప్టెన్‌గా నాయకత్వం వహించిన మిథాలీరాజ్ గడిచిన సీజన్‌లో మంచి పేరు సంపాదించింది. తత్ఫలితంగా ఆమెకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ 'ఐసిసి నెంబర్ 1 బ్యాట్స్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్', 'ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డులు ఇచ్చి సత్కరించింది.

విజయాల సాధనలో అత్యున్నత శిఖరాన్ని చేరిన కీర్తి సైనా నెహ్వాల్‌కు దక్కుతుంది. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ బ్యాడ్మింటన్‌కు ఆమె ప్రాతినిథ్యం వహిస్తోంది. హర్యానాకు చెందిన సైనా నెహ్వాల్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 19 ఏళ్ల ఈ బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి 2009 సంవత్సరం చాలా ఆనందం కలిగించి ఉంటుంది.



సైనా నెహ్వాల్

మన దేశం ఆమె విజయాలను గుర్తించి, తగిన విధంగా గౌరవించింది. 'అర్జున్' అవార్డుతో సత్కరించింది. సైనా నెహ్వాల్ ప్రస్తుతం అంతర్జాతీయంగా 7వ స్థానంలో ఉంది. బ్యాడ్మింటన్‌కి మన దేశ ప్రధాన జాతీయ కోచ్‌గా ఉన్న పుల్లెల గోపీచంద్

## గడిచిన సంవత్సర క్రీడావలోకనం

సైనా నెహ్వాల్‌కి గురువు. ఉత్తమ కోచ్‌గా ఆయనను గుర్తించి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ద్రోణాచార్య అవార్డుతో సత్కరించింది. ఆగస్టులో భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చింది. అదే సమయంలో ఈ అవార్డులు ప్రకటించటం అందరికీ సంతోషం కలిగించింది.

సైనా నెహ్వాల్ పెరిగిందీ, చదువుకున్నదీ రాజేంద్రనగర్‌లోని ఎఎమ్ఆర్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయానికి దగ్గర్లోనే. అమెరికాలో అత్యధిక సర్క్యులేషన్, ప్రతిష్ఠ కలిగిన క్రీడాపత్రిక స్పోర్ట్స్ ఇలస్ట్రేటెడ్, సైనా నెహ్వాల్‌ను 'బెస్ట్ ఇండియన్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' గా అభివర్ణించింది.

తరువాత సిఎన్ఎన్ ఐబిఎన్ టెలివిజన్ ఛానల్ కూడా ఆమెను 'బెస్ట్ ఇండియన్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' గా ఎంపిక చేసింది.

ఈ పురస్కారానికి ఆమెతో పాటు గౌతమ్ గంభీర్, బాయ్‌చుంగ్ భుటియా, పంకజ్ అద్వానీ, లియాండర్ పేస్ ఒలింపియన్ బాక్సర్ విజేందర్ సింగ్ తదితర ప్రసిద్ధ క్రీడాకారులు పోటీ పడ్డారు.

వీరందరి కంటే ఎక్కువ ఓట్లు సాధించిన సైనా నెహ్వాల్ 'బెస్ట్ ఇండియన్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' గా ఎన్నికయ్యారు. బ్యాడ్మింటన్‌లో సూపర్ సిరీస్ టైటిల్‌ను గెలిచిన మొదటి భారతీయ మహిళగా భారతదేశాన్ని బ్యాడ్మింటన్ క్రీడలో అత్యున్నత శిఖరాలకు చేర్చినందుకు గుర్తింపుగా సిఎన్ఎన్ ఐబిఎన్ అవార్డు లభించింది.

జూన్‌లో జరిగిన ఇండోనేషియన్ ఓపెన్‌లో ప్రపంచ బ్యాడ్మింటన్‌లో మూడవ ర్యాంకులో ఉన్న చైనాకు చెందిన లింగ్‌వాంగ్‌ను ఓడించటం ద్వారా సైనా నెహ్వాల్ టైటిల్ గెలుచుకున్నారు. డిసెంబర్‌లో న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి డాక్టర్ మన్‌మోహన్ సింగ్ ఆమెకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన












మాట్లాడుతూ, బ్యాడ్మింటన్ కోర్టులో సైనా నెహ్వాల్ ప్రతిభాపాటవాలు క్రీడాభిమానులను ఎంతో అలరిస్తాయని పేర్కొన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. "సైనా నెహ్వాల్ పైన మనం ఇంకా చాలా ఆశలు పెట్టుకున్నాం. రాబోయే సంవత్సరాల్లో ఈ క్రీడా ఛాంపియన్ భారతీయ మహిళలు క్రీడారంగంలో ఎవరికీ తీసిపోరని నిరూపించగలరని నేను నిస్సందేహంగా చెప్పగలను" అని ప్రధాని వ్యాఖ్యానించారు.

సైనా నెహ్వాల్, ప్రపంచ బ్యాడ్మింటన్‌లో 16వ ర్యాంకులో ఉన్న చేతన్ ఆనంద్ కలిసి డిసెంబర్‌లో లక్నోలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన సయ్యద్ మోడి (మాజీ జాతీయ ఛాంపియన్) మెమోరియల్ టోర్నమెంట్‌లో సింగిల్స్ టైటిల్‌ని గెలుచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సైనా క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ఆ టోర్నీ జరగడానికి ఒక వారం ముందు చికెన్‌పాక్స్ సోకకుండా ఉన్నట్లయితే, సైనా నెహ్వాల్ ఆట తీరు ఇంకా ఎంతో మెరుగ్గా ఉండేదనటంలో సందేహం లేదు.

ఇక గుత్తా జ్వాల విషయానికి వస్తే, శ్రుతి కురియన్‌తో కలిసి అనేక టైటిల్స్ గెలుచుకున్నారు. అయితే, తరువాత ఆమెతో విభేదించిన జ్వాల వి. దిజుతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఆడాలని నిర్ణయించుకున్నారు. ఉమెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రపంచంలో ఏడవ స్థానంలో ఉన్న జ్వాల, దిజు కలిసి ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో క్వార్టర్ ఫైనల్‌కి చేరిన మొదటి భారతీయ జంటగా పేరు సంపాదించారు.

వీరిద్దరూ కలిసి చైనీస్ తైపెలో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్ గెలుచుకున్నారు. అంతేకాక, జోహోర్ బహ్రులో




జరిగిన ప్రపంచ సూపర్ సిరీస్ మాస్టర్స్‌లో వీరిద్దరూ ఫైనల్‌కు చేరుకుని మరో ఘనత సాధించారు. జ్వాలను వివాహం చేసుకున్న చేతన్‌కి కూడా గడిచిన సంవత్సరం చక్కని విజయాలను అందించింది.

ఈ టాప్ ర్యాంకింగ్ క్రీడాకారులే కాక, బ్యాడ్మింటన్‌లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిభాశాలురైన క్రీడాకారులకు కొదవేం లేదు. ఆర్‌ఎంవి గురుదత్త సాయి బహ్రెయిన్‌లో జూనియర్స్ టైటిల్‌ను, డచ్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఇతనికి ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్నట్లు కనపడుతోంది. భారతదేశంలో జూనియర్ నెంబర్‌గా ఉన్న ఎన్.సిక్కిరెడ్డి, పి.వి.సింధు అనే బాలికలు కూడా అత్యంత ప్రతిభాశాలురైన క్రీడాకారిణులుగా కన్పిస్తున్నారు.

తమ ప్రతిభను వారు ఇప్పటికే వివిధ పోటీల్లో ప్రదర్శిస్తున్నారు.



గుత్తా జ్వాల

చేతన్ ఆనంద్


మహేష్ భూపతి

సయ్యద్ మోడి మెమోరియల్ టోర్నమెంట్‌లో సయాలి గోఖలేను సింధు కంగుతినిపించింది. సింధు ఇంకా పాఠశాల దశలోనే ఉందన్న విషయం మనం మర్చిపోకూడదు. నేషనల్ ఛాంపియన్‌గా ఉన్న సయాలి గోఖలే స్పానిష్ ఓపెన్‌ను కూడా గెలుచుకున్నారు. సయాలిని ఓడించటమంటే మాటలు కాదు. సిక్కి రెడ్డి, సింధు ముందు ముందు ఆంధ్రప్రదేశ్‌కి మంచి పేరు తేగలరు.

ఇక క్రికెటర్ వివిఎస్ లక్ష్మణ్ విషయానికి వస్తే, సిఎన్ఎన్ ఐబిఎన్ స్పెషల్ అవార్డును ఆయన గెలుచుకున్నారు. టెస్ట్‌క్రికెట్‌లో మొదటి స్థానానికి వచ్చిన టీమిండియాలో ఆడినందుకు సౌరవ్‌గంగూలి, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లేలతో కలిసి ఆయన ఈ అవార్డును గెలుచుకున్నారు.

ఇక దేశీయ క్రికెట్‌లో మనం ఆనందించదగ్గ సంఘటనలేమీ జరగలేదు. హైదరాబాద్ రంజీ ట్రోఫీ జట్టు పరిస్థితి దయనీయంగా ఉంది. ఆ పరిస్థితి చాలదన్నట్లు, టోర్నమెంట్‌లో 'ఎలైట్' గ్రూప్ స్థానం నుంచి 'ప్లేట్' గ్రూప్‌కి దీని స్థానం దిగజారింది.ప్లాటినమ్ జూబ్లీ సంవత్సరంలో ఉన్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కి ఇంతకన్న ఎదురుదెబ్బ మరేమి ఉంటుంది!

కొరియాలోని చాంగ్‌వాన్‌లో జరిగిన ప్రపంచ కప్ టోర్నమెంట్‌లోని వివిధ విభాగాల్లో హైదరాబాద్‌కి చెందిన గగన్ నారంగ్ ఒక స్వర్ణపతకాన్ని, ఒక కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు.

ఇక పద్మశ్రీ కోనేరు హంపి ప్రపంచ చెస్ క్రీడాకారుణుల్లో తన నెంబర్ టూ స్థానాన్ని పదిల పరచుకుంది. నిధుల కొరత, చదరంగపు రంగానికి చెందిన సంస్థలతో సమస్యలు వంటి ఆటంకాలు ఎన్నో ఉన్నప్పటికీ, ఆమె తన వంతు పాత్ర విజయవంతంగా పోషిస్తూనే ఉంది.

ఉమెన్ గ్రాండ్ మాస్టర్‌గా, ఇంటర్నేషనల్ మాస్టర్‌గా నిలిచిన గుంటూరుకు చెందిన ద్రోణవల్లి హారిక డిసెంబర్‌లో చెన్నైలో జరిగిన జాతీయ ప్రీమియమ్ ఉమెన్స్ చెస్ టోర్నమెంట్‌లో టైటిల్‌ను సాధించింది. టర్కీలో జరిగే వరల్డ్ ఉమెన్స్ చెస్ టోర్నమెంట్‌కి ఇప్పుడు ఆమె సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరలో జరిగే చెస్ ఒలింపియాడ్‌లో కూడా ఆమె పాల్గొననున్నది. వరల్డ్ ఉమెన్స్ చెస్‌మీట్‌లో ఆమె భారతజట్టుకి నాయకత్వం వహించనున్నది. ఇక పెండ్యాల హరికృష్ణ నాన్సీ ఫెస్టివల్ చెస్ టోర్నమెంట్‌ను గెలుచుకున్నారు.

అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ వంటి క్రీడల్లో మన క్రీడాకారుల ప్రతిభాపాటవాల గురించి స్థలాభావం వల్ల వివరించలేకపోతున్నాము.

ఈ కొత్త ఏడాదిలో కూడా ఆంధ్రప్రదేశ్‌లోని క్రీడాజట్లు, క్రీడాకారులు అద్భుత విజయాలు సాధించగలరని కోరుకుందాం.

- దాసు కేశవరావు
(అనువాదం : వై. సరోజ)

# మన గ్రామం - మన పంచాయితీ పాలన

**గ్రామ పంచాయితీలకు సంబంధించిన కొన్ని సాధారణ, తదితర అంశాలను ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లోని ఆరవ అద్యాయనంలో పేర్కొన్నారు.**

## ఇంటినెంబరు - వీధి పేరు

వీధులకు పేర్లు పెట్టుటకు, భవనాలకు డోర్ నెంబర్లు ఇచ్చుటకు లేదా అట్టి వీధి పేరును గానీ, ఇంటి నెంబరును గానీ మార్చుటకు గ్రామపంచాయితీకి అధికారం ఉంటుందని ఈ చట్టంలోని 126వ సెక్షనులో పేర్కొన్నారు.

ఏ వ్యక్తి కూడా చట్టపరమైన అధికారం లేకుండా అట్టి పేరును లేదా నెంబరును నాశనం చేయుటకానీ, తొలగించుటకానీ లేదా చెరిపివేయుట గానీ చేయరాదు. ఇంటికి నెంబరు వేసిన తదుపరి ఇంటి యజమాని, ఆ నెంబరును అలాగే ఉంచాలి. అట్టి నెంబరు తొలగించబడినా లేదా చెడగొట్టబడినా సదురు ఇంటి యజమాని అట్టి నెంబరును మళ్ళీ ఏర్పాటు చేయాలి.

## అనుమతులు - లైసెన్సులు

అనుమతులకు, లైసెన్సులకు సంబంధించిన కొన్ని సాధారణ అంశాలను ఈ చట్టంలోని 127వ సెక్షనులో పేర్కొన్నారు.

(1) ఈ చట్టం ప్రకారం గాని లేదా ఈ చట్టాన్ని అనుసరించి రూపొందించబడ్డ రూల్సు లేదా బైలాల ప్రకారం ఇవ్వబడే అనుమతులు లేదా లైసెన్సులు, వాటికి ఏదైనా కాలపరిమితి ఉంటే అట్టి కాలపరిమితి, అట్టి లైసెన్సు లేదా అనుమతి మంజూరు చేయుటకు విధించబడిన పరిమితులు, నిబంధనలు, షరతులను పేర్కొని, కార్యనిర్వాహణాధికారి లేదా అతని చేత అధికారమివ్వబడిన వ్యక్తి చేత సక్రమంగా సంతకం చేయబడి ఉండాలి.

(2) అట్టి ప్రతి లైసెన్సు లేదా అనుమతికి గ్రామపంచాయితీ విధించిన ఫీజును వసూలు చేయవచ్చును. అయితే మంగలి, చాకలి, మేదర లేదా కుమ్మరి లేదా ఇతర గ్రామీణ చేతి వృత్తుల వారు తమ వృత్తిని చేసుకొనుటకు లేదా వ్యాపారాన్ని నిర్వహించుటకు గ్రామపంచాయితీ పరిధిలోని ఏదేని స్థలాన్ని వినియోగించుటకు జారీ చేయబడ్డ లైసెన్సుకు ఏవిధమైన ఫీజును చెల్లించనవసరం లేదు.

(3) ఈ చట్టం ప్రకారం లేదా ఈ చట్టాన్ని అనుసరించి రూపొందించబడ్డ నిబంధనలు లేదా బైలాల ప్రకారం నిర్దేశించబడిన అధికారి లైసెన్సు లేదా అనుమతిని తిరస్కరిస్తూ, నిలిపి వేస్తూ, రద్దు చేస్తూ లేదా సవరిస్తూ జారీ చేసే ఉత్తర్వులు లిఖిత పూర్వకంగానూ, అట్టి నిర్ణయానికి రావటానికి గల కారణాలను పేర్కొని ఉండాలి.

ఈ చట్టం ప్రకారం లైసెన్సు లేదా అనుమతి కొరకు దాఖలు చేయబడ్డ ప్రతి ధరఖాస్తుపై అట్టి దరఖాస్తును స్వీకరించిన తేదీ నుండి లేదా ఆమోదం లభించిన తేదీ నుండి లేదా నిర్దేశించబడిన ఇతర అంశాలను పూర్తి చేసిన నాటి నుండి పదిహేను రోజుల లోపు నిర్ణయాన్ని తెలియపరిచాలి. లేకపోయినట్లయితే అట్టి లైసెన్సు లేదా అనుమతి జారీ చేయబడినట్లు భావించబడుతుంది.

(4) ప్రైవేటు మార్కెట్లకు సంబంధించిన ప్రత్యేక అంశాలకు లోబడి, ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించబడ్డ నిబంధనలు లేదా బైలాల ప్రకారం జారీ చేయబడ్డ అనుమతి లేదా లైసెన్సును పొందిన వ్యక్తి, అట్టి లైసెన్సు లేదా అనుమతిలో పేర్కొనబడిన పరిమితులను, నిబంధనలను లేదా షరతులను ఉల్లంఘించినా లేదా అతిక్రమించినా, లేదా సదరు వ్యక్తి ఈ చట్టం ప్రకారం రూపొందించబడ్డ నిబంధనలు లేదా బైలాలలోని ఏదేని అంశం యొక్క ఉల్లంఘనకు శిక్షింపబడినా, అట్టి వ్యక్తి తప్పుడు సమాచారంతోను లేదా మోసంతోనూ అనుమతిని లేదా లేదా లైసెన్సును పొందినా, కార్యనిర్వాహణాధికారి సదరు వ్యక్తికి తగిన వివరణ ఇచ్చుకొనుటకు అవకాశాన్ని కల్పించి అట్టి లైసెన్సు లేదా అనుమతిని నిలుపుదల చేయటం లేదా రద్దు చేయటం చేయవచ్చును.

(5) ఈ చట్టం ప్రకారం అనుమతి లేదా లైసెన్సు అవుసరమైన ఏదేని స్థలాన్ని కార్యనిర్వాహణాధికారి తనిఖీ (inspect) చేయాల్సి ఉంటుంది. సూర్యోదయానికి, సూర్యాస్తమయానికి మధ్యలో అతను అట్టి స్థలంలో ప్రవేశించవచ్చును. సూర్యాస్తమయానికి, సూర్యోదయానికి మధ్య సమయంలో అట్టి స్థలం ప్రజల సందర్శనార్థం ఉన్నా లేదా ఏదేని పరిశ్రమ పనిచేస్తున్నా, ఈ చట్టం ప్రకారం అవసరమైన లైసెన్సు లేదా అనుమతి లేకుండా లేదా అట్టి లైసెన్సు లేదా అనుమతికి విరుద్ధంగా ఏదేని ప్రదేశంలో ఏదైనా పని జరుగుతున్నదని నమ్మడానికి కారణం ఉన్నా, కార్యనిర్వాహణాధికారి అట్టి ప్రదేశంలోకి రాత్రి లేదా పగలు ఏ సమయంలోనైనా నోటీసు లేకుండా ప్రవేశించి అక్కడ ఏదైనా చట్టం, నిబంధన, బైలా లేదా రెగ్యులేషన్, లైసెన్సు లేదా అనుమతిలోని ఏదేని షరతు, లేదా ఏదేని చట్ట పరమైన ఆదేశం లేదా నిషేధం ఉల్లంఘించబడుతున్నదేమో తెలుసుకొనవచ్చును. ఈ ప్రకారం విధులు నిర్వహిస్తున్న లేదా ఈ సబ్ సెక్షను ప్రకారం ప్రవేశించడానికి బలప్రయోగం చేసిన కార్యనిర్వాహణాధికారి పైనా లేదా కార్యనిర్వాహణాధికారిచే అట్టి అధికారాలు చట్టపరంగా దఖలు పరచబడిన వ్యక్తిపైనా నష్టం (damage) లేదా అసౌకర్యం కల్పించారని క్లెయిమ్ దాఖలు చేయడానికి వీలులేదు.

(6) ఏదేని లైసెన్సు లేదా అనుమతిని రద్దు చేసినా లేదా నిలుపుదల చేసినా లేదా దానియొక్క కాలపరిమితి లేదా పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోవటానికి ఉన్న కాల పరిమితి ముగిసినా, అట్టి రద్దు లేదా నిలుపుదల ఉత్తర్వులు రద్దు అయ్యేవరకూ లేదా 11వ సబ్‌సెక్షనుకు లోబడి లైసెన్సు లేదా అనుమతి పునరుద్ధరణ జరిగే వరకూ ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన రూల్స్ లేదా బైలాలకు సంబంధించినంత వరకూ లైసెన్సు లేదా అనుమతి లేనట్లుగానే పరిగణించబడుతుంది.

(7) లైసెన్సు లేదా అనుమతి పొందిన వ్యక్తి, అట్టి లైసెన్సును లేదా అనుమతిని, వాటి అమలులో ఉన్న కాలంలో, కార్యనిర్వహణాధికారి అడిగినప్పుడు చూపించవలసి ఉంటుంది.

(8) ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన రూల్సు లేదా బైలాలననుసరించి పొందవలసిన లైసెన్సును పొందని లేదా రిజిస్ట్రేషన్ చేయని నేరానికి శిక్షంపబడినప్పుడు, మెజిస్ట్రేట్ వారు విధించే జరిమానాకు అదనంగా అట్టి అనుమతి లేదా లైసెన్సు లేదా రిజిస్ట్రేషన్ కొరకు చెల్లించవలసిన ఫీజు వసూలు చేసి గ్రామపంచాయితీకి చెల్లింపు చేయడమే గాకుండా, ప్రాసిక్యూషన్ ఖర్చులను కూడా నిర్ణయించిన ప్రకారం గ్రామపంచాయితీకి చెల్లించమని ఆదేశించ వచ్చును.

(9) ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన రూలు, బైలా లేదా రెగ్యులేషన్ ప్రకారం లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషన్ కొరకు లేదా పునరుద్ధరణ కొరకు చేసే దరఖాస్తును కాల పరిమితి ప్రారంభం కావటానికి ముందుగా కనీసం 30 రోజులకు తగ్గకుండా, 90 రోజులకు మించకుండా లేదా దరఖాస్తులో పేర్కొన్న కనీస గడువు లోపల సమర్పించాలి.

(10) సబ్ సెక్షను (8) ప్రకారం వసూలు చేయబడ్డ ఫీజు శిక్షింపబడ్డ వ్యక్తి లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషన్‌కు అర్హత కల్పించదు.

(11) లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషన్ నిమిత్తం గ్రామపంచాయితీ లేదా గ్రామపంచాయితీ తరపున ముందస్తుగా వసూలు చేయబడ్డ ఫీజు, అట్టి చెల్లింపు చేసిన వ్యక్తి లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషనుకు అర్హత కల్పించదు. కానీ లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషన్ తిరస్కరింపబడినట్లయితే చెల్లించిన మొత్తాన్ని తిరిగి పొందవచ్చును. లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ కొరకు దరఖాస్తు చేసిన వ్యక్తి, అట్టి దరఖాస్తు మీద ఉత్తర్వులు తెలియచేయబడే వరకూ లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషను పునరుద్ధరింపబడినట్లుగానే వ్యవహరించ వచ్చును. లైసెన్సు లేదా అనుమతి లేదా రిజిస్ట్రేషన్ కొరకు చేయబడ్డ దరఖాస్తులపై స్వీకరించిన తేదీ నుండి 30 రోజుల లోపు లేదా కొన్ని రకాల కేసుల్లో అంతకంటే ఎక్కువగా నిర్దేశించిన గడువులోపల కార్యనిర్వాహణాధికారి ఉత్తర్వులను జారీ చేయనట్లయితే, అట్టి దరఖాస్తు సాధారణ కాలపరిమితికి, సాధారణంగా విధించబడే షరతులకు, చట్టానికి, రూల్సుకు, బైలాలకు లోబడి మంజూరు అయినట్టుగా భావించాల్సి ఉంటుంది.




## అప్పీలు - రెండవ అప్పీలు

లైసెన్సును లేదా అనుమతిని మంజూరు చేస్తూ, తిరస్కరిస్తూ, నిలిపివేస్తూ లేదా రద్దు చేస్తూ కార్యనిర్వాహణాధికారి జారీ చేసిన ఉత్తర్వులపై గ్రామపంచాయితీకి అప్పీలు దాఖలు చేసుకొనవచ్చునని ఈ చట్టంలోని 128వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి అప్పీలులో గ్రామపంచాయితీ నిర్ణయంపై రెండవ అప్పీలును నిర్దేశిత అధికారి వద్ద దాఖలు చేయవచ్చును. అట్టి అధికారి నిర్ణయమే తుది నిర్ణయమవుతుంది.

గ్రామపంచాయితీ నిర్ణయంపై ఇట్టి రెండవ అప్పీలును జిల్లా పంచాయితీ అధికారి వద్ద దాఖలు చేయవచ్చునని ఆంధ్రప్రదేశ్ గ్రామపంచాయితీ (రెండవ అప్పీలు) రూల్సు 2000లో పేర్కొన్నారు.

అప్పీలుకు కాలపరిమితిని ఈ చట్టంలోని 129వ సెక్షనులో పేర్కొన్నారు. ఈ చట్టంలోని అంశాలలో అప్పీలు దాఖలు చేయుటకు అవకాశాన్ని కల్పిస్తూ, అప్పీలు కాలపరిమితిని నిర్దేశించనట్లయితే, అట్టి అప్పీలును అప్పీలు చేయవలసిన ఉత్తర్వును తీసుకున్న తేదీ నుండి 30 రోజుల లోపు దాఖలు చేయవలసి ఉంటుంది.

## లైసెన్సును పొందవలసిన అవసరం లేనివారు

ప్రభుత్వం, మార్కెట్ కమిటీలు లైసెన్సు లేదా అనుమతిని పొందవలసిన అవసరం లేదని ఈ చట్టంలోని 130వ సెక్షనులో పేర్కొన్నారు. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వం లేదా మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ లేదా ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పత్తి మరియు లైవ్ స్టాక్) మార్కెట్ చట్టం 1966 ప్రకారం ఏర్పడిన మార్కెట్ కమిటీ స్వాధీనంలో లేదా అధికారం క్రింద ఉన్న ప్రదేశానికి సంబంధించి ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన రూల్సు, బైలాలు లేదా రెగ్యులేషన్‌ల ప్రకారం తీసుకొనవలసిన లైసెన్సు లేదా అనుమతి పొందవలసిన అవసరం లేదు.

## పంచాయితీ నోటీసు

ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించబడిన రూల్సు, బైలా లేదా రెగ్యులేషన్ ప్రకారం ఏ వ్యక్తికైనా, ఏదేని పనిచేయమని, లేదా చర్యలు చేపట్టమని నోటసు, రిక్విజిషన్ లేదా ఉత్తర్వు జారీ చేసినప్పుడు, అట్టి నోటీసులో అట్టి పని చేయుటకు లేదా చర్యలు

చేపట్టుటకు నిర్దిష్ట కాలపరిమితిని పేర్కొనవలసి ఉంటుందని ఈ చట్టంలోని 131వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి నోటీసు, రిక్విజేషన్ లేదా ఉత్తర్వులో పేర్కొన్న ఆదేశాన్ని అందులో పేర్కొన్న కాలవరిమితిలోపు పూర్తి చేయక పోయినట్లయితే కార్యనిర్వాహణాధికారి అట్టి పనిని పూర్తిచేసి లేదా నోటీసు, రిక్విజేషన్ లేదా ఉత్తర్వును సక్రమంగా అమలు జరుపుటకు అవసరమని భావించిన చర్యలను చేపట్టి, అందుకు అయిన ఖర్చులన్నింటిని సంబంధిత వ్యక్తి నుండి వసూలు చేయవచ్చును. అట్టి నోటీసు,రిక్విజేషన్ లేదా ఉత్తర్వును అమలు చేయనందుకు నిర్దిష్టమైన జరిమానా పేర్కొననట్లయితే, అట్టి వ్యక్తికి, అట్టి ప్రతి నేరానికి శిక్షగా రు. 50/- కి మించని జరిమానా విధించబడుతుంది.

కార్యనిర్వాహణాధికారి లేదా అతని చేత అధికారమీయబడిన వ్యక్తి నిబంధనలకు లోబడి సూర్యోదయానికి, సుర్యాస్తమయానికి మధ్యలో ఏ రోజైనా, ఏ ప్రదేశంలోకైనా, నోటీసునిచ్చిగాని, ఇవ్వకుండానే గాని, సహాయకులను లేదా పనివారలను తీసుకొని గాని లేదా లేకుండా గానీ ఈ చట్టం లేదా ఈ చట్టం క్రింద రూపొందించిన రూలు, బైలా,రెగ్యులేషన్ లేదా ఉత్తర్వును అమలు జరుపుటకు ప్రవేశించి విచారణ, inspection, test, examination, సర్వే, కొలతలు లేదా వెల కట్టు (valuation) లేదా ఏదేని ఇతర పని చేయవచ్చునని ఈ చట్టంలోని 132వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ సెక్షను క్రింద విధులు నిర్వహించే క్రమంలో లేదా ప్రవేశానికి వీలుకలిగించే విధంగా బల ప్రయోగం చేయటం వలనగానీ అట్టి వ్యక్తిపై నష్టం లేదా అసౌకర్యం కలిగించారని క్లెయిమ్ చేయటానికి వీలులేదు.

## తూనికలు - కొలతలు - పరిశీలన

కార్యనిర్వాహణాధికారి లేదా అతనిచే అధికారమీయబడిన వ్యక్తి భారతీయ శిక్షా స్మృతిలోని XIIIవ అధ్యాయంలో పేర్కొనబడిన తూనికలు, కొలతలకు సంబంధించిన నేరాలను నిరోధించుటకు గ్రామంలోని మార్కెట్లు మరియు దుకాణాల్లో ఉపయోగించబడుతున్న తూనికలు, కొలతలను పరిశీలించుట, పరీక్షించుట చేయవచ్చునని ఈ చట్టంలోని 133వ సెక్షనులో పేర్కొన్నారు.

## సమాచార సేకరణ

కార్యనిర్వాహణాధికారి లిఖిత పూర్వకమైన ఉత్తర్వుల ద్వారా గ్రామపంచాయితీపై అజమాయిషీ (jurisdiction) గల కార్యనిర్వాహణాధికారి నుండి అతని పరిధిలో గల గ్రామానికి లేదా అందులోని భాగానికి, లేదా వ్యక్తికి లేదా ఆస్థికి సంబంధించి, సంబంధిత (such categories) సమాచారాన్ని ఇవ్వవలసినదిగా కోరవచ్చునని, అట్టి కార్యనిర్వాహణాధికారి అట్టి ఉత్తర్వులను అమలు జరపాలని ఈ చట్టంలోని 134వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి ఉత్తర్వులలో దానిని అమలు జరుపుటకు సంబంధించిన




నిర్దిష్ట కాలపరిమితిని పేర్కొనాలి. అయితే కార్యనిర్వాహణాధికారి అట్టి కాలపరిమితిని పొడిగించవలసిందిగా ఎప్పటికప్పుడు కోరవచ్చును.

## బాకీల వసూళ్ళు, నేరవిచారణ - కాలపరిమితి

గ్రామపంచాయితీ వసూలు చేయవలసిన బాకీలకు సంబంధించిన కాలపరిమితిని ఈ చట్టంలోని 135వ సెక్షనులో పేర్కొన్నారు. ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన రూలు, బైలా, రెగ్యులేషన్ లేదా ఉత్తర్వు మేరకు గ్రామపంచాయితీకి చెల్లించవలసిన పన్ను లేదా ఇతర మొత్తాన్ని వసూలు చేయుటకు మొదటిగా తాఖీదు నిచ్చి ఉండవలసిన, మొదటిగా దావా వేసి ఉండవలసిన లేదా మొదటిసారిగా ప్రాసిక్యూషన్ ప్రారంభించి యుండవలసిన నాటి నుండి మూడు సంవత్సరాల కాలపరిమితి తరువాత తాఖీదునివ్వరాదు, దావా వేయరాదు, ప్రాసిక్యుషన్ ప్రారంభించరాదు.

ప్రాసిక్యూట్ చేయుటకు అధికారం గల వ్యక్తుల గురించి ఈ చట్టంలోని 136వ సెక్షనులో పేర్కొన్నారు. ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందిచబడిన రూలు లేదా బైలా, ఉల్లంఘన నేరాలకుగాను, నేరం జరిగిన నాటి నుండి 12 నెలలోపు పోలీసు, కార్యనిర్వాహణాధికారి లేదా ఇందునిమిత్తమై గ్రామపంచాయితీ లేదా కార్యనిర్వాహణాధికారి చేత అధికార మీయబడ్డ వ్యక్తి ఫిర్యాదు చేయక పోయినట్లయితే ఏ వ్యక్తిని అందునిమిత్తం విచారించుటకు (prosecute) వీలులేదు.

అయితే ఈ చట్టం ప్రకారం లైసెన్సు, అనుమతి లేదా రిజిస్ట్రేషన్ అవసరమైన వాటికి అట్టి లైసెన్సులో కాలపరిమితి ఏదైనా ఉండేటట్లయితే అట్టి పరిమితి పూర్తి అగునాటి వరకూ కొనసాగుతున్న (continuing) నేరంగా భావించబడుతుంది. అట్టి కాలపరిమితి లేనట్లయితే నేరం ప్రారంభమైన నాటినుండి 12 మాసాల లోపు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

నేరాల రాజీ (compounding of offence) గురించి ఈ చట్టంలోని 137వ సెక్షనులో పేర్కొన్నారు. కార్యనిర్వాహణాధికారి నిబంధనలకు లోబడి రు. 500/-లు మించని మొత్తానికి ఈ చట్టం లేదా ఈ చట్టం




ప్రకారం రూపొందించిన రూలు లేదా బైలా ఉల్లంఘన నేరాలల్లో రాజీ చేయదగ్గ నేరాలుగా రూల్సు ప్రకారం ప్రకటించబడ్డ వాటిని రాజీ చేయవచ్చును.

నేర విముక్తి నిమిత్తం చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించిన తర్వాత, ఉల్లంఘన చేసిన వ్యక్తి మీద అట్టి నేరానికి సంబందించి ఏ విధమైన తదుపరి చర్యలు చేపట్టరాదు.

ఈ సెక్షనులో పేర్కొన్న విషయాలేవీ ఎన్నికల నేరాలకు వర్తించవు.

కార్యనిర్వాహణాధికారి తలపెట్టిన ప్రతి విచారణ (Prosecution) లేదా రాజీ చేయబడ్డ (compounded) నేరం వివరాలను తదుపరి గ్రామపంచాయితీ సమావేశంలో తెలియపరచాలని ఈ చట్టంలోని 138వ సెక్షనులో పేర్కొన్నారు.

## పంచాయితీకి దావా నోటీసు

గ్రామపంచాయితీకి వ్యతిరేకంగా చర్యకు నోటీసు జారీ చేయుట గురించి ఈ చట్టంలోని 138-ఎ సెక్షనులో పేర్కొన్నారు. గ్రామపంచాయితీ లేదా కార్యనిర్వాహణాధికారి లేదా ఎవరైనా సభ్యుడు, లేదా అట్టి గ్రామపంచాయితీ, సర్పంచ్, కార్యనిర్వాహణాధికారి, సభ్యుడు, అధికారి లేదా సేవకుని ఆదేశాలపై పనిచేసే ఏ వ్యక్తిపైనా ఈ చట్టం ప్రకారం చేసిన పనికి లేదా ఈ చట్టాన్ని లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన రూలు, బైలా, రెగ్యులేషన్ లేదా ఉత్తర్వును అమలు జరిపే క్రమంలో నిర్లక్ష్యంగా లేదా ఉల్లంఘనగా వ్యవహరించినందుకు దావా గానీ లేదా ఇతర న్యాయ ప్రక్రియగాని 60 రోజుల ముందుగా లిఖిత పూర్వక నోటీసు జారీ చేయకుండా వేయరాదు. అట్టి నోటీసులో దావా వేయనున్న వ్యక్తి పేరు, అతని నివాసం, దావాకుగల కారణం, దావాలోని ప్రార్థన స్వభావము, కోరుతున్న నష్టపరిహారం యొక్క మొత్తం వివరాలతో గ్రామపంచాయితీ కార్యాలయంలో సమర్పించాలి. అట్టి ప్రక్రియ (Proceedings) ను సర్పంచ్, కార్యనిర్వాహణాధికారి, సభ్యుడు, అధికారి, సేవకుడు లేదా వ్యక్తి మీద చేపడుతున్నట్లయితే అతని నివాసం వద్ద కూడా అందజేయాలి. అట్టి నోటీసు లేకుండా కోర్టు సదరు దావాను లేదా లీగల్ ప్రొసీడింగును చేపట్టరాదు.

స్థిరాస్థిని తిరిగి పొందేందుకు లేదా యాజమాన్యపు హక్కు నిర్ధారించేందుకు వేసే ప్రొసీడింగులు మినహా మిగతా అన్ని ప్రొసీడింగులు అట్టి చర్యకు కారణం (Cause of action) ఉత్పన్నమైన నాటి నుండి ఆరు మాసాల లోపు దాఖలు చేయాలి. నిరంతర నష్టం (Continuing injury of damage) కు సంబంధించినట్లయితే అట్టి నష్టకరమైన చర్య కొనసాగుతున్న కాలంలోనూ లేదా అది ముగిసిన నాటి నుండి ఆరు మాసాల లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది.

## పోలీసు సహకారం

గ్రామపంచాయితీకి పోలీసుల సహకారం గురించి ఈ చట్టంలోని 139వ సెక్షనులో పేర్కొన్నారు. ప్రతి పోలీసు అధికారి తన పరిధిలోని గ్రామంలో గ్రామపంచాయితీ, దాని అధికారులు, సేవకులు వారి చట్టపరమైన అధికారాన్ని నిర్వహించటంలో సహకరించాలి.

## విధినిర్వహణకు ఆటంకాలు

కార్యనిర్వాహణాధికారిని లేదా కార్యనిర్వాహణాకారి చేత చట్ట పరంగా అధికారాలు దఖలు పర్చబడ్డ వ్యక్తిని ఏదేని ప్రదేశం, భవనం లేదా భూమిలోకి ప్రవేశించకుండా నిరోధించి అతని చట్టపరమైన అధికారాన్ని వినియోగించడాన్ని ఆటంకరపరచిన వ్యక్తి భారతీయ శిక్షాస్మృతిలోని 344వ సెక్షను ప్రకారం నేరం చేసినట్లుగా పరిగణించబడతాడు అని ఈ చట్టంలోని 140 వ సెక్షనులో పేర్కొన్నారు.

గ్రామపంచాయితీని లేదా సర్పంచ్‌ని, కార్యనిర్వాహణాధికారిని లేదా గ్రామపంచాయితీ సభ్యుని లేదా గ్రామపంచాయితీ ఉద్యోగిని, లేదా ఈ చట్టంలోని అంశాలు లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించబడిన రూల్స్ ప్రకారం విధులు నిర్వహించుటకు గ్రామపంచాయితీచే నియమించబడ్డ ఏ వ్యక్తినైనా తన విధులు నిర్వహించుటలో ఆటంకపరచినా లేదా అటంక పరచుటకు ప్రయత్నించినా, ఈ చట్టం ప్రకారం విధులను నిర్వహించే క్రమంలో ఏర్పాటు చేయబడిన గుర్తులను (marks indicating any level or direction) తొలగించినా, నాశనం చేసినా, చెరిపివేసినా, ఈ చట్టం ప్రకారం ఉన్న అధికారాలననుసరించి గ్రామపంచాయితీ ఏర్పాటు చేసిన నోటీసును తొలగించినా అట్టి వ్యక్తి రు.50/-లుకి మించని జరిమానాకు శిక్షార్హుడు అని ఈ చట్టంలోని 141వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టం ప్రకారం సమాచారం ఇవ్వమని కోరినప్పుడు అట్టి సమాచారం ఇచ్చుటకు నిరాకరించినా లేదా తెలిసి కూడా తప్పుడు సమాచారం ఇచ్చినా అట్టి వ్యక్తి రు. 10/-లుకి మించని జరిమానాకు శిక్షార్హుడు అని ఈ చట్టంలోని 142వ సెక్షనులో పేర్కొన్నారు.

## ప్రత్యేక అధికారుల నియామకం

ఏదైనా ఒక ప్రాంతాన్ని ఈ చట్టంలోని 3వ సెక్షను ప్రకారం తొలిసారిగా గ్రామంగా ప్రకటించినప్పుడు. గ్రామపంచాయితీ, దాని సర్పంచ్, దాని కార్యనిర్వాహణాధికారి, సభ్యుల ఎన్నిక కాబడి అధికారంలోకి రావలసిన సర్పంచ్, సభ్యుల అధికారాలను నిర్వర్తించుటకు ప్రత్యేక అధికారిని కమీషనర్ వారు నియమించవలసి ఉంటుంది అని ఈ చట్టంలోని 143వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి ప్రత్యేక అధికారి, ఇందుకొరకు కమీషనర్ వారు నిర్ధారించిన తేదీలోపుగా పంచాయితీ సభ్యుల ఎన్నికకు ఏర్పాట్లు చేయాలి.

అయితే అట్టి తేదీలోపు ఎన్నికలు ఏ కారణంచేతైనా పూర్తికావని కమీషనర్ భావించినట్లయితే అట్టి తేదీని వాయిదా వేయవచ్చును.

అట్టి గ్రామపంచాయితీ ఎన్నికల ప్రక్రియ పూర్తికానట్లయితే ప్రభుత్వం లేదా ప్రభుత్వంచే నియమించబడ్డ అధికారి అట్టి గ్రామపంచాయితీకి ప్రత్యేక అధికారిని లేదా పర్సన్ ఇన్ చార్జిని లేదా పర్సన్ ఇన్ చార్జి కమిటీని నియమించాలల్సి ఉంటుంది.

ఈ విధంగా నియమించబడ్డ ప్రత్యేక అధికారి లేదా పర్సన్ ఇన్ చార్జి లేదా పర్సన్ ఇన్ చార్జి కమిటీ సర్పంచ్ సభ్యులు ఎన్నిక కాబడి బాధ్యతలు స్వీకరించే వరకూ గ్రామపంచాయితీ, దాని సర్పంచ్, కార్యనిర్వాహణాధికారి యొక్క విధులను నిర్వహించాలి.

## కులమతాలకు అతీతంగా

గ్రామపంచాయితీలోని లేదా గ్రామపంచాయితీ చేత నిర్వహించబడుతున్న అన్ని రోడ్లు, మార్కెట్లు, బావులు, చెరువులు(tanks) రిజర్వాయర్లు, నీటి దారులు (waterways) కుల మతాలతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఈ చట్టంలోని 144వ సెక్షనులో పేర్కొన్నారు.

మూడు సంవత్సరాలకు మించని కాలపరిమితితో గ్రామపంచాయితీ తగిన షరతులకు లోబడి ఈ చట్టం లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించబడిన రూలు, బైలాల లేదా రెగ్యులేషన్ ప్రకారం రావలసిన ఫీజు చెల్లింపులను నిర్ధారించే అధికారం గ్రామపంచాయితీకి కలదని ఈ చట్టంలోని 145వ సెక్షనులో పేర్కొన్నారు.




## మున్సిపాలిటీ చట్టాల వర్తింపు

గ్రామపంచాయితీ విజ్ఞప్తి మేరకు గానీ లేదా ఇతరత్రా గానీ ఏదేని నిర్దిష్ట ప్రాంతానికి మున్సిపాలిటీలకు సంబంధించిన చట్టంలోని అంశాలు లేదా రూల్సు, పన్నులకు సంబంధించిన అంశాలతో సహా వర్తిస్తాయని కమీషనర్ నోటిఫికేషన్ జారీ చేయుట ద్వారా ప్రకటించవచ్చునని ఈ చట్టంలోని 146వ సెక్షనులో పేర్కొన్నారు.

అట్టి నోటపై చేయబడిన అంశాలను వాటి మౌలిక స్వభావానికి విరుద్ధం కాకుండా, సదరు గ్రామానికి లేదా ప్రాంతానికి అవుసరమైన మార్పులతో అన్వయించుకోవాలి.

పైన పేర్కొన్న అంశాలను సాదారణ స్వభావానికి భంగం కలుగకుండా, అట్టి అంశాల్లో మున్సిపల్ కౌన్సిల్ లేదా ఛైర్ పర్సన్ లేదా కార్యనిర్వహణాధికారి అని ఉన్న చోట గ్రామపంచాయితీ లేదా సర్పంచ్ లేదా కార్యనిర్వాహణాధికారి అని వర్తించుకోవాలి. మున్సిపల్ కౌన్సిల్ యొుక్క అధికారి లేదా సేవకుడు అని ఉన్న చోట గ్రామపంచాయితీ అధికారి లేదా సేవకుడు అని, మున్సిపల్ పరిధి అని ఉన్నచోట గ్రామపరిధి లేదా నిర్దేశించిన ప్రాంత పరిధిగాను వర్తింపుజేసుకోవాలి.

## అధికారాల బదలాయింపు

గ్రామపంచాయితీ అధికారాలను ఇతర స్థానిక సంస్థలకు బదలాయించుట, అలాగే ఇతర స్థానిక సంస్థల అధికారాలను గ్రామపంచాయితీకి బదలాయించుట గురించి ఈ చట్టంలోని 147వ సెక్షనులో పేర్కొన్నారు.

మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ లేదా ఏదేని ఇతర స్థానిక సంస్థను, సంబంధిత గ్రామ పంచాయితీని సంప్రదించి ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా అందులో పేర్కొనబడిన పరిమితులకు, షరతులకు మరియు నియంత్రణకు లోబడి;

(ఎ) ఈ చట్టం ప్రకారం గ్రామపంచాయితీకి గల ఏదేని అధికారాన్ని లేదా విధిని మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ లేదా ఏదేని ఇతర స్థానిక సంస్థ చేత చేయబడుటకు బదిలీ చేయవచ్చును;

(బి) మండల పరిషత్ లేదా జిల్లాపరిషత్ లేదా ఇతర స్థానిక సంస్థకుగల ఏదేని అధికారాన్ని లేదా విధిని గ్రామపంచాయితీ చేత చేయుబడుటకు బదిలీ చేయవచ్చును.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ లిమిటెడ్‌ను కూడా ఈ సెక్షను ప్రకారం "స్థానిక సంస్థ" గానే పరిగణించాల్సి ఉంటుందని వివరణ ఇవ్వబడింది.

- వి. రఘు
న్యాయవాది

# దోమా, దోమా.. నీకు వందనం

హాస్య కథల పోటీ విభాగంలో ద్వితీయ బహుమతి పొందిన కథ

- కె. కోటేశ్వరరావు



"మహానగరంలో చికెన్‌గున్యా, మలేరియా, జ్వరాలు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి" కాబట్టి, నగర ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం మందులను సరఫరా చేస్తుంది", అని టి.వి.లో ఒకటే తెలియచేస్తున్నారు. రాఘవకాలనీలో 'రాఘవరావు' అప్పుడే ఆ వార్తలు విని లైట్ తీసి అలా తన రూములో పడుకున్నాడు.

'ఝుమ్మందినాదం' అంటూ ఇంతలో ఎక్కడి నుంచో ఝుమ్ ఝుమ్ అంటూ గాల్లో తేలుతూ కళ్ళు పెద్దవి చేసుకొని వచ్చింది మహమ్మారి 'దోమ' రెడ్ బెడ్ ల్యాంప్ వెలుగులో హాయిగా నిద్రిస్తున్న రాఘవరావుని, జానకిని వాళ్ళపాప పావనీని చూస్తూ ఉంది.

తల్లి జానకి జానకీ దేవిలా ఉంది.

పాప పావని ముద్దు ముద్దుగా ఉంది.

తండ్రి రాఘవరావుని చూడగానే చిరాకేసింది. ఇటువంటి వాళ్ళని చూస్తేనే కుట్టి కుట్టి ఏడ్పించాలనిపిస్తుంది. వాళ్ళ రక్తాన్ని కోకోకోలా లాగా త్రాగాలనిపిస్తుంది. వయ్యారంగా దోమ రాఘవరావు మోకాళ్ళ క్రింది భాగాన వ్రాలింది. గుబురు గుబురు వెంట్రుకల నడుమ దాగి కసిగాగ్రుచ్చి హాయిగా దాని 'స్ట్రా'తో రక్తం పీల్చుకోసాగింది. రాఘవరావు నిద్రలో గ్రుచ్చుకున్నట్లు అనిపించి చేయి పెట్టి మోకాళ్ళ మీద కొట్టాడు. వెంటనే దోమ దొరకకుండా తప్పించుకుని పారిపోయింది. పాడు

మానవుడు, రక్తాన్ని పీల్చనివ్వకుండా నన్ను మర్డర్ చేయాలనుకున్నాడు. నేను దొరుకుతానా అని కుట్టి తుర్రుమని ఎగిరిపోయింది.

తెల్లారి లేచేసరికి ఒళ్ళంతా నొప్పులు. ఏ పనీ చేయబుద్ధి కాలేదు. ఒళ్ళంతా నలతగా ఉంది. ఆరోజు పనులన్నీ నెమ్మదిగానే సాగాయి. ఆఫీస్‌కి వెళ్ళాడు కాని, ఏ పనీ చేయబుద్ధి కాలేదు. ఏ పని ముందుకు సాగటం లేదు. ఒంట్లో ఒకటే నలత. వెంటనే ఆఫీస్ నుంచి డాక్టర్‌గారి వద్దకు వెళ్ళాడు.

డాక్టర్‌గారు, ఎప్పటినుంచి మీకు జ్వరం అని అడిగారు. ఒంట్లో నలతగా ఉందా? అయితే ఇది దోమకాటు వల్ల కాబట్టి, మీరు 4 రోజులు సెలవు తీసుకోండి అని చెప్పారు. అలా 'దోమకాటు వలన' ఆరోజు అంతా నష్టపోయాడు రాఘవరావు. ఈ దోమల వలనే అన్ని వ్యాధులు. వాటిని నిర్మూలించాల్సిన మునిసిపాలిటి వాళ్ళ మీద కేసు వేస్తా. ముందుగా ఈ లేఖ వ్రాయాలి అని లేఖ వ్రాయుటం ప్రారంభించాడు.

గౌరవనీయులు మేయర్ గార్కి,

నమస్కరించి మీ నగరపౌరుడు రాఘవరావు వ్రాయునది. మహానగరంలో మీ పాలనలో చెత్తా చెదారం తీయకపోవటం వలన, దోమల బాధ ఎక్కువైంది. మీ చేతకానితనం వలన, మీరు మురికి నిర్మూలన కావించకపోవటం వలన 'దోమలు ఒక సామ్రాజ్యాన్ని స్థాపించాయి. ఈ మహానగరంలో మీరు, మీ నగరపాలికల వారి పోషణలో పెంచి పోషించబడ్డ ఒక 'దోమ' మా ఇంట్లో దూరి నన్ను కుట్టడం వలన నా ఆరోగ్యం దెబ్బతిన్నది. అది ఏ రోగమో చికెన్‌గున్యానో, మటన్ గున్యానో నాకేమీ తెలియటంలేదు. నాకు ఆరోగ్యం దెబ్బతినటం వలన ఆఫీస్‌కి వెళ్ళకపోవటం వలన వేలల్లో నష్టం ఏర్పడింది. నా ఆరోగ్యం దెబ్బతిన్నది. దానికి మీరే బాధ్యత వహించాలి. నా నష్టాన్ని భర్తీ చేయాలి. లేకపోతే పౌరుల ఆరోగ్య భద్రతను కాపాడలేని మీరు నష్టపరిహారం చెల్లించాలి. లేకపోతే తీవ్రపరిణామాలు ఎదుర్కొనవల్సి వస్తుంది.

ఇట్లు
మీ చికెన్‌గున్యా బాధితుడు
(చిగుబా) రాఘవరావు

మేయరు ఉత్తరం అందుకున్నాడు. వెంటనే లేఖ వ్రాశాడు అందిన రిజిష్టర్ పోస్ట్‌ను ఆత్రంగా చించి చదవడం ప్రారంభించారు రాఘవరావు.

చిగుబా రాఘవరావు గార్కి,

మీ లేఖ విచిత్రంగా ఉంది. దోమకాటుకు మేమొక్కరమే కారణం అంటూ వ్రాసిన లేఖ హాస్యాస్పదంగా ఉంది. మీ ఇళ్ళ వద్ద మురికి గుంటలు మీరు శుభ్రం చేసుకోకపోవటం వలన 'దోమలు సామ్రాజ్యం స్థాపించాయి'. మీరు మాకు శుభ్రం చేయుటలో సహకరించటం లేదు. కాబట్టి దోమలు కుట్టాయి. మీ ఇంట్లో మీరు మురికితో పాటు దోమలు పెంచటం వలన మీ దోమే మిమ్మల్ని కుట్టిందోచ్. కాబట్టి బాధ్యత మాదికాదు అని మీకు సవినయంగా తెలియపరుస్తున్నాం.

ఇట్లు
మీ మేయరు

అయ్యా, మేయర్ గారూ

మీ ఉత్తరం మీ పనితీరుని స్పష్టం చేస్తుంది. మా ఇంటి ముందున్న మురికిగుంట, మీరు వేసిన కల్తి తారురోడ్డు విరగటం వలన ఏర్పడింది. మురికిగుంటలు మీ వలనే ఈ కాలనీలో ఏర్పడ్డాయి. కాబట్టి దోమలు పెరిగిపోయాయి. కాబట్టి మీరు బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించండి. నా పేరు చికెన్‌గున్యా బాధితుడు రాఘవరావు అని గుర్తుంచుకోండి.

ఇట్లు
చిగుబా రాఘవరావు

అయ్యా,

చిగుబా రాఘవరావు గారికి మీ కాలనీలో మురికిగుంటలకి దోమల మందు, స్ప్రే చేయడం జరిగింది. మీ కాలనీలో అన్ని చోట్ల చల్లడం జరిగిందని మా రికార్డులు ఋజువు పరుస్తున్నాయి. ఇంటింటికి వెళ్ళి అడిగి, చల్లిన వివరాలు ఉన్నాయి. అందులో ఇష్టంలేదని చల్లించుకోనివారి ఇంటి నెంబర్స్ లిస్ట్‌లో మీ ఇల్లు ఉంది. కాబట్టి మీరే బాధ్యతారహితంగా దోమలను పెంచడం జరిగిందని భావిస్తూ 'దోమల నివారణకు ఆటంకం కల్గించిన' మీపై చట్టబద్దంగా చర్య తీసుకుంటాం.

ఇట్లు
మేయరు

అయ్యా, మేయర్‌గారు!

మీ లేఖ అందినది. మీరు మందులు చల్లించుకోలేదు మీపై చర్య తీసుకుంటాం అని వ్రాశారు. మందులు కొట్టేందుకు కావాలని మధ్యాహ్నం లేదా వేళపాళా లేకుండా వస్తారు. మేము ఉద్యోగులం. ఇళ్ళల్లో ఉందని సమయంలో వచ్చి లేరని చల్లినట్లు దొంగలెక్కలు వ్రాసుకుంటారు. కాబట్టి దోషం మీదేనని ఒప్పుకోండి. అలాగే మందులు



చల్లిస్తున్నాం అని అంటున్నారు అలాంటి కల్తీ మందులు తిని దోమలు చావకుండా ఇంకా కుడుతున్నాయి. కాబట్టి మీరు నిజంగా దోమల నివారణ చేపట్టండి. ప్రజల ఆరోగ్య భద్రత మీపై ఉంది. ఈ ఉత్తరాల ఖర్చు కూడా కలుపుకొని నష్టపరిహారం చెల్లించగలరు.

ఇట్లు
చిగుబా రాఘవరావు

చిగుబా రాఘవరావు గార్కి,

ఉత్తరాలు వ్రాయటంలో చూపించటంలోని శ్రద్ధలో సగం శ్రద్ధ మీరు మీ పరిసరాల శుభ్రతపై శ్రద్ధ వహించండి. మీరు ఋజువులు లేని నేరారోపణ చేస్తున్నారు. మీరు గ్యాస్ బండ ప్రక్కవారికి అప్పచెప్పినట్లు మందులు చల్లించుకునే బాధ్యత కూడా అప్పగించండి. కల్తీలు అంటున్నారు, అంత అనుభవం మాకు లేదు అని నొక్కి వక్కాణించుచున్నాము.

ఇట్లు
మీ మేయర్, మహానగర్

మేయర్ గార్కి

ఇప్పటికి దోమకాటు వలన నష్టపోయి అనారోగ్యం పాలైనాను. మీతో వాదించే ఓపిక లేదు. నాకు నష్ట పరిహారం చెల్లించగలరు. లేదా మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించమంటారా?

మీ
చిగుబా రాఘవరావు
రాఘవ కాలనీ

అయ్యా, చిగుబా రాఘవరావు గార్కి,

మీరు మాట్లాడితే కోర్టులు, మానవ హక్కుల సంఘం అంటూ బెదిరిస్తున్నారు. ఇంతకీ మిమ్మల్ని కుట్టిన దోమ మాదేనని ఆధారాలు ఉన్నాయా? మీరే చెత్తను మీ ఇంటిలో పెంచటం వలన దోమల సంతతి పెరిగింది. దాని వలన మనరాష్ట్రం, దేశంలో దోమల సంతతి పెరిగింది. ఇది దేశద్రోహం కాదా? కాబట్టి ప్రతి పౌరుడు దోమల నివారణలో తమ బాధ్యత వహించాలి. కావున మేము మీపై చర్య తిసుకొనగలము. మిమ్మల్ని కుట్టిన దోమ మాది కాదని నిరూపించ లేకపోతే మీపై మీ నేరానికి తగ్గ చర్య తీసుకోవాల్సి ఉంటుంది.

ఉత్తరం చదివి చిగుబా రాఘవరావు భయపడి లాయర్ విశ్వనాథ్ వద్దకు పరిగెత్తాడు. ఇంత విచిత్రమైన కేసు తాను ఇంతవరకు చూడలేదని ఆయన ఆలోచనలో పడ్డాడు. అతనికి తెల్సిన విలేఖరికి ఈ విషయం తెల్పాడు. అంతే మర్నాడు పేపర్లో పెద్ద హెడ్డింగ్ "దోమకాటు-నష్టపరిహారం"

వార్త వింతగా ఉండటంతో మిగిలిన అన్ని పత్రికలు పరిశోధన ప్రారంభించాయి. వార్తా ప్రచారం లభించటంతో మేయర్ వ్యతిరేక దారులు ఉద్యమం ప్రారంభించారు. మేయర్ మద్దతు దారులు కూడా ఇదంతా ప్రతిపక్షాలవాళ్ళ కుట్ర అని, "ప్రతిపక్షాల వాళ్ళు ఈ దోమలని




విమానాల నుంచి దిగుమతి చేస్తున్నారని "వ్యాఖ్యానించారు.

ప్రతిపక్షాలు మరింత రెచ్చిపోయాయి. దోమలను నిర్మూలించాల్సిన బాధ్యత మున్సిపల్ మేయర్‌గారిది. కాబట్టి దోమల నివారణ కాయిల్స్ మొదలైనవి ప్రజలకు ఉచితంగా యిస్తే, దోమల నివారణ సాధ్యం అని ఉద్యమించారు.

దోమల నివారణ చర్యలు చూసిన వెంటనే "జీవ కారుణ్య జీవ సంరక్షణ సంఘం" వారు జీవులు మానవుని అనాలోచిత చర్యకు చావాల్సిందేనా? అరికట్టాల్సిన అవసరం ఉందని ఉద్యమించారు. "దోమలను నిర్మూలించడం అన్యాయం, దోమలు వర్ధిల్లాలి అని ఉద్యమించారు.

టి.వి ఛానల్స్ వారుకూడా "దోమలకు జీవించే హక్కుఉందా? లేదా? అని చర్చలు ఏర్పాటు చేసారు.

దోమల్ని చంపాలా? వద్దా? అని "ఎస్" "నో" ఎస్ఎంఎస్ మెసేజ్ పోటీలు ఏర్పాటు చేశారు.

నగర వ్యాప్తంగా దోమ సంహారక మందులు చల్లే వారికి, జీవ పరిరక్షణ వారికి మధ్య హింస ప్రజ్వరిల్లింది. మనుషులు దోమల్లాగా చావసాగారు.

ఇంతలో ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. తీర్పు వచ్చే వరకు ఎవరు ఎటువంటి చర్యలు తీసుకోకూడదని కోర్టు ఆదేశించింది.

మున్సిపాలిటీ వాళ్ళు పారిశుద్ధ్యం పనులు నిలిపేశారు. వర్షాకాలం వచ్చింది. కుప్పల కుప్పలుగా దోమల జనాబా పెరిగింది. మస్కిటో కాయిల్, మందుల షాపువారికి డిమాండ్ పెరిగిపోయింది. వాటి సరఫరా ఆపివేయమని కోర్టు ఆదేశించింది.

"దోమలు ఒక సామ్రాజ్యంను ఏర్పాటు చేసుకున్నాయి. చికెన్ గున్యా, మలేరియా, పైలేరియా ఇంకా ఎన్నో వ్యాధులు ప్రబలిపోతున్నాయి." అంటూ లేఖలు రాస్తున్న రాఘవరావు దోమల రాఘవరావు అని పేరొచ్చింది. దానితోపాటు చికెన్‌గున్యా, బోదకాలు బోనస్‌గా వచ్చాయి. ఎక్కడి గొంగళి అక్కడే అని రాఘవరావు వాపోయాడు.

◆

# మన చరిత్రకు మహోపకారం చేసిన కల్నల్ కాలిన్ మెకంజీ

## 1754-1821

'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అన్నడు మన వేమన.

ఆంగ్లేయులు మన దేశాన్ని మూడు వందల ఏళ్ళు పాలించారు. ఇంగ్లండు నుండి వచ్చిన అధికారులలో దాదాపు 90 శాతం మన దేశాన్ని దోచుకున్నారు.

తక్కిన 10 శాతం కొందరు మాత్రం మన దేశాన్ని, మన భాషలను, సంస్కృతిని గౌరవించారు. మన ప్రజలను ప్రేమించారు. ఆ కొందరే వేమన అన్నట్లు పుణ్య పురుషులని చెప్పవచ్చు. కొందరు మనం మరువరాని, మరువకూడని వారు. వారెవరు? తెలుగు ప్రజలు మరువరాని వారిలో మొదటి ఆంగ్లేయుడు సర్‌థామస్ మన్రో. అతడు శాంతి భద్రతలను సుస్థిరమొనర్చి, రైతులకు ఎంతగానో సహాయపడినాడు.

అగ్గిపురుగులకు ఆహారం అవుతున్న తెలుగు కావ్యాలను వేలాదిగా సేకరించి శుద్ధ ప్రతులు వ్రాయించి, నిఘంటువులను సమకూర్చి తెలుగు సాహిత్యానికి మహోపకారం చేసిన దొర సి.పి. బ్రౌన్. గోదావరిపై ఆనకట్ట కట్టించి, మరెన్నో జలాశయాలు నిర్మింపజేసి లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం కావించిన అన్నదాత సర్ ఆర్థర్ కాటన్.

మన చరిత్రకు కావలసిన ముడి సరుకును సమకూర్చి, మెకంజీ కైఫీయత్తులుగా అమూల్యమైన చరిత్రలను మనకు అందించిన మహనీయుడు కల్నల్ కాలిన్ మెకంజీ.

మెకంజీ స్కాట్లాండుకు పడమరగా వున్న లూయీ అనే ద్వీపంలోని స్టార్నొవే అన్న గ్రామంలో క్రీ.శ. 1754లో జన్మించాడు. తండ్రి మర్డాక్ మెకంజి. తల్లి బార్బరా మెకంజి. తండ్రి చిన్న వ్యాపారాలు చేస్తూ తన గ్రామంలో పోస్టు మాస్టరుగా వుండేవాడు.

స్టార్నొవే లోని బడిలో చదువు సాగించాడు కాలిన్ మెకంజీ. గణితంపట్ల ఆసక్తి ఎక్కువగా వుండేది. కొంతకాలం స్టార్నొవే లోనే పన్నులు వసూలు చేసే ఆఫీసులో గుమాస్తాగా పనిచేశాడు మెకంజీ. జాన్ నేపియర్ అనే సంపన్నుడు మెకంజీని తనకు సహాయకుడుగా వేసుకొన్నాడు. నేపియర్ పూర్వీకులలో గొప్పవాడైన జాన్ నేపియర్ చరిత్ర రాయటానికి కావలసిన ఆధారాలన్నీ సేకరించాడు. జాన్ నేపియర్ గణిత శాస్త్రానికి చాలా అవసరమైన 'సంవర్గమానములు' లోగరిథమ్స్ కనిపెట్టాడు. విషయ సేకరణలో మెకంజీ అతనికి బాగా తోడ్పడినాడు. అప్పుడే భారతీయ గణిత శాస్త్ర విషయం తెలుసుకొన్నాడు.

నేపియర్ చనిపోయిన తర్వాత మెకంజీ 1782లో మదరాసుకు వచ్చాడు. ఈస్టిండియా కంపెనీవారు ఇతనికి ఇంజనీరింగ్ శాఖలో



కల్నల్ కాలిన్ మెకంజీ, అతని సహాయకులు

ఉద్యోగమిచ్చారు. నేపియర్ అల్లుడు శామ్యూయల్ జాన్‌స్టన్ అపుడు మధురలో కంపెనీ ఉద్యోగిగా వుండేవాడు. జాన్‌స్టన్ కోరిక మేరకు మధురలో కొంతకాలం వున్నాడు. అచటి పండితులతో స్నేహం చేసి భారతదేశ చరిత్రకు కావలసిన కొంత సామాగ్రిని సంపాదించాడు.

ఇంజనీరింగ్ శాఖలో ఉద్యోగి కావున కంపెనీ వారి సైన్యంతో పాటు దిండిగల్లు, కోయంబత్తూరు మున్నగు చోట్ల పనిచేశాడు. 1784-90 సం.ల మధ్య సర్కారు - రాయలసీమ ప్రాంతాలలో పనిచేశాడు. నెల్లూరు నుండి తూర్పు కనుమల ద్వారా రాయలసీమ ప్రాంతానికి రహదారి మార్గాల నమూనాలతో దేశపటాలు తయారుచేశాడు. కొంతకాలం గుంటూరు ప్రాంతంలో పనిచేశాడు. తన పనిని ఎంతో శ్రద్ధతో, తెలివితేటలతో చేసినందుకు మెచ్చుకొన్న కంపెనీవారు మెకంజీని గుంటూరు సీమ సర్వే చేయటానికి 1790లో అధికారిగా నియమించారు. 1792లో టిప్పుసుల్తాన్‌కి చెందిన శ్రీరంగపట్నంపై కారన్‌వాలిస్ దాడిచేశాడు. అప్పుడు మెకంజీ కంపెనీ సైన్యపు ఇంజనీర్‌గా పనిచేశాడు. కారన్ వాలిస్, మెకంజీని దత్త మండలాల (నేటి రాయలసీమ)తో పాటు నెల్లూరు సీమ సర్వే చేయటానికి నియమించాడు. రాయలసీమ నెల్లూరు ప్రాంతాలకు

**మన చరిత్రకు కావలసిన ముడి సరుకును సమకూర్చి, మెకంజీ కైఫీయత్తులుగా అమూల్యమైన చరిత్రలను మనకు అందించిన మహనీయుడు కల్నల్ కాలిన్ మెకంజీ.**

సంబంధించిన దేశపటాన్ని, నైసర్గిక పటాన్ని మొట్టమొదట తయారు చేసినవాడు మెకంజీ.

అమరావతి శిల్పాలను కనుగొని వాటి వైభవాన్ని చాటాడు. అసంఖ్యాకంగా వ్రాత ప్రతులను (తాళపత్రాలు), నాణేలను, ప్రాచీన వస్తువులను సేకరించాడు. అవి ప్రస్తుతం మద్రాసులోని ప్రాచ్య లిఖిత గ్రంథ భాండారం (మద్రాసు) ఇండియా ఆఫీసు లైబ్రరి (లండన్) కలకత్తా, న్యూఢిల్లీ పురావస్తు సంగ్రహాలయంలో భద్రపరచబడినవి. సేకరించబడిన విషయాలు అన్నీ 5 సంపుటాలుగా భద్రపరచబడినవి. ఎచ్. ఎచ్. విల్సన్ (2 సంపుటాల కలకత్తా వీటి 1838) ఒక సంపుటంగా 1882లో ప్రచురించారు. ఇవి మద్రాసులో వున్నాయి. బ్లాగ్డెన్ (1వ సంపుటి) లండన్ 1916 ప్రధానంగా జానాలో సేకరించినవి, విలియం టేలర్ (3 సంపుటాలు-మద్రాసు) 1857-62 మరి కొన్ని సంపుటాలు - మరెన్నో సంపుటాలున్నాయి. హిస్టారికల్ రికార్డ్ ఆఫ్ ది సర్వే ఆఫ్ ఇండియా (1945,50,54-డెహ్రాడున్). ఈ సర్వే రికార్డులన్నీ డెహ్రాడూన్‌లో భద్రపరచబడినవి. ఇవి ఇటీవల న్యూఢిల్లీలోని నేషనల్ ఆర్కైవ్స్‌కు తరలించబడినాయి. మెకంజీ రాతప్రతులను క్షుణ్ణంగా పరిశీలించి అందలి చారిత్రక విషయాలను సేకరించి అనువదించిన వారిలో ప్రముఖుడు సి.పి. బ్రౌన్, 'వార్స్ ఆఫ్ రాజాస్', మెమోరీస్ ఆఫ్ హైదరాలి, టిప్పుసుల్తాన్ సైక్లిక్ టేబిల్స్, కర్ణాటిక్ క్రనాలజి, శిథిలమవుతున్న మెకంజి రాతప్రతులను, ఎత్తి రాయించి సొంత ఖర్చుతో సంపుటాలుగా రూపొందించాడు. అవన్నీ మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత భాండాగారంలో వున్నాయి.

జూన్ 1884 నాటి 'శాటర్‌డే మేగజైన్' లోని మెకంజి బొమ్మను అందంగా రాయించి మద్రాసులోని ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథ భాండాగారంలో వుంచాడు. కొంతకాలం క్యూరేటర్‌గా పనిచేశాడు. అమరావతి శిల్పాల గురించి 1797లో అకౌంట్స్ ఆఫ్ ఎక్స్‌ట్రాక్ట్స్ ఆఫ్ జర్నల్స్ రాశాడు. అమరావతి శిల్పాల చిత్రాలు (అతడు గీచినవి) లండన్‌లోని ఇండియా ఆఫీసు లైబ్రరిలో వున్నాయి. శ్రీశైల ఆలయంలో ప్రవేశించిన మొదటి ఆంగ్లేయుడు మెకంజీ. ఖమ్మం తాలూకా పటాన్ని, పెన్నానది మూలాన్ని గురించి రాశాడు. అనెగొంది రాజుల చరిత్ర, విజయనగర రాజుల చరిత్ర, మరాఠా బ్రాహ్మణుల పుస్తకాలను సి.పి. బ్రౌన్ అనువదించాడు.

ఈ సర్వే పనులలో భాగంగా దేశమంతా సంచారం చేశాడు. సుందరమైన దేవాలయాలను చూచాడు. శాసనాలపట్ల ఆసక్తిని మరింత పెంచుకొన్నాడు. ఆ కాలంలోనే ఏలూరులో వుండిన కావలి వెంకట సుబ్బయ్యగారి కుమారులతో మెకంజీకి పరిచయం కలిగింది. వారు వెంకట నారాయణ, వెంకట బొర్రయ్య, వెంకట రామస్వామి, సీతయ్యగార్లు. వీరిలో బొర్రయ్య గొప్ప తెలివితేటలు గలవాడు. మెకంజీ యువకుడైన బొర్రయ్య సహాయంతో తెలుగు, కన్నడ శాసనాలలోని విషయాలను తెలుసుకొన్నాడు. గ్రామ చరిత్రలు రాయటానికి, తాళపత్ర గ్రంథాలను సేకరించటానికి చరిత్రకుపయోగించే నాణేలను సేకరించటానికి బొర్రయ్యకు వేతనమిచ్చి వినియోగించుకొన్నాడు. బొర్రయ్య 27 ఏళ్ళ ప్రాయంలోనే చనిపోయాడు. ఆ వయస్సులోనే బొర్రయ్య చాలా విషయాలను సేకరించాడు. బొర్రయ్య తమ్ముడు లక్ష్మయ్య మెకంజీకి సహాయకుడయ్యాడు.

1810-1815 వరకు మెకంజీ మదరాసు ప్రాంత సర్వేయర్ జనరల్‌గా నియమితుడయ్యాడు.

1816-1821 వరకు భారతదేశపు మొదటి సర్వేయర్ జనరల్‌గా నియమితుడయ్యాడు.

1793 నుండి 1816 వరకు దక్షిణ భారతదేశంలో ఉద్యోగం చేసినపుడు మెకంజీ తాళపత్ర గ్రంథాలు, వ్రాతప్రతులు 1560 వరకు సేకరించాడు. ఇవికాక అతని సేకరణలో ప్రధానమైనవి.

| | | | |
|---|---|---|---|
| 1. | స్థానిక చరిత్రలు | : | 2070 |
| 2. | శాసన పాఠాలు | : | 8076 |
| 3. | దేశపటాలు | : | 79 |
| 4. | బొమ్మలు (డ్రాయింగ్స్) | : | 2630 |
| 5. | నాణేలు | : | 6218 |
| 6. | శిల్ప చిత్రాలు | : | 106 |
| 7. | పురాతన వస్తువులు | : | 40 |

మెకంజీని గురించి చెప్పేటప్పుడు బొర్రయ్యను మరవలేము. కంపెనీ కొలువు కోసం బొర్రయ్య మచిలీపట్నంలో హిందూస్తానీ, పర్షియన్, ఆంగ్ల భాషలను బాగా నేర్చుకొన్నాడు. జైనుల వృత్తాంతం, మొఘలుల తర్వాత కర్ణాటక మందలి సంఘటనలు అనే రచనలను ఆంగ్లంలో చేశాడు. మెకంజీ బొర్రయ్య నెంతగానో ఆదరించాడు. తన ఆస్తిలో కొంతభాగం బొర్రయ్యకు చెందునట్లు వీలునామా వ్రాశాడు. బొర్రయ్య తమ్ముడు కావలి వెంకట రామస్వామి మొట్టమొదటిసారి దక్కన్ కవుల జీవిత చరిత్రలు వ్రాశాడు. తెలుగు కవుల జీవిత చరిత్రలను గ్రంథస్థం చేసిన వారిలో మొదటి వాడాయన.

మెకంజీ సొంత పైకం 15వేల రూపాయలు ఖర్చుచేసి తాళపత్రాలు, శాసనాలు, నాణేలు మున్నగువాటిని సేకరించాడు. మెకంజీ సేకరణలను అతని మరణానంతరం కంపెనీ పరంగా వారన్ హేస్టింగ్స్ 10 వేల డాలర్లకు కొన్నాడు.

మెకంజీ కృషి వల్లనే అమరావతిలో బౌద్ధ స్తూపమున్న విషయం వెల్లడైంది. 1792లో అమరావతిని దర్శించిన మెకంజీ వెంకటాద్రినాయుడు గారిని కలుసుకొని, అమరావతి స్తూపం వర్ణనను ఏషియాటిక్ సొసైటీ వారి సంపుటాలలో ప్రచురించాడు. హైందవ విజ్ఞాన మందిరానికి కావలి బొర్రయ్య అనే మహాద్వారము తనకు లభించెనని మెకంజీ వ్రాశాడు.

వారన్ హేస్టింగ్స్ సంస్కృతం, అరబ్బీ, పారసీ, జాపనీస్, బర్మీస్ భాషలలోని గ్రంథాలను, శిల్పాలను, నాణేలను ఇంగ్లాండుకు పంపాడు. దక్షిణ భారతదేశ భాషలలోని స్థానిక చరిత్రలు, తాళపత్రాలు మున్నగునవి 5,31,255. ఇవన్నీ మద్రాసు ప్రాచ్య లిఖిత భాండాగారంలో భద్రపరచబడినాయి. దాదాపు 40 ఏళ్ళు మన చరిత్రకు కావలసిన వస్తు సామాగ్రిని సేకరించాడు. ప్రపంచ చరిత్రలో అన్ని చారిత్రక పరికరాలు సేకరించినవారు మరొకరు లేరు. మెకంజీ 1821లో కలకత్తాలో చనిపోయాడు. నలభై ఏళ్ళ తర్వాత మెకంజీ సేకరించిన కైఫీయత్తులలో చాలా వాటికి శుద్ధ ప్రతులు వ్రాయించి ఆ గ్రంథాలను మనకిచ్చిన మరో మహనీయుడు సి.పి.బ్రౌన్.

– జానమద్ది హనుమచ్ఛాస్త్రి



# 'ఒక ఊరు - ఒక ఉత్పత్తి'

## స్వయం సహాయక సంఘాలకు జపాన్ ఉద్యమస్ఫూర్తి

ప్రస్తుతం మన గ్రామీణాభివృద్ధిలో ప్రముఖపాత్ర పోషిస్తున్న స్వయం సహాయక సంఘాలకు స్ఫూర్తినిచ్చిన సంస్థలు దాదాపు 30 ఏళ్ల కిందటే చైనా, జపాన్‌లలో ప్రారంభమైనాయి.

1978లో చైనాలో ప్రారంభమైన సంస్కరణలతో కొత్త ఊపిరిపోసుకున్న "టౌన్‌షిప్ అండ్ విలేజ్ ఎంటర్‌ప్రైజస్" (TVES), ఆ తరువాతి ఏడాది జపాన్‌లో ప్రారంభమైన "వన్ విలేజ్ - వన్ ప్రొడక్ట్" ఉద్యమాలు నగరాలకు ప్రజల వలసలను నిరోధించి, ప్రభుత్వాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పథకాలతో ఉత్పత్తులు చేసి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు దన్నుగా నిలవడమే కాకుండా, అనతికాలంలోనే ప్రబల శక్తిగా అవతరించాయి. ఈ రెండు ఉద్యమాల గురించి స్పష్టంగా మనం నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా, సబ్సిడీలు, రుణాలు, మాఫీల వంటి ప్రోత్సాహకాల ప్రమేయం లేకుండా స్వయంశక్తిపై రూపొందించిన వస్తువుల ద్వారా ప్రపంచ మార్కెట్‌లోకి అడుగుపెట్టి బ్రహ్మాండమైన లాభాలు గడిస్తున్నాయి. జపాన్‌లో బాగా ప్రాచుర్యం పొందిన "ఒక ఊరు - ఒక ఉత్పత్తి" విజయగాథను గురించి ఈ సంచికలో తెలుసుకొందాం.

– ఎడిటర్

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, ప్రపంచ దేశాల మధ్య పోటీతత్వం పెరిగి పారిశ్రామికంగా త్వరితగతిన అభివృద్ధి చెందాయి. పరిశ్రమల స్థాపనకు నగరాలు, పట్టణాలే అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉంటాయి కాబట్టి, అవే పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. కానీ గ్రామాలు అత్యధికంగా ఉండే ఆసియా, ఆఫ్రికా దేశాల్లో చాలా మంది పొట్ట చేత బట్టుకొని పట్టణాలకు చేరుకొని స్థిరపడిపోయినా, మెజార్టీ ప్రజలు అరకొరగా ఉన్న ఉపాధి అవకాశాలను నమ్ముకొని గ్రామాల్లోనే ఉండిపోయారు. వారి జీవనోపాధికి పరిమితమైన మార్గాలు మాత్రమే ఉన్న దశలో స్వయం సహాయక, స్వయం ఉపాధి పథకాలు దాదాపు అన్ని దేశాల్లో తెరపైకి వచ్చాయి. ఈ పథకాల్లో కొన్ని ఉద్యమరూపం దాల్చి ఎన్నో కాల పరీక్షలకు తట్టుకొని నిలబడి ప్రపంచ దేశాలకు మార్గదర్శకం కాగా, మరెన్నో పథకాలు కాలగర్భంలో కలిసిపోయాయి.

"ఒక ఊరు - ఒక ఉత్పత్తి" పథకం 'ఒయిటా రాచరిక ప్రాంతపు గవర్నర్ మొరిహికొ హిరమత్సు మానసపుత్రిక. 1979లో ఆయన ఈ పథకానికి రూపకల్పన చేశారు. 1980లో మొదటిసారిగా ఒయిటా ప్రాంతంలోని 5 నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో దీని అమలుకు ఆదేశాలు జారీ చేశారు.

వెనుకబడిన ప్రాంతమైన ఒయిటాను జపాన్‌లోని ఇతర ప్రాంతాలకు ధీటుగా అభివృద్ధి చేయడమే హిరమత్సు ఉద్దేశం. ఒక గ్రామంలో లేదా ఒక పట్టణంలో ఉండే ప్రజలు ఒక వస్తువును ఎంపిక చేసుకొని, దాన్ని ఉత్పత్తి చేసి దేశంలోని అన్ని ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలించి అమ్మకాలు సాగిస్తారు. తద్వారా వచ్చిన డబ్బును సభ్యులంతా సమానంగా పంచుకొంటారు.

ఈ పథకాన్ని అమలుపరిచాక గ్రామాల నుంచి ప్రజలు పట్టణాలకు వలసపోవడం ఆగిపోయింది. ఏ ప్రాంతంలో ఏ వనరులున్నాయో ప్రజలు తెలుసుకొని, వాటిని ప్రాసెస్ చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్‌లోకి ప్రవేశపెడతారు. ఈ పథకం అమలుచేస్తున్న క్రమంలో ప్రజలు ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, అకౌంటింగ్ వంటి విషయాలను నేర్చుకోవడమే కాకుండా సృజనాత్మక ఆలోచనలతో ముందుకు వెళ్ళటం స్పష్టంగా కనిపించింది.

1980 - 2002 మధ్యకాలంలో ఈ పథకం అమలుచేస్తున్న వారు 338 స్థానికంగా ప్రసిద్ధిగాంచిన ఉత్పత్తులు, 133 సంస్కృతికి సంబంధించిన ఉత్పత్తులు, 80 పర్యావరణానికి సంబంధించిన ఉత్పత్తులతో ఓ పెద్ద జాబితాను రూపొందించారు.



1980లో 143 స్థానిక ప్రసిద్ధిగాంచిన ఉత్పత్తుల ద్వారా 3600 కోట్ల యెన్‌ల వ్యాపారం చేయగా అది 2001 నాటికి 336 ఉత్పత్తులతో 14,100 కోట్ల యెన్‌లకు చేరింది. దీన్ని బట్టి "ఒక ఊరు - ఒక ఉత్పత్తి" పథకం ఎంత బాగా విజయవంతమైందో అర్థమవుతోంది.

ఒయిటా ప్రాంతంలో జపాన్‌లో ప్రసిద్ధిగాంచిన 'బెప్పు' హాట్ స్ప్రింగ్స్ ఉన్నాయి. దేశ విదేశాల నుంచి ఈ హాట్ స్ప్రింగ్స్‌ను చూడటానికి ఏటా కోటి మంది పర్యాటకులు వస్తారు. వారిలో 38 లక్షల మంది అక్కడికి సమీపంలో ఉన్న యుపూయిన్ పట్టణంలో "ఒక ఊరు - ఒక ఉత్పత్తి" ప్రధాన కేంద్రాన్ని సందర్శిస్తారు. ఆ విధంగా ఈ పథకం ప్రపంచ నలుమూలలలో ప్రాచుర్యం పొందింది.

## స్వావలంబన - సృజనాత్మతకే పెద్దపీట

ఈ పథకం 30 ఏళ్ల ప్రస్తానంలో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొంది. కానీ పాలకులు ఎప్పుడూ సబ్సిడీలు, మాఫీలు, రుణాలను ఇచ్చి ఆదుకోవటానికి ప్రయత్నించలేదు. రాయితీలు ఇవ్వడం ప్రారంభమైతే స్వావలంబన లక్ష్యం నెరవేరదని వారు దృఢంగా నమ్మడం వల్లనే అటువంటి ప్రయత్నాలు చేయలేదు. దీనికి బదులుగా, నాణ్యమైన ఉత్పత్తులను రూపొందించడంలో మెళకువలను, వాటిని ఏ విధంగా మార్కెట్ చేయవచ్చునో నిపుణుల ద్వారా బోధనకు ఏర్పాట్లు చేశారు. ఉత్పత్తిదారుల సౌకర్యార్థం వ్యవసాయ సాంకేతిక విద్యా కేంద్రాన్ని, పుట్టగొడుగుల పరిశోధనా మార్గదర్శక కేంద్రాన్ని, పశుగ్రాస పరిశోధనా కేంద్రాన్ని, సముద్ర సంపద, మత్స్యశాఖ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి సభ్యులకు శిక్షణనిప్పించారు. అదే విధంగా వారు తయారు చేసిన ఉత్పత్తులకు దేశవిదేశాలలో ఎలా ప్రచారం చేయాలో గవర్నరే స్వయంగా ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసి చూపించారు. ప్రజలు తమ ఉత్పత్తులను ఎలా వాడాలో ప్రచారం చేసి, ఎక్కువమంది వాటిని కొనేందుకు ప్రోత్సాహపరిచారు.

ఒయిటా వాసులు ఉత్పత్తి చేసిన షిటకే బ్రాండ్ పుట్టగొడుగులను 2001 లో 1425 టన్నులను దేశీయ మార్కెట్‌లో అమ్మారు. జపాన్ దేశీయ మార్కెట్‌లో ఒయిటా పుట్టగొడుగుల వాటా 28 శాతం ఉండటం పలువురిని ఆశ్చర్యపరిచింది. అదే విధంగా నిమ్మ, నారింజ జ్యూస్, ఆవు మాంసం, బార్లీ గింజలతో చేసిన సారాయి మొదలైనవి జపాన్ మార్కెట్లో గొప్ప బ్రాండ్‌లుగా అవతరించాయి.

## విజయానికి కారణాలు

ఇంతగా విజయవంతమైన ఈ పథకానికి దోహదం చేసిన కారణాలను ఈ విధంగా పేర్కొనవచ్చు.

**భౌగోళిక స్థితి:** ఒయిటా ప్రాంతం ఆర్థికంగా చాలా వెనుకబడిన ప్రాంతం. రోడ్లు లేవు. చాలా తక్కువ సేద్యయోగ్యమైన భూమి ఉండేది. జపాన్ వాసుల ప్రధాన ఆహార పంట వరి పండటానికి అది అనువైన నేల కాదు. అందువల్ల, వరి కాకుండా మిగతా పంటలు పండించి, వాటి ద్వారా వచ్చిన ఉత్పత్తులు ప్రాసెస్ చేసి మార్కెట్‌లో పెట్టాలని నిర్ణయించారు. దానికి తోడు అధికోత్పత్తి యుగంగా పేరుగాంచిన 1955 -1972 మధ్య కాలంలో ఈ ప్రాంతంలో ఎటువంటి పంటలు పండించకపోవడంతో పర్యావరణంలో మార్పులు చోటు చేసుకోలేదు. అందువల్ల ఈ ప్రాంతాన్ని ఇకో-టూరిజం కేంద్రంగా మార్పు చేశారు. ఇది ఎందరో దేశ విదేశీ యాత్రికులను బాగా ఆకట్టుకొంది. ఈ ప్రాంతంలోనే హాట్‌స్ప్రింగ్స్ ఉండటం కూడా తదుపరి అభివృద్ధికి బాగా తోడ్పడింది.






**శ్రామికులకు ఉపాధి:** ఒయిటా ప్రాంతంలోని అదనపు శ్రామికులందరికీ ఉపాధి దొరకటం విశేషం. గృహిణులు తయారు చేసే పచ్చళ్ల, కూరలు, ఇతర తినుబండారాలను రోడ్డుపక్క షాపుల ద్వారా రహదారులపై వచ్చే పోయే మోటారు వాహనదారులకు అమ్మకాలు చేశారు. ఈ పద్ధతి చాలా విజయవంతమైనది. గృహిణులు చేసే ఉత్పత్తులను మరిన్ని ప్రాంతాలకు విస్తరింపజేశారు. ఆ ప్రాంతంలోని యువకులు పెద్ద పెద్ద పట్టణాలు, నగరాలకు వెళ్లి చదువుకొని, తమ స్వస్థలాలకు తిరిగొచ్చి, స్థానికంగా లభించే వనరులతో వ్యాపారాలు మొదలుపెట్టి, విస్తరించడం వల్ల ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందింది.

**పెట్టుబడులు:** ఈ పథక వ్యూహకర్త హిరమత్సు పదే పదే అంటుండే వారు, ''మా ప్రభుత్వం స్వయం సహాయకులకు మాత్రమే సహాయమందిస్తుంది. మేం ఎవరికీ సబ్సిడీలు వంటి రాయితీలు ఇవ్వబోమ''ని, అయినప్పటికీ, కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ఆర్థికశాఖ భారీ నిధులను కేటాయించి, సత్వర అభివృద్ధి సాధించాలని లక్ష్యాలను నిర్ణయించేది. కానీ, ఒయిటా ప్రాంతంలో అగ్రోప్రాసెసింగ్ యూనిట్లకు, టూరిజం స్పాట్స్ అభివృద్ధికి ఎక్కువ పెట్టుబడులు అవసరమయ్యేవి కావు. ప్రపంచ వ్యవసాయ విధానాలపై ఉరుగ్వేలో జరిగిన ఒప్పందం ప్రకారం, ఈ ప్రాంతానికి కోటి ముప్పయి లక్షల యెన్‌లు మంజూరయ్యాయి. అందులో సగం ప్రభుత్వం విడుదల చేసింది. మిగతా సగాన్ని సభ్యులే భరించారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయంతో మౌలిక సదుపాయాలను సమకూర్చుకున్నారు కానీ, సబ్సిడీల రూపంలో అందజేయకపోవడం విశేషం.

**టెక్నాలజీ:** ఏడాది పొడవునా ఉత్పత్తులని నిరాటంకంగా తయారు చేయటానికి, క్వాలిటీ కంట్రోల్‌కు టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుంది. ఉత్పత్తులకు సరిపడే యంత్రాలను సమకూర్చుకోటానికి రీసెర్చి, డెవలప్‌మెంట్ విభాగం ఎంతో అవసరం. ఆ విభాగాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఖర్చుతో కూడుకొన్నపని. అందువల్ల స్థానికులే సృజనాత్మకంగా ఆలోచించి కొత్త పద్ధతులను అమలుచేశారు. వ్యవసాయక, మత్స్య సంబంధమైన, పుట్టగొడుగులు, పువ్వుల పెంపకాలలో సభ్యులకు కావాల్సిన గైడెన్స్ ఇప్పించటానికి గైడెన్స్ కేంద్రాలను నెలకొల్పారు.

**మార్కెటింగ్:** గవర్నర్ హిరమత్సునే సేల్స్‌మెన్‌గా భావించి, మంచిపేరు ప్రఖ్యాతులున్న ఆయనచే అనేక ఎగ్జిబిషన్ల, ఫెయిర్స్‌ను ప్రారంభింపజేశారు. ఈ ఫెయిర్స్ జపాన్ రాజధాని టోక్యో నగరంలోనే కాక, వివిధ దేశాల రాజధానుల్లో కూడా ఏర్పాటుచేసి, ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఒయిటా ఉత్పత్తులకు పోటీగా మరో ప్రైవేటు సంస్థ అవే ఉత్పత్తులను అమ్మటాన్ని గమనించిన సభ్యులు వినూత్నంగా రేడియో, టీవీలలో, ఇంటర్నెట్‌లో మెయిల్స్ ద్వారా ప్రచారం చేసి అమ్మకాలను పెంచుకున్నారు. అపార్ట్‌మెంట్స్‌లో స్టాల్స్ పెట్టి గృహిణులను ఆహ్వానించి, రుచి చూడటానికి శాంపిల్స్ ఇచ్చి అమ్మకాలు (డైరెక్టు మార్కెటింగ్) చేసుకున్నారు.

**నెట్ వర్కింగ్:** విజయగాథలను, విజయసాధకుల అనుభవాలను సేకరించి, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకొనేలా సెమీనార్లు సదస్సుల్లో వివరించేవారు.

**అంతర్జాతీయ గుర్తింపు:** 'Think globally and Act locally' ఇది ప్రస్తుతపు ఒయిటా వస్తూత్పత్తి కేంద్రం నినాదం. అభివృద్ధికి దూరంగా, ఎవరికీ పట్టని ఓ మారుమూల ప్రాంతం 20, 30 ఏళ్లలో అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందింది. అనేక దేశాలలోని సంస్థలతో శాశ్వత ఒప్పందాలను ఈ కేంద్రం చేసుకొంది.

చైనాలోని షాంగై, జియాంగ్సూ, షాంగ్జీ రాష్ట్రాలు, ఫిలిప్పీన్స్, మలేషియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, లావోస్, మంగోలియా అమెరికాలలో ఈ ఉద్యమ కేంద్రాలను స్థానికులు నెలకొల్పుకొన్నారు.

## ముగింపు

ప్రతి దేశంలో కొన్ని ప్రాంతాలు స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని దినదిన ప్రవర్థమాన మవుతుంటే, కొన్ని ప్రాంతాలు మాత్రం బయటి సహాయమంది నా అభివృద్ధికి నోచుకోవు. ఒక ప్రాంతాన్ని బాగా అభివృద్ధి చేయడానికి స్థానిక వనరులకు అనుగుణంగా ఆర్థిక, పారిశ్రామిక విధానాలు ఉండాలి. ఆ విధానాలు ప్రజల భాగస్వామ్యంతో అమలుచేయాలి. ప్రభుత్వ సహకారంతో ప్రజల భాగస్వామ్యం, స్వచ్ఛందంగా, స్వతంత్రంగా ఉన్నప్పుడే ప్రాంతీయ అభివృద్ధి పథకాలు విజయవంతమవుతాయి.

- **సాంబశివారెడ్డి,** (ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)



# స్థానికసంస్థల బలోపేతంతోనే గ్రామీణాభివృద్ధి

ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఇంగ్లీషులో డెమోక్రసి అని అంటారు. గ్రీకు భాషలో డెమోక్రాషియా లేదా డెమాస్ అనే పదాలకు అర్థం 'ప్రజల ు'! క్రాటోస్ అనగా 'పరిపాలన' అని అర్థం. అనగా రెండు పదాల కలయికే 'ప్రజల పరిపాలన'.

పురాతన కాలంలో భారతదేశ గ్రామపంచాయతీలు పరిపాలనాధికారాలు కలిగి వుండేవని సంస్కృత పండితుల ప్రగాఢ విశ్వాసం.

మౌర్యుల కాలానికి ముందువున్న లిక్కవి, మల్లాస్ అనే రాజ్యాలలో ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొని ఉందని బ్రిటిష్ శాస్త్రవేత్త హావెల్, జర్మన్ శాస్త్రవేత్త కీత్‌ల అభిప్రాయం. వైదిక కాలంలో భారతదేశంలోని మహిళలకు పరిపాలనలో సమాన భాగస్వామ్యం వున్నట్లు ఆధారాలున్నాయి.



ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ పాలకులను ప్రజలే ఎన్నుకుని, తమను తామే పరిపాలించుకుంటారు. అనగా ప్రజలే పాలకులు! ఇదే ప్రజాస్వామ్యం.

'వైవిధ్యం, విభిన్నతలను కలిగివుంటూ అందరికి సమానతను అందించే ప్రభుత్వ రూపమే ప్రజాస్వామ్యం' అని ప్లేటో అభిప్రాయపడ్డారు.

సామాజిక మార్పుతోనే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

ఎంతో మంది త్యాగఫలంతో భారతమాత దాస్య శృంఖలాలు తెగిపోయి 1947వ సంవత్సరం, 15వ తేదీన భారతదేశం స్వతంత్రమైంది.

జవహర్‌లాల్ నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్, వల్లభాయి పటేల్, బాబాసాహెబ్ అంబేద్కర్, డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్‌లతో బ్రిటిష్ పాలకులచే ఏర్పాటు చేయబడిన రాజ్యాంగ పరిషత్ 9-2-1946న ప్రథమంగా సమావేశమై, అనేక సమావేశాలు, చర్చల తరువాత 26-11-1949న నూతన రాజ్యాంగాన్ని ఆమోదించడం జరిగింది. ఈ భారత రాజ్యాంగం 26-10-1950 నుండి అమలులోనికి వచ్చింది.

ప్రతివ్యక్తికి, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, స్వేచ్ఛాయుతమైన ఆలోచన, భావప్రకటనా స్వేచ్ఛ, నమ్మకం, విశ్వాసం కలిగి వుండే ఆరాధనా పూర్వకమైన స్వేచ్ఛ, సమాన హోదా, సమాన అవకాశాలు వుండాలని, దేశ సమైక్యత, అభద్రతా భావం, సోదర భావాన్ని, వ్యక్తిగత గౌరవాన్ని పెంపొందించడం వంటివి వుండాలని భారత రాజ్యాంగం నిర్దేశిస్తోంది!

'భారత రాజ్యాంగం అట్టడుగు నుండి ప్రారంభించబడాలి. ప్రతి గ్రామం సంపూర్ణ అధికారం గల పంచాయితీని కలిగి వుండాలి. పంచాయతీ రాజ్యాంగంలో రైతే ప్రథముడు. రైతే ప్రధానమంత్రి కావాలి. అతనికి ఇంగ్లీషు భాషరాదు. ప్రపంచ రాజకీయాలు తెలియవు. అతను నెహ్రూను తన కార్యదర్శిగా నియమించుకుంటాడు. అట్టి సేవను జవహర్‌లాల్ నెహ్రూ గర్వపడుతూ చేయాలి. మనకున్న మంత్రులలో ఒక్కరైనా రైతు లేకపోవడం దురదృష్టకరం. ప్రతి గ్రామంలోని ప్రజలు, అట్టడుగు నుండి ప్రజాతంత్రాన్ని నిర్వహించాలి. గ్రామాలు, కేంద్రాల నుండి శక్తిని పొందాలి. కేంద్రం తన అధికారాన్ని, శక్తిని గ్రామాల నుండి పొందాలి" అని 1946 వ సంవత్సరంలో 'హరిజన' పత్రికలో మహాత్మా గాంధీజీ వ్రాశారు.

అయితే ఉత్కృష్టమైనదని భావించిన భారతరాజ్యాంగం రూపొందించినప్పుడు, 80 శాతం నివసించే గ్రామాలకు సంబంధించిన గ్రామపంచాయతీల ప్రసక్తి గురించి భారత రాజ్యాంగంలో లేదు.

ఈ విషయమై రాజ్యాంగ సభలో టంగుటూరి ప్రకాశం పంతులు,

ఆచార్య రంగా, సంతానం, మునిస్వామి పిళ్ళై మొదలైన వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు గ్రామపంచాయతీలను నిర్మించి, వాటిని స్వయంపాలక సంస్థలుగా రూపొందించాలని శ్రీ సంతానం రాజ్యాంగానికి సవరణను ప్రతిపాదించగా, అందుకు అనుగుణంగా భారత రాజ్యాంగంలో 40వ అధికరణ పొందుపరచబడింది.

అయితే ప్రజాస్వామ్యం వేదకాలం నాటిదే అనడానికి ఆధారాలున్నాయన్న విషయాలు విశదీకరిస్తున్నాను. ఋగ్వేదం, ఐత్తరీయ బ్రాహ్మణం, కౌటిల్యుని అర్థశాస్త్రం, బౌద్ధగ్రంథాలు మొదలైన వాటిల్లో గ్రామసభల గురించిన ప్రస్తావన వుంది.



పంచ అనగా గ్రామపంచాయతీ అని లేదా సర్పంచి అనే అర్థాలు ద్యోతకమవుతున్నాయి. మహాభారత కాలంలోనే ప్రతి గ్రామానికి ఒక గ్రామసభ ఉండేది. సభ్యులను సభేయులు అని, అధ్యక్షుణ్ణి గణపతి అని సంభోదించేవారు.

జైనుల కాలంలో భోజుడు అనే పేరుతో గ్రామాధ్యక్షుడు వుండేవాడు. మౌర్య కాలంలో, ప్రతి గ్రామానికి ఒక అధ్యక్షుడు వుండేవాడని కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఉటంకించాడు.

క్రీస్తు శకం 412-513 సంవత్సరాల మధ్యకాలంలో రెండవ చంద్రగుప్తుని పాలనలో పంచమండలి అనే పేరుతో గ్రామసభ ఉండేది. సభాధ్యక్షుణ్ణి గణశ్రేష్టి అని పిలిచేవారు. ఆనాటి పాలనలో వున్న పంచమండలి, పరిషత్, అధికరణ అనే మూడు విధాలైన స్థానికసంస్థలు మూడు అంచెల పాలనలో వుండేవి.

ప్రాచీన పాలనలో ప్రతి గ్రామానికి ఒక నాయకుడు, ప్రతి వంద గ్రామాలకు ఒక సామంతుడు, ప్రతి వేయి గ్రామాలకు ఒక ఆశాపాలుడు అధినేతలుగా వుండేవారు.

దీనిని బట్టి గ్రామపంచాయతీ వ్యవస్థ, స్థానిక స్వపరిపాలన అనేవి వేదకాలం నాటి నుంచే అమలులో వున్నట్లు తెలుస్తోంది.

గ్రామపంచాయతీలు సజీవంగా వుంటేనే, భారతదేశం స్వయం పాలనాశక్తిని కలిగి వుంటుందని గాంధీజీ అభిప్రాయపడ్డారు.




బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనలోనే, స్థానికసంస్థల పునరుద్ధరణకు లార్డ్ రిప్పన్ కొన్ని సంస్కరణలను తీసుకుని రావాలనే ఉద్దేశ్యంతో 1871వ సంవత్సరంలో రమేష్‌చంద్ర దత్తు సభ్యత్వంతో రాయల కమీషన్‌ను నియమించడం జరిగింది.

గ్రామపంచాయతీల నిర్మాణం అవసరం అని రాయల కమీషన్ బ్రిటిష్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

1922లో గయలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలో దేశబంధు చిత్తరంజన్‌దాస్ గ్రామ స్వపరిపాలన మాత్రమే నిజమైన స్వరాజ్యం అని అభిప్రాయపడ్డారు.

1957వ సంవత్సరంలో బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచనల ప్రకారం మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రథమంగా అమలులోకొచ్చింది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 21,943

గ్రామపంచాయతీలు ఉండగా, వాటిల్లో 1319 నోటిఫైడ్ గ్రామపంచాయతీలు, 20,624 నాన్ నోటిఫైడ్ గ్రామపంచాయతీలున్నాయి.

పల్లె సీమల సర్వతోముఖాభివృద్ధికి అధికార వికేంద్రీకరణకు, గ్రామ స్వపరిపాలనతో, పంచాయతీలను బలోపేతం చేయడానికి, బి.పి.ఆర్. విఠల్ సిఫార్సుల మేరకు భారత రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం A.P. PANCHAYATRAJ ACT-13 OF 1994 T G.O. Ms. No. 304, PR&RD 1994 ను 30.5.1994 నుండి అమలులోనికి తెచ్చింది.

ఈ కొత్త శాసనం ద్వారా మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడింది.

73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న విధంగా 243 జి. అధికరణం యొక్క 11వ షెడ్యూలులో పేర్కొన్న 29 అంశాలను గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీ చేయాలి.








## 29 అంశాలు

1) వ్యవసాయం 2) భూ అభివృద్ధి, భూ సంస్కరణల అమలు, భూసార పరిరక్షణ 3) సాగునీరు, నీటి నిర్వహణ, వాటర్‌షెడ్ అభివృద్ధి 4) పశు సంవర్ధక, పాడిపరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ 5) మత్య పరిశ్రమ 6) సామాజిక అటవి, తోటల పెంపకం 7) చిన్నతరహా అటవీ ఉత్పత్తి 8) ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ 9) ఖాదీ, గ్రామీణ కుటీర పరిశ్రమలు 10) గ్రామీణ గృహ నిర్మాణం 11) మంచినీరు 12) ఇంధనం, పశుగ్రాసం 13) రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, కాలువలు, జలమార్గాలు, ఇతర కమ్యూనికేషన్ విధానాలు 14) గ్రామీణ విద్యుద్దీకరణ, విద్యుచ్ఛక్తి పంపిణీ 15) సాంప్రదాయేతర ఇంధన వనరులు 16) దారిద్ర్య నిర్మూలన 17) విద్య-ప్రాథమిక, సెకండరీ పాఠశాలలు 18) సాంకేతిక శిక్షణ-వృత్తి విద్య 19) వయోజన విద్య- అనియత విద్య 20) గ్రంథాలయాలు 21) సాంస్కృతిక కార్యక్రమాలు 22) మార్కెట్లు, సేవలు 23) ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డిస్పెన్సరీలు, ఆరోగ్యం, పారిశుధ్యం 24) కుటుంబ సంక్షేమం 25) మహిళా, శిశు అభ్యుదయం 26) సాంఘిక సంక్షేమం 27) బలహీన వర్గాల సంక్షేమం -ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, తెగల సంక్షేమం 28) ప్రజాపంపిణీ వ్యవస్థ 29) సామాజిక ఆస్తుల నిర్వహణ

పైన పేర్కొన్న 29 అంశాల బదిలీ జరిగిననాడు స్థానిక ప్రభుత్వాలు ఏర్పడి, పూజ్యబాపూజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సిద్ధిస్తుందనడంలో సందేహం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే పన్నుల నుండి కొంత శాతం గ్రామపంచాయతీల మనుగడకు, గ్రామ ప్రజల సౌకర్యాలకు, గ్రామీణాభివృద్ధికి గ్రామపంచాయతీలకు కేటాయించాలి.

న్యాయ పంచాయతీలు ఆవిర్భవించి, నిష్పక్షపాతంగా న్యాయాన్ని సమకూరుస్తూ, ప్రభుత్వ న్యాయస్థానాలపై వుండే పనిభారాన్ని తగ్గించాలి.

గ్రామపంచాయతీల నిర్వహణలో ఇతర అధికార సంస్థల జోక్యం ఉండరాదు.

ప్రజలకు అందుబాటులో వుండే, ప్రజల భాగస్వామ్యంతో ప్రజలకు సేవలనందించేది ఒక్క పంచాయతిరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి వ్యవస్థే మాత్రమే!

*- ఎ. వి. రాజా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ*

# 2015 నాటికి నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలు

**ఐక్యరాజ్యసమితిలో ఇప్పటికి 192 దేశాలు సభ్యత్వం కలిగివున్నాయి. వీటిలో కొన్ని బాగా అభివృద్ధి చెందిన దేశాలు. ఈ దేశాల ప్రజలు మెరుగైన, సౌకర్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఇక్కడి ప్రజలు అత్యధిక శాతం అక్షరాస్యత కలిగి, మెరుగైన సగటు జీవన ప్రమాణం (జీవించేకాలం), మంచి ఆరోగ్యం, పని సామర్థ్యం సాధించారు. వీటితో పాటు ప్రపంచ ప్రమాణాలు కలిగిన రక్షిత మంచినీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను ఏర్పరచుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఈ దేశాలలో సామాజిక వ్యవస్థలైన విద్యాసంస్థలు, ఆసుపత్రులు, సమాచార వ్యవస్థ, టెలిఫోన్, ఇంటర్‌నెట్ వంటి మాధ్యమాలు ప్రజలందరికీ అందుబాటులో వున్నాయి. పై సౌకర్యాలే కాకుండా ప్రజల తలసరి ఆదాయం సరిపడినంత ఉంటూ, వారికి ఇంటిని ఏర్పరచుకునేందుకు, వృద్ధాప్యంలో అవసరాలకి ఉపయోగపడుతుంది.**

ప్రపంచ నాయకులను ప్రపంచంలోని అసమానతలు కలవర పెడుతున్నాయి. కొన్ని దేశాలు చాలా మూల సంపద, వనరులు కలిగి వుండి దేశ ప్రజలందరికి అన్ని రకాల సౌకర్యాలు అందించే స్థితిలో వుంటే, పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలు మాత్రం అందరికి ఆహారాన్ని అందుబాటులోకి తేవడం, పౌష్టికాహార లోపం నివారించడం వ్యాధికారకమైన పరిస్థితులను అరికట్టడంలోనే తలమునకలై వున్నాయి. వీటితో పాటు అత్యధిక నిరక్షరాస్యత, అత్యల్ప జీవన ప్రమాణం ఇబ్బంది కలిగిస్తున్న సమస్యలు.

2000 సంవత్సరం సెప్టెంబర్ నెలలో 189 మంది సభ్యులతో ఐక్యరాజ్యసమితి సంఘం ఈ ప్రతిన బూనింది.

"పేదరికం కారణంగా దయనీయమైన, అమానవీయమైన పరిస్థితులలో మగ్గుతున్న మనసాటి ప్రజలను విముక్తి చేయడానికి సాయశక్తులా కృషి చేస్తాము". దీన్ని సాధించడానికి కింది లక్ష్యాలను నిర్దేశించింది.

1. 1990 - 2015 సంవత్సరాల మధ్య ప్రాతిపదికగా పేదరికంలో మగ్గుతున్న జనాభా మధ్య వ్యత్యాసం గుర్తించడం.
2. ప్రపంచంలో పేదరిక నిర్మూలనను అత్యంత ప్రాధాన్యం కలిగిన విషయంగా సదస్సు గుర్తించింది. 21వ శతాబ్దంలో కీలకమైన మానవీయ విలువల పరిరక్షణ లక్ష్యం చేరడానికి తమ వంతు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మిలీనియ డిక్లరేషన్ ప్రకటించింది.

### ప్రధాన లక్ష్యాలు:-

### (1) మెదటి ప్రధాన లక్ష్యం:

### దుర్భర దారిద్ర్యాన్ని, ఆకలి (పేదరికాన్ని)ని నిర్మూలించడం

భారతదేశం పేదరికాన్ని 1993-2000 సం॥ల మధ్య 36% నుండి 28.6% కి తగ్గించగలిగినప్పటికీ HID (మానవ అభివృద్ధి సూచిక) GDI (లింగ సంబంధమైన అభివృద్ధి సూచిక)ల మధ్య వ్యత్యాసం వలన దారుణమైన (సరైన పరిస్థితులులేని) దేశంగా గుర్తించారు. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి చెందుతున్న దేశాలలో దేశ వ్యాప్తంగా జరిగిన పేదరిక నిర్మూలన చర్యలను లెక్కకడుతుంది.

అంటరానితనం కొందరిని సమాజంతో కలవనీయకుండా చేయడం వంటివి కూడా పేదరికానికి సంబంధించిన అంశాలే.

సభ్యదేశాలు సాధించిన ప్రగతి, లక్ష్య సాధనలో వారు చేపడుతున్న చర్యలను ఈ అంతర్జాతీయ సంస్థ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. ఇటీవల కాలంలో పెరిగిన ఆహారధాన్యాల ధరలు పేద ప్రజల సంఖ్యను 100 మిలియన్‌లకి పెంచే అవకాశం వుందని సెప్టెంబర్ 2008లో జరిగిన సమావేశం గుర్తించింది.

1990లలో సగటున సంవత్సరానికి ఒక వ్యక్తికి 174.23 కి.గ్రా. ఆహారధాన్యం లభ్యం అయితే 2005-06 సంవత్సరానికి ఒక వ్యక్తికి అందే ఆహార ధాన్యం 163.33గా గుర్తించబడింది.

భారతదేశం అత్యధికంగా పౌష్టికాహార లోపం వున్నవారు కలిగిన దేశంగా సంస్థ పరిశీలనలో తేలింది. ప్రభుత్వం ICDS ఆధ్వర్యంలో అంగన్‌వాడి సెంటర్‌లు నడపడం వలన 2000 సం.లలో 47% వున్న పౌష్టికాహార లోపం 2005 సం॥కి 46% కి తగ్గింది. ఈ వ్యత్యాసం చెప్పుకోతగినంతగా లేదు.

పౌష్టికాహార లోపం ఎక్కువగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వున్న దిగువ తరగతి పేద ప్రజలలో కనిపిస్తుంది. వీరిలో స్కూల్‌లో చేరే పిల్లల సంఖ్య చాలా తక్కువ. వివిధ రకాల వ్యాధులు, అంటువ్యాధుల వీరిలో ప్రబలడం వలన అనారోగ్యం పాలవుతున్నారు. వీరిలో సగటు జీవన ప్రమాణం చాలా తక్కువ.

దారిద్ర్యరేఖకి దిగువవున్న మహిళలు నిరక్ష్యరాస్యులు. వీరు తక్కువ జీతాలు వుండే కష్టమైన (కఠినమైన) పనులు చేయడం వలన పెరుగుతున్న ధరలకనుగుణంగా తమకి కుటుంబానికి పోషకాలతో కూడి ఆహారం పొందలేక నిరుపేదలుగా జీవిస్తున్నారు.

**ఆహార కొరతకు, ఇటీవల కాలంలో ధరల పెరుగుదలకు కారణాలు:**

1. ప్రపంచ జనాభా పెరుగుదల
2. ఇంధనాలుగా ఆహార పంటలను వాడటం
3. వాతావరణ ప్రతికూలత వలన ఆహారధాన్యాల దిగుబడి తగ్గడం
4. పెట్రో సంబంధమైన నూనెల ధరల పెరుగుదల వలన ఎరువుల ధరలు పెరగడం.

ఇటీవల జరిగిన సర్వేలో భారతదేశం ప్రపంచంలోనే అత్యధికంగా ఆకలితో అలమటించే ప్రజలున్న దేశంగా, పౌష్టికాహార లోపం వున్న ప్రజలు నివసించే దేశంగా గుర్తించారు.




2008 సం॥ ప్రపంచంలో ఆహార కొరత స్థాయి అనే రిపోర్ట్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికి ఆకలి (ఆహారకొరత) ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య 963 మిలియన్లు.

ఆహార కొరతతో బాధపడుతున్న 88 దేశాల పట్టికలో ఆధునిక భారతదేశం 66వ స్థానంలో వుంది. అత్యధిక సంఖ్యలో 200 మిలియన్ ప్రజలు పౌష్టికాహార లోపం వున్నవారు మన దేశంలో వున్నారు. పౌష్టికాహార లోపం కలిగినవారు అధికంగా పేదలు, భూమిలేని కూలీలు, మహిళలు, పిల్లలు. పౌష్టికాహార లోపం పూర్తిగా పేదలలోనే వుంటుందనలేము. ఎందుకంటే అధికంగా చక్కెర పదార్థాలు, అధిక కేలరీలు కల కొవ్వు పదార్థాలు మాత్రమే తీసుకొని శరీరానికి అవసరమైన పోషకాలు విస్మరిస్తే వారికి పౌష్టికాహార లోపం, అనారోగ్యం కలుగుతాయి.

### (2) రెండవ ప్రధాన లక్ష్యం:

**ప్రపంచ వ్యాప్తంగా ప్రాథమిక స్థాయి విద్యను సాధించడం.**

**టార్గెట్:**

2015 సం॥ కల్లా ప్రతి బాలుడు, బాలిక ప్రాథమిక విద్యను పూర్తి చేసేలా ప్రోత్సహించడం, అందరు పిల్లలను ప్రాథమిక విద్య కోసం పాఠశాలలో చేర్చడం.

1) 2007 సం॥లో ప్రకటించిన సర్వశిక్షాభియాన్ వార్షిక సర్వే రిపోర్ట్‌లో బడికి రాని పిల్లల సంఖ్య ముందుకన్నా తగ్గిందని ప్రకటించింది. 2000 సం॥లో వీరు 6.6% వుంటే 2005 సం॥లో 4.2%కి తగ్గింది. మన దేశంలోని మొత్తం 584 జిల్లాలలో 562 జిల్లాల్లో జరిగిన సర్వే వివరాలు ఇవి.

2) బడికి వెళ్ళని 11-14 సంవత్సరాల మధ్య వయస్సు బాలికల శాతం 10.3% (2000)లో వున్నది. 7.4% (2006)కి తగ్గింది.

15-16 సం॥ల వయస్సు కల బాలికల్లో బడికి వెళ్ళనివారు 22.6% (2006) వుండగా, 2007 నాటికి 20.8% తగ్గింది.

3) ప్రారంభదశ ప్రాథమిక పాఠశాలలకు (ప్రీస్కూల్) హాజరవుతున్న పిల్లల శాతం

ఎ) 3 సంవత్సరాల పిల్లలు - 24.7%

బి) 4 సంవత్సరాల పిల్లలు - 18.2%

సి) 5 సంవత్సరాల పిల్లలు - 7.4%

4) ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు పాఠశాలకి హాజరవుతున్న విద్యార్థులు 73.47% వుంది.

**టార్గెట్:** బాలురు, బాలికలందరు ప్రాథమిక విద్యను సక్రమంగా పూర్తి చేసేలా చూడటం

**I నుండి V వరకు పూర్తి చేసిన విద్యార్థులు I నుండి VII వరకు పూర్తి చేసిన విద్యార్థులు**

| I నుండి V వరకు | I నుండి VII వరకు |
|---|---|
| **బాలురు** | **బాలురు** |
| మధ్యలో చదువు ఆపేసిన వారు - 24.61% | మధ్యలో చదువు ఆపేసిన వారు - 50.2% |
| కొనసాగించిన వారు - 75.3% | కొనసాగించినవారు - 49.8% |
| **బాలికలు** | **బాలికలు** |
| మధ్యలో చదువు ఆపేసిన వారు - 24.81% | మధ్యలో చదువు ఆపేసిన వారు - 52.3% |
| కొనసాగించిన వారు - 75.1% | కొనసాగించిన వారు - 47.7% |

### 15 - 24 సం॥ల మధ్య వయసు వారి అక్షరాస్యతా శాతం

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 6 సం॥లు, ఆపైన వయస్సు వారిలో అక్షరాస్యత శాతం 65.4% ఉంది.

ప్రస్తుతం అక్షరాస్యత 66% ఉంది. గ్రామాల్లో పిల్లలు ముఖ్యంగా బాలికలు, నిరుపేద కుటుంబాలలో పిల్లలు పాఠశాలలో చేరడం ఇంకా తక్కువగానే వుంది. ఇంకో బాధాకరమైన అంశమేమంటే ప్రాథమిక పాఠశాలలో చేరిన పిల్లలు మధ్యలో చదువు ఆపేస్తున్నారు. వారు (సెకండరీ) మాధ్యమిక స్థాయి విద్యను పొందలేక పోతున్నారు.

2000 సం॥లో 80% మంది తరగతులకి హాజరవ్వగా ఇది 2005 సం॥కి 88% పెరిగింది. కాని షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకి చెందిన విద్యార్థులలో ఎక్కువగా 10వ తరగతి చేరే లోపే మధ్యలో చదువు ఆపేస్తున్నారు. వీరిలో 80% ST విద్యార్థులు, 70% SC విద్యార్థులు వుంటున్నారు.

### పిల్లల్లో అక్షరాస్యత

1వ తరగతి ఒక సంవత్సరం చదవడం పూర్తి చెయ్యడాన్ని అక్షరాస్యతగా పరిగణిస్తే 1వ తరగతిలో 94% మంది పిల్లలు చేరుతున్నారు. కాని చదువు కొనసాగించక మధ్యలో మానేసే వారి శాతం క్రింది విధంగా వుంది.

| | 1 నుండి 5 | 1 నుండి 6 తరగతి |
|---|---|---|
| బాలురు | 24.61% | 50.26% |
| బాలికలు | 24.81% | 52.38% |

2001 సం॥ జనాభా లెక్కల ప్రకారం 6 సం॥ వయస్సు అంతకన్నా ఎక్కువ పిల్లల్లో 65.4% అక్షరాస్యత వుంది. 1వ తరగతి ఒక సంవత్సరం పూర్తయితే వారు అక్షరాస్యులు కింద లెక్క.

### మధ్యాహ్న భోజన పథకం:

భారతదేశంలో 12 కోట్ల మంది పిల్లలకి 9.5 లక్షల పాఠశాలల ద్వారా మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఒక పూట ఆహారం లభిస్తుంది. మొత్తం భారతదేశంలో ఈ పథకం కింద 5000 కోట్లు ఖర్చవుతున్నాయి.

### (3) మూడవ ప్రధాన లక్ష్యం:

**స్త్రీ, పురుష సమానత్వం ప్రోత్సహించడం, స్త్రీలు స్వశక్తితో ఎదగడానికి అవకాశాల కల్పన**

**టార్గెట్:** ప్రాథమిక, మాధ్యమిక విద్యలో లింగ అసమానతలను కనీసం

2005 సం॥కి తొలగించడం. బాలిక విద్యను కొనసాగించేలా ప్రోత్సహించడం. బాలురతో సమానంగా విద్యను పొందే అవకాశమివ్వడం. 2015 సం॥ నాటికి అన్ని విద్యాస్థాయిలలో ఈ సమానత్వం వర్తించేలా చర్యలు తీసుకోవడం.

మహిళలు పురుషులతో సమానంగా ఎదగడానికి, మహిళల రక్షణకి మన రాజ్యాంగం హక్కులను కల్పించింది. దోపిడికి వ్యతిరేకంగా, గృహహింసకి వ్యతిరేకంగా చట్టాలని, అంతే కాకుండా ఆస్థిహక్కు, ప్రభుత్వ సంస్థలలో, పంచాయితీ రాజ్‌లలో 33% రిజర్వేషన్‌ను మహిళలకు కల్పించింది.

జనవరి 2008 సం॥ కల్లా ప్రపంచ వ్యాప్తంగా (పార్లమెంటు) చట్టసభల్లో మహిళలు 18% స్థానాలు పొందగలిగారు.

1) బాలురతో పోలిస్తే ప్రాథమిక, మాధ్యమిక ఉన్నత స్థాయి విద్యను పొందుతున్న బాలికల శాతం

- ప్రాథమిక పాఠశాలలో బాలికల అక్షరాస్యత 70.9% (85.9% 2006-07 సం॥కి)
- ఆంధ్రప్రదేశ్‌లో బాలురు 70.9% విద్య పొందుతుంటే 51.2% బాలికలు విద్య పొందుతున్నారు.
- సగటు అక్షరాస్యత 65.4% తో పోలిస్తే బాలికల అక్షరాస్యత 61.11% వుంది.

2) 15-24 సం॥ల మధ్యవయస్సు మహిళల అక్షరాస్యత పురుషులతో పోలిస్తే

- 2001 సం॥లో పనికి వెళ్ళే మహిళలు 25.68% (గ్రామాల్లో 30.91%, పట్టణాలలో 11.55%)
- పనిచేసే మహిళలలో 71.8% మంది వ్యవసాయం, వ్యవసాయ సంబంధమైన రంగాలకి సంబంధించిన వాటిలోనే పాల్గొంటున్నారు.

3) వ్యవసాయ పనులలో మహిళలకి దొరికే జీతం వాటా (ఒకే పనికి స్త్రీలకి పురుషుల కన్నా తక్కువ జీతం లభిస్తుంది)

4) మహిళలకి చట్టసభలలో సరైన, సమాన ప్రాతినిధ్యం.

- 1992 రాజ్యాంగ సవరణతో పంచాయితీరాజ్ సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్‌లు ఇస్తున్నారు. 1 మిలియన్ మహిళా ప్రజా ప్రతినిధులున్నారు.

**టార్గెట్:** 2005 సం॥కి ప్రాథమిక, సెకండరీ స్థాయి విద్యను లింగ అసమానతలు లేకుండా అందరికీ అందుబాటులోకి తేవడం. 2015 సం॥ కల్లా అన్ని స్థాయిల్లోని విద్య (ఉన్నతవిద్యలు)ను లింగ అసమానతలను తొలగించడం.

ప్రాథమిక, మాధ్యమిక, కళాశాల విద్యను పొందుతున్న బాలురు, బాలికల శాతం (యునెస్కో)

| I నుండి V తరగతి 2005-06 చేరినవారు | I నుండి VII తరగతి |
|---|---|
| బాలికలు - 74.15% | బాలికలు - 48% |
| బాలురు - 76% | బాలురు - 49.75% |

**వెనుకబడిన జిల్లాలు:** మహబూబ్‌నగర్, మెదక్, కర్నూలు, ఆదిలాబాద్, ఆదిలాబాద్

**సూచిక:** 15-24 సం॥ మధ్య వయస్సు పురుషులలో పోల్చుకుంటే (సెకండరీ) మాధ్యమిక స్థాయి విద్య కోసం పాఠశాలలో చేరే మహిళల సంఖ్య 0.79% తక్కువ.

### (4) నాల్గవ ప్రధాన లక్ష్యం : శిశు మరణాలను తగ్గించడం

**టార్గెట్:** 1990 నుండి 2015 మధ్య 5 సం॥ల లోపు పిల్లలలో మృత్యువాత పడే వారి సంఖ్య మూడింట రెండు వంతులు తగ్గించడం.

1990 సం॥లో 5 సం॥ లోపు వయస్సు వున్న 1000 మంది పిల్లలలో 117 మంది మృత్యువాత పడేవారు. అది ఇప్పుడు 72 మందికి తగ్గింది. 1000 మంది శిశువులలో 58 శిశుమరణాలు సంభవిస్తున్నాయి. వ్యాధి నిరోధక టీకాలు 60% మంది పిల్లలే పొందగలుగుతున్నారు.

మన దేశంలో వుండవలసిన దానికన్నా తక్కువ బరువు, పౌష్టికాహార లోపం వున్న పిల్లలు అధిక సంఖ్యలో వున్నారు. ప్రపంచ సంస్థల పరిశీలనలో అభివృద్ధిని కాంక్షించే, చిత్తశుద్ధి కలిగిన రాజకీయ చైతన్యం, అవసరమైన చర్యలు చేపట్టడం, స్పష్టమైన ప్రణాళికలతో, పనులతోనే మార్పు సాధించడం వంటివి చెయ్యకపోతే లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదు.

భారతదేశంలో శిశుమరణాలకి వుండవలసిన దానికంటే తక్కువ బరువుతో పుట్టడం, పౌష్టికాహార లోపం కారణాలు. వీటితో పాటు ముఖ్యంగా విరోచనాలు, డయేరియా, అంటువ్యాధులు, శ్వాస సంబంధమైన వ్యాధులు శిశువుల అకాల మరణాలకి కారణం అవుతున్నాయి. రక్షిత మంచినీటి సదుపాయం, శుభ్రమైన మరుగుదొడ్లు, ఎవరికి వారు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే చాలా సమస్యలు అరికట్టవచ్చును. ప్రపంచం మొత్తం మీద ఆకలితో అలమటిస్తున్న వారిలో సుమారు 50% మంది భారతదేశంలో వున్నారు. పౌష్టికాహార లోపం వల్ల ప్రపంచ వ్యాప్తంగా మరణిస్తున్న 50% పిల్లలు మన దేశం వారే.

ఇంకో ముఖ్య విషయం శిశువు పుట్టిన గంటలోపు మొదలుపెట్టి 18 నెలలు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వాలి.

### (5) ఐదవ ప్రధాన లక్ష్యం:
### గర్భిణీస్త్రీల ఆరోగ్యం బాగుండేలా చర్యలు.

**టార్గెట్:** 1990 నుండి 2015 మధ్య గర్భిణీ స్త్రీలలో మరణాలను నాల్గింట మూడు వంతులు తగ్గించడం.

భారతదేశంలో ప్రతి లక్ష మంది గర్భిణులలో 450 మంది మృత్యువాత పడుతున్నారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో గర్భిణీలు



మరణం సంభవించే దేశాలలో మనదేశం ఒకటి. ప్రసవం సమయంలో తల్లి మరణిస్తే పుట్టిన బిడ్డలకు సరైన సంరక్షణ లభించదు.

గర్భం దాల్చాక 3 నెలలకు కాని మహిళలు ఆరోగ్య కేంద్రాలకి వైద్యం కోసం వెళ్ళడం లేదు. వీరిలో చాలామంది వుండవలసిన దానికన్నా బరువు తక్కువగా, సరైన పోషకాహారం లేకుండా వుంటున్నారు. అందువలన 3 వంతుల మంది పిల్లలు పుట్టేటప్పుడు చాలా తక్కువ బరువుతో వుంటున్నారు. 1960లో దంపతులు 6గురు పిల్లలను కలిగి వుండేవారు. 1990లో ఇది ముగ్గురు పిల్లలకి పరిమితమైంది. ఒకసారి గర్భంగా దాల్చాక రెండవసారి గర్భం దాల్చడానికి 36 నెలలు మధ్య సమయం వుండాలి. కాని ఈ వ్యవధి పాటించటం లేదు. గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాల్లో కూడా సగానికి సగం డెలివరీలు ఇంట్లోనే జరగడం వలన చాలా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

18 సం॥లు నిండిన యువతులందరికీ విధిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన పోషకాల సప్లిమెంట్స్‌ను సరఫరా చెయ్యకపోతే ఇప్పుడు వున్న సమస్యలు ఇంకా తీవ్రతరమవుతాయి.

2006-07 సంవత్సరంలో జాతీయ గర్భిణీ స్త్రీల లబ్ధి పథకం కింద 26.2 లక్షల మంది లబ్ధి పొందారు.

### (6) ఆరవ ప్రధాన లక్ష్యం:

**HIV / ఎయిడ్స్, మలేరియా మొదలైన వ్యాధులను అరికట్టడం**

**టార్గెట్:** 2015 కల్లా HIV / ఎయిడ్స్, మలేరియా, ఇతర వ్యాధుల వ్యాప్తిని పూర్తి అరికట్టడం

అన్ని చర్యలు తీసుకొంటూ ఎయిడ్స్‌పై యుద్ధం ప్రకటించినప్పటికీ భారతదేశంలో 25 లక్షల ఎయిడ్స్ రోగులున్నారు. ఇంకా ప్రతి సంవత్సరం 2.25 లక్షల కొత్త రోగులు చేరుతున్నారు.

T.B. గత 5 సం॥లుగా వేగంగా ప్రబలుతోంది. మలేరియా (గిరిజన) అడవి ప్రాంతాల్లో భీకరంగా వ్యాపిస్తోంది. ఇంకా వివిధ వాతావరణాల్లో, కాలాల్లో అంటువ్యాధులు, బ్యాక్టీరియా కారక రోగాల నుండి రక్షించుకునేందుకు సన్నద్ధం కావాలి.

### (7) ఏడవ ప్రధాన లక్ష్యం:

**ప్రకృతిని పరిరక్షించుకోవడం.**

**టార్గెట్:** ప్రకృతి సంపదను పరిరక్షించుకోవడానికి మౌలిక, దీర్ఘకాలిక కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించాలి. నష్టపోయిన ప్రకృతి సంపదను తిరిగి పొందడానికి అవసరమైన చర్యలు, కార్యక్రమాలు చేపట్టాలి.

గడచిన రెండు సంవత్సరాలలో ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదల, దానివల్ల మానవ జాతి మనుగడ పై పడుతున్న ప్రభావం, ప్రకృతి విరుద్ధమైన భయంకరమైన మార్పులు ప్రపంచ ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

ఈ ఉష్ణోగ్రత పెరుగుదల చాలా చోట్ల అనావృష్టి, కొన్నిచోట్ల అకాల వర్షాలు, అతివృష్టి వంటి విపరీతాలకి దారితీస్తున్నాయి. ఆహారోత్పత్తి పడిపోవడం, సముద్రంలో నీటిమట్టం పెరగడం, భూఖనిజ సంపదను కోల్పోవడం, భూగర్భ జలాలు అడుగంటడం, ధృవాల వద్ద, మంచు పర్వతాలలోని మంచు కరిగిపోవడం, దాని వలన నిరంతరం పారే నదులు వేసవిలో ఎండిపోవడం వంటి వివత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నాము.



కొంతవరకైనా ఈ సమస్య నుంచి బయట పడటానికి పెట్రో సంబంధ వుత్పత్తులు, బొగ్గు వాడకం తగ్గించడం అవసరం. నీటిని, ఇంధనాలను వృధా చెయ్యకుండా తరువాతి తరాల వారికి అందించడం. ప్రయాణాలకి ప్రైవేటు రవాణా కన్నా పబ్లిక్ రవాణా మాధ్యమాలపై ఎక్కువ ఆధారపడటం మంచిది.

సోలార్ ఎనర్జీ (సౌర విద్యుచ్ఛక్తి), విండ్ ఎనర్జీ (గాలి మరల నుండి విద్యుచ్ఛక్తి), బయో ఇంధనాలు (మొక్కలు జీవ సంబంధ) వంటివి పర్యావరణాన్ని రక్షించడానికి మంచి ప్రత్యామ్నాయాలు.

అన్ని పబ్లిక్ స్థలాలలో మొక్కలు నాటడం, వాటిని పెంచడాన్ని ప్రోత్సహించాలి. పూర్తిగా పచ్చదనం నింపే ఒక అడవిని వృద్ధి చేయడం వలన మనం కొట్టేసిన చెట్ల స్థానంలో కొన్నింటిని పెంచినట్లవుతుంది.

### (8) ఎనిమిదివ ప్రధాన లక్ష్యం:

**అభివృద్ధి చెందడానికి ప్రపంచం చేయూతని అందుకోవడం.**

(a) మంచి పరిపాలన అందించడానికి అంకితమై ఉండాలి.

(b) తక్కువ ధరలకు అవసరమైన మందులు దొరికేలా చూడటం

జాతీయ స్థాయి మందుల ధరల నియంత్రణ మండలిని భారత ప్రభుత్వం ఏర్పరచింది. అత్యవసర మందుల ధరలను నియంత్రించి సగటు మనిషికి అందేలా చూసే అధికారం ఈ సంస్థకి వుంది.

(c) కొత్త టెక్నాలజీ ఉపయోగాలను, ఫలాలను అందరికీ అందుబాటులోకి తేవడం.

1960 నుండి 2000 సం॥ మధ్య అభివృద్ధి చెందుతున్న దేశాలలో సగటు వ్యక్తి జీవన ప్రమాణం (జీవించే కాలం) 46 సం॥ నుంచి 63 సం॥లకి పెరిగింది. అదే విధంగా 5 ఏళ్ళ లోపు పిల్లలలో మరణాల సంఖ్య సగానికి పైగా తగ్గింది. 1975-2000 సం॥ల మధ్య అక్షరాస్యతా శాతం సగానికి ఎక్కువ పెరిగింది.

11వ ప్రణాళిక ప్రకారం నిరుద్యోగుల 1999-2000 సంవత్సరంలో వున్న 26.68 కోట్ల నుండి 2004-2005 సం॥నికి 34.74 కోట్లకు పెరిగింది. ఒక సంవత్సరానికి ఉద్యోగాలు 2.3% వుంటే పని చేసే వారి సంఖ్య (పని సామర్థ్యం) 2.5% పెరుగుదల చూపిస్తోంది. 65% మంది తమకు తాము స్వయంగా ఉపాధి కల్పించుకుంటున్నారు. వీరిలో ఆ ఉపాధిని కొనసాగించడం చాలా మందికి సాధ్యం కావడం లేదు.

-అనువాదం: **వి. రజని**

# అందని ఆకు

గ్రామీణ కథల పోటీ విభాగంలో ప్రథమ బహుమతి పొందిన కథ

- యస్. రామ నరసింహం (సరసి)

**ఊరంతా కోలాహలంగా పండగ వాతావరణంతో కళకళ లాడిపోతోంది. వీధి వీధికీ తోరణాలు కట్టేరు. రోడ్ల మీద ముగ్గులు పెట్టేరు. లౌడు స్పీకర్లలో చక్కని పాటలు వినిపిస్తున్నాయి.**

ఎవరో తరుముకొస్తున్నట్టూ, ఏదో చెయ్యాల్సిన పని ఆలస్యం అయి పోతోందన్నట్టూ వూళ్లో ప్రతి వాడూ హడావుడిగా కనిపిస్తున్నాడు. పొరుగూరి వాడికైతే ఆ హంగామా ఎందుకో తెలియకపోవచ్చు గాని



వూళ్లో వాళ్లకందరికీ తెలిసిందే. చాలా రోజుల నుంచి ఆ రోజు కోసం వాళ్లు ఎదురుచూస్తున్నదే.

సర్పంచి గారింట్లో పెళ్లి!!

నెల్లాళ్ల ముందు నుంచే వూళ్లో వూహాగానాలు. ఎక్కడ నలుగురు కలిసినా ఆ పెళ్లి ఎంత గొప్పగా చేస్తారనే చర్చలే. సర్పంచి గారు వందెకరాల ఆసామీ మరి! ధర్మాత్ముడు. పెళ్లి దగ్గర కొచ్చే కొద్దీ వూహాగానాలు పుకార్ల మాదిరిగా రూపాంతరం చెంది పెరిగి పెద్దవి కాసాగేయి. కూతురి పెళ్లికి సర్పంచి గారు టౌను నించి ఏనుగుల్ని తెప్పిస్తారని, సినిమా యాక్టర్లని తీసుకొస్తారని. అల్లుడు గారు ఒక రోజులో లెక్కపెట్టగలిగినన్ని వంద రూపాయల నోట్లు కట్నంగా ఇస్తారని. అమ్మాయిని తూకం తూచి అంతెత్తు బంగారం పెడతారని. ఇలా ఒకరు చెప్పడం, చుట్టూ చేరిన వాళ్లు కళ్లింత చేసుకుని, నోళ్లు వెళ్లబెట్టి వినడం!

కట్న కానుకలూ, పెళ్లి ఏర్పాట్ల గురించి ఎవరెంత గొప్పగా చెప్పినా ఏ మాత్రం ఆశ్చర్యపోని వ్యక్తి వూరు మొత్తానికి ఒకే ఒక్కడున్నాడు. అతడే వెంకయ్య.

కాలవ గట్టున రావి చెట్టు కింద గుడిసెలో కుక్కిమంచంలో అటు పేదరికాన్ని, ఇటు వార్ధక్యాన్ని సమానంగా పోషిస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు వెంకయ్య. "పెళ్లి ఆళ్లెంత గొప్పగా సేసుకుంటే మాత్రం నాకేం వొరుగుద్దీ? వూళ్లో అందరికీ బోజనాలు పెడతారంటగా? ఎట్టా పెడతారో సెప్పండి. ఏవెడతారో సెప్పండి." అనేవాడు.

వూళ్లో వార్తలన్నీ పోగేసి, కాలకృత్యాల కోసం కాలవ గట్టు కొచ్చినపుడు అన్నీ వెంకయ్య చెవిలో వేసే అతడి స్నేహితుడొకడున్నాడు. ఆయన పేరు అప్పన్న. అప్పన్నెప్పుడొస్తాడా అని వెంకయ్య ఆతృతగా చూసేవాడు ప్రతి రోజూ. ఈ మధ్య వేరే వార్తలేం లేవు. ప్రతి రోజూ సర్పంచి గారింట్లో పెళ్లి మాటలే. వెంకయ్యకి ఇష్టం లేనివి చెప్పి, నోరెందుకు నొప్పి తెచ్చుకోవాలని, అతడికిష్టమైన భోజనాల గురించే చెప్పేవాడు అప్పన్న.

"పెద్దపెద్ద ఆకులంట! పెళ్లి కోసం ప్రత్యేకంగా టౌనులో కుట్టించి తెస్తన్నారంట. గుళ్లో అన్నదానం సేసినపుడు పెట్టినట్టు వుట్టి సాంబారన్నం కాదు బావా. వొడ్డించిన వొంటకాలతో ఆకు పట్టదంట!" అన్నాడు అప్పన్న ఒకరోజు.

"ఏంటి. అంత పెద్ద ఆకులో కూడానా? ఆశ్చర్యపోతూ అడిగేడు వెంకయ్య.

" అవును మరి. ఒకటా రెండా? ముప్పయ్యో నలబయ్యో వొడ్డిస్తారంట." కథనం రక్తి కట్టడానికి అతిశయోక్తి జోడించి చెప్పేడు అప్పన్న. " పప్పులు, కూరలు, స్వీట్లు, శార్లు, సాంబార్లు..... అటి పేర్లు నాకు తెలవదు బావా. అయ్యన్నీ వొడ్డిస్తారంట. అంతెందుకూ, ఆకుకి ఆ సివర్లో ఏసిన స్వీటు అందుకోవాలంటే నువు లేసి, సుట్టు తిరిగి దావాల్సిందే! అంత పెద్ద ఆకులో పెడతారంట! అసలు ఆటన్నిటీ రుసి సూసే సరికే కడుపు నిండిపోద్దంట. ఇంకేం తింటాం?" అంటూ అప్పన్న చెప్పేసరికి వెంకయ్య కళ్లు పచ్చబడిపోయాయి.

"బతికున్నందుకు అసువొంటి బోజినం ఒక్కసారన్నా సెయ్యాలి బావా! బతుకంతా గెంజి మెతుకుల్తోనే అయిపోయె. అందుకేనేమో మొన్నొచ్చిన జొరానికి నూకలు సెల్లిపోవాల్సినోణ్ణి బతికించేడు దేవుడు." అన్నాడు వెంకయ్య.

అప్పన్న చెప్పిన కథని క్షణక్షణం గుర్తు చేసుకుంటూ భార్య పైడమ్మకి చెబుతూ వుండేవాడు. " ఇంటన్నావా అందనంత ఆకంట! సుట్టు తిరిగెళ్లి తినాలంట!" అంటూ భర్త ఆనందపడిపోతూ చెబుతూ వుంటే మొగుడి కళ్లల్లో కనిపించే మెరుపులు చూసి మురిసిపోయేది పైడమ్మ.

రేపు పెళ్లనగా వెంకయ్య ఇంటికి - కాలవ అవతల పూరిలో వుంటున్న కూతురు అల్లుడూ, పిల్లల్ని వెంటబెట్టుకుని వచ్చేరు. 'అత్తగారు అడుక్కుతింటోంటే అల్లుడు మనుగుడుపులకి వచ్చే' దన్నది సామెత. ఆ చందంగానే అల్లుడు కూడా వచ్చేడని అనుకున్నాడు వెంకయ్య. కాని, సర్పంచి గారింట్లో విందు కోసమే పైడమ్మ వాళ్లని పిలిపించిందని అతడికి తెలియదు.

"ఏరా కిష్టిగా. అందనంత ఆకులేస్తారంట రేపు, ఎట్టా తింటారో ఏమో మీరిద్దరూ" అంటూ వెంకయ్య మనవల్ని వొళ్లో కూర్చోబెట్టుకుని ఏమేమి వడ్డిస్తారో, ఎలా తినాలో అవన్నీ వాళ్లకి కళ్లకు కట్టినట్టు చెప్పసాగేడు. వాళ్లకి అర్థం కాదేమోనని మరింత వివరంగా చెప్పడానికి, తన గుడిసె మీద పడేసి వున్న పెద్ద సైకిల్ చక్రం టైరుని తీసి నేల మీద పడేసి "ఇదిగో ఇంత ఆకుంటదంట. దీన్లో ఇక్కడ పప్పు, ఇక్కడ కూరలు, ఇక్కడ మిటాయిలు, మజ్జిలో వణ్ణం..." అంటూ నేల మీద మట్టి తీసి, టైరులోపల పోగులు పోగులుగా పెట్టి చూపించేడు.

"ముందు ఇది కలుపుకు తినాల. ఎక్కువ తినబాకు. ఇంకా తినేవి సాలా వున్నాయి. తర్వాత ఈ కూర." అంటున్న వెంకయ్యని "మరి ఆ సివర వున్న పచ్చడి తినాలంటే ఎట్టా?" అడిగేడు కిష్టిగాడు.

"అది కూడా తెలవదంట్రా. ముందుకు వొంగేవంటే వణ్ణంలో పడతావు. అంచేత లేసెళ్లి అక్కడివి తెచ్చుకుని ముందుకేసుకోవాల" అన్నాడు వెంకయ్య.

కిష్టిగాడు పకపకా నవ్వేడు. "ఎందుకు తాతా. ఆకుని ఇటు తిప్పుకుంటే పోలా?" అంటూ పదేళ్ల మనవడు సైకిల్ టైరుని చేతితో ఇటు తిప్పేనరికి- వెంకయ్య తన అవివేకానికి సిగ్గుపడిపోయాడు. "అప్పన్న గాడు సెప్పేడు అటేపెళ్లాలని. ఆడు కనబణ్ణీ సెబుతా" అంటూ తన తెలివితక్కువ తనాన్ని వేరే వాడి మీదకి నెట్టేశాడు వెంకయ్య.

"మట్టిలో పుట్టాం మట్టిలో పెరిగాం, అలాగని మట్టి తినలేం కదయ్యా" అంది పైడమ్మ మట్టిని అన్నంలాగా చూపిస్తున్న మొగుడికి చురకేస్తూ. వెంకయ్య గుర్రుగా చూశాడామె వంక.

సాయంత్రం సర్పంచి గారి పాలేరొచ్చి పొద్దున్నే పెళ్లని, మధ్యాహ్నం భోజనాలనీ, ఇంట్లో అందర్నీ రమ్మనీ చెప్పివెళ్లేడు. వూళ్లో పెద్దా పిన్నా అందరికీ ఆహ్వానాలు వెళ్లాయి.

ఆ రాత్రి వెంకయ్య నిద్ర పోలేదు. పైడమ్మని కూడా నిద్రపోనివ్వకుండా ఆ తిండి గురించే ఏవేవో చెప్పసాగేడు. "చాల్లేవయ్యా పడుకో, తెల్లారేక ఎట్టాగూ తినేదేగా" అంది పైడమ్మ.

తెల్లారింది. వెంకయ్య కూతురు మాలక్ష్మి కాలవలో స్నానం చేసి, పిల్లలికి కూడా స్నానాలు చేయించి, తయారు చేసింది. అల్లుడు కుడా సిద్ధం అయ్యాక పెళ్లికి బయల్దేరుతూ వుంటే, తల్లి పైడమ్మ అంది. "మీరెళ్లండమ్మా, మీ నాయనా, నేను తర్వాతొసాం" అని.

ఇరవై ఎకరాల పొలంలో చుట్టూ దడులు కట్టి పెద్ద సర్కస్ టెంటు వేసినట్టు వేసి పెళ్లి చేశారు సర్పంచి గారు. వూళ్లో జనాలే కాక పొరుగూరి వాళ్లు కుడా ఎగబడి ఎగబడి చూశారా మహోత్సవాన్ని. పెళ్లయ్యాక అందరికీ బంతి భోజనాలు ఏర్పాటయ్యాయి.

'తండ్రి చెప్పినట్టే పెద్ద పెద్ద ఆకులు, వంటకాలు ! తినడం కాదు కదా, బతుకులో తామెప్పుడూ అటువంటి వంటకాల్ని చూడనే లేదు' అనుకుంది మాలక్ష్మి. భర్త, పిల్లలతో కలిసి అంతా ఆబగా తిన్నారు. కడుపు పట్టనంత తిన్నాకా కూడా మిగిలిపోయాయి చాలా వరకు.

భోజనాలు చేస్తున్న వాళ్లందరి దగ్గరకీ వచ్చి పేరు పేరునా పలకరించింది సర్పంచి గారి భార్య. "ఏమే లక్ష్మీ! మీ అమ్మా, నాన్నా రాలేదా?" అంటూ అడిగిందావిడ. వాళ్లు కూడా వచ్చి ఎక్కడో జనాల్లో కూర్చుని తింటూ వుంటారని ఆమెకు తెలుసు. అయినా ఆశ కొద్దీ అబద్ధ మాడింది లక్ష్మి "అయ్యకి వొంట్లో బాగులేదమ్మా. మీరు కాస్తంత ఆకులో పెట్టిస్తే, పట్టుకెడతా." అంటూ కొంగు తీసింది బొడ్లోంచి.

"అయ్యో. అంతకన్నానా?" అంటూ ఆవిడ నలుగురు తినగలిగినంత అన్నాన్ని, ఆధరువుల్నీ ఆకుల్లో చుట్టి ఇప్పించింది.




ఇంటి కొచ్చాక చూస్తే తల్లీ, తండ్రీ అక్కడే వున్నారు. "ఏం రాలేదా" అంటూ అడిగింది మాలక్ష్మి. పైడమ్మ తలొంచుకుంది గాని, మాట్లాడలేదు.

"అమ్మగోరు అన్నం పంపించేరు. అయ్యా, నువు సెప్పినట్టే పెద్ద పెద్ద ఆకులు. అందనంత ఆకులు. ఇవిగో సూడు. లే.తిందువు గాని." అంటూ చాప మీద పడుకున్న తండ్రి పక్కనే మూట విప్పి పరిచింది మాలక్ష్మి.

"ఎక్కడ తింటాడమ్మా. రాత్రే యెల్లిపోయాడే నీ నాయనా" అంటూ పైడమ్మ ఒక్కసారిగా గొల్లుమంది.

"తెల్లారతాది తిండి తిందారని సంతోసపడిపోయాడే. ఆ సంతోసంతో వుక్కిరి బిక్కిరైపోయినట్టున్నాడు. లెగిసి సూసే సరికే, ఎల్లిపోయాడే." అంటూ పైడమ్మ శోకాలు పెట్టింది.

కూతురు తండ్రి మీద పడి ఏడుపు ప్రారంభించింది. "పొద్దున్నే సూసిన దానివి, సెప్పలేదేం? అంటూ తల్లిని నిలదీసింది.

"సచ్చిపోయాడని సెపితే అల్లరవుద్ది. ఇంట్లో ఎవుడన్నా సచ్చిపోతే ఆల్లని భోజనాలకి రానివ్వరు. మీనోటి కాడ కూడెందుకు సెడగొట్టాల? ఈడెట్టాగూ తినలేక పోయేడు. మీక్కూడా సెడగొడితే పైకెల్లినోడు సంతోసపడతాడా?" అంటూ, విలపించింది పైడమ్మ.

"అందనంత ఆకులో అన్నవెడతారని రోజంతా కలలు కనేవోడివిగా. తినూ. నీ పక్కనే వుందయ్యా ఆకు." అంది పైడమ్మ, అందని ఆ ఆకును అందేలా అతని దగ్గరకు తోస్తూ. ◆

# యేసుక్రీస్తు మధుర స్పర్శ

- స్వామి రంగనాథానంద

(గత సంచిక తరువాయి భాగం)

'కొండమీద ప్రసంగం ముగియడంతోనే, యేసుక్రీస్తు అజ్ఞాత జీవనం కూడా ముగిసింది. వేలకొద్ది జనం ఆయన్ని వెంబడించడం మొదలుపెట్టారు. వారిలో చాలామంది శరీర సంబంధమైన రుగ్మతలు, మానసిక సమస్యల బాధితులు. పలువురిది ఆయనకున్న ఆధ్యాత్మిక శక్తి పట్ల అచంచలమైన విశ్వాసం. వారాయన ఆశీర్వాదాల్ని కోరుకొని పొందారు. బాగయ్యారు కూడా. కొందర్ని ఆయన స్పర్శించాడు. మరికొందరు ఆయన వస్త్రపు చెంగును మాత్రం ముట్టారు. కొందర్ని 'మీరు పరిపూర్ణులు కండి' అంటూ ఆశీర్వదించాడు. వారందరి విషయంలోను ఫలితాలు వెనువెంటనే కనిపించాయి. అంటే యేసులో 'ఆ శక్తి ఉందని, ఆయన హృదయం కరుణాపూరితమని రుజువయింది. అయితే ఆయన తన శక్తిని ప్రదర్శించడానికి గాని, ప్రచారం చేసుకోవడానికి గాని ఇష్టపడేవాడు కాడు. తన ద్వారా బాగయిన వారికి కూడా ఆ విషయం అనవసరంగా ప్రచారం చేయవద్దని చెప్పేవాడు. స్వస్థత పొందిన వారు వెళ్ళి సమాజమందిరంలో ధర్మశాస్త్ర సంబంధమైన కృతజ్ఞత కానుకవేసి సంప్రదాయ సంబంధమైన యాజకులను తృప్తి పర్చండంటూ ఉద్బోధించాడు. మీ విశ్వాసమే మిమ్మల్ని బాగుపర్చిందని చెబుతూ, వారు పొందిన స్వస్థతకు కారణం వారిలోని విశ్వాసమేనని ప్రోత్సహించేవాడు.

ఇక్కడినుండి ఆయన జీవితంలోని సంఘటనల వడి పెరిగింది. సంప్రదాయ బద్ధమైన మతాధికారులకు, ఆయనకూ మధ్య నెలకొన్న వైరుధ్యం మరింత బలపడుతూ వచ్చింది. చివరికి అది సిలువతో పరాకాష్టకు చేరుకుంది. కాని ఈ రెండున్నరేళ్ళ కాలంలో అనేక ఘటనలు, ఉదంతాలు, వ్యక్తులతో మనకు పరిచయం అవుతుంది. ఆ సంఘటనలు, వ్యక్తులకు చరిత్రలో తిరుగులేని 'స్థానం' ఏర్పడింది. ఎంతో విషాదంతో కూడిన ఆ రెండున్నర సంవత్సరాల నాటకీయ పరిణామాల్లో ఆ సంఘటనలు, వ్యక్తులది ఉత్తేజభరితమైన పాత్ర. ఎంతో జాగరూకత, ఉత్తేజం, మానవత్వం, కరుణ, హాస్యం, చిరునవ్వులతో ఆయన అనేక ప్రాంతాలు సందర్శించారు. ధనవంతులతో, పేదవారితో, పాపులతో మంచివారితో, తక్కువవారితో, ఎక్కువవారితో ఆయన మెలిగిన విధానం, అందులో వ్యక్తమైన ఆయన హుందాతనం, నిబ్బరం మనల్ని అబ్బుర పర్చుతుంది. వివిధ పరిస్థితులలో ఆయన చూపించిన బహుముఖ ప్రజ్ఞ కూడా మనల్ని ఆశ్చర్యపర్చుతుంది.

## మరియ, మార్త

బేతని గ్రామానికి చెందిన మరియ, మార్తల అద్భుతమైన



ఉదంతం ప్రపంచ సాహిత్యంలో చేరిపోయింది. యేసు పట్ల వారిద్దరికీ ఎంతో భక్తి. తమ సోదరుడైన లాజరు అకాల మరణం వారినెంతో కృంగదీసింది. ఆ సమయంలో ఆయన పొరుగునే ఉన్నారని తెలిసింది. యేసువద్దకు మార్త పరుగెత్తింది. ఆయనలోని దైవత్వం పట్ల తనకు ప్రగాఢ విశ్వాసం ఉందని ప్రకటించింది. ఆ తరువాత ఇంటికి వెళ్ళి తన సోదరి మరియతో, "బోధకుడొచ్చాడు, నిన్ను పిలుస్తున్నాడు," అని తెలియజేసింది. ఇద్దరూ కలిసి వెళ్ళి బోధకునికి స్వాగతం చెప్పారు. మరియు ఆయన పాదాలపైన పడింది. యేసు ఎంతో కదిలిపోయాడు. వారంతా విలపించడం చూసి ఆయనకూడా తన ఆత్మలో మూలుగుతూ, కదిలిపోయి కన్నీళ్ళు విడిచాడు (యోహాను 11: 33,35).

తరువాత లాజరు సమాధి వద్దకు వెళ్ళాడు. కొన్ని క్షణాలపాటు పరలోకంలోని దేవునితో సంభాషించి, బయటకు రమ్మంటూ లాజరును ఆదేశించాడు. వెంటనే లాజరు సజీవుడుగా బయటకు వచ్చాడు. మరొక అద్భుతమైన సంఘటనలో, యేసు ప్రభువు చివరి విందు భోజనానికి ముందు మరియ ఆయనకు ఎంతో ప్రేమ పూరితమైన పరిచర్య చేస్తూ కనిపిస్తుంది. ఎంతో విలువైన అత్తరు బుడ్డిని తీసుకువచ్చి ఆయన తలపై పోసింది. ఆ సమయంలో ఆయన విందుకు కూర్చున్నాడు. అంతటి వృధాకు పాల్పడేందుకు బదులుగా దాన్ని అమ్మి బీదలకు సాయం చేయవచ్చు కదా అని ఒక శిష్యుడు విమర్శించబోతే, "ఆ స్త్రీని వేధించవద్దు. ఆమె నా నిమిత్తం ఒక మంచికార్యం చేసింది. బీదలెల్లపుడూ మీతో ఉంటారు కాని నేనుండను. ఆమె నా శరీరాన్ని అత్తరుతో తడిపి నా భూస్థాపనకు సాదృశ్యరూపకంగా వ్యవహరించింది. ఈ సువార్త ప్రకటించబడిన



ప్రతిచోటా ఆమె చేసిన ఈ కార్యం కూడా ప్రకటించబడుతుంది'', అంటూ యేసు వారించాడు.

ఆ ఇద్దరు సోదరీమణులు యేసును కలుసుకున్న మూడో సంఘటన కూడా ఉంది. ఇది ఎంతో మర్మయుక్తమైన ఉదంతం. యేసు ఒకసారి వారి ఇంటికి వచ్చాడు. మరియ ఆయన పాదాల చెంత కూర్చొని ఆయన సుబోధలు వింటోంది. మార్త వంటింట్లో ఆయన కోసం పాటుపడుతోంది. కాసేపయ్యాక మార్తవచ్చి తన సోదరి మరియ మీద ఫిర్యాదు చేసింది. నేనొక్కదాన్నే కష్టపడుతున్నానన్న చింత నీకు లేదా? నా సాయానికి సోదరిని కూడా పంపవచ్చుకదా? అని ఆమె వాపోయింది. అపుడు యేసు ''మార్తా, మార్తా, నీవు విస్తారమైన పనులు పెట్టుకొని నష్టపడుతున్నావు. మరియ ఉత్తమమైన దాన్ని ఎంపిక చేసుకుంది. అది ఆమె వద్దనుండి తొలగించబడదు,'' అని జవాబిచ్చాడు.
(లుకా 10:40-42)

## లోకాన్ని పూర్తిగా వదిలేస్తేనే పరలోక జీవితం సాధ్యం

యూదయలో యేసు సంచరిస్తున్న సమయంలో ఆయన వద్దకు ఒక వ్యక్తి వచ్చి, ఆయన ఎదుట మోకరించి సద్బోధకుడా' అని ఆయన్ను సంబోధించాడు. 'నిత్యజీవానికి వారసున్ని కావడానికి నేనేం చేయాలి? అని ఆయన ప్రశ్నించాడు. తనను సద్బోధకుడా' అని సంబోధించినందుకు యేసు అతన్ని మందలించి, ఆ సంబోధనకు దేవుడు తప్ప మరెవరూ అర్హులు కాదని సరిదిద్దాడు. పది ఆజ్ఞలూ పాటించమని అతనికి బోధించాడు. ఆ పని తాను చిన్నతనం నుంచీ చేస్తున్నానని, తాను ఇంకా ఏమైనా చేయవలసి ఉంటుందా, అని అతను జవాబిచ్చాడు. అపుడు యేసు అతన్ని చూసి జాలిపడి 'నీకు ఒకటి కొదువగా ఉంది. వెళ్ళి నాకున్నదంతా అమ్మి బీదలకు పంచిపెట్టితే పరలోకంలో ధనవంతుడవుతావు. అపుడు వచ్చి నా సిలువ మోస్తూ నన్ను వెంబడించు', అని సూచించాడు. అతడు చాలా ధనవంతుడు. అందువల్ల ముఖం చిన్న బుచ్చుకొని వెళ్ళిపోయాడు (మార్కు 10:21-22). ఆయనలా వెళ్ళిపోయిన నేపథ్యంలోనే యేసు చాలా సుప్రసిద్ధమైన ఒక వ్యాఖ్యచేశాడు. ''ఒక ధనవంతుడు పరలోక రాజ్యంలో ప్రవేశించటం కంటే, ఒక ఒంటె సూది బెజ్జంలో నుండి దూరడం చాలా సులువని'' ఆయన వ్యాఖ్యానించాడు.

సామాజిక విలువలకు, పరలోక సంబంధమైన జీవితానికి మధ్యగల అంతరాలను ఈ ఉదంతం స్పష్టం చేస్తుంది. లోకాన్ని పూర్తిగా త్యజించడమే పరలోక సంబంధమైన జీవితంలో పరమార్థమన్నది కూడా దీనితో రుజువవుతుంది. ఆ యువకుడైతే ముఖం చిన్నబుచ్చుకొని విచారంతో వెళ్ళిపోయాడు కాని, యేసుక్రీస్తు నిర్దేశించిన ప్రమాణాలను అందుకొని పరిశుద్ధమైన, ధన్యకరమైన జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరుకోవడానికి ఆ తరువాత తరాల్లో అనేక మంది యువతీయువకులను ఈ సంఘటన ప్రేరేపించింది.

## కరుణామయుడైన యేసు

రెండు సంఘటనల్లో ఆయనలోని పరలోక సాక్షాత్కారాన్ని విమోచనా శక్తిని రుజువు చేయడమే కాక, పరిశుద్ధత అనేది పాపాన్ని ఏవిధంగా పరిగణిస్తుందో రుజువు చేస్తుంది.

సీమోను అనే ఒక రోజున యేసును తన ఇంటికి భోజనానికి పిలిచాడు. యేసు ఆయన ఆహ్వానాన్ని మన్నించి వచ్చి విందులో కూర్చున్నాడు. యేసు ఆ పరిసయ్యుని ఇంట విందులో ఉన్నాడని తెలుసుకున్న ఆ ఊరిలోని పాపాత్మురాలైన ఒక స్త్రీ అత్తరు బుడ్డినొకదాన్ని తెచ్చి, ఆయన పాదాలను కన్నీటితో తడిపి, తన తలవెంట్రుకలతో తుడిచి, ఆయన శరీరాన్ని అత్తరుతో అభిషేకించింది.

ఒక పాపాత్మురాలు ఇదంతా తనకు చేయడాన్ని యేసు అనుమతించడం పట్ల ఆ పరిసయ్యుడు ఆగ్రహించాడు. అపుడు యేసు సీమోనునుద్దేశించి మాట్లాడుతూ, ''ఒక వడ్డీ వ్యాపారి వద్ద ఇద్దరు అప్పు తీసుకున్నారు. ఒకడు ఐదొందల రూపాయిలు, మరొకడు యాభైరూపాయలు తీసుకున్నాడు. ఆ అప్పును వాళ్ళు చెల్లించలేక పోయినపుడు అతను ఇద్దరినీ క్షమించాడు. ఇద్దరిలోనూ వడ్డీ వ్యాపారి అత్యధికంగా ఎవరిని ప్రేమించాడు చెప్పు'' అని యేసు ప్రశ్నించాడు. 'ఆయన వద్ద ఎక్కువ మొత్తాన్ని అప్పుతీసుకున్న వ్యక్తినే' అని సీమోను జవాబిచ్చాడు. 'నీవు సరిగ్గా జవాబిచ్చావు. ఈ మహిళను చూడు. నేను మీ ఇంటిలోనికి వచ్చినప్పుడు నేను కాళ్ళు కడుగు కోవడానికి నీవు నీళ్లియ్యలేదు. కాని ఆమె నా పాదాలకు తన కన్నీటితో తడిపి, తన తలవెంట్రుకలతో తుడిచింది. నీవు నన్ను ముద్దు పెట్టుకోలేదు. కాని అప్పటి నుండీ ఆమె నా పాదాలను ముద్దు పెట్టుకొంటూనే

ఉంది. నీవు నా తలను నూనెతో అంటలేదు. కాని ఆమె నాపాదాలను, తలను కూడా అత్తరుతో అభిషేకించింది. అందువల్ల విస్తారమైన ఆమె పాపాలు ఆమె విస్తారమైన ప్రేమ కారణంగా క్షమించబడ్డాయి.కొంచెమే క్షమించబడ్డ వారు, కొంచెమే ప్రేమిస్తారు' అని చెప్పి ఆ స్త్రీ వైపు తిరిగి 'నీ పాపాలు క్షమించబడ్డాయి' అని యేసు తెలిపాడు. ఆ మాటలు విందులో కలకలం రేపాయి. పాపాలను క్షమించే ఈ వ్యక్తి ఎవరు? అంటూ గుసగుసలు మొదలు పెట్టారు. యేసు మాత్రం ఆమెతో ' నీ విశ్వాసమే నిన్ను రక్షించింది. సమాధానంతో వెళ్ళు' అని చెప్పాడు. (లూకా VII.41-50)



యేసు యెరూషలేము లోని దేవాలయంలో ఒకసారి బోధిస్తున్నారు. ధర్మశాస్త్రోపదేశకులు, పరినయ్యులు పాపం చేస్తూ పట్టుబడిన ఒక స్త్రీని ఆయన వద్దకు తెచ్చారు. మోషే ధర్మశాస్త్రం ప్రకారం రాళ్ళతో కొట్టి చంపబడవలసిన ఆ స్త్రీని ఏమిచేద్దాం? అని వారాయన్ను అడిగారు. ఆయన్ను చిక్కుల్లో పెట్టాలన్నది వారి అభిమతం. ఇదంతా విన్న యేసు నేల మీదికి వంగి నేలపై తన చేతి వేలితో ఏదో రాస్తున్నాడని సువార్తికుడు వివరిస్తాడు. ఇదంతా పట్టనట్టుగా ఆయన నేల మీద రాస్తున్నాడు. అయితే వారు పట్టుబట్టి యేసు అభిప్రాయం కోసం పదేపదే అడగడం ప్రారంభించారు. అపుడు యేసు తలెత్తి 'మీలో పాపం చేయని వాడు మొదటిరాయి ఆ స్త్రీ మీద వేయాలి' అని తెలిపి మళ్ళీ నేల మీద రాస్తున్నాడు. అది విన్న వాళ్ళందరికీ మనస్సాక్షిలో వణుకు పుట్టింది. ఒక్కరొక్కరే ఆ స్థలం నుండి వెళ్ళిపోయారు. చివరికి అక్కడ ఆమె, యేసు మాత్రమే మిగిలారు. తలెత్తిన యేసు ఆమె ఒంటిరిగా నిలువబడి ఉండటం చూసి, 'అమ్మా, నీపై నిందలు మోపిన వారంతా ఏరి? నీ మీద రాళ్ళెవరూ వేయలేదా?' అని ప్రశ్నించాడు. 'ఎవరూ వేయలేదు' అని ఆమె జవాబిచ్చింది. అపుడు యేసు 'నేను కూడా వేయను. వెళ్ళు. మళ్ళీ పాపం చేయకు' అని చెప్పి ఆమెను పంపించాడు.

'నీ పాపాలు క్షమించబడ్డాయి' అన్న మాటల వెనుక ఉన్న 'శక్తి' ఆయనలోని దైవసాక్షాత్కారం ద్వారానే వచ్చింది. ఇది సాధువులకు కూడా అంతుపట్టని శక్తి. ఆయన దైవిక శక్తి ఆయన చేసిన అత్యంత ప్రాముఖ్యమైన ఒక వ్యాఖ్యలో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన పౌరులారా నాదగ్గరికి రండి. నేను మీకు విశ్రాంతినిస్తాను. నేను సాత్వికుడను. దీన మనసుగల వాడను గనుక, మీ మీద నాకాడి నెత్తుకొని నా వద్ద నేర్చుకోండి. అపుడు మీ ప్రాణాలకు విశ్రాంతి దొరుకుతుంది. ఎందుకంటే నా కాడి సులువుగాను, నా బరువు తేలికగాను ఉంటుంది", అని ఆయన ప్రకటించాడు.

కృష్ణావతారంలో పలికిన మాటల్ని ఈ మాటలు మనకు గుర్తు చేస్తాయి. "మీ బాధ్యతలన్నీ వదిలేసి నాలో సేదదీరండి. మీ పాపాలన్నింటి నుండి నేను విముక్తి కలిగిస్తాను. విచారించవద్దు", అన్నవే ఆ మాటలు (భగవద్గీత 18.66)

యేసు బోధలు

యేసుకిక శ్రమలు, కష్టాలు ఆరంభమయ్యాయి. ఆయన చేసే వ్యాఖ్యాల్లో దేశద్రోహం, దైవదోషం వంటి తప్పిదాలను ఆయనపై ఆరోపించడానికి నాటి యాజకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే ఆయన జ్ఞానం, సమయస్ఫూర్తి వారి ప్రయత్నాలను వమ్ము చేసింది. వారిలో కొందరు ఒక రోమా ప్రభుత్వ నాణేన్ని ఆయనకు చూపించి, కైసరుకు పన్నివ్వడం న్యాయమా, కాదా అని ప్రశ్నించారు. నాణెం పైన ఎవరి బొమ్మ ఉంది? అన్న యేసు ప్రశ్నకు వారు 'కైసరు బొమ్మ ఉంది' అని జవాబిచ్చారు. 'అయితే కైసరువి కైసరుకివ్వండి, దేవునివి దేవునికి ఇవ్వండి' అని చెప్పిన ఆయన జవాబుతో ఆయన జ్ఞానానికి వారు ఆశ్చర్య చకితులయ్యారు.

ఆయన్ను ఇరుకులో పెట్టాలన్న ఉద్దేశ్యంతో ఒక ధర్మశాస్త్రోపదేశకుడు 'ధర్మశాస్త్రంలోని ఆజ్ఞలన్నింటిలో కెల్లా అత్యంత ప్రాముఖ్యమైన ఆజ్ఞ ఏది?' అని ఆయనకు వేసిన ప్రశ్నకు, ఆయనిచ్చిన జవాబు ద్వారా ఆధ్యాత్మికతను, సామాజిక బాధ్యతల్ని సమ్మిళితం చేసిన ఒక అద్భుతమైన వ్యాఖ్యాను లోకం ఆయన నోట పొందింది.

'నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణ మనసుతో, నీ పూర్ణ ఆత్మతో ప్రేమించాలి. ఇదే మొట్టమొదటిది, అత్యంత ప్రాముఖ్యమైనది అయిన ఆజ్ఞ. అయితే రెండవ ఆజ్ఞ కూడా అలాంటిదే. నిన్నువలె నీ పొరుగువార్ని ప్రేమించు అన్నది ఆ రెండవ ఆజ్ఞ. ధర్మశాస్త్రమంతా, ప్రవక్తల ప్రవచనాల సారాంశమంతా ఈ రెండు ఆజ్ఞల్లోనే మిళితమై



ఉన్నాయి' అని యేసు జవాబిచ్చాడు.

ఈ ప్రవచనం మరొక ఆచరణాత్మక ప్రశ్న తలెత్తడానికి దారినిచ్చింది. మరి నా పొరుగు వాడెవడు? అన్నది ఆ ప్రశ్న. దానికి జవాబుగా యేసు చెప్పిన మంచి సమరయుని ఉపమానం, మతపరమైన, వర్గపరమైన సంకుచిత ఆలోచనా సరళి పూర్తిగా విరుద్ధంగా ఆధ్యాత్మికతను, సామాజిక బాధ్యతల్ని మేళవించిన సార్వత్రిక సిద్ధాంతాన్ని ఆవిష్కరించింది.

ఒక వ్యక్తి యెరుషలేము నుండి యెరికోకు వెళ్తూ దొంగల చేతిలో చిక్కాడు. వారతన్ని దోచుకొని గాయపర్చి రోడ్డు మీదే వదిలేసి వెళ్ళిపోయారు. ఒక యాజకుడు, ఆ దారిలో వచ్చి అతన్ని చూశారు. కాని తమ దారిన తాము వెళ్ళిపోయారు. కాని ఒక సమరయుడు మాత్రం అతన్ని చూసి, అతని మీద జాలిపడి, అతన్ని పరామర్శించి, గాయాలను నూనెతో, ద్రాక్షరసంతో కడిగి, కట్టి, తన పశువుమీదే అతన్ని ఎక్కించుకొని ఒక సత్రానికి తీసుకువెళ్ళి అందులో పెట్టాడు. మరునటి రోజు వెళ్ళిపోతూ అతని పక్షంగా ఆ సత్రపు యజమానికి రెండు కాసులిచ్చి 'అతన్ని జాగ్రత్తగా చూసుకో. అవసరమైతే మళ్ళీ నేను వచ్చినపుడు మరికొంత చెల్లిస్తాను' అని చెప్పాడు.

ఈ కథ చెప్పి, ఆ దొంగల చేతిలో చిక్కిన వానికి ఈ ముగ్గురిలో పొరుగు వాడెవడని యేసు అడిగాడు. అతని మీద జాలిపడిన వాడేనని ఆ ధర్మ శాస్త్రోపదేశకుడు జవాబియ్యగా, నీవు కూడా వెళ్ళి ఆ ప్రకారం చెయ్యమని ప్రభువు సలహా ఇచ్చాడు. (లూకా 10:30-37)

యాజకులు పెట్టే బాధలు ఎదుర్కొంటూనే మధ్యమధ్యలో యేసు బోధలు చేశాడు. సామాన్య ప్రజలకు సన్నిహితులైన శిష్యులకు కూడా ఆయన బోధించాడు. అత్యంత క్లిష్టమైన సంగతులు కూడా సులువుగా 'అర్థమయ్యే విధంగా ఉదాహరణల ద్వారా ఆయన సాధారణ ప్రజలతో మాట్లాడేవాడు. మంచి సమరయుని లాంటి ఉదాహరణ ద్వారా ఆయన తన బోధల కీలకాంశాన్ని 'పరిశుద్ధ జీవితం'గా తెలియజేశాడు. పదిమంది కన్యకల ఉపమానం వంటి ఉపమానాల ద్వారా ఎంతో లోతైన పారమార్థిక సత్యాలను ఆయన బోధించాడు. మానవసేవ, అన్నార్తులను ఆదుకోవడం, రోగులు, నిరాశ్రయులు, వస్త్రహీనులు, బలహీనులను ఆదుకోవడమే ఆత్మతో దేవుణ్ణి ఆరాధించడమని ఆయన బోధించాడు. 'మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకరికి మీరు చేశారు గనుక, నాకు కూడా చేశారు' అని ఆయన సెలవిచ్చాడు. (మత్తయి 25:40)

సర్వసృష్టికి వెళ్ళి సువార్త ప్రకటించమంటూ ఆయన తన శిష్యులను ఆదేశించాడు. అయితే అలా బోధ చేసేవారు అన్నింటినీ వదిలేసిన సాధు జీవితాన్ని జీవించాలని, వారు దేవునిపై ఆధారపడిన వారుగా, లౌకిక జీవితం పైన, ఆస్తులు, తదితర విషయాల పైన మక్కువ లేనివారుగా, సమాధానకర్తలుగా, సాత్వికులుగా ఉండాలని బుద్ధుడు తన శిష్యులకు బోధించినట్టుగా ఆయన వారికి బోధించారు. బౌద్ధమతస్తుల లాగే, క్రైస్తవ బోధకులు కూడా ఆ తరువాత క్రమంలో ఈ బోధ నుండి పక్కకు తొలిగిపోయి, మహాబోధకుడు చూపించి 'ఇరుకుమార్గం' వదిలి వేయడం విషాదకరం.

అయితే తన శిష్యులకు మాత్రం యేసు ఉపమానాల అవసరం లేకుండానే నేరుగా బోధించాడు. క్రీస్తుగా తన నిజతత్వాన్ని, అభిషక్తుడిగా తన మహిమరూపాన్ని, తన మరణానికి కొద్దిరోజుల ముందు యేసు తన శిష్యులకు చూపించాడు. అయితే తన పునరుద్ధానం వరకు ఈ విషయాన్ని ఎవరితోనూ చెప్పవద్దని ఆయన వారిని ఆజ్ఞాపించాడు. నేనే మార్గం, నేనే సత్యం, నేనే జీవమునైయున్నాను. నా ద్వారానే తండ్రి వద్దకు చేరగలరు. నన్ను ఎరిగితే నా తండ్రిని ఎరిగినట్టే. నన్ను చూసినవాడు నా తండ్రిని చూసినట్టే. . . నేను నా తండ్రిలో ఉన్నట్టు మీరు నమ్మడం లేదా? నేను మీతో చెప్పే మాటలు నావి కావు కాని నాకు తండ్రి బయల్పర్చిన మాటలు. అయితే నాలో నివసించే తండ్రి ఈ కార్యాలు చేస్తున్నాడు' (యోహాను 14 : 6-10) అని యేసు సెలవిచ్చాడు.

తనను వెంబడించే వారంతా తమను తాము ఉపేక్షించుకొని తమ సిలువనెత్తుకొని రావాలని ఆయన ఉద్బోధించాడు. ఆయన సకల సౌకర్యాలతో కూడిన పూలబాట వంటి మతాల్ని వారికి బోధించలేదు కాని సాహసోపేతమైన వీరమార్గాన్ని వారికి బయల్పర్చాడు. దేవుని ప్రేమలో సర్వస్వాన్ని త్యజించిన జీవితం అది. 'తన ప్రాణాన్ని కాపాడుకోగోరె వాడు దాన్ని పోగొట్టుకుంటాడు. నా కోసం తన ప్రాణాన్ని పోగొట్టుకోగోరేవాడు దాన్ని కాపాడుకుంటాడు. ఈ లోకాన్నంతా సంపాదించుకున్న వ్యక్తి తన ప్రాణాన్ని పోగొట్టుకుంటే దాని వల్ల అతనికేమి ప్రయోజనం? తన ప్రాణానికి బదులుగా మానవుడేమి ఇవ్వగలడు?' అని యేసు బోధించాడు (మత్తయి 16 : 25 - 26)

- అనువాదం: **రెవ. టి. ఎ. ప్రభుకిరణ్**

# ప్రజా ప్రతినిధులకు చక్కని అవకాశాలు మహిళా శిశు కార్యక్రమాలు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణకు హాజరయ్యే పంచాయతీరాజ్ సంస్థల ప్రజా ప్రతినిధులలో ప్రజాసేవ పట్ల అంకిత భావం, తమ పదవీ కాలం పూర్తయ్యేలోపు ఏఏ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా తమ ప్రాంతానికి మేలు చేయగలమో తెలుసుకోవాలనే ఆకాంక్ష కన్పిస్తూ వున్నాయి. ఇది చాలా సంతోషదాయకం.

అధికారాల వికేంద్రీకరణకు సంబంధించిన వ్యవస్థ రూపుదిద్దుకుంటూవున్న సమయమిది. దానివలన ప్రజా ప్రతినిధులు గుర్తించిన అన్ని స్థానిక సమస్యలను పరిష్కరించడానికి చాలినంత నిధులు అందుబాటులో లేవని, స్థానికంగా తమ ఆలోచనలకు కార్యరూపమివ్వడానికి సమస్యలు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం వీటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరడం జరుగుతూ వున్నది. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా వున్నది.

అయితే, ఈ సమస్యలు పరిష్కారమైతేనే ప్రజాసేవ చేయగలం అనుకొంటే పొరపాటే. తెలివైన నాయకులు తాము గుర్తించిన అడ్డంకులూ, సమస్యలు తొలగడానికి కృషి చేస్తూనే, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను తమ ప్రజల శ్రేయస్సు కోసం వినియోగించుకోగల అవకాశాలను అందిపుచ్చుకొంటారు. వారి ఆశీస్సులతో తమ రాజకీయ భవితను చక్కగా తీర్చిదిద్దుకుంటారు.

ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ అమలు చేస్తున్న వివిధ పథకాలను, కార్యక్రమాలను వినియోగించుకొని తమ ప్రాంతంలోని మహిళలకు, పిల్లలకు ఎలాంటి సేవలు అందించగలరో తెలుసుకుందాం.

### మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ లక్ష్యాలు

- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్ల లోపు పిల్లల సమగ్ర అభివృద్ధి సాధించడం.
- బాలికల పట్ల కుటుంబంలో, సంఘంలో కొనసాగుతున్న వివక్షతను తగ్గించడం. వారి విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం.
- నిరాదరణకు గురైన, క్లిష్టపరిస్థితులలో జీవనం సాగిస్తున్న మహిళలను అదరించడం. వారికి తగిన శిక్షణనిచ్చి, ఆర్థిక స్వావలంబన కలిగించడం.
- బాలికలు, స్త్రీలు ఎదుర్కొంటున్న సాంఘిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం.

ఈ లక్ష్యాల సాధనకు ఈ శాఖ అమలు పరిచే కార్యక్రమాలను ప్రధానంగా మూడు వర్గాలుగా విభజించవచ్చును. అవి.

- మహిళా శిశు సంక్షేమ గృహాల నిర్వహణ
- సమగ్ర శిశు అభివృద్ధి పథకాల అమలు (ఐసిడిఎస్)
- సాంఘిక సమస్యల నివారణా చర్యలు

### మహిళాభివృద్ధి శిశు సంక్షేమ కార్యక్రమాలు

**I. సంక్షేమ గృహాల నిర్వహణ**

1. శిశు విహార్‌లు/శిశుగృహాలు
2. బాలసదనాలు
3. కాలేజీ విద్యార్థినుల వసతి గృహాలు
4. ఉద్యోగినుల వసతి గృహాలు
5. రెస్క్యూ హోమ్
6. స్టేట్ హోమ్స్, సర్వీసు హోమ్స్/స్వధార్ హోమ్స్
7. వృద్ధాశ్రమాలు
8. శ్రీమతి దుర్గాబాయి మహిళల సాంకేతిక శిక్షణాలయం

**II. ఐసిడి.ఎస్ ప్రాజెక్టుల నిర్వహణ**

**III. సాంఘిక సమస్యలు పరిష్కార చర్యలు**

1. గృహహింస నిరోధక చట్టం అమలు
2. బాల్య వివాహ నిరోధక చట్టం అమలు
3. అక్రమ రవాణా నివారణా చర్యలు
4. లింగ వివక్ష నివారణా చర్యలు

## మహిళా శిశు సంక్షేమ గృహాలు

### 1. శిశు విహార్‌లు / శిశు గృహాలు

అనాథలు, కన్నవారి నిరాదరణకు గురైన శిశువులు, ఆరేళ్ల లోపు పిల్లలను శిశు విహార్‌లు, శిశు గృహాలలో చేర్చుకొంటారు. వీరిని ఈ కేంద్రాలలో సంరక్షిస్తారు. దత్తత కోరుకునే జంటలకు నాయబద్ధంగా దత్తతకు ఇస్తారు.

రాష్ట్రంలో రెండు శిశువిహార్‌లు వున్నాయి. ఒకటి చిత్తూరులో వున్నది. ఇందులో 30 మంది పిల్లలకు ఆశ్రయం లభిస్తోంది. రెండవది హైదారాబాదులో వున్నది. ఇక్కడ దాదాపు 200 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు.

ఇవికాక రాష్ట్రంలో పది శిశుగృహాలు వున్నాయి. ఒక్కో శిశు



**రాష్ట్రంలో మొత్తం 81 బాల సదనాలున్నాయి.**
**ఒక్కోదానిలో 60 మంది పిల్లలకుఆశ్రయమిస్తారు.**
**జిల్లావారీ బాలసదనాల వివరాలు**

| క్రమసంఖ్య | జిల్లా | బాల సదనాల సంఖ్య | బాలసదనాలు వున్న ఊళ్ల పేర్లు |
|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 3 | శ్రీకాకుళం, సోంపేట, పలుంస |
| 2 | విజయనగరం | 3 | బొబ్బిలి, విజయనగరం, గజపతినగరం |
| 3 | విశాఖపట్నం | 5 | భీముని పట్నం, కశింకోట, నర్సీపట్నం, పాడేరు, చింతపల్లి |
| 4 | తూర్పుగోదావరి | 4 | రాజమండ్రి, అడ్డతీగల, కాకినాడ, అమలాపురం |
| 5 | పశ్చిమగోదావరి | 3 | తణుకు, దెందులూరు, ఆకివీడు |
| 6 | కృష్ణా | 4 | నూజివీడు, మచిలీపట్నం(1,2), విజయవాడ |
| 7 | గుంటూరు | 3 | గుంటూరు, బాపట్ల, పిడుగురాళ్ల |
| 8 | ప్రకాశం | 3 | గిద్దలూరు, ఒంగోలు, కందూరు |
| 9 | ఎస్.పి.ఎస్. నెల్లూరు | 5 | నెల్లూరు, గూడూరు, వెంకటగిరి, సుల్లూరుపేట, కోట |
| 10 | కర్నూలు | 3 | పెద్దపాడు, ఆళ్లగడ్డ, పత్తికొండ |
| 11 | కడప | 4 | కడప (కొండాయపల్లి), రాజంపేట, కడప(రీజనల్‌హోమ్), లక్కిరెడ్డిపల్లి |
| 12 | అనంతపూర్ | 3 | హిందూపురం, ధర్మవరం, అనంతపురం |
| 13 | చిత్తూర్ | 3 | మదనపల్లి, చిత్తూరు, శ్రీకాళహస్తి |
| 14 | వరంగల్ | 4 | జనగాం, గూడూరు, ములుగు, వరంగల్ |
| 15 | కరీంనగర్ | 3 | కరీంనగర్, జగిత్యాల, హుజూరాబాద్ |
| 16 | ఖమ్మం | 3 | ఖమ్మం, భద్రాచలం, మునుగూరు |
| 17 | అదిలాబాద్ | 4 | అదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ |
| 18 | నిజామాబాద్ | 3 | నిజామాబాద్, కామారెడ్డి, బాన్స్‌వాడ |
| 19 | నల్గొండ | 3 | భువనగిరి, నల్గొండ, మిర్యాలగూడ |
| 20 | మహబూబ్‌నగర్ | 5 | మహబూబ్‌నగర్, ఆత్మకూరు, అచ్చంపేట, వనపర్తి, గద్వాల్ |
| 21 | మెదక్ | 4 | మెదక్, సిద్దిపేట్, సంగారెడ్డి, నారాయణ్‌ఖేడ్ |
| 22 | రంగారెడ్డి | 4 | పరిగి, ఆల్వాల్, వికారాబాద్, మెయినాబాద్ |
| 23 | హైదరాబాద్ | 2 | హైదరాబాద్ (1,2) |

గృహంలో పది మంది పిల్లలు ఆశ్రయం పొందడానికి వసతి వున్నది. ఇవి విశాఖపట్నం, కృష్ణా, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, వరంగల్, ఖమ్మం, అదిలాబాద్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలలో వున్నాయి.

## 2. బాలికాసదనాలు

6-10 సంవత్సరాలలోపు అనాథ బాలకలను, వికలాంగులైన



తల్లిదండ్రులు కలిగిన పిల్లలను, మాజీసైనికుల పిల్లలను ఈ సదనాలలో చేర్చుకొంటారు. వారికి అన్ని వసతులు కల్పించి పదవతరగతి వరకు చదివిస్తారు. ఈ పిల్లలకు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే యోగాభ్యాసం, కంప్యూటర్ శిక్షణ, ఆటపాటలు, సృజనాత్మక కృత్యాలలో శిక్షణ ఇస్తారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఇక్కడి బాలికలకు పాఠ్యాంశాలపై ప్రత్యేక శిక్షణనిస్తారు.

## 3. కాలేజీ విద్యార్థినుల వసతి గృహాలు

ఇవి రాష్ట్రంలో ఆరు వున్నాయి. విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు, గుంటూరు, తిరుపతి, వరంగల్, హైదరాబాదులందు ఈ వసతి గృహాలు నడుస్తున్నాయి. బాలికా సదనాలలో పదవతరగతి పూర్తి చేసిన బాలికలు, పై చదువు కొనసాగించే అవకాశం వుంటుంది. ఇక్కడి విద్యార్థినులకు చదువుతోపాటు కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల నిర్వహణ, అవసరమైన సబ్జెక్టులలో ప్రత్యేకమైన కోచింగ్ ఇప్పించడం కూడా జరుగుతుంది.

## 4. ఉద్యోగినుల వసతి గృహాలు

రాష్ట్రంలో ఉద్యోగినుల వసతి గృహాలు 16 వున్నాయి. మొదటి తరగతి పట్టణాలలో ఐదువేల రూపాయల లోపు నెలసరి ఆదాయం పొందే మహిళలకు, ఇతర పట్టణాలలో 4500/- రూపాయలలోపు నెలసరి ఆదాయం పొందే మహిళలకు ఈ హాస్టళ్లలో ప్రవేశం వుంటుంది. ఈ గృహాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి, కర్నూలు, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లందు నడుస్తున్నాయి.

## 5. రెస్క్యూ హోమ్

సాధారణంగా బాల్యవివాహాలకు సంబంధించిన కేసులలో కోర్టు ద్వారా బాలికలు ఈ గృహానికి వస్తారు. వీరికి పద్దెనిమిదేళ్ళు నిండేవరకు ఈ గృహంలో వుంటారు. ఇక్కడున్న కాలంలో స్పెషల్ కోచింగ్ ద్వారా విద్యాబోధన, కంప్యూటర్ శిక్షణ, ఇతర వృత్తి విద్యలలో శిక్షణనిస్తారు.

## 6. స్టేట్ హోమ్స్, సర్వీసు హోమ్స్, స్వధార్ హోమ్స్

అనాథలు, అన్యాయాలకు గురైన స్త్రీలు, క్లిష్టమైన పరిస్థితుల నుండి రక్షింపబడిన మహిళలకు ఈ సంస్థలలో ఆశ్రయం కల్పిస్తారు. వీరు మూడు నుంచి ఐదేళ్లపాటు ఈ హోమ్స్‌లో ఉండవచ్చు. ఇక్కడ వున్న కాలంలో వారికి ఉచిత భోజన, వస్త్ర, వసతి, వైద్య సదుపాయాలు వుంటాయి. వారికి కౌన్సిలింగ్ ద్వారా మానసిక స్థైర్యాన్ని కలిగించడమేకాక స్వయం ఉపాధి కానీ, నెలసరి ఆదాయాన్నిచ్చే వుద్యోగాలను కానీ సమకూర్చే వృత్తివిద్యా కోర్సులతో శిక్షణనిస్తారు.

స్టేట్ హోమ్‌లు శ్రీకాకుళం, రాజమండ్రి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ లందు వున్నాయి. సర్వీసుహోమ్‌లు పశ్చిమగోదావరి జిల్లాలోని కన్నాపురం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వరంగల్, హైదరాబాదులందు నడుస్తున్నాయి. ఇవికాక, రాష్ట్రంలో అన్ని జిల్లాలలోనూ కలిపి 29 స్వధార్ హోమ్‌లు వున్నాయి.

## 7. వృద్ధాశ్రమాలు

అరవై ఐదు సంవత్సరాల పైబడిన వృద్ధ మహిళలకు, అనాథస్త్రీలకు ఈ వృద్ధాశ్రమాలు కల్పతరువుల వంటివి. వారికి ఉచిత భోజన వసతి, వస్త్ర, వైద్య సదుపాయాలు అందిస్తారు.

రాష్ట్రంలో వృద్ధుల కోసం 111 డే కేర్ సెంటర్‌లు, (పగలు నడిచే వృద్ధాశ్రమాలు), 17 షార్ట్‌కేర్ యూనిట్లు (కొద్దికాలం వసతి నిచ్చే గృహాలు), 40 మొబైల్ మెడికేర్ హోమ్స్ (సంచార వైద్య గృహాలు), 3 వృద్ధాశ్రమాలు నడుస్తున్నాయి. వీటి వివరాలు ఇలా వున్నాయి.





## 8. శ్రీమతి దుర్గాబాయి మహిళల సాంకేతిక శిక్షణా కేంద్రం

ఇది హైదరాబాద్ నగరంలో అమీర్‌పేటలో వున్నది. ఈ సంస్థ సివిల్, ఆర్కిటెక్చర్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఇన్స్ట్రుమెంటేషన్ డిప్లొమా కోర్సులలో శిక్షణనిస్తున్నది. దీనికి విద్యార్థినుల ఎంపిక కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా సాంకేతిక విద్యా శాఖ డైరెక్టరు చేస్తారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ గృహాల నుంచి వచ్చే విద్యార్థినులకు కొన్ని సీట్లను ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది.

**సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసిడిఎస్ పథకం):** రాష్ట్రంలోని 23 జిల్లాల్లో 423 ఐసిడిఎస్ ప్రాజెక్టులు

నడుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనుబంధ పోషకాహారం, వ్యాధి నిరోధక చర్యలు, పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య పరీక్షలు, రెఫరల్ సేవలు అందిస్తున్నారు.

### సాంఘిక సమస్యల పరిష్కార, నివారణా చర్యలు

ఇందులో భాగంగా లింగవివక్షతను తగ్గించడానికి, బాలికా సాధికారతను సాధించడానికి బాలికా సంరక్షణ పథకం, కిశోర శక్తి యోజన పథకాలు అమలవుతున్నాయి. అంతేకాకుండా గృహహింస



నిరోధక చట్టం, బాల్యవివాహ నిరోధక చట్టం, బాలికలు-స్త్రీల అక్రమ రవాణ నిరోధక చట్టం అమలు పరచడానికి కృషి జరుగుతోంది.

### బాలికా సంరక్షణ పథకం

ఈ పథకం భారతీయ జీవిత భీమా సంస్థ (ఎల్.ఐ.సి) వారితో ఒప్పందం మేరకు 1.4. 2005 నుండి అమలులో వున్నది.

### అర్హతలు

గ్రామీణ ప్రాంతాల్లో రూ. 20,000/- పట్టణ ప్రాంతాలలో రూ. 24,000/- లోపు ఆదాయం కలిగి ఒకరు లేక ఇద్దరు పాపలు మాత్రమే కలిగి వున్న కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. 1.4.2005 తర్వాత కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసుకొని వుండాలి. ఒక్క పాపనే కలిగి వున్న వారు ఆ పాపకు మూడేళ్లలోపు నమోదు చేసుకోవాలి. ఇద్దరు పాపలు వున్నవారు చిన్నపాపకు మూడేళ్ల నిండే లోపు నమోదు చేసుకోవాలి.

### లబ్ధి

ఒకే బాలిక కలిగిన కుటుంబానికి ఆ అమ్మాయికి 20 సంవత్సరాలు నిండిన తర్వాత లక్షరూపాయలు, ఇద్దరు పాపలతో నమోదు చేసిన కుటుంబాల లోని బాలికలకు ఒక్కొక్కరికి ముప్పైవేల రూపాయలు జీవిత భీమా సంస్థ చెల్లిస్తుంది. దగ్గరలోని అంగన్‌వాడీ కేంద్రాలలో నింపిన దరఖాస్తు ఫారాలను అందజేయడం ద్వారా అర్హులైన పిల్లలను నమోదు చేయవలసి వుంటుంది.

### 2. కిశోర శక్తి యోజన

ఈ కార్యక్రమం క్రింద బాలకార్మిక సమస్య, బాల్యవివాహాలు, బాలికలలో నిరక్షరాస్యత వంటి సమస్యలు ఎక్కువగా వున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఎంచుకొని, 11-18 సంవత్సరాలలోపు బాలికలు 25-30 మందితో బాలికా మండళ్లను ఏర్పాటు చేశారు. వారిలో చురుకుగా వుండి, చక్కటి వాక్చాతుర్యం కలిగిన ముగ్గురిని లీడర్లుగా ఎంపిక చేశారు. ఇలా ఎంపిక చేసిన లీడర్లకు ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత శుభ్రత అంశాలపైన బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా, బాలకార్మికులు వంటి సాంఘిక సమస్యలపైన, లింగ వివక్షత వంటి అంశాలపైన శిక్షణనిచ్చారు. తర్వాత వీరి ద్వారా బాలికామండలి సభ్యులకు శిక్షణ నివ్వడం జరిగింది.

గత రెండు సంవత్సరాలుగా ఈ పథకం క్రింద పద్దెనిమిదేళ్లలోపు బాలికలకు వృత్తి విద్యా శిక్షణనిస్తున్నారు. తొమ్మిది, పది తరగతుల వరకు చదివిన బాలికలకు కంప్యూటర్ శిక్షణ, టెలీకాలర్స్ శిక్షణ, ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్ ఇస్తున్నారు. తక్కువ చదువుకున్న లేదా నిరక్షరాస్యులైన బాలికలకు కాగితపు సంచుల తయారీ, జనపనార వస్తువుల తయారీ, శారీరోలింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ వంటి కోర్సుల శిక్షణనిస్తున్నారు. శిక్షణ పొందిన వారిలో ఎనభైశాతం మందికి ఉద్యోగవకాశాలు కల్పించడం జరుగుతోంది.

ఇవేకాకుండా ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సంస్థ అధ్వర్యంలో నడిచే దుర్గాబాయి మహిళాశిశు వికాస కేంద్రాలు (గతంలో 'ప్రాంగణాలు' గా పిలువబడేవి) అన్ని జిల్లాలలో వున్నాయి. ఈ కేంద్రాలలో కూడా ఉచిత నివాస, భోజన వసతి ఇచ్చి అనేక వృత్తి విద్యలలో శిక్షణను ఇస్తున్నారు. ఉద్యోగావకాశాలను కూడా కల్పిస్తున్నారు.

### 3. బాల్యవివాహ నిరోధక చట్టం అమలుకు కృషి

దీని కొరకు మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ కృషి చేస్తున్నా, ఈ చట్టం అమలుకు ప్రజాప్రతినిధులు తప్పక పూనుకోవాలి. శారీరకంగా, మానసికంగా పరిణితి చెందని బాలికల వివాహం చాలా అనర్థాలకు దారితీస్తుంది. తరచూ అబార్షన్లవడం, వెంటవెంటనే పిల్లలు పుట్టడం తల్లి అయిన కిశోర బాలిక అనారోగ్యానికి, ప్రాణాంతకమైన రక్తహీనతకు దారి తీస్తుంది. అందువలన ఎందరో బాలికలు, ప్రసవ సమయంలో మరణించడం కూడా జరుగుతోంది. కుటుంబ బాధ్యతలు మోయగల పరిపక్వత లేక వీరు గృహహింసకు కూడా గురవుతున్నారు.

ఈ అవాంఛనీయ సంఘటనలను ఆపడం కోసమే ప్రభుత్వ బాల్యవివాహ నిరోధక చట్టం, 2006 ను అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం 18 ఏళ్లలోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు యువకులకు జరిగే వివాహం చట్టరీత్యా చెల్లదు. ఈ వివాహాలకు కారణమైన ఇరుపక్షాలు తల్లిదండ్రులు, ప్రోత్సహించిన బంధువులు, పెళ్లి నిర్వహించిన పురోహితులు/మతపెద్దలు అందరూ శిక్షార్హులే. వీరికి రెండేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, లక్షరూపాయల వరకూ జరిమానా విధించబడతాయి.

తమ ప్రాంతంలో బాల్యవివాహాలు జరుగకుండా కట్టుబాట్లు విధించడం, అవసరమైన చర్యలు తీసుకోవడం వలన ప్రజాప్రతినిధులు ఈ సాంఘిక సమస్యను అరికట్టడానికి తమవంతు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

### 4. గృహహింస నిరోధక చట్టం అమలు

ఈ చట్టం స్త్రీల పట్ల జరిగే శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక

హింసలన్నింటినీ 'గృహహింస' గా గుర్తించింది. ఈ చట్టం అమలులో స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యను సానుభూతితో విని, ఆమెకు ఈ చట్ట పరిధిలో ఏ విధమైన సహాయం అందుతుందో వివరించి, బాధితురాలి కోరికమేరకు కౌన్సిలింగ్ ఇప్పించడం కానీ, కోర్టులో కేసు దాఖలు పరచడం కానీ రక్షణాధికారి చేయవలసి వుంటుంది. మన రాష్ట్ర ప్రభుత్వం ఈ ముఖ్యమైన బాధ్యతను నిర్వహించేందుకు స్త్రీల సమస్యల పట్ల అవగాహన కలిగిన జిల్లా స్థాయిలో పనిచేసే మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లను రక్షణాధికారులుగా నియమించింది.

ఈ చట్టం క్రింద విడాకుల మంజూరీ వుండదు. కానీ బాధితురాలు మళ్లీ తనపై హింస జరుగకుండా రక్షణ ఉత్తర్వులు పొందవచ్చు. అదే కాకుండా పిల్లల కస్టడీ వుత్తర్వులు, నివాస వుత్తర్వులు, మెయింటెనెన్స్ ఉత్తర్వులు కూడా ఈ చట్టం క్రింద 60 రోజులలోపు పొందే వీలున్నది. కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు అవసరమైతే పోలీసులు సహాయం చేస్తారు. కొన్ని సందర్భాలలో గృహహింసకు గురైన మహిళలు నిరాశ్రయులుగా రక్షణాధికారిని కలుస్తుంటారు.

వారికి కోర్టు నుంచి వారి ఇంటిలో వుండటానికి నివాస వుత్తర్వులు వచ్చేదాకా ప్రభుత్వ సంక్షేమ గృహాలలో కానీ, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే గృహాలలోకానీ ఆశ్రయం కల్పిస్తారు. అవసరమైన వారికి వైద్య సహాయం కూడా అందిస్తారు. గృహహింస బాధితులు మీ జిల్లాల మహిళాశిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్లను మీ సమస్య పరిష్కారానికి సంప్రదించవచ్చు.

## వివిధ జిల్లాలలోని రక్షణాధికారుల ఫోన్ నంబర్లు

| క్రమ సంఖ్య | జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ | ఆఫీసు నెం | సెల్ నెం. |
|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 08942-221276 | 94408 14582 |
| 2 | విజయనగరం | 08922-277985 | 94408 14584 |
| 3 | విశాఖపట్నం | 0891-2706156 | 94408 14575 |
| 4 | తూర్పుగోదావరి | 0884-2368442 | 94408 14682 |
| 5 | పశ్చిమగోదావరి | 08812-242621 | 94408 14587 |
| 6 | కృష్ణా | 0866-249317 | 94408 14461 |
| 7 | గుంటూరు | 0863-2234159 | 94408 14511 |
| 8 | ఎస్.పి.ఎస్. నెల్లూరు | 0861-2329481 | 94408 14522 |
| 9 | చిత్తూర్ | 08572-235253 | 94408 14496 |
| 10 | కడప | 08562-244039 | 94408 14489 |
| 11 | కర్నూలు | 08518-277721 | 94408 14589 |
| 12 | అనంతపూర్ | 08554-232337 | 94408 14471 |
| 13 | ప్రకాశం | 08592-235304 | 94408 14506 |
| 14 | అదిలాబాద్ | 08732-236630 | 94408 14455 |
| 15 | నిజామాబాద్ | 08462-238109 | 94408 14550 |
| 16 | కరీంనగర్ | 0878-2254647 | 94408 14450 |
| 17 | ఖమ్మం | 08742-255857 | 94408 14441 |
| 18 | వరంగల్ | 0870-2550359 | 94408 14433 |
| 19 | మహబూబ్‌నగర్ | 08542-272778 | 94408 14557 |
| 20 | నల్గొండ | 08682-245983 | 94408 14566 |
| 21 | సంగారెడ్డి | 08455-276460 | 94408 14544 |
| 22 | రంగారెడ్డి | 040-23240023 | 94408 14537 |
| 23 | హైదరాబాద్ | 040-23202355 | 94408 14531 |

### 5. బాలికలు, స్త్రీల అక్రమ రవాణా నివారణా చర్యలు

మన దేశంలోనే ప్రప్రథమంగా మనరాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి సమగ్రమైన పాలసీని రూపొందించింది. మనరాష్ట్రంలో బాలికలు, స్త్రీల అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోంది. సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబాలలోని బాలికలు, స్త్రీలు ఎక్కువగా ఈ విధమైన అక్రమరవాణాకు గురవుతున్నారు. అమాయకత్వం, పేదరికం, విషయ పరిజ్ఞానం లేకపోవడం, ప్రస్తుతం తామున్న బాధాకరమైన పరిస్థితుల నుంచి బయటపడి, మెరుగైన జీవితాన్ని పొందాలనే ఆశ - వీరిని ప్రేమ పేరిట, వుద్యోగాల పేరిట, సినిమాలలో అవకాశాల పేరిట మోసం చేసే వ్యక్తుల వుచ్చులో తేలికగా పడేలా చేస్తున్నాయి. స్వర్గతుల్యమైన జీవితాన్ని అందిస్తామనే వారి మాయ మాటలకు లోబడి, తమ వారినందరినీ వదిలి వెళ్లిన అమాయకపు ఆడపిల్లలను వేశ్యావృత్తిలోనికి బలవంతంగా నెట్టడం జరుగుతోంది.

మనగ్రామాల్లో, మండలాల్లో ప్రజల సమస్యలపై స్పందించి, ఇలాంటి హేయమైన బాధకరమైన పరిస్థితులలోకి మన ప్రాంతపు ఆడపిల్లలు నెట్టబడకుండా మనం కాపాడుకోవాలి అన్న సంకల్పం, దీక్ష వున్న నాయకులుంటే ఈ దుర్మార్గాలను ఆపడం సాధ్యమే. పేదరికం, కష్టాలు, బాధలలో మగ్గుతున్న కుటుంబాలను గుర్తించి వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పడటానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమమాలలో తగిన దానిని గుర్తించి ఆ కుటుంబాలను ఆదుకోవాలి. వారి పిల్లలు నిరక్షరాస్యులు కాకుండా నివారించాలి. మహిళా సంక్షేమ శాఖ, ఇతర సంక్షేమ శాఖలు వెనుకబడిన తరగతుల వారికి, షెడ్యూల్డ్ కులాల వారికి, షెడ్యూల్డ్ తెగల వారికి ఆయా శాఖలు నిర్వహిస్తున్న వసతి గృహాలలో చేర్పించాలి.

మన ప్రాంతంలో అపరిచితులెవరైనా పేదకుటుంబాలలోని అమ్మాయిలకు, స్త్రీలకు ఎరవేస్తున్నారా అన్నది గమనించి, కాపాడుకోవడానికి అంగన్ వాడీ కేంద్ర పరిధిలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులు వివిధ శాఖల సమన్వయంతో ఏర్పరచడం జరిగింది. ఇవి చక్కగా, సమర్థవంతంగా పనిచేయడానికి ప్రజానాయకులు కృషి చేయాలి.

### మహిళలు, పిల్లల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రజాప్రతినిధులు చేపట్టవలసిన చర్యలు

1. అనాథలైన పిల్లలను వారి వయసును బట్టి తమ దగ్గరలోని శిశుగృహాలు, శిశువిహార్‌లలో, బాల సదనాలలో చేర్పించాలి. దీనివలన అవకాశమున్న పిల్లలు దత్తత ద్వారా ఒక కుటుంబానికి వెళ్లగలుగుతారు. అలాకాని పక్షంలో వీరు ప్రభుత్వ వసతి గృహాలలో సంరక్షణ పొందుతారు. చక్కగా చదువుకొని ఉద్యోగం సంపాదించుకోగలుగుతారు అంతేకాక వీరందరికీ బాలికా సంరక్షణ పథకం వర్తింప చేస్తున్నందున, ఇరవై సంవత్సరాలు వచ్చేటప్పటికి భారతీయ జీవిత బీమా సంస్థ నుంచి లక్షరూపాయలు నగదు కూడా పొందగలుగుతారు.

2. మీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరును సంప్రదించి నిరాదరణకు గురైన స్త్రీలను, అనాథలను సంక్షేమ గృహాలలో చేర్పించడం ద్వారా నిరాశ నిండిన వారి జీవితాలలో వెలుగు నింపిన వారవుతారు.

3. పేద కుటుంబాలలోని స్త్రీలు, పిల్లలు దుర్మార్గాలకు, దోపిడీకి గురికాకుండా చూసే కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను బలోపేతం చేయాలి. ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగు పడటానికి మహిళా సంఘాల ద్వారా సహాయం అందించాలి. ఆ కుటుంబాలలోని కిశోర బాలికలకు వృత్తి శిక్షణ అందేలా చూడండి.

4. మీ ప్రాంతంలో బాల్య వివాహాలు జరుగకుండా చర్యలు చేపట్టాలి. మొట్టమొదట మీ వూళ్లో ఇప్పటి నుంచి ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా వుండేలా చర్యలు చేపట్టండి. నెమ్మదిగా మీ ప్రాంతమంతా ఈ సాంఘిక సమస్యకు దూరమయ్యేలా ప్రయత్నించవచ్చు.

5. మీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు చక్కగా పని చేస్తుంటే ఆ కార్యకర్తలను అభినందించండి. సమస్య లేవైనా వుంటే, సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కరించేలా చూడండి.

6. గృహహింస చాలా హేయం. ఇది కుటుంబానికి సంబంధించినది అని ఇందులో మనం తలదూర్చకూడదు అనీ అనుకోవద్దు. గృహహింస సంఘటనలు మన చుట్టు పక్కల, మన బంధువుల ఇళ్లలోనూ జరుగుతూనే వున్నాయి. ఈ సాంఘిక సమస్యను రూపుమాపడానికి, ఈ విషయంలో మనందరం ఇప్పటి వరకూ పాటిస్తున్న మౌనాన్ని వీడాలి. ఇది అన్యాయం అని గుర్తించాలి. మీకు తెలిసిన పరిధిలో బాధితులెవరైనా వుంటే వారికి గృహహింస నిరోధక చట్టం గురించి తెలియజేయండి. వారికి అవసరమైన మానసిక స్థైర్యాన్ని కలిగించండి. అన్నింటికన్నా ముఖ్యం, రాబోయే తరాలలో ఈ రుగ్మత రూపుమాపడానికి మనందరం కృషి చేయాలి. ఆడపిల్లల పట్ల చిన్న చూపుకూడదు. ఆరోగ్యం, చదువు, ఉద్యోగావకాశాలకు చేయూత నివ్వడంలో కుటుంబంలో ఆడపిల్లలను, మగపిల్లలను సమంగా చూడాలి.

7. మరో ఇంటికి కోడలిగా వెళ్లే మన అమ్మాయిని అత్తవారింట్లో అందరూ బాగా చూసుకోవాలని ప్రతి కుటుంబమూ కోరుకుంటుంది. అలాగే తన వారందరినీ వదిలి మన ఇంటికి వచ్చిన కోడలిని మనం ఆదరించాలి. ఆ అమ్మాయి మన ఇంటి వాతావరణానికి, అలవాట్లకు అనుగుణంగా మారడానికి సమయం పడుతుంది అన్నది గుర్తుంచుకోవాలి.

8. పిల్లలకు (పాపైనా, బాబైనా) చిన్నప్పటినుంచి ఇతరుల అభిప్రాయాలను, వద్ధతులను గౌరవించడం నేర్పాలి. సంస్కారవంతులుగా తీర్చిదిద్దాలి.

9. అర్హులైన వారికి బాలికా సంరక్షణ పథకం గురించి తెలియజేయాలి. వెంటనే నమోదు చేసుకొనేలా ప్రోత్సహించాలి.

10. దుర్గాబాయి శిశు వికాస కేంద్రాలు (ప్రాంగణాలు), దుర్గాబాయి శిశు సాంకేతిక శిక్షణా కేంద్రాలలో అర్హులైన వారు శిక్షణ పొందేలా ప్రోత్సహించాలి. ప్రజా నాయకులు మహిళా శిశు అభ్యున్నతికి చేసే కృషి వారి ఉజ్జ్వల రాజకీయ భవితకు గొప్ప పెట్టుబడి.

– డా ఇ.వి స్వర్ణలత, సెంటర్ హెడ్,
మహిళా శిశు అభివృద్ధి కేంద్రం, ఎ. ఎం.ఆర్ అపార్డ్, హైదరాబాద్.

# చినుకు చిందులు

గ్రామీణ కథల పోటీ విభాగంలో
తృతీయ బహుమతి పొందిన కథ

**ఎండ మండి పోతూ ఉంది.**

**అది ఎండాకాలం కాదు. చినుకులు చిందులు వెయ్యాల్సిన సమయం. వర్షాకాలం అయినా నలభై డిగ్రీలకు చేరుకుంది. చుట్టుప్రక్కల ఎక్కడా చుక్కనీరు దొరక్క చెట్లమీద పిట్టలు దప్పికతో గొంతు ఎండుకపోయి నేల మీద రాలిపడుతున్నాయి.**

భుజం మీద తుండుగుడ్డతో మొహం తుడుచుకున్నాడు చలమయ్య.

“నువ్వు ఎంతసేపు నిలబడినా ప్రయోజనం లేదయ్యా ! మా బ్యాంకుకు కేటాయించిన ఇరవై లక్షలు... వెయ్యిమందికి పైగా రైతులు రుణం కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు.... అందరికీ సర్దాలంటే తలా వెయ్యి గానీ, రెండు వేలు గానీ ఇవ్వాల్సిఉంటుంది. వర్షాలు పడేటట్లులేవు... ఈ సంవత్సరం కరువు వచ్చేటట్లువుంది. ఈ వర్షాభావ పరిస్థితుల్లో అప్పులిచ్చి కూర్చుని, తిరిగి చెల్లింపులు లేకుంటే మాకు చెమటలు పట్టిస్తారు మాపై అధికారులు... నీకు ఖరీఫ్‌కు రుణం ఇచ్చాం.... వొక్కపైసా చెల్లింపులేదు... మళ్ళీ అప్పు అంటే ఎలా? మా పరిస్థితి అర్థం చేసుకో !” చెప్పుకుపోయాడు బ్యాంకు మేనేజరు.

నిట్టనిలువునా మంటలు ఎగిసిపడుతున్నట్లనిపించింది. అక్కడ నిలబడలేక మేనేజరు గదిలోనుంచి బయటకు వచ్చాడు. ఎవరిపనిలో వాళ్ళున్నా అందరూ తనను చూసి పగలబడి నవ్వుతున్నట్లనిపించింది.

రెండు నెలల నుంచి కాలుగాలిన పిల్లిలా బ్యాంకు చుట్టూ తిరిగినా రుణం వొచ్చే అవకాశం కన్పించలేదు.

....తనకు వున్న రెండున్నర ఎకరాల్లో వరినాట్లు వేశాడు. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి గింజలు వేశాడు. నీటి తడిలేక వరి ఎండిపోయింది. పత్తి గింజలు మొలకెత్తక మొరాయించాయి. పొలం దున్నేసి కందులు వేశాడు. అవీ మొలకెత్తలేదు.



– ఆలపర్తి రామకృష్ణ

....ఇప్పటికే నాలుగు లక్షల అప్పు వడ్డీ వ్యాపారుల దగ్గర తెచ్చాడు గత నాలుగేండ్లలో. ఆ అప్పుతీరేమార్గం కన్పించడంలేదు... ఏంచెయ్యాలో దిక్కుతోచడంలేదు...

పొన్నూరు టౌను నుంచి బయటపడ్డాడు. వల్లభరావుపాలెం వైపు నడక సాగించాడు.

సెప్టెంబరు నెల వచ్చేసరికి రోడ్డుకు అటూఇటూ పచ్చటి పొలాలు భూమిమీద తివాచీ పరిచినట్లు కన్పించాలి. వరినాట్లు ఊపు అందుకోలేదు... పొలాలన్నీ బీడుభూముల్లా కన్పించేయి...

ఎక్కడా పైరు కన్పించడంలేదు. చెరువులన్నీ ఎండిపోయాయి. ఏ గ్రామంలో తిరిగినా అదివరకు పచ్చటిచేలూ, చేలపక్కన పంటకాలువ, మరో పక్కన చెరువు, చెరువులో కలువలు, తామరాకులు కన్పించేవి.

వానాకాలంలో ముసురు పట్టుకుంటే వారం రోజులు వొకటే వాన. రోడ్డుమీద నడవాలంటే మోకాలు బురదలో దిగిపోయేది. కాళ్ళకు బూట్లు తొడుక్కునట్లు బురద అంటుకునేది.

కుండలు, కొడవళ్ళు, బుట్టలు, చేటలు అన్నీ ఊళ్ళోనే తయారుచేసేవాళ్ళు. ఆఖరికి ఎడ్లబండి కూడా వడ్డాబత్తుల వీధిలో తయారయ్యేవి. ఇప్పుడు ఏది కావాలన్నా టౌనుకో పట్టణానికో పరుగెత్తాల్సిందే.

వెనుకటి రోజుల్లో ఏరువాక పండుగ ఎంత వేడుకగా జరుపుకునేవాళ్ళు... నాగలికి పూజలు చేయడం, పాయశం వండుకోవడం, పాలేర్లకి కొత్త బట్టలు కొనిపెట్టడం.... పేదలకు ధాన్యం దానం చెయ్యడం... ప్రతి ఇంటి ముందు పురులు, పాతర్లు ఉండేవి. ధాన్యం నిలువ చేసుకుని మంచి ధర వొచ్చినపుడు అమ్ముకోవడానికి... అప్పులు ఇచ్చిన వ్యాపారస్థులు ఇప్పుడు కల్లాల దగ్గరే ధాన్యం కొలుచుకుని తీసుకువెళ్తున్నారు.

చిన్నప్పుడు అటూ ఇటూ ఎడ్లను నిలబెట్టి తను మధ్యలో నిలబడి ఫొటో తీయించుకున్నాడు. ఇప్పుడు ఎద్దులు లేవు... నాగళ్ళు లేవు... వాటి అవసరం వొచ్చినపుడు కూలికి పిలిపించుకోవడమే! ఎద్దుల్ని మేపాలంటే మాటలా..!




ఎడ్ల బండి ఎదురొచ్చింది. జోడెద్దులు కుమ్ముకుంటున్నాయి. బండి ఒరిగేటట్లుగా వుంది. బండి మీద కూర్చున్న వీరయ్య ఎద్దుల్ని అదమాయించాలని చూస్తున్నాడు. తోకలూ, మూపులూ నిమిరాడు ముందు.. ఎద్దు మాట వినకపోతే చర్నాకోలాతో వాటి శరీరాలను చురుక్కుమనిపించాడు.

" ఏం చలమయ్యా! బ్యాంకోళ్ళు డబ్బులు ఇస్తున్నారా?" ఎద్దుల్ని అదిలిస్తూనే అడిగాడు వీరయ్య.

" లేదు బావా... చెప్పులు అరిగిపోతున్నాయి గానీ... రుణం ఇవ్వడం లేదు... పంట దిగుబడిమీద భరోసా ఉంటేనే అప్పు పుడుతుంది... ఏమిటి ఎద్దులు మొరాయిస్తున్నాయి" అడిగాడు చలమయ్య.

" నీకు తెలియనిదేముంది? వానలు పడక పచ్చిగడ్డి మొలవడంలేదు.. మనం జనుము, పిల్లిమెసరవెయ్యడం మానేశం.. ఇక పశువులకి పశుగ్రాసం ఏం దొరుకుతుంది. ఎండుగడ్డి తప్పితే... పశువుల దాణా కూడా బాగా ఖరీదయ్యింది. సరైన తిండిలేకే ఎద్దులు కూడ కుమ్ములాడుకుంటున్నాయి" అన్నాడు నవ్వుతూ వీరయ్య.

అతని నవ్వులో పశువులకు సరైన పచ్చిగడ్డి కూడ అందిలేకపోతున్నాననే బాధ మిళితమైవుంది.

"ఏమిటీ మీవాడు ఇంట్లోనే వుంటున్నాడట... హైదరాబాద్ వెళ్ళడం లేదా?" అడిగాడు వీరయ్య.

" హైదరాబాద్‌లో మంచి ఉద్యోగంలోనే వుండేవాడు... నెలకు పాతికవేలు వొచ్చేవి... సంవత్సరం కిందట ఆ ఉద్యోగం వూడిపోయింది... ఆరునెలలు చిన్నాచితకా ఉద్యోగాలు చేశాడు అక్కడ... మరీ చిన్నచిన్న ఉద్యోగాలు చేయలేక ఇంటికి వొచ్చేశాడు" అన్నాడు చలమయ్య.

"ఉద్యోగస్థుల పని ఫరవాలేదయ్యా! వాళ్ళకు మళ్ళీ ఉద్యోగం దొరుకుతుంది... మన రైతుల పరిస్థితేనయ్యా అగమ్యగోచరంగా వుంది... మన వూరి సాంబయ్య తెలుసుగదా! నాలుగేళ్ళుగా వరి సాగుచేస్తున్నాడు... రోజురోజుకి అప్పులు పెరిగిపోతున్నాయి గానీ వ్యవసాయం ఖర్చులు తగ్గడం లేదు. పండిన పంటకు తగిన గిట్టుబాటు ధర దొరకడం లేదు... అటు బియ్యం కొనుక్కునేవాడూ ఇబ్బంది పడుతున్నాడు పెరుగుతున్న ధరలతో.... రైతుల శ్రమను మధ్య దళారీలు దోచేసుకుంటున్నారు... ఆ సాంబయ్య ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యలేదు... కొత్త ఇల్లు కట్టలేదు... అయినా అప్పు నాలుగు లక్షలని తేలింది... అప్పిచ్చినవాడు 'ఇస్తావా... ఛస్తావా?' అని ఒత్తిడిచేశాడట... మానసికవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు... ఇబ్బందులు అందరికీ వొస్తాయి... కష్టాలు వొచ్చాయని ప్రాణాలు తీసేసుకుంటారా ఎవరైనా?" ప్రశ్నించాడు వీరయ్య.

"అవునవును" వీరయ్య చెప్పినదానికి తలూపేడు చలమయ్య.

....భూమిపైన నిలబడితేనే రైతుకు అన్ని ఇబ్బందులు... భూమిలోపల పాతిపెడితే రైతుకు ఆరడుగుల గొయ్యి చాలు హాయిగా శాశ్వత నిద్రపోవడానికి... వాన చినుకులు పడుతున్నాయా? లేదా అన్న మీమాంస వుండదు. అప్పిచ్చినవాడు వేధించడు... సాంబయ్య చేసిన పని మంచిదేనేమో!... అనుకున్నాడు చలమయ్య మనస్సులో.




ఇంటికి చేరేకునేసరికి సాయింత్రం నాలుగయ్యింది.

ఇంటిముందు అరుగుమీద కూర్చున్న కొడుకు కన్పించాడు.

....ఉదయం తను పొన్నూరు వెళ్ళేటపుడు అరుగుమీదే కన్పించాడు... సాయంత్రం తను తిరిగివొచ్చే వరకూ ఇంటిముందే కూర్చున్నాడా?...

“ఎండవేడి అదిరిపోతూవుంటే బయటకూర్చున్నావెందుకురా? ఇంట్లో నీడపట్టున వుండకూడదూ?” కొడుకును అడిగాడు.

“కొరియర్ అబ్బాయి వొస్తాడేమోనని ఎదురుచూస్తున్నాను... నాకు కాల్‌లెటర్ రావాలి... పోస్ట్‌మాన్ కూడా కన్పించలేదు” అన్నాడు వామనరావు.

“నీకు ఉత్తరం వొస్తే నువ్వు ఇంట్లో కూర్చున్నా కేకవేసి పిల్చి నీకు ఉత్తరం ఇస్తార్లే! లోపలికి వెళ్ళి కూర్చో!” అన్నాడు చలమయ్య.

“ నా ఆదుర్దా నాది... చదువుకుని ఉద్యోగం లేక ఖాళీగా ఇంట్లోనే కూర్చుంటే ఎంత నామర్దో నీకేం తెలుసు?” అన్నాడు వామనరావు అసహనంతో.

“ పొద్దున్నే అన్నం తినకుండా బయటకు వెళ్ళావంట... వేళకు తిండితిప్పలు లేకుంటే ఆరోగ్యం చెడిపోదూ! అన్నాడు వెంకయ్య.

....ఈ పెద్దాయనకు ఎనభయ్యేళ్ళు వచ్చాయి. అన్నిటిలో వేలు పెడతాడు... ‘కృష్ణారామా!’ అనుకుంటూ ఇంట్లో వో మూల కూర్చోవొచ్చుగదా! ఇంటి ఖర్చులు, పొలం ఖర్చులు ఆయన చేతులమీదే జరగాలి... ఏ విషయమైనా ఆయనకు తెలియకుండా జరిగితే అలుగుతాడు. పచ్చిమంచినీళ్ళు ముట్టడు... ఇంత వయస్సులో కూడ రోజూ ఆరుమైళ్ళ దూరంలో వున్న పొలం వెళ్ళి, అది సరిగ్గాలేదూ... ఇది సరిగ్గాలేదూ అంటూ ఇంటికి తిరిగొచ్చేక నస మొదలెడతాడు... చాదస్థం మనుషులు ఇంట్లోవుంటే ఎవరినీ ఎదగనివ్వరు... అన్నింటికి అడ్డంకిగా తయారవుతారు. తనకు ఇప్పుడు యాభైయ్యేళ్ళు... ఇప్పటికీ ఏపని చెయ్యాలన్నా, ఏది అమ్మాలన్నా ముసలాయన సలహా తీసుకోవాల్సిందే! అలా చేయకపోతే పెద్ద తప్పు... తనకు ఏ పాతికేళ్ళు వయస్సు వున్నప్పుడో అన్ని బాధ్యతలూ తనమీద వొదిలేసివుంటే అద్భుతాలు సృష్టించి వుండేవాడు... ముసలాళ్ళతో ఇదే చిక్కు!...

....చీకుచింతా లేకుండా తిరుగుతూవుంటాడు... అప్పులోళ్ళు మాత్రం తనని వేధించుకుతింటారు... అప్పుడే ముసలి రూపం వొచ్చేసింది తనకు...

“నీ కొడుకునైనా నేనే నీకంటే ముసలివాడిగా కన్పిస్తున్నానని ఊళ్ళో అందరూ అంటున్నారు” అన్నాడోసారి తండ్రితో.

“ఇతరులని ప్రేమించడం, అభిమానిస్తున్నంతకాలం మనిషి నిత్యయవ్వనుడిగా కన్పిస్తాడు... సమస్యలతో సతమతమైపోయి చింతిస్తూవుంటే ముసలివాడైపోతాడు” అన్నాడాయన తనతో.

తండ్రితో వొక్కమాట మాట్లాడకుండా పెరట్లోని బావి దగ్గరకు వచ్చాడు చలమయ్య స్నానం చెయ్యడానికి.

స్నానం చేసి ముందు గదిలోకి రాగానే సింహాచలం మాటలు విన్పించేయి. వీధి గుమ్మం దగ్గరకు వొచ్చాడు.

నోట్లోని చుట్టపీకని ఎడంచేతితో పట్టుకుని బయటకు తీసి ఉమ్మేసి, నాలుగు మాటలు ఘాటుగా మాట్లాడి, మళ్ళీ చుట్టపీకని నోట్లో పెట్టుకుని దవడలు నొప్పి పుట్టేదాకా వొదమ్ములాగి, మళ్ళీ బయటకుతీసి నోటికొచ్చింది అడ్డంగా మాట్లాడుతూవున్నాడు సింహాచలం.

చుట్టుపక్కల ఇళ్ళలోని జనం చలమయ్య ఇంటిముందు చేరి తమాషాగా చూస్తూ నిలబడ్డారు.

“తలపరువు నోరు కాస్తుందంటారు పెద్దలు.... నోరుజారడం మంచిదికాదు” అన్నాడో పెద్దమనిషి సింహాచలంతో.

“ఏమిటయ్యా పెద్ద చెప్పొచ్చావ్... యాభైవేలు తీసుకుని మూడు సంవత్సరాలైంది... వడ్డీ వొక్కపైస జమచెయ్యలేదు... అప్పులు తీర్చడానికి పొలం ఎక్కడ అమ్మాల్సివొస్తుందోనని ఆ ముసలాయన వొక్కమాట మాట్లాడడు... చలమయ్య మూగవాడిలా నటిస్తాడు... పరువు మర్యాద వున్నవాళ్ళయితే ఇన్ని మాటలు పడరు... ఏదోకటి తెగనమ్మి అప్పుతీర్చేస్తారు.” పెద్దగా అరుస్తూ అన్నాడు సింహాచలం.

“రెండ్రోజుల్లో నీ అప్పు వడ్డీతో సహా తీర్చేస్తానులే... నువ్వెళ్ళు” అన్నాడు చలమయ్య.

ఆ మాటలతో చల్లారిపోయాడు సింహాచలం. కనీసం వో అరగంటైనా నడవకుండా సినిమా ఐదు నిమిషాల్లో ముగియడం చుట్టూ మూగిన జనానికి అసంతృప్తిని కల్గించింది. అందరూ అక్కడ నుంచి జారుకున్నారు.

చలమయ్య దగ్గరకు వొచ్చి కూర్చున్నాడు వెంకయ్య.

బ్రద్దలవడానికి సిద్ధంగా వున్న అగ్నిపర్వతంలా కన్పించేడు కొడుకు.

“ఏంచేద్దాం?” అన్నాడు మెల్లగా వెంకయ్య.

మాట్లాడకుండా కోపంగా తండ్రివైపు చూశాడు చలమయ్య. రెండు నిమిషాలు గడిచేక “మన కుటుంబం పరువు గంగలో కలిసిపోయింది.... నలుగురి ముందు వాడిచేత మాటలు పడాల్సివొచ్చింది. ఇప్పుడు పొలం అమ్మినా పోయిన పరువు తిరిగివొస్తుందా?” తండ్రివైపు చూస్తూ అన్నాడు చలమయ్య.



“ ఆ సింహాచలం ఉత్తపాగరుబోతు.... వాడు నోటికి వొచ్చినట్లు మాట్లాడితే మన కుటుంబ గౌరవ ప్రతిష్టలకేం భంగం కలుగదు... అప్పు తీర్చకపోతే మన పరువు గంగలో కలుస్తుంది.... రేపే వాడి డబ్బు వాడిమొహాన కొట్టెయ్యి... బ్యాంకు లాకర్‌లో నేను దాచుకున్న డబ్బు, మీ అమ్మ నగలు వున్నాయి... ఆ నగలు అమ్మేసి అప్పులు తీర్చేద్దాం! ”

“ఆ పనేదో మనం ముందే చేస్తే పరువు దక్కేది గదా!” అన్నాడు చలమయ్య ఆవేశంగా.

“వీడిలా బజార్ల పడతాడని నేనేం కలగన్నానా?... సర్లే రేపు ఉదయం మాట్లాడుకుందాం... భోజనం చేసి పడుకో!” అన్నాడు వెంకయ్య.

ఆ రాత్రి భార్య బతిమాలినా అన్నం ముద్ద నోట్లో పెట్టుకోలేదు. నిద్ర పట్టక అటూఇటూ తిరుగుతూనే వున్నాడు చలమయ్య.

కొడుకును గమనిస్తూనే వున్నాడు వెంకయ్య. కోడలిని పిలిచి చెవిలో ఏదో గుసగుసలాడేడు.

తెల్లవారుఝామున ఇంట్లోనుంచి బయటపడి పొలంవైపు నడిచాడు. చలమయ్య మనస్సు అల్లకల్లోలంగా వుంది.

బాధలకు, సమస్యలకు దూరంగా వెళ్ళిపోవాలి....

ప్రశాంతంగా నిద్రపట్టే చోటుకి చేరుకోవాలి....

చారెడు నేల మీద వెల్లకిలా పడుకున్నాడు. భూమికి, ఆకాశానికి తనగోడు చెప్పుకుని తనువుచాలించాలి. మట్టిలో మట్టిగా కలిసిపోవాలి. ఊపిరి నీలి ఆకాశంలో కలిసిపోవాలి. తన గుండెకోత గూర్చి నేలతల్లికి తెలుసు. వర్షం పడక నెర్రెలిచ్చిన నేల గోడు తనకు తెలుసు... తనగోడు నేలతల్లికే చెప్పుకోవాలి. ఎవరికి చెప్పినా పట్టించుకోరు...

ముసలి తండ్రి పెత్తనం తనకు ఇవ్వడు...

చినుకులు పడక వరి మొక్కలు ఎండిపోతున్నాయి....

అప్పులు తనకోసం చెయ్యలేదు.... ఈ చారెడు నేలమీదే గుమ్మరించాడు.

కొడుక్కి ఉద్యోగం లేదు....

... సింహాచలం మెదడు పొరల్లో మెదిలితేనే తట్టుకోలేకపోతున్నాడు...

బతకడం కంటే చావేమేలు...

పురుగుల మందు డబ్బా చేతిలోకి తీసుకున్నాడు చలమయ్య.

అప్పటికే వెలుగురేఖలు చొచ్చుకువొస్తున్నాయి.

తన పొలం సరిహద్దుల చుట్టూ వోసారి ప్రదక్షిణం చేశాడు. పొలం మధ్యకు చేరుకున్నాడు. డబ్బాలోని ద్రవం నోట్లోకి వొంపుకుని గడగడా తాగేశాడు కళ్ళుమూసుకుని.

వగరుగా, చేదుగా అన్పించింది. చనిపోయేవాడికి ఆ ద్రవం రుచి ఎలావుంటేనేం?

ఆఖరి క్షణాలు...

భూమిని కరుచుకుని పడుకున్నాడు... ఏదో వికారంగా అన్పించింది... కళ్ళు తెరిచే ప్రయత్నం చేయలేదు... చినుకుల చప్పుడు విన్పించింది....

వో గంట గడిచేక వెంకయ్య మనవడిని వెంటబెట్టుకుని అక్కడకు చేరుకున్నాడు గొడుగువేసుకుని.

“వర్షంలో ముద్దగా తడిచావ్... లే ఇంటికి వెళ్దాం...” అన్నాడు వెంకయ్య కొడుకుతో.

లేచి కూచున్నాడు... వొకటే నీరసం... క్రితం రోజు భోజనం చెయ్యలేదు... రాత్రి నిద్రలేదు...

“నేను చనిపోలేదా?” అప్రయత్నంగానే అడిగాడు చలమయ్య.

“కుంకుడుకాయ రసం తాగితే చనిపోతారా?” ఎదురుప్రశ్న వేశాడు వెంకయ్య

“కుంకుడుకాయ రసం ఏమిటీ” అయోమయంగా అడిగాడు తండ్రిని.

“నువ్వేదో ఇటువంటి దూకుడు వ్యవహారం చేస్తావని నాకు అనుమానం వొచ్చింది. పురుగుల మందు డబ్బాలోని మందు పారబోసి కుంకుడుకాయ రసంతో నింపమని మీ ఆవిడకు రాత్రి చెప్పాను... ఆ డబ్బా తెచ్చుకుని గడగడా తాగేసి చనిపోయానని భ్రమపడుతున్నావ్... ఇబ్బందులు వొస్తే ధైర్యంగా ఎదుర్కోవాలిగానీ, పిరికితనంతో పారిపోతారా? పుట్టినవాడు ఎటూ గిట్టక తప్పదు... ఎవడూ ఎల్లకాలం బ్రతకడు... బలవంతంగా బతుకు ముగించుకోవడం ఎందుకు? అన్నాడు వెంకయ్య.

వర్షం జోరు ఎక్కువైంది.

చినుకుల చిందులకు వరిమొక్కలు తేరుకుని ఆనందంగా తలలువూపాయి.

“ ఈ వర్షం పంటలకు బాగా మేలుచేస్తుంది. పంటలు పుష్కలంగా పండుతాయి” అన్నాడు చలమయ్య తండ్రి భుజానికి భుజం రాస్తూ ఎగిరిపోతున్న గొడుగును గట్టిగా పట్టుకుని.

వాళ్ళిద్దరిని చూసి వామనరావు నవ్వుకున్నాడు వానలో తడుస్తూ...

ఆరోజు సాయంత్రం కొరియర్‌లో అతనికి హైద్రాబాద్ నుంచి కాల్‌లెటర్ వొచ్చింది.

◆



# "స్థానికపాలన" (గ్రామీణ వికాస మాసపత్రిక)

## నిర్వహించిన గ్రామీణ కథలు, హాస్య కథల పోటీ ఫలితాలు

### గ్రామీణ కథల విభాగం

| కథ పేరు | బహుమతి | రచయిత/త్రి |
|---|---|---|
| అందని ఆకు | ప్రథమ బహుమతి (రూ. 15,000) | శ్రీ యస్. రామనరసింహం (సరసి) |
| సిందవ | ద్వితీయ బహుమతి (రూ. 10,000) | శ్రీ మల్లిపురం జగదీశ్వరరావు |
| చినుకుచిందులు | తృతీయ బహుమతి (రూ. 8,000) | శ్రీ ఆలపర్తి రామక్రిష్ణ |

*కన్సొలేషన్ బహుమతి (5,000) పొందిన కథలు :* 1. డబ్బు చెట్టు - శ్రీ కాటూరి రవీంద్ర త్రివిక్రమ్; 2. నేలతో సావాసం - శ్రీ పలమనేరు బాలాజి; 3. నాటేది ఒక్కమొక్క - డా॥ కె.బి. లక్ష్మి

*సాధారణ ప్రచురణకు ఎంపికైన కథలు :* 1. యాతన - శ్రీ చందనపల్లి గోపాలరావు; 2. విముక్త - శ్రీమతి కె. వరలక్ష్మి; 3. ఈత - శ్రీ చింతా అప్పలనాయుడు; 4. అమ్మ - స్వాతి శ్రీపాద; 5. చావు వీలునామా - శ్రీ మేరెడ్డి యాదగిరి రెడ్డి; 6. శాలివాహన - శ్రీ ఎనుగంటి వేణుగోపాల్; 7. లేకి - శ్రీ దూసి శ్రీరామమూర్తి; 8. వలసదేవర - శ్రీ సుంకోజి దేవేంద్రాచారి; 9. మనిషికి, మనిషికీ మధ్య - శ్రీ ఎ.వి.యస్. ఆర్. మూర్తి; 10. పరిష్కారం - శ్రీ తేజోమూర్తుల ప్రకాశరావు

### హాస్య కథల విభాగం

| కథ పేరు | బహుమతి | రచయిత/త్రి |
|---|---|---|
| పన్నుపోటు చికిత్స | ప్రథమ బహుమతి (రూ. 15,000) | శ్రీ యస్. భీమశంకర్ కుమార్ |
| దోమా, దోమా నీకు వందనం | ద్వితీయ బహుమతి (రూ. 10,000) | శ్రీ కె. కోటేశ్వరరావు |
| రివర్స్‌గేర్ | తృతీయ బహుమతి (రూ. 8,000) | శ్రీ యం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి |

*కన్సొలేషన్ బహుమతి (5,000) పొందిన కథలు :* 1. సైన్ ఫ్లో - శ్రీ కె.ఎల్.డి.జి. గురుప్రకాశ్; 2. నావను నడిపే ముచ్చట కనరే - శ్రీ శంకు; 3. పెయిన్ ఫ్లూ - శ్రీ సుంకోజి దేవేంద్రాచారి;

*సాధారణ ప్రచురణకు ఎంపికైన కథలు :* 1. మురికి మూర్ఖులు - శ్రీ యస్.రామనరసింహం (సరసి); 2. రచయిత్రి కూతురు - శ్రీమతి స్వాతీ శ్రీపాద .

### తీర్పరుల అభిప్రాయం

*ఈ పోటీలో పాల్గొన్నవారికి, విజేతలకు హార్దిక శుభాకాంక్షలు.*

ఇది తెలుగు కథానిక నూరేళ్ల ప్రయాణించిన శుభతరుణం. మన కథానిక వృక్షం చేవ తేలి, ఎంతో విస్తరించాల్సిన సందర్భం. కాని యీ పోటీలకు వచ్చిన కథలను చదివాక మేము చాలా నిరాశకు లోనైనాము. ఎంపిక చేసిన వాటిలో కూడా మాకు పూర్తి సంతృప్తిని యిచ్చిన కథలు లేవని చెప్పడానికి బాధగా వుంది. "స్థానిక పాలన" పత్రిక వారు పెద్దమొత్తంలో బహుమతులను ప్రకటించినా, తగినన్ని కథలు రాకపోవడం, వచ్చినవి తగిన స్థాయిలో లేకపోవడం విచారకరం. ఇలాంటి పత్రికలు పోటీలను నిర్వహించేటప్పుడు తగినంత ప్రచారం అవసరం. చాలా మంది కథకులకు పోటీ సమాచారం తెలియలేదని సందేహించాల్సి వస్తోంది.

వచ్చిన కథలు చదివి, వడపోతలు పోసి, ఎంపికచేసి మళ్లీ వడపోతకి కూచున్నప్పుడు ఒక సత్యాన్ని గమనించాము. ఇందులో అతికొద్దిమంది చేయి తిరిగిన రచయితలు పాల్గొన్నారు. ఎక్కువ మంది బొత్తిగా కథ గురించిన అవగాహన లేని వారని అర్థమైంది. ఒక్కొక్క విభాగంలో బహుమతికి గాను ఆరు కథలు తీయడం గగనమైపోయింది. చక్కని జాతీయాలు, నుడికారాలు, సామెతలు, తేనెలూరే తెలుగు మాటలూ మచ్చుకైనా కనిపించలేదు. "గ్రామీణకథలు" అనగానే ఏవో నాలుగైదు గ్రామీణ ముద్రలని చేర్చితే చాలనుకున్నారనిపించింది. నగరంలో కూడా గ్రామం వుంటుంది. గ్రామంలో కూడా నగరం వుంటుంది. ఇప్పుడు వంటగ్యాస్, టివి, సెల్‌ఫోన్ సర్వత్రా వున్నాయి. గ్రామాల్లో పశుసంపద మచ్చుకి కూడా లేదు. ట్రాక్టర్లే కనిపిస్తున్నాయి. రుతువులు మారినాయి. జానపదుల ఆలోచనా విధానం మారింది. జానపద కళలు కనుమరుగు అయినాయి. చేతివృత్తులు యిప్పుడు లేవు. "మీరాశి" అనే మాటకు అర్థం గ్రామీణులకు యిప్పుడు తెలియదు. కాలం సజీవమైంది. అది మార్పులు, చేర్పులు చేస్తూ వుంటుంది. పాతరోజులన్నీ గొప్పవీ కావు. నేటి కాలం పూర్తిగా చెడ్డదీ కాదు. ఎన్నో నూతన పరిణామాలను, అంశాలను ఇతివృత్తాలుగా స్వీకరించి, కథామేధావులు నూతన పరిష్కారాలను సూచిస్తే సంతృప్తికరంగా వుండేది. సమాజానికి లబ్ధి చేకూరేది. ముందు ముందు మెరుగైన కథానికలు రాగలవని ఆశిస్తున్నాం. మరోసారి అందరికీ అభినందనలు. ఈ విధంగా మాకు అనేక కథలు చదివి, బహుమతులకు ఎంపిక చేసే సదవకాశం యిచ్చిన "స్థానికపాలన" సంపాదక వర్గానికి కృతజ్ఞతలు.

శ్రీరమణ — విహారి

- యస్. భీమ శంకర్ కుమార్

హాస్య కథల పోటీ విభాగంలో
ప్రథమ బహుమతి పొందిన కథ



# పెన్నుపోటు చికిత్స

సెక్షన్ సూపర్‌వైజర్‌గా ఏ.జి. ఆఫీసులో ఓ పాతికేళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్న రంగారావు రిటైరయ్యాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు సుధాకరం పెళ్ళీడుకు రాకమునుపే, సిటీలో బర్కత్‌పురలో తనదంటూ ఓ త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కోగలగడంతో తమ కుటుంబానికింత చల్లనినీడ దొరికిందనుకున్నాడు. కానీ తానెంచుకున్న ఏరియా ఇటు కాచిగూడ రైల్వేస్టేషన్‌కి కూత వేటు దూరంలోను, అటు ఇమ్లిబన్ బస్టాండ్‌కి 2 కి.మీ.లలోపు దూరంలోను వుండటం రంగారావు జీవితానికి పెద్ద శాపమే ఐంది. ఎంచేతంటే, ఉభయ గోదావరి జిల్లాల్లో వున్న తమ బంధువర్గం ఏ పనిమీద ఎప్పుడు రాజధాని చేరుకున్నా, గురిపెట్టిన బాణంలా దూసుకొచ్చి తనింటి మీద పడ్డం ఓ రివాజైపోయింది.

ఇలా వచ్చినవాళ్ళు, తమ పనులు ముగించుకొని వెళ్ళిపోతూ, సగంలో వదిలేసి వెళ్ళే వాళ్ళ వ్యవహారాల 'ఫాలో అప్' పని రంగారావుకో, ఆయన కొడుక్కో అంటగట్టడం ఒక వంతైతే, అలా వెళ్తూ వెళ్తూ వాళ్ళ వెంటతెచ్చుకున్న వస్తువేదైనా పొరబాటునో, వీళ్ల గ్రహపాటునో వీళ్ళింట్లో వదిలేసి వెళ్ళిపోవడం రెండో వంతు, అలా వదిలేసిన వాళ్ళు ఆవిషయం తమ వూళ్ళకి చేరుకున్న తర్వాత గుర్తొచ్చి, ఇహ అక్కణ్ణుంచి కొనసాగించే 'ఉత్తర' రామాయణం, సృష్టించే రసాభాసా ఇంతా అంతా కాదు. ఎంత కాదనుకున్నా ఈ పరిస్థితి ఇలా కొనసాగుతూనే వుంది. అంతే కాదు. . . రంగారావుకి పాపం తన జీవితమ్మీదే రోత పుట్టించే స్థాయికి చేరుకోవడం మొదలైంది. అదిగో, సరిగ్గా అలాంటి దశలోనే, వ్యాఘ్రేశ్వర్రావనే ఆయన దూరపు బంధువు ఒకాయన రాజమండ్రి నుంచి రాజధానికి చేరుకొని, రివాజుగా రంగారావింటికి రావడం, రెండు మూడు రోజులుండి నిష్క్రమించడం జరిగిపోయింది. పోతే, ఈ వ్యాఘ్రేశ్వర్రావు బహు మొహమాటస్తుడైనందు వల్ల, తను వీళ్ళింటికి రావడం బొత్తిగా మొదటిసారే ఐనందు వల్ల రంగారావు తన నిరసన స్వరాన్ని కాస్త నొక్కి పట్టివుంచాడు.

ఐతే, అతని విడిది, స్నానపానాదులతో రంగారావుకి ఏ పేచీ రాకపోయినా, అతను వెళ్ళిన మూడో రోజునుంచే అసలు తంటా మొదలయింది. అది ఆ మూడోరోజున రాజమండ్రి నుంచి

రంగారావందుకున్న పోస్ట్‌కార్డ్ రూపంలో ఇలా మొదలైంది.

ప్లా:7, అల్కాట్ గార్డెన్స్,
రాజమండ్రి.

తేదీ:

మాrాశ్రీ॥ రంగారావు బావగారికి,

నమస్కారములు. నేను క్షేమంగా ఇక్కడికి చేరుకున్నాను. నాకు అక్కడ, మీ ఇంట్లో వున్న మూడు రోజులు మీరిచ్చిన ఆతిధ్యానికి ఎంతో ఆనందించాను. మీరు చూపిన అభిమానానికి ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు. అన్నట్టు నేను అక్కణ్ణుంచి బయల్దేరే హడావిడిలో నా రేజర్ సెట్‌ని మర్చిపోయి వచ్చేశాను. దయచేసి దాన్ని పోస్టులో పైనున్న అడ్రస్‌కి, - అదే ప్లాట్ నెం:7, అల్కాట్ గార్డెన్స్, రాజమండ్రి - పేర పంపే ఏర్పాటు చేయవల్సిందిగా కోరుతున్నాను.

ఈవిధంగా మీకు శ్రమనందిస్తున్నందుకు క్షమించవలెను. మీ మనవరాలు మంచి హుషారైన పిల్ల. మాటలు రాగానే ఏదయినా మంచి కాన్వెంటులో చేర్పించితే చురుగ్గా పైకి రాగలదు. పాపకు నా ముద్దులు. అక్కగారికి, మీ పిల్లలకు నా శుభాకాంక్షలు. దయచేసి రేజర్‌సెట్ విషయం మరచిపోవద్దు, సాయిరాం.

ఇట్లు,
మీ వ్యాఘ్రేశ్వర్రావు.

దీన్ని అందుకున్న రంగారావుకి నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది. ఇప్పుడు దాన్ని వెతికి పట్టుకొని, పాకింగ్ చేసి, పోస్టాఫీసుకో, కొరియర్ సర్వీసుకో తీసుకెళ్ళి, మరో పాతికో ముప్ఫయ్యో జిడ్డు వదిలించుకొని దాన్ని ఆ వ్యాఘ్రేశ్వర్రావుకి పంపి, 'అదింకా అందలేదు మొర్రో' అంటూ ఆయన చెయ్యబోయే గొడవంతా భరించి. . . ఇలా పెద్ద చరిత్ర మొదలుకాబోతోందన్న విషయం తలపుకొచ్చి, తల తిరిగి, 'ఇలా ఇంకెన్నాళ్లో' అనుకుంటూ తన తల పట్టుకొని మరోలోకంలోకి వెళ్ళిపోయాడు రంగారావు. అంతలో ఆఫీసు నుంచి వచ్చాడు సుధాకరం.

'ఏం నాన్నా, ఏవయింది మళ్ళీ? ఎనీథింగ్ బాదరింగ్ యూ ఎగైన్?' - అన్న కొడుకు సుధాకరం పలకరింపుతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చిన రంగారావు తన చేతిలోని ఉత్తరాన్ని కొడుక్కి అందిస్తూ ఓ వెర్రినవ్వు నవ్వాడు.

'ఒరే అబ్బాయి - ఇహ నావల్ల కాదురా' ఈ రకం శాల్తీలకి గట్టిగా బుద్ధొచ్చే మార్గం ఏదైనా నువ్వే చూడాల్రా. ఈసారి ఈ ఫైలు నీకొదిలేస్తున్నా, ట్రై యువర్ బెస్ట్!' అంటూ నిట్టూర్చాడు.

'డోంట్ వర్రీ డాడ్ - అసలు మీరీ మాట అనకముందే నేనాపనికి పూనుకోవాలనుకున్నాను! సరే, ఇపుడు మీ రాజముద్ర కూడా పడింది గనుక ఇవాళే రంగంలో దిగుతాను అని భరోసా ఇచ్చి, ఆ రాత్రే వ్యాఘ్రేశ్వర్రావుకి జవాబు రాయడం ప్రారంభించాడు.

హైద్రాబాదు

శ్రీ వ్యాఘ్రేశ్వర్రావు గారికి,

నమస్తే, నాన్నగారికి తమరు రాసిన ఉత్తరం అందింది. మేమంతా క్షేమం. మీరు కూడా క్షేమం అని తలుస్తాను. మీరు క్షేమంగా చేరారని తెలిసి మేమంతా ఎంతో ఆనందించాము. మీరున్న మూడు రోజులు ఎంతో సరదాగా గడిచిపోయింది.

అన్నట్టు, మీరు తమ రేజరు సెట్టు నొక్కదాన్ని ఇక్కడ మర్చిపోయినట్టు తెలుసుకొని మేమెంతో విచారించాం. ఐతే, తమరు వదిలింది ఏ రేజరు సెట్టో, ఎక్కడ వదిలారో తెలియజేయగలిగితే వివరంగా రాయండి. ఎంచేతంటే గతంలో మీలాగే వచ్చిన బంధుమిత్రులు కొందరు వదిలిన ఇంకొన్ని రేజరుసెట్లు ఇంట్లో అక్కడా ఇక్కడా పడివున్నాయి. వాటిలో మీది ఏ రేజరు సెట్టో గుర్తించి పంపాలి కదా. అందువల్ల ఆ వివరాలు తెలుపగలరు. మా పాప చదువు విషయంలో తమరి సూచనకు కృతజ్ఞతలు. మీ జవాబు కోసం ఎదురుచూస్తూ. . .

ఇట్లు,
సుధాకరం

ఇది జరిగిన వారం తిరిగేలోగానే సుధాకరం ఎక్స్‌పెక్ట్ చేసినట్టు తిరుగుటపాలో వ్యాఘ్రి జవాబు వచ్చేసింది.

రాజమండ్రి

శ్రీ సుధాకరం గారికి,

నమస్కారములు. ఉభయకుశలోపరి. నా ఉత్తరానికి వెంటనే జవాబిచ్చినందుకు కృతజ్ఞతలు. నాది గిల్లెట్ కంపెనీ రేజరు. దానితో ఐదు ఎక్స్‌ట్రా బ్లేళ్ళుండే కాట్రిడ్జ్ కలిసి, ప్లాస్టిక్ బాక్స్‌లో వుంటాయి. బహుశా మీ బాత్రూంలో గానీ, లేదా ముందున్న మీ హాలు అలమార్లో గానీ వుండవచ్చు. మీకు శ్రమ కలిగిస్తున్నందుకు అన్యధా భావింపక, నా రేజర్ సెట్‌ని జాగ్రత్తగా పాక్ చేయించి పంపగలరు. మీ నాన్నగారికి నా నమస్కారములు. పాపకు ముద్దులు. పాపకు చిన్నచిన్న నర్సరీ రైమ్స్ నేర్పుతూ వుండండి. శెలవు.

ఇట్లు
వ్యాఘ్రేశ్వర్రావు

నెమ్మది నెమ్మదిగా తన కరస్పాండెన్స్ ఫైలు పెరుగుతున్నందుకు సుధాకరం తెగముచ్చట పడిపోతున్నాడు. తాజాగా వ్యాఘ్రి నుంచి అందుకున్న ఉత్తరానికి ప్రత్యుత్తరంగా మరో సందేశాన్ని చురుగ్గా - ఇలా సంధించాడు.

హైద్రాబాదు

శ్రీ వ్యాఘ్రేశ్వర్రావు గారికి,

చిక్కు మీకు సరిగా అర్థమైనట్టు లేదు. ఇక్కడ మీ రేజరుసెట్లు, మా ఇంటికి సందర్శించే వారు మర్చిపోయిన రేజరుసెట్లు (అన్నీ గిల్లెట్‌వే) అన్నీ కలిపి ఎనిమిది వున్నాయి. వాటిలో కొన్ని ఖూబా లో తయారైనవి, కొన్ని జర్మనీవి, ఇంకొన్ని చైనా సరుకు. ఒకటైతే బొత్తిగా లోకల్ తయారీ డూప్లికేటు సరుకని అనిపిస్తోంది. కాబట్టి మీది ఏ కంట్రీలో తయారైనదో, వీలైతే మోడల్ నంబరు కూడా రాయగలిగితే మరీ మంచిది. ఆ వివరం వెంటనే తెలుపగలరు. మా పని సులువుగా మారుతుంది.

మా పాపకు, మీరన్నట్టే నర్సరీ రైమ్స్ నేర్పుతున్నాము. ప్రస్తుతం 'టింకిల్ టింకిల్ లిటిల్‌స్టార్' లేదా 'హంప్టీ డంప్టీ' నేర్పాలనుకుంటున్నాము. ఏదైతే బెటరో సూచించగలరు. తమ క్షేమం తెలపండి.

భవదీయుడు
సుధాకరం

ఈ ఉత్తరాన్నందుకున్న వ్యాఘ్రకి నీరసం రావడం మొదలైంది. నిజానికి తన రేజరు ఏ కంట్రీదో తనకంతగా గుర్తులేదు పాపం. కానీ, గత్యంతరం లేక ఇలా జవాబిచ్చాడు.

రాజమండ్రి

శ్రీ సుధాకరంగారికి,

మీ నాన్నగారికి నమస్కారాలు. మీ పరిస్థితి నాకర్థమైంది. నిజానికి నా రేజర్ ఏ కంట్రీదో, ఏ మోడల్‌దో నేను గుర్తించలేదు. కానీ ఒక విషయం మాత్రం నిజం. అది మీరనుకున్నట్లు డూప్లికేట్ సరుకు గానీ, చైనా బజార్లోకొన్నది కానీ కాదు. దాని ప్లాస్టిక్‌బాక్స్ అడుగుభాగం నీలం రంగులో వుంటుందన్న విషయం నాకు బాగా తెలుసు కాబట్టి, ఈ వివరాల ఆధారంగా నా రేజరు సెట్టుని గుర్తించగలరని నమ్ముతున్నాను. ఇక మీ పాప విషయం, మీరు ఏ పద్యం నేర్పినా ఫర్వాలేదు. అది మీ యిష్టం. దాన్నంతటిని వదిలేసి, నా రేజరు సంగతి త్వరగా తేల్చ ప్రార్థన.

భవదీయుడు
వ్యాఘ్ర

దీన్ని అందుకుని, ఒకటికి రెండుసార్లు చదివి, కథ ఇక్కడే రసకందాయంలో పడుతోందన్న సంగతి గ్రహించిన సుధాకరం అమితానంద భరితుడయ్యాడు. త్వరలో దీన్ని క్లైమాక్స్ చేర్చాలన్న ఆతృత పెరిగి, వ్యాఘ్ర గారి తాజా వుత్తరానికి తారాజువ్వ లాంటి మరో జవాబు తనదైన స్టయిల్లో ఇలా కొట్టాడు.

శ్రీ వ్యాఘ్రం గారికి,

నమస్తే. ఈ ఉత్తర ప్రత్యుత్తర పరంపరతో, మీరు మర్చిపోయిన మీ రేజర్ ధర్మమాని మన మధ్య పరిచయం పెరుగుతూ, మరింత దగ్గరౌతున్నామా అనిపిస్తూ, చాలా ఆనందంగా ఉంది. మా పాప 'టింకిల్ టింకిల్' అంటే బాగా ఇష్టపడ్డంతో ఆ పద్యాన్నే నేర్పించాం. మీరు విని తీరాల్సిందే. పోతే, మీరిచ్చిన ఆధారాల సాయంతో మీ రేజర్‌సెట్‌ని గుర్తించగలిగాము. ఐతే, దీన్ని పోస్ట్‌లో పంపమన్నారా, కొరియర్ ద్వారా పంపమన్నారా, లేదంటే అట్నుంచి ఇక్కడికొచ్చి వెళ్ళేవారుంటే వారి చేతికివ్వమన్నారా ఏవిషయం సూచించి, కన్‌ఫర్మ్‌డుగా రాస్తే, అలాగే ఏర్పాటు చేయగలము.

ఇట్లు
సుధాకరం

ఈ జవాబుతో వ్యాఘ్రేశ్వర్రావుకి కోపం నసాళానికి చేరింది. ఇంక ఉత్తరాలు రాసి లాభం లేదనిపించింది. కానీ, వేరే గత్యంతరం తోచలేదు. మరోవక్క, సెలూన్‌కి వెళ్ళి తన వరునుకి షేవ్ చేయించుకోడం మనస్కరించక, వెంటనే జవాబివ్వడానికి ఓపిక నశించి, నిదానంగా పదో రోజున ఇలా జవాబిచ్చాడు - బహుముక్త సరిగా. . .

శ్రీ సుధాకరంగారికి,

ఇటు నుంచొచ్చే వాళ్ళెవరూ లేరు. అంచేత దాన్ని అదే నా రేజర్ని పోస్టులోనే తగలెయ్యండి. మీ పాపకి టింకిల్ టింకిల్ వచ్చేసినందుకు సంతోషం. కానీ నా రేజర్ ఇంకా నాకు ఇక్కడికి రానందుకు బాధగా వుంది. నాకు బయటి సెలూన్లకెళ్ళి గడ్డం గీయించుకునే అలవాటు లేక, విపరీతంగా పెరిగిపోతూ చాలా చికాగ్గా వుంది. అర్థం చేసుకొని, దాన్ని అర్జంటుగా పంపే ప్రయత్నం చేయ ప్రార్థన. ఇంకెప్పుడూ ఇలా దేన్నీ మర్చిపోనని అర్థం చేసుకుంటూ -

ఇట్లు
వ్యాఘ్ర

ఈ ఉత్తరంలో వ్యాఘ్రకి కొద్దికొద్దిగా జ్ఞానోదయమౌతోందన్న విషయం, తన చికిత్స ఫలిస్తోందన్న విషయం సుధాకరానికి సంతృప్తినిచ్చాయి. ఇంత ఆయన సహనాన్ని పరీక్షించకూడదనుకొని, రేజర్ని పంపే ప్రయత్నాన్ని ప్రారంభించాడు. కానీ, అతని భార్యా సుమలత మాత్రం దీని ముక్తాయింపుగా మరో చివరి ఉత్తరం రాయకూడదా అనడంతో సుధాకరం ఇలా వదిలాడు.

శ్రీ వ్యాఘ్రగారికి

మీకు ఎంత చికాగ్గా వుందో అర్థమైంది. మీ రేజరు మీకు ఎంత అత్యవసరమో గుర్తించాను. కాబట్టి, పోస్టులో పంపడం కన్నా, త్వరగా చేర్చగల కొరియర్‌లోనే పంపడం ఉచితమని తోచింది. ఇందాకే కొరియర్ బుకింగ్ సెంటర్‌కి వెళ్తే, వాళ్ళు మీ ఫోన్ నెంబరివ్వందే సకాలంలో, గ్యారంటీగా చేర్చలేమంటున్నారు. ఇన్నాళ్ళు ఓపికబట్టారు గనుక, వెంటనే, మీ కాంటాక్ట్ ఫోన్ నెంబరును తిరుగు టపాలో రాస్తూ, మీకు దగ్గరగా వున్న కొరియర్ సంస్థ పేరును కూడా సూచించండి. మీ జవాబుకై ఎదురుచూస్తూ 'హంప్టీ డంప్టీ' వంటి నర్సరీ రైమ్ పద్యాలు మీ దగ్గరేవైనా వుంటే మా పాపకు నేర్పేందుకు పంపగలరని ఆశిస్తూ, శెలవు.

సుధాకరం

అంతే దీంతో ఇక లాభం లేదనుకున్నాడో ఏమో, సహనం పూర్తిగా నశించిన వ్యాఘ్ర తిరుగుటపాలు రాయడం మానుకున్నాడు. ఆ తర్వాత, మరో పదిరోజులాగి, పాపం విపరీతంగా పెరిగిపోయే వ్యాఘ్ర గడ్డం గుర్తు చేసుకుంటూ పకపకా నవ్వుకున్న సుధాకరం దంపతులు ఆ విషయాన్ని రంగారావుకి చెప్పారు. చివరికి చికిత్స బాగానే జరిగిందనిపిస్తోందన్న రంగారావు సూచన మీద, ఆర్డనరీ పోస్ట్‌లో వ్యాఘ్రకి ఆ రేజర్‌ని సుధాకరం పంపించేశాడు. ◆

Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**



# వసంత ఋతువుకు స్వాగతం!




ఇంద్రియ నిగ్రహాల
మహాపర్వదినం
మహాశివరాత్రి